# అరుణతార
# ARUNATARA

సంపుటి: 44 సంచిక: 1 హైదరాబాద్ ఫిబ్రవరి, 2016 పేజీలు: 76 వెల: రు. 20



## విరసం 25వ మహాసభలు
## 9, 10 జనవరి 2016, విజయవాడ

హిందూ ఫాసిజాన్ని ఓడిద్దాం
ప్రత్యమ్నాయ సంస్కృతీ రాజకీయాలను ఎత్తిపడదాం

9-10 జనవరి 2016న విజయవాడలోని పి.బి. సిద్ధార్థ కాలేజి ఆడిటోరియంలో జరిగిన విరసం 25 మహాసభల దృశ్యాలు

KLVA101M184

# అరుణతార

సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

321

సంపుటి : 44 ◈ సంచిక : 1 ◈ ఫిబ్రవరి, 2016

విరసం

ఎడిటర్
**దువ్వూరి వెంకట రామక్రిష్ణారావు**
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్,
తార్నాకా, హైదరాబాద్-500007.

**రచనలు పంపించాల్సిన చిరునామ:**
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
**arunatara1977@gmail.com** కూ
పంపవచ్చు

సంపాదకవర్గం :
**ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్**

మేనేజర్
**వలేటి అరవింద్ కుమార్**
భీమ్‌సేన్‌రావు, 1-9-52/ఎఫ్/2,
ఈ-సేవ దగ్గర, మదర్ హైస్కూల్ ఎదురుగా,
రామ్‌నగర్, హైదరాబాద్ - 500020.
**సెల్ : 8142200711**
**(ఫోన్ చేయాల్సిన సమయం**
**ఉ.10 గంటల నుండి మ. 1 గంట వరకు)**

**చందాలు పంపాల్సిన చిరునామ**
విరసం కార్యదర్శి చిరునామా
**పి. వరలక్ష్మి**
5-1820, గీతాశ్రమం వీథి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

**డి.టి.పి. అండ్ లే అవుట్**
**ఆర్. భాగ్యలక్ష్మి**

**కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి,**
**ఆర్. భాగ్యలక్ష్మి**

**కవర్ పేజి ఫొటోలు : క్రాంతి,**
**కె.వి. కూర్మనాథ్, ఆళ్ళ దుర్గారావు**

Like Page://arunatara viplava rachayitala sangham

Virasam website : *www.virasam.in*

**ఈ సంచిక వెల : రు. 20/-**

## సంపాదక లేఖ...

రోహిత్ ఆత్మహత్య హిందుత్వ హత్య. మన సమాజంలో కులానికి, మతానికి ఉన్న పీటముడిని ఇది స్పష్టం చేస్తోంది. అత్యున్నత విద్యా సంస్థగా పేరు మోసిన హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయ పాలకవర్గం సంఘపరివార్ జెండాపట్టుకొని ఊరేగుతోంది. దాని ఎజెండాను యూనివర్సిటీలో అమలు చేస్తోంది. అందువల్లే దళిత విద్యార్థులను బహిష్కరించగలిగింది. స్వయం ప్రతిపత్తిగత విశ్వవిద్యాలయంలో కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, స్మృతిఇరానీ జోక్యం చేసుకునే వీలు దొరికింది.

విశ్వ విద్యాలయాల్లో దళిత విద్యార్థులనే బహిష్కరించడం యాదృశ్చికంగా జరగడం లేదు. మామూలుగా జరిగే పాలనా సంబంధమైన లోపంగా కూడా దీన్ని చూడ్డానికి లేదు. దీని వెనుక స్పష్టమైన హిందుత్వ భావజాలం ఉంది. సంఘపరివార్ శక్తులు విద్యా కేంద్రాలను తమ గుప్పిట్లో పెట్టుకొనే పథకంలో భాగంగానే ఇలాంటివన్నీ జరుగుతున్నాయి.

రచయితలు, హేతువాదుల హత్యల పరంపరలో భాగంగానే ఆత్మహత్య చేసుకొనే దశకు రోహిత్‌ను తీసికెళ్లారు. ఆవు మాంసం తిన్నాడని అఖ్లాక్‌ను హత్య చేసిన హిందుత్వ శక్తులే ఈ ఆత్మహత్యకు కారణం. యాకూబ్ మెమన్ ఉరిశిక్షను ఖండించడం దేశ ద్రోహమని సంఘపరివార్ హెచ్చరించింది. అది దాని హిందూ జాతీయవాదం. అదే దాని దేశభక్తి సిద్ధాంతం. ఈ వాదన నిజమైతే దేశ ప్రజలందరూ సగర్వంగా దేశద్రోహులుగా మారాల్సిందే. ఈ దేశ ముస్లింపక్షాన దృఢంగా నిలబడాలి. సంఘపరివార్ హిందూ ఉగ్రవాదాన్ని, సామ్రాజ్యవాద టెర్రరిజాన్ని ఎదుర్కోడానికి ముందుకు రావాల్సిందే.

ఎందుకంటే.. ఈ దేశంలో ఉగ్రవాదుల పేరుతో ఉరికంబం ఎక్కుతున్నవాళ్లంతా ముస్లింలే. ముస్లింలంటే ఉగ్రవాదులని, వారి నుంచి దేశాన్ని కాపాడుకోవడమే దేశభక్తి అని అదే జాతీయవాదమని సంఘపరివార్ ప్రచారం చేస్తోంది. ఈ వాదన అంతర్జాతీయ స్థాయిలో అమెరికా చేస్తోంది. దాని కనుసన్నల్లో సామ్రాజ్యవాద దేశాలు చేస్తున్నాయి. ఈ దుర్మార్గమే హైదరాబాదు విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులను, అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్‌ను టార్గెట్ చేసింది. అంబేద్కర్ ఆలోచనా విధానం, సంఘపరివార్ భావజాలం మధ్య అక్కడ జరుగుతున్న సంఘర్షణలో యూనివర్శిటీ పాలకవర్గం హిందుత్వ శక్తులపక్షాన నిలిచింది. అందుకే వీసీని, కేంద్ర మంత్రులను శిక్షించాలనే ప్రజాస్వామిక డిమాండ్ ముందుకు వచ్చింది.

రోహిత్ మరణానంతరం సంఘపరివార్ మరింత దుర్మార్గంగా, కుట్రపూరితంగా ప్రచారం చేస్తోంది. ఆయన దళితుడు కాదు అంటోంది. ఆయన వ్యక్తిత్వంపై ధాడికి పాల్పడుతోంది. ఇందుకు మీడియా సహకారం తక్కువేం కాదు. విశ్వవిద్యాలయాల్లో ఉండాల్సిన ప్రజాస్వామిక వాతావరణాన్ని హిందుత్వ కలుషితం చేస్తోంది. దళిత విద్యార్థుల ఆత్మగౌరవానికి, ప్రయోజనాలకు భంగం కలిగే పరిస్థితులు తయారయ్యాయి. విద్యారంగాన్ని కాషాయీకరించడంలో భాగమే ఇదంతా. ఆత్మహత్యలతో ఏ సమస్యా పరిష్కారం కాకపోయినా దళిత విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే దిశగా ఈ పరిస్థితులు తోసుకెళుతున్నాయి.

రోహిత్ ఆత్మహత్య నేపథ్యంలో జాతీయ స్థాయిలో వెల్లువెత్తుతున్న ప్రజాస్వామిక ఆందోళన మరింత ఉధృతం కావాలి. విద్యారంగంలోనేగాక సమాజమంతటా పెరుగుతున్న కాషాయీకరణను హిందూ ఫాసిజంగా అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన అత్యంత విషాదకరంగా మన ముందుకు తీసుకొని వచ్చింది. ఈ దేశంలో హిందుత్వ బ్రాహ్మణిజంతో, కులవ్యవస్థతో కలగలసి ఉంది. అవి లేకపోతే హిందుత్వ ఉనికే లేదు. రాజకీయార్థికంగా దోపిడీ వర్గ ప్రయోజనాల కోసం హిందుత్వ ఫాసిజంగా మారిపోయింది. రోహిత్‌ను అదే బలి తీసుకున్నది. ఫాసిస్టు వ్యతిరేక పోరాటం బ్రాహ్మణీయ హిందుత్వను, మత వర్గ తత్వాన్ని ఓడించగలుగుతుంది.

## సంచిక - 321


**సంపాదకీయం (5-6)**
ఎక్కడ మొదలైంది? - **పాణి**

**పాటలు, కవిత్వం (7-14)**
నల్లజెండా- **ఉదయమిత్ర**
మనుగడ రణం - **సిద్దెంకి యాదగిరి**
ప్రవాహమై... - **షహెబాజ్ అహ్మద్ ఖాన్**
మహాపుణ్యం...! - **శిఖా ఆకాశ్**
పుట్టెడు దు:ఖంలో పుట్టిన పండగ - **పద్మకుమారి**
మృత్యువు నీడ - **మేడక యుగంధరరావు**
అతడి పాట బతికేఉంది! - **పిరికి స్వామినాయుడు**
అరుణతార నీకు లాల్ సలామ్ - **రమేష్ గోంద్యాల**
వివాదం! - **రాంకి**

**కథ (13-18)**
అల్ఫియా... అల్ఫియా... - **షహీదా**

**వ్యాసం (19)**
కవిపై కుట్ర కేసు.. - **పాణి**

**మహా సభల ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాసం (20-23)**
జంగ్ పరివార్‌కీ, సంఘ్ పరివార్‌కీ మధ్య... - **ఖాదర్ మొహియుద్దీన్**

**25వ మహాసభల సందర్భంగా కార్యదర్శి నివేదిక (23-25)**
మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో సాహిత్యోద్యమం - **పి. వరలక్ష్మి**

**మంద్రస్థాయి యుద్ధ సందర్భంపై కీనోట్ (26-29)**
ఇది మనిషి మీద యుద్ధం - **పి. వరలక్ష్మి**

**25వ మహాసభల ప్రసంగ పాఠం (30-54)**
హిందుత్వ హత్యలు- సాంస్కృతిక మూలాలు - **బాసిత్**
కార్పొరేట్ వ్యవసాయం - రైతు ఆత్మహత్యలు - **ఉజ్వల్**
రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు - అగ్రకులతత్వం - **పి. కాశీం**

**సభల నివేదిక (55-58)**
మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో.. 'హిందూ ఫాసిజాన్ని ఎదిరిద్దాం, ప్రత్యామ్నాయ సంస్కృతీ రాజకీయాలను ఎత్తిపడదాం' అనే పిలుపునిచ్చిన విరసం 25వ మహాసభలు

**సాహిత్య వ్యాసం (59-70)**
ప్రపంచ ప్రసిద్ధ సోవియట్ విప్లవ రచయిత ఫెదయేవ్ నవల 'వెనుకంజ'
- **వాగభూషణ్**

**పుస్తక సమీక్ష (70-71)**
సంకెళ్ల సవ్వడి వినండి - **పఙ్జా వెంకటేశ్వర్లు**

**సీరియల్ (72-74)**
మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం - 5 - **ఫ్రాన్సిస్ వీన్**,
అనువాదం : **ముక్తవరం పార్థసారథి**


గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను రూ.20 కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఈ సంచిక నుంచి సంపుటి 44 గాను సంచిక 1 గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. సభలకు సంబంధించిన ప్రసంగ పాఠాలు, మిగతా విషయాలు వచ్చే సంచికలో ప్రచురిస్తాం. - సం.

**అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!**
ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

విరసం కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికలను, విరసం ప్రచురణలను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సాఫ్ట్‌కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను **వలేటి అరవింద్ కుమార్, హైదరాబాద్** పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

# ఎక్కడ మొదలైంది?

**పాణి**

ఈ ఆత్మహననం ఎప్పుడు మొదలైంది? ఎందుకు మొదలైంది? ఈ ప్రపంచాన్ని తమ రెండు చేతులతో అద్భుతంగా తీర్చిదిద్దగల విద్యార్థులు అర్థాంతరంగా ఎందుకు ఇలా నిష్క్రమిస్తున్నారు? ఈ ప్రశ్నలు మనల్ని కుదురుగా ఉండనీయగలవా? గత కొన్నేళ్లుగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకంటే దిగ్భ్రాంతికరంగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఇవాళ మనమున్న హిందుత్వ విపత్కర పరిస్థితులను సూచిస్తోంది. ఇది ఒక వ్యక్తి ఆత్మహత్య మాత్రమేనా? మానవీయంగా పరిఢవిల్లాల్సిన సమాజం విధ్వంసమైపోవడం కాదా?

చదువు వధ్యశిలగా మారిపోయిన ఈ వర్తమానంలో విద్యాలయాలు... అందునా దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాదు విశ్వవిద్యాలయం ఆత్మహత్యల వేదికగా మారిపోయింది. మానవ జీవితేచ్ఛకు శాస్త్రీయతను, సామాజిక అన్వేషణా దృక్కును అందించాల్సిన విశ్వవిద్యాలయాలు మధ్యయుగాల హేయమైన సంస్కృతిని మోసుక తిరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలు ఖండిత జన సమూహాలకు కొత్త వెలివాడను సృష్టించడంలోని తర్కం ఏమిటో ఇక ఆలోచించక తప్పదు. విశ్వవిద్యాలయాల నుంచి దళిత పిల్లలే బహిష్కరణకు గురి కావడం ఎంత మాత్రం యాదృచ్ఛికం కాదు. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో(ఎవరి ఆత్మహత్య అయినా దు:ఖకరమే, అవాంఛనీయమే) 'కింది' సామాజిక శ్రేణుల వాళ్లే కావడం అనుకోని ఘటనలు కాదు. అపారమైన ఆత్మ విశ్వాసంతో, ఎన్నో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అవరోధాలను దాటుకుంటూ యూనివర్సిటీ మెట్లు ఎక్కిన దళిత విద్యార్థులు ఉరితాళ్లకు ఊగడం మామూలు విషయం కాదు.

రోహిత్ మరణవాఙ్మూలం ఆయన ఆలోచనను సూచిస్తుంది. అంత పరిణతి ఉన్న విద్యార్థి తన భవిష్యత్ స్వప్నాలన్నింటినీ రద్దు చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అంత నిస్సహాయతలోకి ఎందుకు జారిపోయాడు? ఆయనలో రగులుతున్న అంబేద్కర్ స్ఫూర్తిని ధ్వంసం చేసిన పరిస్థితులు ఏమిటి?

ఈ ప్రశ్నలు సమాజం వేసుకోవాలి. సమాజంలోని జ్ఞానార్జనా వాహికగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు వేసుకోవాలి. ఎంత అనుకూల పరిస్థితి ఉన్నా ఆత్మహత్య చేసుకోకుండా ఉండాల్సిందనే ఆకాంక్ష అందరిదీ. అయినా అతను వెళ్లిపోయాడు. ఇప్పుడు అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఆలోచించాల్సిన బాధ్యత కూడా అందరిదీ.

విశ్వవిద్యాలయాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయిన మాట వాస్తవమే. అసలు మన సమాజమే సరికొత్త ఆవరణలోకి చేరుకున్నది. అది విద్యా సంస్థకూ వర్తిస్తుంది. అతీతమేం కాదు. అయితే చైతన్యస్థాయిలో సగటు సమాజానికంటే భిన్నంగా ఉండాల్సిన అత్యున్నత విద్యా సంస్థలు ఎందుకు ఇలా తయారయ్యాయి? కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఇలా తయారు కావడం వెనుక పని చేస్తున్న వ్యూహాన్ని మనం ఇప్పటికైనా పసిగట్టగలమా?

పరిశోధన, జ్ఞానార్జన, వినిమయం, ప్రజాస్వామ్యం, ఆధునికత, విలువలు... అనే ప్రాతిపదిక మీద విశ్వవిద్యాలయాలు పని చేయాలి. అధికారిక విధానం ఇదే. లక్ష్యం ఇదే. పాత రోజుల్లో విద్యార్థి ఉద్యమాలు ఈ విధానాలను, లక్ష్యాలను ఇనుమడింపజేసేవి. మొత్తంగానే ఒక ప్రజాస్వామిక సంస్కృతి సమాజంలో నుంచి విశ్వవిద్యాలయాల్లోకి, అక్కడి నుంచి సమాజంలోకి ప్రవహిస్తూ ఉండేది. విస్తరిస్తూ ఉండేది. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి రాజకీయాలు, సంఘాలు, వాటి ఆందోళనలు అన్నీ భాగంగా ఉండేవి. విద్యార్థి రాజకీయాల్లో, అధ్యాపకుల్లో ప్రతీఘాతుక శక్తులు ఉన్నా ప్రగతిశీల శిబిరం ప్రధానంగా, నిర్ణాయకంగా ఉండేది. అయితే రాజ్యం ఒక పథకం ప్రకారం విద్యారంగంలో ప్రగతిశీల శక్తులను దెబ్బతీస్తూ వచ్చింది. సంఘపరివార్ మూక సమాజంలో పెచ్చరిల్లినట్లే విశ్వవిద్యాలయాల్లోనూ తిరుగులేని శక్తిగా పాతుకపోయింది. దానికి ఇప్పుడు ప్రభుత్వాధికారం కూడా తోడైంది.

ఈ కాలంలోనూ ఒక అద్భుతమైన పరిణామం జరిగింది. దళిత బహుజన విద్యార్థులు విద్యా సంస్థల్లో సంఘటితం కావడం మొదలైంది. అంబేద్కర్ స్ఫూర్తి నిలదొక్కుకుంటున్నది. ఇది ఆత్మగౌరవాన్ని, సాంఘిక విముక్తిని బలంగా ఎత్తిపడుతోంది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంఘపరివార్ మేధావులు అంబేద్కర్ గురించిన వివాదం, చర్చ ఎలా చేస్తున్నదీ గమనించవచ్చు. తాజాగా నరేంద్రమోదీ ఇంకో వైపు నుంచి అంబేద్కర్‌ను ప్రసంశల్లో ముంచెత్తాడు. వాస్తవానికి అంబేద్కర్ భావజాలంతో దళితుల, ప్రజాస్వామ్యశక్తుల అసర్షన్‌ను దెబ్బతీస్తున్నది. అగ్రకులతత్వాన్ని, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ప్రమాదకర స్థాయిలో పెంచుతున్నది. అన్నిటికంటే ఘోరం ఏమంటే ఈ స్థితికి సగటు సమాజ ఆమోదాన్ని హిందుత్వ సంపాదించుకున్నది. విశ్వవిద్యాయ పాకు సమ్మతిని కూడగట్టుకున్నది.

ఈ విషయం నేరుగా అంటే వారు ఏవేవో పామరుకు అర్థంకాని సాంకేతిక భాష మాట్లాడవచ్చు. దళిత విద్యార్థుల బహిష్కరణ వెనుక ఏ ఒక్క కారణమో లేదు. సంఘపరివార్ భావజాలాన్ని ఎంత మాత్రం తక్కువ చేయడానికి అసలే లేదు. రోహిత్ తదితరులు తప్పే చేశారని విశ్వవిద్యాయ పెద్దలు అందరినీ ఒప్పింపజేసినా.. అలాంటి తప్పులే అగ్రకుల విద్యార్థులు చేస్తే ఇలా మూకుమ్మడిగా బహిష్కరిస్తారా? అనే అతి పెద్ద ప్రశ్న ఎదురవుతుంది. ఈ చర్య ఉద్దేశపూర్వకమని, కక్షపూరితమని బయటి నుంచి ఈ కొద్ది వివరాలు తెలిసిన వారెవరైనా అనగలరు. గ్రామాల్లో దళితులపై దాడులు చేసిన అగ్రకులాల వాళ్లు..ఇలాంటి వాదనే చేస్తుంటారు.

అసలు కారణం విశ్వవిద్యాయాల్లో పెరిగిపోతున్న హిందుత్వ. అగ్రకులతత్వం. పెరిగిపోతున్న రాజకీయ జోక్యం. అంతే కాదు, పెరుగుతున్న దళిత చైతన్యం. దాన్ని అడ్డుకోడానికి ప్రతీఘాతుక రాజకీయాలు, భావజాలం విశ్వవిద్యాలయాల్లో దళిత పిల్లలను బహిష్కరించి కొత్త వెలివాడలను సృష్టిస్తున్నాయి. ఆత్మహత్యల వేదికగా మార్చివేస్తున్నాయి.

- పాణి, విప్లవరచయితల సంఘంఈ ఆత్మహననం ఎప్పుడు మొదలైంది? ఎందుకు మొదలైంది? ఈ ప్రపంచాన్ని తమ రెండు చేతుతో అద్భుతంగా తీర్చిదిద్దగల విద్యార్థులు అర్థాంతరంగా ఎందుకు ఇలా నిష్క్రమిస్తున్నారు? ఈ ప్రశ్నలు మనల్ని కుదురుగా ఉండనీయగలవా? గత కొన్నేళ్లుగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకంటే దిగ్భ్రాంతికరంగా హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య ఇవాళ మనమున్న హిందుత్వ విపత్కర పరిస్థితులను సూచిస్తోంది. ఇది ఒక వ్యక్తి ఆత్మహత్య మాత్రమేనా? మానవీయంగా పరిఢవిల్లాల్సిన సమాజం విధ్వంసమైపోవడం కాదా?

చదువు వధ్యశిలగా మారిపోయిన ఈ వర్తమానంలో విద్యాలయాలు... అందునా దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాదు విశ్వవిద్యాలయం ఆత్మహత్యల వేదికగా మారిపోయింది. మానవ జీవితేచ్ఛకు శాస్త్రీయతను, సామాజిక అన్వేషణా దృక్కును అందించాల్సిన విశ్వవిద్యాలయాలు మధ్యయుగాల హేయమైన సంస్కృతిని మోసుక తిరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలు ఖండిత జన సమూహాలకు కొత్త వెలివాడను సృష్టించడంలోని తర్కం ఏమిటో ఇక ఆలోచించక తప్పదు. విశ్వవిద్యాలయాల నుంచి దళిత పిల్లలే బహిష్కరణకు గురి కావడం ఎంత మాత్రం యాదృచ్ఛికం కాదు. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో(ఎవరి ఆత్మహత్య అయినా దు:ఖకరమే, అవాంఛనీయమే) 'కింది' సామాజిక శ్రేణుల వాళ్లే కావడం అనుకోని ఘటనలు కాదు. అపారమైన ఆత్మ విశ్వాసంతో, ఎన్నో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అవరోధాలను దాటుకుంటూ యూనివర్సిటీ మెట్లు ఎక్కిన దళిత విద్యార్థులు ఉరితాళ్లకు ఊగడం మామూలు విషయం కాదు.

రోహిత్ మరణవాఙ్మూలం ఆయన ఆలోచనను సూచిస్తుంది. అంత పరిణతి ఉన్న విద్యార్థి తన భవిష్యత్ స్వప్నాలన్నింటినీ రద్దు చేసుకోవలసిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అంత నిస్సహాయతలోకి ఎందుకు జారిపోయాడు? ఆయనలో రగులుతున్న అంబేద్కర్ స్ఫూర్తిని ధ్వంసం చేసిన పరిస్థితులు ఏమిటి?

ఈ ప్రశ్నలు సమాజం వేసుకోవాలి. సమాజంలోని జ్ఞానార్జనా వాహికగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు వేసుకోవాలి. ఎంత అననుకూల పరిస్థితి ఉన్నా ఆత్మహత్య చేసుకోకుండా ఉండాల్సిందనే ఆకాంక్ష అందరిదీ. అయినా అతను వెళ్లిపోయాడు. ఇప్పుడు అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఆలోచించాల్సిన బాధ్యత కూడా అందరిదీ.

విశ్వవిద్యాలయాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయిన మాట వాస్తవమే. అసలు మన సమాజమే సరికొత్త ఆవరణలోకి చేరుకున్నది. అది విద్యా సంస్థకూ వర్తిస్తుంది. అతీతమేం కాదు. అయితే చైతన్యస్థాయిలో సగటు సమాజానికంటే భిన్నంగా ఉండాల్సిన అత్యున్నత విద్యా సంస్థలు ఎందుకు ఇలా తయారయ్యాయి? కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఇలా తయారు కావడం వెనుక పని చేస్తున్న వ్యూహాన్ని మనం ఇప్పటికైనా పసిగట్టగలమా?

పరిశోధన, జ్ఞానార్జన, వినిమయం, ప్రజాస్వామ్యం, ఆధునికత, విలువలు... అనే ప్రాతిపదిక మీద విశ్వవిద్యాలయాలు పని చేయాలి. అధికారిక విధానం ఇదే. లక్ష్యం ఇదే. పాత రోజుల్లో విద్యార్థి ఉద్యమాలు ఈ విధానాలను, లక్ష్యాలను ఇనుమడింపజేసేవి. మొత్తంగానే ఒక ప్రజాస్వామిక సంస్కృతి సమాజంలో నుంచి విశ్వవిద్యాలయాల్లోకి, అక్కడి నుంచి సమాజంలోకి ప్రవహిస్తూ ఉండేది. విస్తరిస్తూ ఉండేది. ఇందులో విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి రాజకీయాలు, సంఘాలు, వాటి ఆందోళనలు అన్నీ భాగంగా ఉండేవి. విద్యార్థి రాజకీయాల్లో, అధ్యాపకుల్లో ప్రతీఘాతుక శక్తులు ఉన్నా ప్రగతిశీల శిబిరం ప్రధానంగా, నిర్ణాయకంగా ఉండేది. అయితే రాజ్యం ఒక పథకం ప్రకారం విద్యారంగంలో ప్రగతిశీల శక్తులను దెబ్బతీస్తూ వచ్చింది. సంఘపరివార్ మూక సమాజంలో పెచ్చరిల్లినట్లే విశ్వవిద్యాలయాల్లోనూ తిరుగులేని శక్తిగా పాతుకపోయింది. దానికి ఇప్పుడు ప్రభుత్వాధికారం కూడా తోడైంది.

ఈ కాలంలోనూ ఒక అద్భుతమైన పరిణామం జరిగింది. దళిత బహుజన విద్యార్థులు విద్యా సంస్థల్లో సంఘటితం కావడం మొదలైంది. అంబేద్కర్ స్ఫూర్తి నిలదొక్కుకుంటున్నది. ఇది ఆత్మగౌరవాన్ని, సాంఘిక విముక్తిని బలంగా ఎత్తిపడుతోంది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంఘపరివార్ మేధావులు అంబేద్కర్ గురించిన వివాదం, చర్చ ఎలా చేస్తున్నదీ గమనించవచ్చు. తాజాగా నరేంద్రమోదీ ఇంకో వైపు నుంచి అంబేద్కర్‌ను ప్రసంశల్లో ముంచెత్తాడు. వాస్తవానికి అంబేద్కర్ భావజాలంతో దళితల, ప్రజాస్వామ్యశక్తుల అసర్టన్‌ను దెబ్బతీస్తున్నది. అగ్రకులతత్వాన్ని, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ప్రమాదకర స్థాయిలో పెంచుతున్నది. అన్నిటికంటే ఘోరం ఏమంటే ఈ స్థితికి సగటు సమాజ ఆమోదాన్ని హిందుత్వ సంపాదించుకున్నది. విశ్వవిద్యాయ పాకు సమ్మతిని కూడగట్టుకున్నది.

ఈ విషయం నేరుగా అంటే వారు ఏవేవో పామరుకు అర్థంకాని సాంకేతిక భాష మాట్లాడవచ్చు. దళిత విద్యార్థుల బహిష్కరణ వెనుక ఏ ఒక్క కారణమో లేదు. సంఘపరివార్ భావజాలాన్ని ఎంత మాత్రం తక్కువ చేయడానికి అసలే లేదు. రోహిత్ తదితరులు తప్పే చేశారని విశ్వవిద్యాయ పెద్దలు అందరినీ ఒప్పింపజేసినా.. అలాంటి తప్పులే అగ్రకుల విద్యార్థులు చేస్తే ఇలా మూకుమ్మడిగా బహిష్కరిస్తారా? అనే అతి పెద్ద ప్రశ్న ఎదురవుతుంది. ఈ చర్య ఉద్దేశపూర్వకమని, కక్షపూరితమని బయటి నుంచి ఈ కొద్ది వివరాలు తెలిసిన వారెవరైనా అనగలరు. గ్రామాల్లో దళితులపై దాడులు చేసిన అగ్రకులాల వాళ్లు..ఇలాంటి వాదనే చేస్తుంటారు.

అసలు కారణం విశ్వవిద్యాయాల్లో పెరిగిపోతున్న హిందుత్వ. అగ్రకులతత్వం. పెరిగిపోతున్న రాజకీయ జోక్యం. అంతే కాదు, పెరుగుతున్న దళిత చైతన్యం. దాన్ని అడ్డుకోడానికి ప్రతీఘాతుక రాజకీయాలు, భావజాలం విశ్వవిద్యాలయాల్లో దళిత పిల్లలను బహిష్కరించి కొత్త వెలివాడలను సృష్టిస్తున్నాయి. ఆత్మహత్యల వేదికగా మార్చివేస్తున్నాయి.

# నల్లజెండా

## ఉదయమిత్ర

నలుపెన్నడూ నాకు దూరంగాదు
నలుపంటే భయం లేదు

ఎందుకంటే...
నేను నలుపు
నా జాతి నలుపు
నేను నడయాడిన మట్టి నలుపు
నా వెంట నడిచే నీడ నలుపు
నేనెత్తి పట్టిన జెండా నలుపు

అమ్మకూ, అందుకునే చేయికీ మధ్యన
ఆకలీ, అవమానమూ
అగాధం సృష్టించినపుడే
నలుపుకు నాంది మొదలయ్యింది
గుడిల పూజారి తీర్థం పోస్తూ
వివక్ష చూసినపుడే
నలుపు చిక్కనయ్యింది
భూస్వామి కొట్టినప్పుడు
కమిలిన దెబ్బల్ని తాకినపుడే
నలుపు విస్తరించింది

అప్పట్నుంచీ
గుండెల మీద
నల్లజెండా మోస్తూ తిరుగుతున్నా...

ఎక్కడ పచ్చని తోటలు దగ్ధమయినా
ఎక్కడ తల్లిశోకం
పల్లెకు కునుకుపట్టకుండా జేసినా

ఎక్కడ నిర్బంధం ఉక్కుపాదం మోపినా
అక్కడికి నల్లజెండానై నడిచి వెళ్లాను
నల్లజెండాల్ని పాతి వొచ్చాను

నాకు
చీకటిని రచించడమంటే ఇష్టం...
చరిత్ర చూడ సాహసించని
అధోజగత్ సహోదరుల
చీకటి బతుకుల రచించిడమన్నా ఇష్టం
జలతారు మేలి మబ్బుల దోబూచులాటగాదు...
రక్తమోడుకాళరాత్రుల్లా స్పందించటం నైజం...

నలుపంటే
ఎందుకంత ఇష్టమంటే...
దాని కడుపున తెలుపు దాగి ఉన్నదంటాను
నల్లని ఆకాశమే లేకుంటే
నక్షత్రాలకు మెరుపెక్కడిది?
నల్లని బురదనే లేకుంటే
కలువకు ఆ సొబగులెక్కడివి?

అనాదిగా
నేను కవిని, రచయితను, కళాకారుడిని, తత్వవేత్తను
మతమౌఢ్యాలకెదురేగి
దగ్గమైన కోపర్నికస్‌ను
రాజుల శాసనాల ధిక్కరించి
ఉరికంబాన్ని ముద్దాడిన స్వేచ్ఛా పిపాసిని

నేను ధబోల్కర్‌ను...
నేను పన్సారేను
నేను కల్బుర్గిని...
నేను స్వేచ్ఛావరణంలో
సత్యావిష్కరణను...
ఏ మతమో, రాజ్యమో, ఉన్మాదమో
నన్ను తుడిచెయ్యాలని జూస్తే
నల్లజెండానై పుడమి గర్భాన్ని చీల్చుకు
మళ్లీ మళ్లీ పుట్టుకు వొస్తా...

# మనుగడ రణం

## సిద్దెంకి యాదగిరి

శిథిల శకలాల చరిత్రలో
బానిసత్వాన్ని మోసిన ధరిత్రిలో
అక్షరాలకు ఆమడ దూరంగా
వెలివేయబడి దుర్బల జాతికి వారసుడినై
కాలం కాగితమ్మీద
సలసలకాగే ప్రతీకార సిరతో
చెరిగిపోని సంతకం చేస్తున్న

నా పూర్వీకుల వల్ల దారి మలినం కావొద్దనీ
ఉమ్మివేయకుండా మూతికి ముంత
పాద ముద్రల్ని తుడుపడానికి ముడ్డికి ఆకు కట్టి
నా జాతి చరిత్రను నా వాళ్లతో తుడిపిన ఖర్మను
మనువాది కుల వివక్ష ముందు నిలబడి
బాజా మార్చిన బతుకుతో
కలం కత్తి దూసి కసిగా సంతకం చేస్తున్న

నా తల్లిదండ్రి వరకు
వెట్టిలో మునిగిన మట్టి మనుషులు
చదువు నేర్పక సమాజం సంతలో
వింత పశువులు

బతుకు కష్టమ్మీద తిరుగుబాటు జెండా పాతి
తమ చెమట ధారలతో
భవిష్యత్తు సారె పై నన్ను ఆవిష్కరించారు
వారి ఆకాంక్షల ఉద్యోగినై
వారి ఆశయాలను ఆద్యంతం సంతకం చేస్తున్న

కల్లోల జీవితంలో
రేపటి కాంతులు పూయించడానికి
ప్రవర్తనతో ప్రకాశించాలని
బాధించకుండా బోధిస్తూ
సందేహ విద్యార్థి జన సందోహాల మీద
నిరంతరం నివృత్తి సంతకం చేస్తున్న

ఏ శ్లోకాలు మాకు శోకాలు కల్గించాయో
ఏ పదాలు మమ్మల్ని పరిహాసమాడాయో
ఏ అక్షరాలు మమ్మల్ని శిక్షించాయో
అదే అక్షరాల సాక్షిగా
సాహిత్యం అందరిదని చాటి చెప్పడానికి
సమాజ హితం కోసం దీటుగా సంతకం చేస్తున్న

రైతుతో పాటు రకరకాల ఆత్మహత్యల్ని రక్షించటానికి
నిరాశ్రయుల నినాదపు నిజాల్ని
నిరసనలకు మద్దతు ప్రకటిస్తూ
న్యాయంగా సాధించటానికి రాజ్యమ్మీదికి
శక్తివంతంగా పోరు సంతకం చేస్తున్న

మానవులంతా సమానమని
మనుష్యుడే మహోన్నతుడని
మానవత్వమే అత్యున్నతమని
సమానత్వ స్వేచ్ఛ పతాకంపై
నమస్కరించి సంస్కారంతో సంతకం చేస్తున్న

మొద్దు మెదడు పైన
పొడిచే పొద్దు మీద
నడిచే సూర్యుని మీద
రగిలే సంతకం చేస్తున్న
నా సంతకం శిలాశాసనం
జ్వాలా తోరణం
మనుగడ రణం.

# ప్రవాహమై...

## షహెబాజ్ అహ్మద్ ఖాన్

కంటిని పొడిచి చీకటి రాత్రులకు
పగటి వెలుతుర్లకు తేడ అడిగితే
ఏం చెప్పగలం?
సంకెళ్ళు తొడిగి కలం పట్టుకుంటావా
తుపాకి మోస్తావా అంటే ఏం మాట్లాడగలం?
ఈ మట్టిని ముద్దాడిన వైనం చూస్తే
ఈ సందర్భంలో ఇదివొక సమాధానమే
ఇక్కడ రక్తమే మట్టిని శాసిస్తుంది
రక్తమే దేహాలను కప్పివేస్తుంది
రక్తమే ప్రవాహమై కారుతుంది
రక్తమే ప్రవాహమై పొంగుతుంది
ఇక ముందు నేను నా రక్తాన్ని
ఒక పెద్ద సముద్రపు అలల్లాగా
అలజడి రేపుతూ, అందాన్నిస్తు కార్చాలి
నేనిప్పుడు నాలో రక్తాన్ని బాగా ప్రవహింప జేసుకోవాలి
రక్తాన్ని ధారపోయకుంటే వాళ్లు ఊరుకుంటారా?
ధారపోయకుండ నేను ఊరుకోగలన?
కొన్ని వేలసార్లు ఘనీభవించిన త్యాగాల
నెత్తురుతో నేనా రక్తంలోకి ప్రవేశించి
ఒక శ్వాసను తీసుకోవాలి
ఈ క్షణం నుంచి ఎర్రగా మరీ ఎర్రగా
రక్తాన్ని మార్చుకోవడానికే కంకణం కట్టుకోని
నిశిరాత్రులను ప్రాధేయపడుతాను
ఎర్రగా మారే నెత్తురులో నా భాషను, ఆశను
కలుపుకోని ఆస్వాదిస్తే గాని
త్యాగాలతో చలించడం నేర్చుకోలేను
కష్టాలు సమసిపోతాయా అన్నప్పుడు
అరేబియన్ కథలు ఆగిపోతాయా అన్న ప్రశ్నే
నన్ను నిస్పృహాయుడిని కాకుండా చేస్తుంది
ప్రవహించే రక్తపు ధారలనే ముడిగా మార్చి
ఆ ధారలనే అడుగులుగా మరల్చి
చిన్న విశ్రాంతి కోసం పరితపిస్తాను
నీవు ఆగిన నేను మాత్రం ఆగలేను
అంటూ అభయమై, సువర్ణద్రవమై
పాదాల వరకు రక్తం నన్ను తడిచేస్తుంది
మథన పడుతున్న నా ఆలోచనలకు
గుచ్చి గుచ్చి మరీ సమాధానం చెప్పడం కొరకు
నన్ను నేను తీర్చిదిద్దినాను
అయినా నా రక్తంం చల్లారట్లేదు
ఏకాంతం వైపు నా సందేహాలు నడిస్తే
రక్తమే బడాబాగ్ని, పువ్వులను నవ్వులను కలిపె
వనమాలి మాటలై ప్రవహిస్తుంది
వనమాలి మాటలై ప్రవహిస్తుంది
రక్తం రక్తం లాగా కావాలంటే
నేను నేనుగా ఉండాలంటే
ఒక శాంతి జెండాను భుజాలపై
ప్రతిఘటన జెండాను చేతుల్లో పట్టుకోవాలి
వక్రీకరణల వేదనతో నలిగి పోతున్న ప్రాణుల
గతాన్ని తెలుపాలన్న తహతహలో నేను ఉంటా

అంతాన్ని మిగల్చకుండా వక్రీకరణ సూత్రాలు
బయటికి కనిపిస్తు రక్తాన్ని మరింత
వేడిగా మార్చుతున్నాయి
దిక్కులు రోదిస్తుంటే హక్కుల సాధనలో
ఇదంతా ఒక భాగమే కదా అంటు రక్తం చిందులేస్తుంది
నాకున్నది ఒకే మార్గం
రక్తంతో నన్నుగా చేసుకోవడం
రక్త కణంగా మారడం
రక్తంలో రక్తంగా మిగలడం

# మహాపుణ్యం...!

**శిఖా ఆకాశ్**

వేదంలా కాదు
మృత్యు నాదమై ఘోషించెను గోదావరి
తల్లీ గోదావరీ... జీవధార గోదావరీ...!
మరణపు అంచున తల్లడిల్లే తల్లుల
నోరు తడిపేందుకు
గుక్కెడు నీళ్ళవలేకపోయావేం?
భక్తి విశ్వాసాలకు
మృత్యువును కానుకగా ఇచ్చావేం?

ఏక ఛత్రాధిపత్యం... ఏక ఛత్రాధిపత్యం
మృత్యు డాక్యుమెంటరీ సూపర్ హిట్
నదీ స్నానం కాదిది
అంతిమ సంస్కార ఘట్టం
వి.ఐ.పి. ఘాట్ జిందాబాద్!
సామాన్యుల మరణం జోహార్! జోహార్!
అసమర్థ సర్కార్ జిందాబాద్! జిందాబాద్!

భూ ఆక్రమణల్లో పంట పొలాలు సరి
రుణ మాఫీలో రైతు కలల ఉరి
రక్తబంధన కూలీల ఎన్‌కౌంటర్ బలి
ఓట్లకు కోట్లు పై పరిపాలనా గురి
ఇసుక మాఫియా అధికార స్వారీ
కార్మికులకు 'చెత్త' కలలు మిగిల్చిన ప్రజా సర్కార్ జిందాబాద్
మహిళలకు మృత్యు గోదావరిని బహుమతిచ్చిన పుష్కర నాయకా
జిందాబాద్
యువతలకు ర్యాగింగ్ ఆత్మహత్యల హత్యను
మిగిల్చిన దేశం సర్కార్ జిందాబాద్
ప్రజల ప్రాణాలకు భరోసా లేని
మానవ తప్పిదాల తెగులు దేశమిక
అధికారాల అలసత్వం జిందాబాద్
నిర్లక్ష్యం మహా వైఫల్యాలు జిందాబాద్
మహా నాయకుల అసమర్థ పాలనా జిందాబాద్
ప్రజల్ని మేల్కొలపాల్సిన చోట
మూఢనమ్మకాల్లో ముంచుతున్నదెవరు?
భావ దారిద్ర్యం పంచుతున్నదెవరు?
భక్తి-ముక్తి అంతా వ్యాపారమే
మత రాజకీయమే
అలలపై తేలియాడే శవాల
రక్త సంచలన రాగమిది
పన్నెండేళ్ళకు మారు
పన్నెండ్రోజుల తీర్థమిది
ప్రాంతాల వారీగా పుణ్యం
మీ చెంతకొస్తుంది
రండి తలారా మునగండి
గోదావరో... కృష్ణో... గంగో... మహాపుణ్య వేళో...
ఈ దేశాన్ని కూడా
ఏదో ఒక నదిలో ముంచండి
పుణ్యమొస్తుందేమో...!
దారిద్ర్యం తీరుతుందేమో!
పోయినోళ్ళంతా మీతో మాట్లాడతారు
పిండప్రదానం చెయ్యండి
ఆ చేతనే ఈ రాజ్యానిక్కూడా
దేవుడా! నేన్నీకు తలకొరివి పెడ్తాన్నా
గోదావరీ... నా జీవధారా నిను కాలుష్య కోవల్లోకి
మా నెత్తుటి ధారల్లోకి ఎక్కిస్తున్నదెవరు?
అఖిల పక్ష కమిటీ లెందుకు?
పని విభజన అవసరమేమిటీ
సర్వంతోనే... సకలంతోనే
మహావతార... మహానేతలారా
ప్రాణాలేమైపోతేనేం?
పదవులు పదిలం
పదవులు పదిలం
నేరాలు సరే...
తప్పించుకునే
కమిటీలు, కమీషన్లు సిద్ధం
సిద్ధం
మహా భక్తులారా!
పుష్కరాలకు కోట్లాదిగా
తరలిరండి!
మీకు మరణం ఫ్రీ
మత రాజకీయాలు జిందాబాద్
మృత్యు గోదావరి జిందాబాద్

# పుట్టెడు దుఃఖంలో పుట్టిన పండగ

**పద్మకుమారి**

వానలు పడుతున్నయి
పొలాలు దున్నుతున్నరు
బిడ్డల పండగ ఎప్పుడో..

బిడ్డలను యాదికి చేసుకోవాలి
లోకానికంతా పెత్తరమాస
నాకైతే ఇత్తనాలేసే రోజుల్లో
దు:ఖంలోంచి పుట్టిన పండగ

ఇంకా ఎవరూ రాలేదు
పిలవొస్తరో లేదో

పోయినేడు జెండా ఎగిరేసి
గుంపులు గుంపులుగా జనం జోహార్లు,, జోహార్లు అని
బిడ్డల్ని తలుచుకున్నరు
గంపలకొద్ది పూలేసిండ్లు
పాటలు పాడిండ్లు
ఏడాది పొడుగూత దాగిన దు:ఖం బైటికొచ్చింది

కొడుకు మట్లో కలిసిపోయినా
ఎర్రజెండలోంచి
అవ్వా.. అని నా దగ్గరికి వచ్చినట్లయింది
నన్ను గుండెలకు అదుముకున్నట్లయింది

వాల్లు చంపేసిన బిడ్డను సంగం నాకిచ్చింది
అందరి దు:ఖం ఒక్కటైంది

భూమ్మీదికి వంగిన నడుంతో
బిడ్డల పండగకు పోయి నిటారుగ లేచినట్లయింది

మల్ల పండగకు ఉంటనో లేదో అనే రందితో బతికిన
అంతా మంచిగుంటే
ఎట్లయిన పోవాలనుకున్నా
కొంగుపట్టుకొని పోతే
బతికినన్ని రోజులకు తాకతి మూటగట్టుకొని వస్త

కొండకు చూస్తున్నట్లు ఎదురు చూస్తున్న
ఇంకా ఎవ్వరూ రాలేదు
ఈ ముసల్ది యాదికి ఉన్నదో లేదో
స్తూపాన్ని ముట్టుకుంటే బిడ్డను తాకినట్లుంటది

# మృత్యువు నీడ

## మేడక యుగంధరరావు

భయమేస్తోంది
బొడ్డు పేగు తెగిన నేలపై
బతకాలంటేనే భయమేస్తోంది

ఆకుపచ్చని వానై కురవాలని
వెలుతురు దీపాల్ని మోసుకుంటూ
అడుగు తీసి అడుగేయబోతుంటాను
గోడ దూకి వచ్చిన తొండ ఒకటి
మిటాయి పొట్లంతో ఎదురొస్తుంది
ఒళ్ళంతా నామాలు పూసి
చటుక్కున చప్పరించేయాలని చూస్తుంది

అటకపై బూజు దులిపి
వేమన పద్యాన్ని
బహిరంగంగా ఒప్పజెప్పబోతుంటాను
సంతబజారులో
చొక్కా గుండీకి, డ్రాయరు బొందుకు

నను నగ్నంగా నిలబెట్టేయాలని చూస్తుంది
ఏరుకొచ్చిన గులకరాళ్ళను మూల పెట్టేసి
మనిషి చచ్చిపోయాడని చెప్పమంటుంది

ఎవరో వదిలేసిన మృత కళేబరాన్ని
ప్రేమగా గుండెకు హత్తుకుంటాను
జీవం పోసి
కుటుంబ సభ్యుడ్ని చేస్తాను
పండుగకో,పబ్బానికో
వేడి వేడిగా పొగలు కక్కుతున్న
ఉదారంగు పదార్థం
నాలుకపై జివ జివలాడుతుంది
ఇల్లు ఇల్లంతా
నవ్వుల గోరింటాకు పండుతుంది

సరిగ్గా అపుడే-
సింధూలోయ నాక్రమించిన
మంచు ఖడ్గం
గొంతులో సర్రున దిగబడిపోతుంది

ఆహా! ఎంత గొప్పదీ దేశం
బతకాలంటేనే భయమేస్తోంది

# అతడి పాట బతికేఉంది!

## సిరికి స్వామినాయుడు

అతడు లేడు, అతడిపాట బతికే ఉంది
అతనికంటే అతనిపాట మహా శక్తిసంపన్నమైనది
వేకువనెవడు ఉరిదీయగలడు
ఉరికే జలపాతాన్నెవడు చెరబట్టగలడు
నిప్పులవాన అతని పాటనెవడు నిషేధించగలడు

తొలకరి రెక్కల చినుకుల పిట్టలు
బీడునేల మీద వాలినపుడు...
చిరుగాలికి పైరు శిశువులా ఊగాడుతున్నపుడు
పచ్చని అడవి మీంచి
పక్షిరెక్క శబ్ద తరంగాల్ని సృష్టించినపుడు
చాళ్ల మీద చెమట విత్తులు వెదజల్లపడ్డపుడు
గనిలో వనిలో కార్ఖానాలో
స్వేద నదులు గలగలా ప్రవహిస్తున్నపుడు
అతనిపాట అంతర్లీనంగా వినిపిస్తూనే ఉంటుంది
పాల తరగల పరుగులాఅతనిపాట
ప్రజల పెదాల మీద పదాల వరదై ప్రవహిస్తూనే ఉంటుంది!

యింకా... అతని పాట ఏంచేస్తుంది
నిశ్చలమైన నదికి కెరటాల రెక్కలిస్తుంది
మోళ్లకు, కొత్తఆశల చివుళ్ల తొడుగుతుంది
కుందేళ్లకు కోరల్నిస్తుంది
పావురాళ్లకు పదునైన గోళ్లనిస్తుంది
చీమలకు పడగల్నిస్తుంది
మేకలకు పంజాలిస్తుంది
సగం చచ్చిన సమాజంమీద జీవజలాలు చల్లి
రక్తంతో రాగాలాపన చేయిస్తుంది
చేపల కోసం పన్నినట్టు
అడవులమీదా... కొండలమీదా... నదులమీదా
పన్నిన ఉక్కువలల్ని ఛేదిస్తుంది!

పడమటపొదు మీంచి ఎర్రని దొండపండు సూరీడై
అతడు రాలిపోవచ్చునేమోగానీ
రేపటితూరుపు మందార పూలవనాల్లోంచి
ఎల్లలెరుగని అతనిపాట గళమెత్తి
విముక్తిగీతమై పల్లవిస్తుంది!!

# అరుణతార నీకు లాల్ సలామ్

## రమేష్ గోండ్యాల

పున్నమి చంద్రుడి రూపంలో విముక్తి మార్గాన్ని అన్వేస్తున్న
పరిశోధకుడు ఆయన

పేదరాశి పెద్దమ్మ ఒడిలో కూర్చొని
స్వేచ్ఛ ద్వారాలు తెంచుటకై
ఓనామాలు దిద్దుకుంటున్న
భాల మేధావి ఆయన

సూర్యపేట మట్టి పొరలను పెలిగించుకోని
మొలకెత్తిన మరో సూర్యోదయం ఆయన

నిత్యం చరిత్రని అభ్యసించి
సత్యాన్ని శోధించిన వివేకవంతుడాయన

ముప్పు అంచునకు నెట్ట బడ్డ
పోలవరం ఆది వాసుల చేతిలో
ఎరుపెక్కిన ఎర్రజెండా ఆయన

శిథిల మౌతున్న బ్రతుకులను
పునరుద్ధరించి బంధాలను తెంచుకున్న
మహా ధైర్య శాలి ఆయన

నూతన మానవ ఆవిష్కరణ కలలు గంటూ
ధగ ధగ వెలుగులు విరజిమ్ముతూ
శాశ్వతంగా నింగికేగసిన
అరుణతార ఆయన

# వివాదం!

## రాంకి

మా పుట్టుకా వివాదమే
మా నడకా వివాదమే
మా చదువూ వివాదమే
మా స్నేహం వివాదమే
మా పాటా
మాటా
ఆటా అన్నీ వివాదమే
మా ఉనికీ
మా ఊపిరీ
వివాదమే
ఊరిలోకి వస్తామంటే
వివాదమే
బావి నీళ్ళు
తీసుకుంటే వివాదమే
మేము తినే ఆవుమాంసపు
తునకా వివాదమే
కట్టిన అరక
దున్నిన చెలక
అడిగిన ఎద్దడుగు జాగా
మా చేనూ
చేను గట్టూ
సమస్తం వివాదమే
మా శ్రమను
కుప్పలుగ
రాశులుపోసి
శ్రామిక ఫలం
వెలగట్టమని
వినమ్రంగా

చేతులుగట్టి
కోరడం
ఆశించడం కూడా
వివాదమే
తల దువ్వడం
తల ఎత్తడం
తెల్లని అంగో
మెరిసే గౌనో
వేసుకోవడం
మనసారా నవ్వడం
అన్నీ అన్నీ వివాదమే
ఎన్ని హింసలు పెట్టినా
మేము మళ్ళీ మళ్ళీ
మొలకెత్తడమూ
వివాదమే
మొత్తంగా
అర్థమయింది
ఈ దేశంలో
దేవుడయినా
విగ్రహమైనా
దళితుడయితే
ప్యాపిలి వినాయకుడిలా
ముక్కలై పోవాల్సిందే

* * *

ఆలయ ప్రవేశ
నిషేధాలతో
మీ అంటరాని
దేవుడు మాకెందుకులే
అనుకుంటె అదీ వివాదమే
బుద్ధుడినో జీసస్‌నో
నమ్ముకున్నా వివాదమే
మా ప్రార్థనా మా ఆచరణా
అన్నీ వివాదమయిన చోటును
మేము ఒక ఓటరుగా ఒక సంఖ్యగా
మాత్రమే నమోదయిన చోటును
మేము కేవలం ఒక "లబ్ధి"దారులమో
వినియోగదారులమో మాత్రమే అయిన చోటును
మా ఆలోచనలకు
విలువలేనిచోటును
మేమే బహిష్కరిస్తున్నాం!

* * *

అందరం అమ్మ
పొత్తిళ్ళనుంచే
బాహ్య ప్రపంచంలోకి
కనులు తెరుస్తాం
అదెం చిత్రమో గాని
మనుషులు
పాదాలనుంచి
పుడతారని చెబుతుంది
మీ "శాస్త్రం"
అదో పుక్కిటిపురాణం
అందుకే
మీ శాస్త్రాలు,
పుక్కిటిపురాణాలు
తర్కాలు
కుతర్కాలు
జడతర్కాలు
తలకిందుల తర్కాలు
మీ "పాండిత్య"
ప్రకర్షలూ
ఇంకానా ఇకపై
చెల్లవంటున్నాం!
సకల శాస్త్రాలకు
కళలకు
సంగీతాలకు
సంపదలకు
మా శ్రమే మూలం అని
సగర్వంగా డప్పేసి
చాటి చెబుతున్నాం

* * *

ఇపుడు నగరం నడి బొడ్డున
మా అమరుల సాక్షిగా
"వెలి" వాడలను సృష్టించుకుంటున్నాం
"పరమ ఛండాల"
స్వప్నాలను ఆవిష్కరించుకుంటున్నాం
నడుస్తున్న కాలం
రాబోయె కాలం
ఇక "పరమ ఛండాల"
చరిత్రల కాలమే!
ఊరి పొలిమేరలు
జరిగి జరిగి
ఎగసి ఎగసి
మీకు ఉచ్చుగా
బిగుసుకోవడం
స్పార్టకస్ నాడే
మొదలయింది
అయితే అదిపుడు
మరింత వేగవంతమయింది
( వేముల రోహిత్ స్మృతికి)

# అల్ఫియా... అల్ఫియా...

## షహీదా

సందీప్‌ను ఒళ్లో కూచోబెట్టుకుని ఆటోలోంచి బైటకు చూస్తోంది సరిత కానీ ఆమె కళ్లు వేగంగా వెనక్కి వెళిపోతున్న దృశ్యాల్ని చూడ్డం లేదు. ఆమె కళ్ల ముందు ఒకటే రూపం మెదుల్తోంది.

అల్ఫియా.

గులాబిరంగు పెదాల మధ్య త్రికోణాల్లాంటి ఎగుడుదిగుడు పళ్లు, నవ్వినప్పుడల్లా సొట్టలు పడే బుగ్గలు, మెరిసే నల్ల నల్ల కళ్లు. కీచు కీచు మంటూ చప్పుడు చేసే బూట్లను తొడుక్కుని, ఎప్పుడూ ముదురురంగుల మిలమిల మెరిసే గౌన్లో, పైజామా కుర్తాలో తొడుక్కుని తమ కాంపౌండ్ లోని వసారా అంతటా అందరికంటే బిజీగా రోజంతా తిరుగాడే అల్ఫియా.

అల్ఫియా...అల్ఫియా...

ఎలా వున్నావురా? వచ్చేస్తున్నా, నీ దగ్గరకే, కొద్దిగా ఓపిక పట్టు తల్లీ...

"ఇంకా ఎంత దూరం అమ్మా?" అసహనంగా అడిగాడు సందీప్.

ఏడేళ్ల సందీప్‌కి అమ్మ ఒళ్లో కూచోడం అసౌకర్యంగా వుంది. కానీ షేర్ ఆటో కావడంతో తప్పలేదు. ఎప్పుడెప్పుడు దిగి నడుస్తామా అన్నట్టు వుంది సందీప్‌కి.

"కొంచెం ఓపిక పట్టు నాన్నా. నాక్కూడా నిన్ను ఇలా కూచోబెట్టుకుంటే కాలు నెప్పెడుతోంది. కానీ ఏం చేస్తాం, పాపం అల్ఫీకి చాలా జ్వరం అట. తనకి ఇంకెంత కష్టంగా వుందో ఆలోచించు. ఎవరైనా దిగితే నుంచుందువులే, ఏం?" అనునయించింది సరిత.

సరే అన్నట్టు తలాడించి 'తన బెస్ట్ ఫ్రెండ్ అల్ఫీ' కోసం అలాగే ఆ అసౌకర్యాన్ని భరించడానికి సిద్ధపడ్డాడు సందీప్.

అల్ఫియా తనకు పరిచయం అయిన తీరుని గుర్తు చేసుకుంటే సరితకెప్పుడూ సంభ్రమంగానే ఉంటుంది. మబ్బు పడ్తున్న ఆకాశంకేసి చూస్తూ అనుకుంది, 'అప్పుడూ వర్షాకాలమే, ఇలాగే...'

* * *

2012లో చలపతికి సూరత్‌కి ట్రాన్స్‌ఫర్ అనగానే 'భాష తెలీని ఆ కొత్త రాష్ట్రంలో ఎలా?' అని భయపడింది సరిత. 'విశాఖలో పుట్టి పెరిగిన తనకు హిందీ కూడా రాదాయే. కానీ చేసేదేముంది?'

ఆటోలో వస్తుంటేనే 'దగ్గరకొచ్చేశాం' అని చలపతి చెప్పాక రోడ్ల మీద పెద్ద గెడ్డాలతో మగవాళ్లూ, నల్లటి బుర్ఖాలు వేసుకుని నడుస్తున్న ఆడవాళ్లను చూసి ఏదో తెలీని భయం ఆవరించింది సరితను. నాలుగేళ్ల సందీప్‌ను తీసుకుని చలపతితోపాటు ఆటోలోంచి దిగిన ఆమెకు దిగగానే తమ కిరాయి ఇల్లు వున్న కాంపౌండ్ అంతటా ముఖాన బొట్లు లేకుండా పైజామా, కుర్తాల్లో, బుర్ఖాల్లో మహిళలు కనిపించేసరికి ఇంకా మ్రాన్పడిపోయింది. కాళ్లలో ఒకలాంటి వణుకు వచ్చింది. చలపతిని ఒకర్లిద్దరు మహిళలు, "భాబీ కో లాయే, అచ్ఛా భయ్యా," అంటూ పలకరిస్తుంటే సరిత వాళ్లకేసి సరిగా కళ్లెత్తి కూడా చూడకుండా ఎలాగో లోపలకొచ్చిపడింది.

ఆ రోజు రాత్రి నెల రోజుల తర్వాత కలిసిన ఆత్రుతతో తనను దగ్గరకు తీసుకోబోయిన భర్తను తోసేస్తూ ఆమె ఉక్రోషంగా అడిగిన ప్రశ్న - "ఇంత పెద్ద సూరత్‌లో ఇంకెక్కడా దొరకలేదా ఇల్లు?"

సూరత్ లాంటి నగరంలో అంత తొందర్లో తన ఆఫీసుకు దగ్గర్లో ఇల్లు దొరకడమే అదృష్టం అంటూ ఇల్లు వెతకడంలో తన తిప్పలన్నీ చెప్పుకొచ్చిన చలపతిని ఏమనాలో సరితకు తోచలేదు కానీ ఎందుకో తన 'పరిస్థితి'ని ఏమాత్రం పట్టించుకోకుండా ఆ ఇల్లు వెతికాడనే అసంతృప్తి ఆమెలో మిగిలిపోయింది.

ఆరు నెలలు గడిచిపోయినా ఆ కాంపౌండ్‌లో నిజంగా ఎవరూ సరితను కళ్లారా చూసింది లేదనే చెప్పాలి. ఎప్పుడూ తలుపులు వేసేసుకుని ఉండేది. సందీప్‌ని బైట ఆడనిచ్చేది కాదు. తలుపేసేసి తనే ఆడేది, తర్వాత టీవీ పెట్టి మురిపించేది. రోజంతా ఇంటిపని, వంటపని, సందీప్ చదువు, ఆటలతో తీరిక లేనట్టు ఉండేది.

"పిల్లోడ్ని అలా బంధించకు, ఆడుకోనివ్వు," అని చలపతి అనేవాడు.

'ఆ పిల్లల్తోనా?'

సరితకు ఏంటో తెలీని భయంగా వుండేది. అందుకని పంపకపోయేది. తన బొమ్మల్తో తనే ఆడుకోవడం సందీప్‌కీ అలవాటైపోయింది. స్కూల్లోనూ గ్రౌండు లేదు. ఆమె ఆ ఆరు నెలల్లో చలపతిని కనీసం నెలకోసారైనా అడుగుతూ వుండిన ఒకే ఒక మాట - "ఏమైంది, ఆఫీసులో ఎవరైనా 'మంచి లొకాలిటీ'లో ఇల్లు ఉందన్నారా?" అని.

'ఈ లొకాలిటీకేమైంది?' అని చలపతి వాదించేవాడు కాదు. అతని లోకం కూడా తనూ, తన ఉద్యోగం, భార్య, సందీప్...అంతే. ఈ ఇల్లు బానే వుంది, నీళ్లకు సమస్య లేదు, ఇంటివాళ్లతో సమస్య లేదు, ఇంటి పక్కల ఎవరున్నా అతనికేం పెద్ద సమస్య లేదు. ఇల్లు తీసుకునేటప్పుడు ఎవరూ చెప్పలేదు కానీ తీరా దిగాక వర్షాకాలంలో ఎక్కువ వర్షం కురిస్తే నీళ్లు లోపలకు వచ్చేస్తాయి అని అందరూ చెప్పడంతో పై అంతస్తులో ఇల్లు దొరికితే మారదామనే అతనికీ వుండేది. కానీ దొరకలేదు. ఆ మాటే చెప్పేవాడు.

భాష కాని భాష, రాష్ట్రం కాని రాష్ట్రం, మతం కాని మతం మనుషులు చుట్టూ, ఇవన్నీ చాలదన్నట్టు గ్రౌండు ఫ్లోరు...వర్షాల్లో లెట్రిన్ నిండి నీళ్లు పైకి వస్తాయేమో అని సరిత భయం. ఏ రకంగానూ ఇష్టం లేని ఆ యింట్లో సరితకు అంతా తెలీని చికాగ్గా

వుండేది. ఫోన్లో మాట్లాడే అమ్మావాళ్లకు తన అసంతృప్తి తెలిస్తే బాధపడ్తారని చెప్పకపోయేది కానీ వాళ్లు ఆమె గొంతులో వినిపించని ఉల్లాసాన్ని పసిగట్టి నిట్టూర్చేవారు.

ఫస్టు ఫ్లోరులో ఇల్లు దొరకకుండానే వర్షాకాలం వచ్చేసింది. హోరున వర్షం, గాలి. ముందు జాగ్రత్తగా ముందువైపు తలుపు పైన షేడ్ లాగా కట్టించుకున్నారు. ఇంటి ఓనర్లతో ఎంత చెప్పినా వాళ్లు మెసలకపోవడంతో వాళ్లే డబ్బులు పెట్టుకున్నారు. అలా షేడ్ కట్టుకోని వాళ్ల ఇళ్లలోకి తలుపు కింద నుండి జల్లు కొట్టేసి గదుల్ని తడిపేస్తోంది.

'సందీప్ వచ్చే టైం అయ్యింది, తలుపు తెరిచేలోగా ఆ షేడ్ మీంచి నీళ్లు పడి తడుస్తాడేమో,' అనుకుంటూ తలుపు గడీ తీసి దగ్గరకు జారేసింది సరిత. వర్షం చిన్న తుప్పర్లకు మారింది. తనూ టీ పెట్టుకుందామని కిచెన్లోకి వెళ్లి పొయ్యి మీద కాడగిన్నెలో నీళ్లు పెట్టింది. కొంగు లాగినట్టు తోచడంతో సందీపే అనుకుని "వదులమ్మా," అంటూ వెనక్కి తిరిగిన సరితకు ఒక మూడేళ్ల పాప కనిపించింది. తలుపు తెరిచి ఉండడంతో లోపలకి వచ్చేసినట్టుంది.

గౌనంతా తడిచిపోవడమే కాదు అక్కడక్కడా మురిగ్గా కూడా వుంది. కాళ్లకు చెప్పుల్లేవు. రెండు పిలకలూ, వాటికి కట్టిన రిబ్బన్లూ కూడా నీళ్లోడుతున్నాయి.

"ఏయ్, ఎవర్నువ్వు, బైటకు నడువ్, గదంతా తడిచిపోతుంది," గట్టిగా అరిచింది సరిత.

ఆ పాపకు తెలుగు రాదు, సరితకు హిందీ రాదు. ఇద్దరూ ఒకరినొకరు కాస్సేపు అలా చూసుకున్నారు. సరితకేం చేయాలో అర్థం కాలేదు. పాపను బైటకు పంపడానికన్నట్టు దగ్గరకెళ్లింది గానీ ముట్టుకోడానికి సందేహించి అట్లే చేయి తలుపు బైటకు చూపిస్తో, "జావో, జావో, ఘర్ జావో," అంది తనకు తెలిసిన 2, 3 హిందీ పదాల్ని అతి కష్టమ్మీద గుర్తు చేసుకుని.

పాప అదేం అర్థం కానట్టు గబుక్కున సరిత చేయి పట్టుకుని, "ఊ, పిల్లా, పిల్లా, ఊ.." అంటూ తలుపుకేసి చూపిస్తోంది. సరిత గబుక్కున ఆ పాప చేయి విదిలించుకుంది. కానీ ఆ పాపకు అదేం పట్టలేదు. చీర పట్టుకుని, "పిల్లా, పిల్లా," అంటూ తలుపుకేసి సరితను లాగే ప్రయత్నం చేస్తోంది.

సరిత బైటికి తొంగి చూసింది. ఆ కాంపౌండ్లో నాలుగు వైపులా ఇండ్లు వుండి మధ్యలో అంతా ఖాళీ ప్రదేశం ఉంటుంది. దాన్ని సిమెంటుతో చప్టా చేశారు. ఎదురెదురుగా చెరి నాలుగు ఇండ్లుంటాయి. మూడోవైపు రెండు ఇండ్లు. ఏ ఇంటి నుండి చూసినా మిగతా అన్ని ఇండ్లూ కనిపిస్తాయి. నాలుగో వైపున పెద్ద ఇనుప ఊచల గేటు. దాంట్లో భాగంగానే రాకపోకలు చేయడానికి పగలంతా తెరిచి ఉంచే చిన్న తలుపు. రాత్రిపూట దానికి తాళం వేస్తారు. ఆ వీధంతా వరసగా ఇలాంటి కాంపౌండ్లే ఉన్నాయి. ఇనుప తలుపు గడియ పెట్టి ఉంది. అంటే పాప తమ కాంపౌండ్లోదే. బైటి నుండి రాలేదు. ఏ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయో అని చూసింది. అన్నీ మూసి ఉన్నాయి. అయినా వర్షంలో ఎవరు తెరుస్తారు? ఈదురుగాలి కొడ్తోంది.

'ఈ పాప ఏ ఇంటి నుండి వచ్చినట్టు?'

పాప సరితను బైటకు లాగే ప్రయత్నం చేస్తూనే ఉంది.

'ఓరి దేవుడా! ఇదెక్కడి లంపటం? ఈ పాప ఇల్లు ఏదో?'

మళ్లీ "ఘర్, ఘర్?" అంటూ పాపను ప్రశ్నించింది. పాప అదేం పట్టనట్టు, "పిల్లా, పిల్లా," అంటూ ఉంది. పరిశీలనగా చూసిన సరితకి ఆ పాప బుగ్గల మీద కారుతున్నవన్నీ వర్షం నీళ్లే కాదని అర్థం అయ్యింది.

'సందీప్ కూడా వస్తాడు,' అనుకుంటూ చాయ్ ఆశ వదులుకుని గ్యాస్ బంద్ చేసి గబగబా హవాయి చెప్పులు వేసుకుని పాపతో బైటికొచ్చింది. గొడుగు వేసుకునేంత వర్షం కాదు.

పాప సరిత చేయి పట్టుకుని ఇనుప గేటు పక్కన కాంపౌండు లోపలే రోజూ తాము చెత్త వేసే పెద్ద ఇనుప కంటేనర్ దగ్గరకు తీసుకొచ్చింది. దానికేసి చూపిస్తూ, "పిల్లా, పిల్లా," అన్నది మళ్లీ.

"ఏంటో ఈ పిల్లా," అని విసుక్కుంటూనే చూసిన సరితకు ముందు ఏం కన్పించలేదు. పాప పైన కాదు కింద అన్నట్టు కింద కూచుని అటు చూపిస్తోంది. సరితకు కూడా కూచోక తప్పలేదు. గొంతుకు కూచుని పరీక్షగా చూసింది. అప్పుడు గానీ ఒక చిన్న కుక్కపిల్ల కనిపించలేదు. నిజానికి ఆ కుక్కపిల్ల కుంయి కుంయి అంటోంది గానీ దాని గొంతు ఆ ఈదురుగాలిలో వినిపించలేదు. కంటితో చూశాక గానీ చెవులకూ ఆ కుంయి కుంయి అందలేదు. అది పూర్తిగా తడిచిపోయి వణుకుతోంది. అదక్కడ ఎలా ఇరుక్కుందో సరితకు అర్థం కాలేదు.

'దీని తల్లి ఎక్కడుందో? వస్తే కరవదు కదా?' అనుకుంటూ చుట్టూ చూసింది. ఇంతలో సందీప్ రిక్షా నుండి దిగనే దిగాడు. రిక్షా అతను రోజూలాగే పైనుండి గేటు తెరిచి వెళిపోయాడు.

ఎప్పుడూ బైటకు రాని అమ్మ ఇలా బైటకు రావడమే కాక గొడుగు లేకుండా వర్షంలో తడుస్తూ కిందకి వంగి దేన్నో చూస్తుండడం, ఆమె పక్కనే చిన్న పాప వుండడం చూసి సందీప్ కుతూహలంగా అట్లే నుంచున్నాడు.

"పో, పో, స్కూలు బ్యాగు ఇంటిలో పెట్టి, బూట్లు విడువ్. నేను వస్తున్నా," అంది సరిత.

సరితకు కుక్కపిల్ల వెంటనే కనిపించలేదు గానీ పిల్లలకుండే సహజాతంతో సందీప్కి కుక్కపిల్ల వెంటనే కనిపించింది. దాంతో సందీప్ ఆ రెండుపన్లూ చేసి మళ్లీ ఉరికొచ్చాడు.

"అమ్మా, తియ్యమ్మా దాన్ని, పాపం," అంటూ వెంటపడ్డాడు.

ఆ పాప కూడా, "పిల్లా, దో, దో," అంటోంది "తీసివ్వు" అన్నట్టుగా.

అప్పటికే వీపంతా తడిసి చీదరగా అన్పిస్తుంది సరితకు. "పిల్లా లేదు గిల్లా లేదు, పదండి," అని ఇద్దర్నీ ఒక్క కసురు కసిరి ఇంట్లోకి తరుముదామనిపించి తిరిగింది. కానీ ఇద్దరూ ఆ కుక్కపిల్లకేసి ఎంత 'అయ్యో పాపం' అన్నట్టుగా చూస్తున్నారంటే సరితకు నోరు రాలేదు. వర్షానికీ, గాలికీ తాము పడేసిన చెత్తాచెదారమే చెల్లాచెదురై అక్కడంతా చీదరగా వుంది. ఆ చెత్తలోకి చేయి పెట్టి ఆ కుక్కపిల్లను ముట్టుకోబుద్ధి కూడా కాలేదు. రోజు విడిచి రోజు చెత్త తీసుకుపోయేవాళ్లే అక్కడ శుభ్రం చేసి పోతుంటారు.

'కుక్కపిల్లను తీసి కూడా ఏం చేయాలి? దాని తల్లి వచ్చి కరుస్తే? ఈ పాపని ఇంతసేపు వదిలేసి ఇంట్లో వాళ్లేం చేస్తున్నారు,

బుద్ధి లేని మనుషులు, ఎటు పోయిందనే చింత కూడా లేదు,' అనుకుంటూ చుట్టూ చూసింది. ఎవరూ కనిపించలేదు. ముగ్గురూ తడుస్తున్నారు. పిల్లలేమో కుక్కపిల్ల లేకుండా కదిలేలా లేరు.

"ఛ, వేలెడంత లేని ఈ పిల్లలకు నా మీద ఇంత అధికారం ఏంటో," అనుకుంటూనే మొత్తానికి సరిత ఆ కుక్కపిల్లను బైటికి లాగింది. మోకాళ్ల మీద కూచోవాల్సి రావడంతో చీరంతా మురికి అయ్యింది. పాప గౌనుకి మురికి ఎలా అంటిందో అర్థమూ అయ్యింది. ఆ కంపుకి వాంతికొచ్చినట్టయ్యింది. దగ్గు పొర లేసింది. వెంటనే పిల్లలిద్దరూ కుక్కపిల్ల కోసం చేతులు చాచారు.

"కొట్టేస్తాను ఏమనుకున్నారో, ఇంట్లోకి పదండి ముందు," అని వాళ్లని ఇంట్లోకి తరిమింది. బాత్రూంలోకి వెళ్లి ఆ కుక్కపిల్లను సబ్బుతో కడిగి సందీప్ చేతికిచ్చి రెండుసార్లు తన కాళ్లూ, చేతులూ, ముఖమూ రాచి రాచి సబ్బుతో కడుక్కుంది.

బట్టలు మార్చుకుని పిల్లల్ని తుడవడానికి తువ్వాలతో వచ్చిన సరితకు తమ జీవితంలోకెల్లా గొప్ప అద్భుతాన్ని చూస్తున్నట్టుగా ఆ కుక్కపిల్ల దగ్గర చేరిన ఆ ఇద్దరు పిల్లల్నీ చూస్తుంటే నవ్వొచ్చింది. సరిగ్గా అప్పుడే ఆ పాపా సరితను చూసి నవ్వింది - బుగ్గల్లో సొట్టలు పడేలా, కళ్లు చికిలించి, ఈ 'ఒల్‌మొత్తం' ప్రపంచంలో తనంత సంతోషంగా వున్న పిల్ల ఎక్కడా లేదన్నట్టు. ఆ క్షణంలో తన మెదడు లోపల ఏ రసాయనాలు విడుదల అయ్యాయో సరితకు అర్థం కాలేదు గానీ అల్ఫియా మాత్రం ఆమె ప్రపంచంలోకి శాశ్వతంగా ప్రవేశించింది.

అప్పటికి గానీ తను భ్రమపడ్డట్టు అల్ఫియా పడగ్గదిలో నిద్రపోవడం లేదని అర్థమై ఆందోళనగా పాపను వెతుకుతూ వచ్చింది కాదు షెహనాజ్.

* * *

షేర్ ఆటో తన చివరి స్టాపులో ఆగడంతో అందరూ దిగారు. అక్కడ నుండి ఇంకో షేర్ ఆటో తీసుకున్నారు సరిత, సందీప్. ఆ రూట్‌లో అంత రద్దీ లేకపోవడంతో సందీప్‌ను తన పక్కన కూచోబెట్టుకుంది సరిత.

అల్ఫియా తమ జీవితంలోకి వచ్చాక ఇరవై నాలుగ్గంటలూ తలుపులు వేసుకుని ఉండడం ఇక సాధ్యం కాలేదు సరితకు. అల్ఫియా, సందీప్, వాళ్ల కుక్కపిల్ల టైగర్. వాళ్ల అల్లరికి ఒకోసారి తలనెప్పి వచ్చేసేది సరితకు. "టైగర్‌ని పోలీసులకిచ్చేస్తాను గోల తగ్గించకపోతే, ఏమనుకున్నారో," అనే బెదిరింపు ఒక్కటి తప్ప ఏదీ వాళ్ల కేరింతల్ని అదుపు చేయలేకపోయేది. అదీ కాస్సేపే. సందీప్‌కి తన బొమ్మలతో తనే ఆడుకునే రోజులు ఇక తిరిగి రానంత దూరానికి వెళిపోయాయి.

'అల్ఫియా ఒంటరిగా రాలేదు. అల్ఫియాతో వాళ్ల అమ్మ 'షెహనాజ్ భాభీ' వచ్చింది.

"ఆప్ మాంస్-మచ్చీ ఖాతే క్యా?" అని వెనకాముందూ ఆడుతూ అడిగి "తింటాం," అనగానే సంబరపడి చికెన్ బిర్యానీ వండినప్పుడు తెచ్చిచ్చి, "బీఫ్ వండిన గిన్నెలు కాదు భాభీ, వేరేవి లోపల నుండి తీసి విడిగా వండాను," అంటూ ప్రత్యేకంగా చెప్పే షెహనాజ్. "ఏంటీ మీ భాభీ ఈ నెలింకా బిర్యానీ పంపలేదు?" అని చలపతి అడిగేలా చేసి తనకు అసూయ కలిగించిన షెహనాజ్.

తమ బంధువులెవరో ట్రాన్స్‌ఫర్ అయి వెళిపోతుంటే వాళ్ల గ్యాస్ సిలెండర్‌ను తమ బంధువుల్లో ఎవరికో కాక తమకే సిఫారసు చేసి ఇప్పించిన షెహనాజ్.

"అల్ఫీకెప్పుడూ ముదురురంగులే తెస్తావు, లేత రంగులు పిల్లలకెంత బాగుంటాయో," అని తను తెచ్చిన గులాబీ రంగు గౌను తొడిగితే నొచ్చుకోకపోగా, "నజర్ న లగ్ జాయే మేరీ బేటీకో," అంటూ అల్ఫీని ముద్దులాడిన షెహనాజ్.

తనకు తెలిసిన హోల్‌సేల్ షాపులకు తీసుకెళ్లి చవకగా బట్టలిప్పించిన షెహనాజ్...షేర్ ఆటోల్లో ధైర్యంగా ప్రయాణించడం నేర్పిన షెహనాజ్...ఇంకా ఎన్నో, ఎన్నో తన మనసుకు మాత్రమే తెలిసిన షెహనాజ్...

ఆ వెనుకే సల్మాన్ భయ్యా ఇంట్లోకి రాకున్నా 'అల్ఫియా కే పప్పా'గా మాటల్లోకి వచ్చాడు. పది మాటలకన్నా ఎక్కువ లేని తన హిందీ-ఉర్దూ పదకోశం కనీసం వంద మాటలకు విస్తరించింది ఆ తర్వాతి రెండేళ్లలో. అందులో, 'కోయీ బాత్ నహీ, మేరీ పూజా హోగయీ, అందర్ ఆవో భాభీ" తోపాటు 'ఈద్ ముబారక్' కూడా చేరింది. కాంపౌండ్ లోని మహిళలతో 'ఆప్‌కా ఖీర్ అచ్చా హై' అనడంతో పాటు 'హమారా పాయసం భీ టేస్టు కరోనా' అని అనడం నేర్చుకుంది.'

"అసలు అల్ఫియా వాళ్లు అంత దూరం ఎందుకు వెళిపోయారమ్మా?" సందీప్ విసుగ్గా అడిగిన ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చింది సరిత.

"ఏమోరా నాకూ తెలీదు," అంది ముక్తసరిగా. అల్ఫియా గురించి ఫోన్ వచ్చినప్పటి నుండి అమ్మ మూడ్ సరిగా లేదని గుర్తొచ్చి సందీప్ కూడా గమ్మున ఉండిపోయాడు.

రోడ్డెంబడి వరుసగా కనిపిస్తున్న మెకానిక్ షాపులను చూస్తో, 'యాకూబ్ ఎలా వున్నాడో? వాళ్లు కోరుకున్నట్టుగా ఏదైనా మంచి మెకానిక్ షాపులో కుదురుకున్నాడో లేదో...' అనుకుంది సరిత.

'అల్ఫియాలాగే యాకూబ్ బుగ్గలూ సొట్టలు పడేవి. చిత్రంగా ఇద్దరు పిల్లలకూ ఇందులో వాళ్ల అమ్మ షెహనాజ్ పోలికే వచ్చింది. తన మాటల్ని కూడా 'మాటలపోగు' అల్ఫియాకే ఇచ్చేసి సాధ్యమైనంతవరకూ చిరునవ్వుతోనే పని నడిపించుకునే సోగకళ్ల యాకూబ్.'

దసరా శెలవలకొచ్చిన తన మేనకోడలు రాణి, తమ కాలనీలో నవరాత్రులన్ని రోజులూ పెద్దెత్తున జరిగిన దాండియా కోలాటం ఆటలో మెరుపుతీగలా కదులుతున్న పద్నాలుగేళ్ల యాకూబ్ మీంచి చూపులు తిప్పుకోలేకపోవడం చూసి 'ఇంకో రెండేళ్లు పోతే వీధిలో ఎంతమంది ఆడపిల్లల చూపులు ఆ సొట్టలు పడే బుగ్గల్లో చిక్కుకుపోతాయో!' అని తను నవ్వుకోవడం గుర్తొచ్చింది సరితకు.

నెలనెలా వాళ్ల కరెంట్ బిల్లుతోపాటు తమ కరెంట్ బిల్లు కూడా అడిగి మరీ తీసుకెళ్లి కట్టేసి వచ్చే యాకూబ్.

తను కుర్చీలు గేటు దగ్గర బండి లోంచి దింపడం చూసి తన స్నేహితులతో క్రికెట్ ఆడుతున్నవాడల్లా ఆపి వచ్చేసి వాటిని ఇంటిలోపల వరకూ మోసుకొచ్చి పెట్టి ఒక్కమాట కూడా మాట్లాడకుండా తిరిగి ఆటకోసం ఉరికిన యాకూబ్.

సందీప్‌కు మొదటి 'మగ దోస్తు' అయ్యి వాడిని తన

చేతుల్లోంచి లాగేసుకోవడమే కాక క్రికెట్ ఆటలో తాము కొట్టిన బంతుల్ని పరుగెత్తికెళ్లి తీసుకురావడానికి 'ఒప్పుకుని' వాడికి 'మొదటి హీరో' కూడా అయిన యాకూబ్.

ఒక్క చిన్ని బుజ్జి అల్ఫియా, ఒక్క చిట్టి పొట్టి అల్ఫియా, ఒక్క చిన్నారి పొన్నారి అల్ఫియా తమకెన్ని తలుపుల్ని తెరిచిందో...ఎంతమంది స్నేహితుల్ని తనకూ, సందీప్‌కూ సంపాదించి పెట్టిందో!

అల్ఫియా...అల్ఫియా...ఎలా వున్నావురా?'

తావు చేరడంతో సరిత, సందీప్ దిగి ఆటోకి డబ్బులిచ్చి నుంచున్నారో లేదో "ఆవో బెహన్, ఇస్ తరఫ్," అంటూ వచ్చిన సల్మాన్ వారిని తనతోపాటు తీసుకెళ్లాడు. 'తామంతా వుండిన కాలనీకీ ఈ ఇరుకు గల్లీలకూ ఎంత తేడా' సరిత అనుకోకుండా వుండలేకపోయింది. సందీప్ కూడా ఆ కొత్త వాతావరణంలో చిన్నబోయినట్టుగా ఏమడగకుండా నడుస్తున్నాడు.

గుమ్మంలోనే వాటేసుకుని కళ్లనీళ్లు పెట్టుకుంది షెహనాజ్.

"ఏం కాదు, ఏం కాదు," అంటూ ఆమె భుజం తట్టింది సరిత. సందీప్ ఇంకా బిక్కచచ్చిపోయాడు.

లోపలకెళ్లి చూస్తే అల్ఫియా మంచానికి అతుక్కుపోయినట్టుగా పడి ఉంది. కడుపు తరుక్కుపోయింది సరితకు. సందీప్ 'ఎవరీమె, అల్ఫియేనా?' అన్నట్టు విస్తుపోయి చూడ్డం చూసి, 'వీడిని తేకుండా వుండాల్సిందేమో' అనిపించేసింది సరితకు.

గది బైటకొచ్చి కూర్చున్నారు. సందీప్ అక్కడే మంచం దగ్గర మోడా మీద కూర్చున్నాడు.

"చప్పుళ్లు చేయకుండా కూర్చో, అల్ఫి నిద్రపోతోంది కదా, డిస్టర్బెన్స్ అవుతుంది," అని సందీప్‌తో చెప్పి షెహనాజ్ కేసి తిరిగింది సరిత.

"ఏం మాయరోగమో ఏంటో, ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు," అంటూ మొదలుపెట్టి షెహనాజ్ చెప్తున్న మాటలన్నీ సరిత చెవిన పడుతున్నాయి గానీ అల్ఫియానలా చూశాక పూర్తిగా తలకెక్కడం లేదు కూడా.

తాముండిన కాలనీలోనే కొత్తగా కట్టిన అపార్ట్‌మెంట్సులో రెండో అంతస్తులో వాటా కిరాయికి దొరకడంతో సరితా వాళ్లు అల్ఫి వాళ్లున్న కాంపౌండ్‌ను వదిలి వెళ్లారు. ఆ వీధంతా కూడా ఒక్కొక్కటిగా అలాంటి పాత కాంపౌండులన్నిటినీ పడగొట్టి అపార్ట్‌మెంట్లు కట్టడం మొదలయ్యింది. దాంతో ఆ తర్వాత కొద్ది నెలలకే షెహనాజ్ వాళ్లతో పాటు అందరూ ఆ కాంపౌండును ఖాళీ చేసేశారు. అప్పుడు ఒక్కసారి సరితను కలిసి మారిన ఫోను నెంబరూ, అడ్రసూ ఇచ్చేసి వెళ్లింది షెహనాజ్. అల్ఫిని తీసుకుని వచ్చింది. అదే ఆఖరు. ఈ ఆరు నెలల్లో ఒకరి కబురు ఒకరికి లేదు. అందుకని ఆరు నెలల కబుర్లు కూడా దొర్లుతున్నాయి ఉండీ ఉండీ.

షెహనాజ్ అక్క కూతురు యాస్మీన్ టీ తీసుకు వచ్చింది. ఇద్దరూ తీసుకున్నారు.

"దూధ్ పియేగా బేటా?" అడిగింది షెహనాజ్ సందీప్‌ని. సందీప్ తల అడ్డంగా ఊపాడు.

"నక్కో భాభీ. వచ్చేటప్పుడు తాగి వచ్చాడు, ఇంతకీ యాకూబ్ ఎక్కడ?"

"మీరు ఆటో దిగిన కాడే అటువైపే దుకాన్లో పని కుదిరింది. రాత్రి తొమ్మిదవుతుంది వచ్చేవరకూ."

"దుకానం మంచిదేనా? నేర్పిస్తరా? ఇంతకీ తన ఆరోగ్యం ఎలా వుంది? బాగే కదా?" అడిగింది సరిత ఆప్యాయంగా.

షెహనాజ్ ఒక్కక్షణం ఏం మాట్లాడలేదు. యాకూబ్ గురించి అడగగానే ఆమె ముఖంలో రంగులు ఎందుకు మారుతున్నాయో అర్థం కాక సరితకు కొంచెం కంగారేసింది.

షెహనాజ్ తేరుకుని, "నీ దగ్గర దాచేదేముంది భాభీ. అక్కడ ఉన్నంతవరకూ యాకూబ్ ఎలా వున్నాడో నీకు తెలవంది కాదు. అల్ఫి అనే కాదు ఎన్ని రోజుల సంది మిమ్మల్ని చూస్తుండినాడో గానీ యాకూబ్ కూడా 'ఆంటీ అచ్ఛీ హై అమ్మీ' అని నీ గురించి చెప్పినాకే నేనూ నీకు అంత దగ్గరైన. కానీ ఇప్పుడు వాడు అప్పటి లెక్క లేనట్టు అన్పిస్తుంది...," అంటూ సగంలో ఆగింది షెహనాజ్.

"అంటే?"

"నీకు నేను ఎప్పుడూ చెప్పలేదు. పదమూడేళ్ల ముందు గుజరాత్ అంతటా ముస్లింల మీద దాడులు చేసి చాలామందిని చంపేసినారు కదా, అప్పుడు సూరత్‌లో మా మీదా దాడులు జరిగినయ్. చాలా నష్టపోయినం, మీ భయ్యా పని చేసే బేకరీకీ అగ్గిపెట్టింరు. ఎట్లనో మళ్లీ ఎన్నో తిప్పలు పడి ఈకాడికి వచ్చినం. యాకూబ్ పిల్లోడు, వానికవేం గుర్తు లేవు. కానీ ఇప్పుడు వాడు పెద్దగయిండు, వానికి అన్నీ తెలుస్తున్నయ్. వాళ్ల నాయినను, నన్ను అప్పుడేమైంది, ఎట్ల జరిగింది అని అడిగిండు. ఈమధ్యల్నే అహమ్మదాబాదులో ముస్లింలను మా కాలనీల్లో వుంచొద్దు అని హిందువులు పట్టుబట్టి వాళ్లను లేపేస్తే మావోళ్లంతా ధర్నాలు చేసి చాలా గొడవ చేసిన్రు. వీని దోస్తు ఎవరో తీస్కపోతే ఆడికి పోయి వచ్చిండు. అందుకే వెంటనే ఈ దుకానం అంత మంచిది కాకున్నా వీన్ని అందులో చేర్పించిండు మీ భయ్యా. ఖాళీగుంటే ఎటు పోతడో అని. నాకెందుకో భయమైతుంది. లేదు భాభీ, వాడు మునుపటి లెక్క లేడు, ఎప్పుడూ ఏదో రందిలో ఉన్నట్లుంటడు, కోపంగా ఉంటున్నడు, రోజులూ బాలేవు...," షెహనాజ్ గొంతు నిండా విషాదం.

సరిత షెహనాజ్‌ను కొత్త మనిషిని చూస్తున్నట్టుగా చూస్తూ వుండిపోయింది. 'ఎప్పుడూ నవ్వుతూ పలకరించే ఈమె వెనుక ఇంత దుఃఖం వుందా?'

హఠాత్తుగా సరితకు అపార్ట్‌మెంటులోకి మారాక అమ్మా, నాన్నా వచ్చినప్పుడు నాన్న అన్న మాటలు గుర్తొచ్చాయి.

"పోనీలేమ్మా, యిన్నాళ్లకైనా ఈ ఇల్లు దొరికింది మంచిదైంది, రాణి చెప్పింది మీరుండిన ఆ కాంపౌండు గురించి, అంతా తురకోళ్లేనట కదా. ఈ అపార్ట్‌మెంటుల్లో వాళ్లకు ఇళ్లు కిరాయికి యివ్వడం గానీ, కొననివ్వడం గానీ వుండదట కదా అసలు. శుభం. అందులోనూ నాలుగైదు తెలుగువాళ్ల ఇళ్లే వున్నాయి కనుక మీ అత్తామామలు వచ్చినా, మాకైనా ఇలా వచ్చినప్పుడు పొద్దుపోతుంది."

'తనకు తెలవని ఈ వివరం నాన్నకెలా తెలిసిందో' అని అప్పుడు ఆశ్చర్యపోయింది. ఆయన సాయంత్రం వాకింగ్‌కు వెళ్లినప్పుడు పక్కలున్న తెలుగువాళ్లెవరో చెప్పి ఉంటారనుకుంది.

వంటింట్లో హడావుడి పడుతున్న తను తెలుగువాళ్లు ఉండడం వల్ల అమ్మావాళ్లకు బోర్ కొట్టకుండా వుందిలే అనుకుందే తప్ప...

ఈమధ్యలో వీధుల్లో ఏదో తేడా అన్పిస్తోంది అనుకున్నా కానీ ఏంటో అర్థం కాకపోయేది. షెహనాజ్ మాటలు వింటుంటే వీధుల్లో అంతకు ముందులా ఎటు చూస్తే అటు తెల్ల పైజామా, కుర్తాలూ, నల్ల బుర్ఖాలూ కనిపించకపోవడమే ఆ తేడానా? అందుకేనా వీళ్లు ఇంత దూరానికి రావల్సి వచ్చింది?

కానీ...కానీ...జీవితంలో ఒక్క ముస్లిం కుటుంబంతో కూడా పరిచయం లేని నాన్న 'శుభం' అని ఎందుకన్నాడు? అదే షెహనాజ్ అంత జరిగినా కూడా తమ పట్ల అంత ఇదిగా...'

తల వంచుకుని కూచున్న షెహనాజ్‌ను మాటలు రానట్టు మూగగా అట్లే చూస్తూ ఉండిపోయింది సరిత.

"అమ్మా, అమ్మా," సందీప్ మెల్లగా సరిత కొంగును లాగుతున్నాడు.

"ఉండమ్మా, ఆంటీతో మాట్లాడుతున్నాను కదా, వెళదాంలే," అంది సరిత బాబుకేసి తిరగకుండానే.

"లేదమ్మా..."

"క్యా బేటా, దా, నా దగ్గరకు రా, మంచిగా చదువుతున్నావా?" అంటూ సందీప్‌ను దగ్గరకు తీసుకోబోయింది షెహనాజ్. సందీప్ పోకుండా సరితతోనే,

"అమ్మా, అల్ఫీ..."

అప్పుడు గమనించింది సరిత బాబు ఏదో చెప్పాలనుకుంటున్నాడు అని.

"ఏంటమ్మా?"

"అమ్మా, అల్ఫీ చూస్తోంది...," అన్నాడు.

సరితా, షెహనాజ్ ఒక్కక్షణం ఒకరినొకరు చూసుకుని రెప్పపాటులో లేచి అల్ఫియా దగ్గరకు ఉరికారు. అల్ఫియా కళ్లు కొద్దిగా తెరుచుకుని ఉన్నాయి.

"యా అల్లా, యా ఖుదా," అంటూ షెహనాజ్ అక్కడే కూలబడింది.

సరిత అట్లే నుంచుండిపోయింది. నిన్నటి నుండి కండ్లు తెరవలేదని చెప్పారు. సందీప్ కేసి ఆశ్చర్యంగా చూసింది. సందీప్ ఆమెకేసే బితుకు బితుకు చూస్తున్నడు. దగ్గరకు తీసుకుంది.

షెహనాజ్ యాస్మిన్‌ని పిల్చి, "హకీం సాబ్ ను తోల్కరా పో, అల్ఫియా కండ్లు తెరిచింది అని చెప్పు," అని పంపింది.

షెహనాజ్ అల్ఫియా చేయి పట్టుకుని, "అల్ఫీ బేటా, ఎలా వుందిరా, సందీప్ వచ్చిండు చూసినవా?" అంటూ మంద్రస్వరంలో అడుగుతోంది. అల్ఫియా ఏం అనకుండా మళ్లీ కండ్లు మూసుకుంది.

సరిత అంతకు ముందు సందీప్ కూర్చున్న మోడా మీద కూచుంది.

హకీం సాబ్ వచ్చి చూసిండు.

పదే పదే, "చమత్కార్, చమత్కార్," అంటూ అల్ఫియాను పరీక్షలు చేశాడు.

"ఇంకేం ఫర్వాలేదమ్మా, కోలుకుంటుంది, మనం మార్చిన మందులు పని చేయడం మొదలైంది," అని హామీ ఇచ్చి, సలహాలు ఇచ్చి వెళ్లాడు.

'భగవంతుడా, రేపు నీ గుడికొచ్చి మొక్కు తీర్చుకుంటా,' మనసులోనే అనుకుంది సరిత.

'రెండు గంటలవుతుంది వచ్చి. ఇంటికెళ్లాలి. ప్రయాణమే దాదాపు గంట పడుతుంది.' వాచీ చూసుకుంటూ అనుకుంది సరిత. తనకూ, సందీప్‌కూ కూడా అక్కడ ఏదో ఊపిరాడనట్టుగా అన్పిస్తుంది అని ఆమెకు అర్థమౌతోంది.

"భాభీ, మేం వెళ్తాం మరి," అంది షెహనాజ్‌తో. అల్ఫియా పక్కనే కూచుని, శబ్దం రాకుండా పెదవులు మాత్రం కదుపుతూ ప్రార్థనలా ఏవో వల్లిస్తున్న షెహనాజ్ స్పృహలోకి వచ్చింది.

"అంతా అల్లా దయ, మీలాంటి వాళ్ల దయ భాభీ, సందీప్ రావడంతోనే అల్ఫీ కండ్లు తెరవడమేంటి, అల్లా మిమ్మల్ని చల్లగా చూస్తాడు," అంటూనే వారిని గుమ్మం దాకా సాగనంపింది షెహనాజ్.

చీకటి పడింది. వర్షం వచ్చే సూచనలు పెరిగాయి. సల్మాన్ వారి వెంటే ఆటో స్టాండ్ దాకా వచ్చాడు.

"మీరు వెళ్లండి ఇక. మేం వెళ్తాం," అంది సరిత.

"ఠీక్ హై, ఫోన్ కర్తా హు, సందీప్ బేటా అచ్ఛేసే పఢ్‌నా," అంటూ ఆయన శెలవు తీసుకున్నాడు.

ఆటోలో కూర్చున్నారు. డ్రైవరు ఆటో నిండడం కోసం చూస్తున్నాడు.

ముందు రోజు అల్ఫీ గురించి ఫోన్ వచ్చినప్పటి నుండి తెలీని వత్తిడితో ఉండిన సరితకు ఇప్పటికి గానీ మనసు కుదుటపడలేదు. ఇప్పటివరకూ అల్ఫియా గురించే ఆలోచించింది. కానీ ఆమెకు లోపలంతా మరింకేదో నెప్పిగా కూడా వుంది. యాకూబ్ తమను పలకరించడానికి కూడా రాలేదు, కనీసం సందీప్‌ని...

తాము బైల్దేరుతుండగా సల్మాన్ భయ్యా యాస్మిన్‌తో, "యాకూబ్‌కి బెహన్‌జీ, సందీప్ వచ్చిర్రని చెప్పినవా లేదా?" అని అడగడం, "హాజీ, కానీ రానన్నాడు," అని ఆమె అనడం సరిత చెవిన పడింది.

'ఈ పిల్లలకు నా మనసు మీద నేను ఇంత అధికారం ఇవ్వడం ఎందుకు? రాలేదని బాధపడ్డం ఎందుకు?' అనుకుందే గానీ మళ్లీ ఉండబట్టలేక వద్దనుకుంటూనే రోడ్డు అవతల యాకూబ్ పని చేస్తున్న దుకానం ఉందని షెహనాజ్ చెప్పిన వైపు చూసింది.

అక్కడే దుకానం బైట నుంచుని వున్న యాకూబ్ కనిపించాడు. అప్పటిదాకా అతను తమకేసే చూస్తూ వుండినాడు అని అతని తడబాటును చూడగానే సరితకు అర్థమైంది. ఇద్దరూ కొద్దిక్షణాలు రోడ్డు మీద తిరుగుతున్న వాహనాల మధ్య నుండి అలా చూసుకుంటూ వుండిపోయారు. ఇద్దరి ముఖాన నవ్వు లేదు. తడబాటుని సర్దుకుని మెల్లగా యాకూబ్ 'ఆదాబ్' అన్నట్టుగా కుడిచేయిని నుదుటి దాకా ఇంకా తీసుకువచ్చాడు గానీ సరిత అప్పటికే చూపులు తిప్పుకుంది, చూడలేదు.

ఇంతలో, "అమ్మా, అమ్మా, యాకూబ్ భయ్యా," అని సందీప్ అరుస్తూ అతనికేసి రమ్మన్నట్టుగా చేయి ఊపడం మొదలెట్టాడు. సరిత మళ్లీ అటు చూసేవరకు యాకూబ్ మాయమయ్యాడు.

సందీప్ నిరాశగా చేయి కిందకి దించి, "అమ్మా..." అని ఏదో అనబోయాడు గానీ సరిత అసహనంగా, "సరిగా కూచో, వర్షం

మొదలైతుంది," అంటూ ఆటో ప్రవేశద్వారం దగ్గర తాడుతో కట్టిన గుడ్డను విప్పింది. ఆటో భారంగా నాలుగడుగులు వేసిందో లేదో, "రోకో భయ్యా, రోకో, రోకో," అంటూ అరుపులు.

"జాగా నహీ," అంటూ డ్రైవరు గేరు మార్చి ఆటోని ముందుకురికించబోయాడు.

"అరే జాగా కే లియే నహీ," అంటూనే ఆటో వెనకే ఉరికొస్తున్న యాకూబ్ గుడ్డను పక్కకు తొలగించి ఒక పెద్ద బిస్కెట్ ప్యాకెట్టు సందీప్ చేతిలో పెట్టాడో లేదో ఆటో స్పీడందుకుంది.

"భయ్యా, ఘర్ ఆవోనా," అరిచాడు సందీప్. ప్యాకెట్టుని కిందపడేసుకున్నాడు. దాన్ని తీసి, "బ్యాగులో పెట్టనా?" అని అడిగింది సరిత. "ఊహు," అంటూ దాన్ని తీసేసుకున్నాడు సందీప్.

అల్ఫియాను చూసినప్పటి నుండి ముభావంగా, దిగులుగా వున్న సందీప్ తృప్తిగా నవ్వుతూ ఆ బిస్కెట్ ప్యాకెట్టును చూసుకోవడం చూసి, "జాగ్రత్తగా పట్టుకో మరి, కింద పడేయకు," అని చెప్పింది సరిత. సందీప్ బుద్ధిగా తలూపాడు.

సందీప్ అరిచిన అరుపు యాకూబ్‌కి వినిపించిందో లేదో సరితకు అర్థం కాలేదు.

'విన్నా గానీ వస్తాడా? ఊహు, రాడు.'

హఠాత్తుగా కొద్దిరోజుల క్రితమే ఎర్రబొట్లు పెట్టుకున్న కొంతమంది తమ అపార్ట్‌మెంటులో పంచిపోయిన 'బేటీ బచావో, బహు లావో' అని రాసున్న పాంప్లెటు గుర్తొచ్చింది.

"నీ ఫేవరెట్ కరీనా కపూర్‌ని సైఫ్ అలీ ఖాన్ ఎగరేసుకుపోవడం గురించి కూడా రాశారోయ్ ఇందులో," అని చలపతి మళ్లొకసారి తనను ఉడికించడానికి అనడం, "ఏం కాదు, వాడినసలు చూసి ఉండదు, వాళ్ల అమ్మ డింపుల్స్ పడేలా స్వీట్‌గా నవ్వి ఉంటుంది, మంచి అత్తగారు దొరకుతుందని చేసుకుని ఉంటుంది," అని తను పాత సమాధానాన్నే ఇవ్వడం, ఇద్దరూ నవ్వుకోవడం గుర్తొచ్చింది. అప్పుడసలు ఏం ఆలోచించలేదేంటి దాని గురించి? ఇప్పుడన్నీ ఎందుకిలా ఒక్కసారిగా గుర్తుకొస్తున్నాయి?'

కళ్లు మూసుకుని వెనక్కి వాలింది.

'ఊహు, రాడు. ఈసారి దసరా నవరాత్రులకు దాండియా కోలాటం ఆడడానికీ ఎలాగూ రాడు. మా అపార్ట్‌మెంటులో ఆడపిల్లల అమ్మానాన్నలు అతని సొట్టలు పడే బుగ్గల్లో వాళ్ల చూపులు చిక్కుకుపోతాయేమో అని భయపడాల్సిన పని లేదు,' వ్యంగ్యంగా, విషాదంగా పెదాలు విచ్చుకున్నాయి. తన ఆలోచనల్లోని తీవ్రతకు తనే ఉలిక్కిపడింది.

'ఇదేంటీ నాకేమైంది? ఎందుకిలా ఆలోచిస్తున్నా? ఎవరు ఎవర్ని చూస్తే నాకేం, చూడకపోతే నాకేం? అసలిదంతా నాకెందుకు? నేనూ, నా కుటుంబం సుఖంగా ఉన్నాక ఎవరెలా పోతే నాకెందుకు? అలా అనుకుంటే మరి గొంతంతా ఇంత నెప్పిగా వుండడం దేనికి?

కానీ... కానీ... అల్ఫియా ఒక్కసారైనా వస్తే బాగుండు...

అల్ఫియా ఒకసారి మా అపార్ట్‌మెంటుకొచ్చి అంతటా కలియతిరిగితే బాగుండు...'

అల్ఫియాను మొదటిసారి చూసిన రూపం ఆమె కళ్లను వీడడం లేదు.

'మీ పెద్దవాళ్లకు మా పిల్లలంతా ఒకటి కాదు కావచ్చు, కానీ మా పిల్లలకు మాత్రం మీ పెద్దలంతా ఒకటే సుమా అన్నట్టు ఎవరైనా తనకేసి చూస్తే చాలు కళ్లు చికిలించి బుగ్గలు సొట్టలు పడేలా నవ్వుతూ అందరికీ సమానంగా తన నవ్వుల్ని ఉదారంగా పంచేసే అల్ఫియా.

పెద్దవాళ్లున్నది పిల్లల మాటలు వినడానికే కదా, పిల్లలకు కావల్సినవన్నీ చేయడానికే కదా అన్నట్టు ఆ కాంపౌండ్ లోని పది ఇండ్లలో ఉన్న పెద్దవాళ్లందరినీ ఒకే విధంగా ఆజ్ఞాపించేసి తన మాట వినేలా చేసుకునే 'నియంత' అల్ఫియా.

ఇళ్లకే కాదు మనుషుల మనసులకూ తాళాలుంటాయి అని తెలీనట్టు అమాయకంగా అందరి ఇళ్లలోకీ వచ్చేసి బుడిబుడి అడుగులతో స్వేచ్ఛగా తిరుగాడే అల్ఫియా.

ఊహు, అమాయకంగా కాదు, ఏవేవో అక్కరకు రాని తాళాలతో మూసుకుపోయే ఆ మనసులన్నిటినీ తెరిచేసే తాళం చెవుల గుత్తుల్ని తన చేతుల్లో పట్టుకున్నట్టుగా కొంటెగా...

కానీ ఒకరికొకరు కనీసం కంటికొక్కడా కనిపించకుండా చేసే గోడలు రోజురోజుకూ ఎత్తుగా పెరిగిపోతుంటే అల్ఫియా ఎలా వస్తుంది? వాటిని పడగొట్టకుండా అల్ఫియా దగ్గర ఎన్ని తాళం చెవులు వుంటే మాత్రం ఏం లాభం?

చాప కింద నీరులా చూస్తూ చూస్తూ వుండగానే ఎక్కడ నుండి పుట్టుకొస్తున్నాయి ఈ గోడలు? ఎవరు పుట్టిస్తున్నారు? ఎందుకోసం? ఎవరు పడగొట్టాలి వాటిని? ఎలా? అయినా నాకెందుకు? నేనేం చేయగలను?

కానీ...కానీ...అందరూ నాలాగే నాకెందుకు అనుకుంటే?

అబ్బా! సమాధానం వెతుక్కునే శక్తిలేని నాకు ఇలాంటి ప్రశ్నలు ఎందుకు వస్తున్నాయి? ఎటు దారి తీస్తాయి ఇవన్నీ? లోపలంతా ఎందుకింత నెప్పిగా అనిపిస్తుంది?'

కణతలు నొక్కుకుంది సరిత. నిద్రకు పడ్డ సందీప్‌ను దగ్గరగా పొదువుకుంది.

కానీ అంత అలజడిలోనూ, అంత అశాంతిలోనూ, అంత చిక్కుచిక్కు ఆలోచనల్లోనూ కూడా 'అల్ఫియా తనకు పరిచయం కాకపోతేనే బాగుండేదేమో, తలుపుల వెనుక ఆ రోజులే బాగుండేవేమో' అని మాత్రం ఒక్కక్షణం అంటే ఒక్కక్షణం కూడా అనిపించడమే లేదు సరితకు. ఆమెకు తెలీకుండానే ఆమె మనసు పదేపదే ఉచ్చరిస్తున్నదల్లా.

అల్ఫియా...అల్ఫియా...ఏక్ బార్ ఆవోనా...

1 దాండియా - గుజరాత్ రాష్ట్రంలో దసరా నవరాత్రులకు పెద్దెత్తున ప్రజలు సామూహికంగా కోలాటం, ఇతరత్రా నృత్యాలు చేస్తారు.

2 'బేటీ బచావో, బహు లావో' - కొన్ని సంఘ్ పరివార్ సంస్థలు బహిరంగంగానే చేపట్టిన ఒక క్యాంపెయిన్. ముస్లిం అబ్బాయిల ఆకర్షణ నుండి హిందూ అమ్మాయిల్ని కాపాడి వారిని పెళ్లాడకుండా చూడాలి (బేటీ బచావో- కూతుళ్లను కాపాడుకోవాలి), ముస్లిం అమ్మాయిల్ని హిందూ అబ్బాయిలు ఆకర్షించి పెళ్లిళ్లు చేసుకుని వారిని హిందువులుగా మార్చాలి (బహు లావో-కోడళ్లను తేవాలి). స్థూలంగా, ఈ విధంగా చేసి ముస్లింల జనాభాను అదుపు చేసి హిందువుల జనాభాను పెంచాలి అని.

# కవిపై కుట్ర కేసు..

**పాణి**

తెలంగాణ ముఖ్యమంత్రికి చదువరి అని పేరు. ఓసారి నన్నయ్య, పాల్కురికి సోమనాథుడు గురించి చేసిన సాహిత్య వ్యాఖ్యలు టీవీలో విన్నాను. నిస్సందేహంగా అది మంచి విశ్లేషణ. ఎప్పటి నుంచో తెలంగాణ వాదులు అంటున్న మాటే. అంతక ముందు నుంచే ఆస్థానేతర తెలుగు వాఙ్మయం గురించి, దేశీ, మార్గ సాహిత్యాల గురించి అభ్యుదయ, విప్లవ సాహిత్య విమర్శకులు చారిత్రక, సామాజిక విశ్లేషణ ఇచ్చి ఉన్నారు. అయినా ఒక బూర్జువా నాయకుడి నోటి వెంట అలాంటి సాహిత్య సంబంధమైన మాటలు వింటే ఆ నాటి పరిస్థితుల్లో ముచ్చటేసింది.తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర, వాళ్ల చేసిన సాహిత్య చర్చ ప్రభావమిది.తెలంగాణవాద సాహిత్య కారుల వాదనలు అన్నీ ఒప్పుకోలేకపోయినా, అందులో ఒక ప్రజాస్వామిక ధోరణి ఉన్నది. అస్తిత్వ వ్యవహారం కాబట్టి అంగీకరించలేనివి ఎన్నో ఉన్నా.. ఒక ప్రాంత సాహిత్యానికి 'తెలుగు సాహిత్య చరిత్ర'లో జరిగిన అన్యాయం గురించిన వేదన, అన్వేషణ రెండూ అద్భుతమనిపిస్తాయి. ఇవి ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయనంటే....తెలంగాణ ప్రాంతాన్ని దోపిడీ చేసుకోవలసిన వర్గంగా మేం ఎదిగాక కూడా పక్క ప్రాంతం బూర్జవా వర్గమే దోచుకుంటూ ఉంటే ఎలా ?అని తెలంగాణ ప్రాంతీయ బూర్జవావర్గం రంగం మీదికి వచ్చాక దానికి రాజకీయ నాయకత్వం వహిస్తుండిన కేసీఆర్ ఇలాంటి సాహిత్య విశ్లేషణతో సహితం గొంతు కలపాల్సి వచ్చింది.

తెలంగాణ రాష్ట్ర సాధన కేవలం ఆ ప్రాంత బూర్జువావర్గం వల్లే రాలేదు. తొలి, మలి తెలంగాణ ఉద్యమాల వెనుక విప్లవ, ప్రజాస్వామిక శక్తుల పాత్ర గణనీయమైనది.అట్టడుగు నుంచి ప్రజా సంచలనాలను లేవదీసి, చైతన్యవంతం చేసి, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం అందించడంలో విప్లవశక్తుల పాత్ర ఇంకా తెలంగాణ ప్రభుత్వ పంచన చేరని తెలంగాణ వాదులందరూ గుర్తిస్తున్నదే. మలి దశ ఉద్యమంలో అలాంటి కృషి చేసిన యువ మేధావుల్లో కాశీం ఒకరు. కవిగా, విమర్శకుడిగా, సాహిత్య పరిశోధకుడిగా, తెలంగాణ ఉద్యమ వ్యాఖ్యాతగా ఆయన ప్రభావశీలమైన వ్యక్తి. ఈ మధ్య ఆయన విడుదల చేసిన తెలంగాణ సాహిత్య విమర్శ వ్యాసాలు చదువుతూ ఉండగా ఆయన మీద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజద్రోహం, కుట్ర కేసులను ఆపాదిస్తూ కేసు పెట్టిందని తెలిసింది. కవిగా కూడా ఆయన కుట్రలను; కుహకాలను, విద్రోహాలను ఎండగడుతూ ఎంతో కవిత్వం రాశాడు. ఇప్పుడు ఆయన మీద ఆ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర కేసు పెట్టింది. తెలంగాణ సాహిత్య చరిత్రలోకి వెళ్లి ఎన్నో అవసరమైన విశ్లేషణలు అందించిన కాశీం మీద ఆ రాష్ట్ర ప్రభుత్వం రాజద్రోహ నేరం ఆపాదించిందని తెలిసినప్పుడు కేసీఆర్ అప్పుడెప్పుడో తెలంగాణ సాహిత్యం గురించి చేసిన వ్యాఖ్య గుర్తుకు వచ్చింది..

సాహిత్యకారులను రాజ్యం కుట్రదారులగా భావించడం అనాది నుంచీ ఉంది. తన ప్రాభవాన్ని గానం చేసిన కవికి సన్మానాలు, ప్రశ్నించిన కవికి కుట్ర కేసులు బహూకరించడం రాజ్య లక్షణం. కాశీం అందరిలాగా తెలంగాణ వాది అయి ఉంటే బాగుండేది. తన చైతన్యం వల్ల, తాత్విక విశ్వాసాల వల్ల ఆయన విప్లవ రచయిత.తెలంగాణ రాష్ట్రం ఒక బూర్జువా నినాదమే అయినా అందులో తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ సమస్య ఉన్నది. దాని కోసం వాళ్లు దశాబ్దాలుగా ప్రాణాలు బలి పెట్టి పోరాడుతున్నారు.అందువల్ల విప్లవకారులు,విప్లవ రచయితులు, ఎందురో ప్రజాస్వామికవాదులు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యభావన పట్ల వాళ్లకు ఉండే గౌరవం అలాంటిది.

కాశీం ప్రజాస్వామిక తెలంగాణ గురించి మాట్లాడుతున్నందు వల్ల, అది విప్లవంలో భాగంగానే ఎప్పటికైనా సాధ్యమవుతుందనే అవగాహన ఉన్నందు వల్ల, మొత్తంగానే సమాజం మౌలికంగానే విప్లవకర పరివర్తన సాధించవలసి ఉన్నదనే నమ్మకం ఉన్నందు వల్ల కేసీఆర్ ప్రభుత్వం కుట్ర కేసు పెట్టింది. ఇది దుర్మార్గం. అయితే కేసీఆర్‌కు సహజం.తెలంగాణ ఉద్యమ కాలంలో కేసీఆర్ ఏవేవో మాట్లాడి ఉంటాడు. కోస్తా వలసవాద ప్రభుత్వం ప్రజల మీద పెట్టిన రకరకాల కేసులు ఎత్తేస్తానని, ఎన్‌కౌంటర్లు ఉండవని, భావ ప్రకటనా స్వేచ్ఛ అమలు చేస్తానని, ఏకంగా మావోయిస్టు ఎజెండా అమలు చేస్తానని నోటికి వచ్చినవన్నీ చెప్పి ఉండవచ్చు. విప్లవ శక్తులు వాటిని నమ్మలేదు. ఎందుకంటే బ్రిటీష్ వలసవాదులు వెళ్లిపోయినా వాళ్లు చేసిన నానా రకాల దిక్కుమాలిన అప్రజాస్వామిక చట్టాలను అడ్డంపెట్టుకొని దేశ ప్రజలను భారత పాలకవర్గం అణచివేస్తుండగా, కేసీఆర్ అలాంటి వాటిని తొలగించడం ఆయన వర్గ స్వభావానికి విరుద్ధం. ఆయన పరిణతి పొందిన, కల్తీ లేని నికార్సయిన బూర్జువా వర్గ ప్రతినిధి. అందుకే గత పాలకుల వలెనే రచయిత మీద కుట్ర కేసు పెట్టడానికి ఏ మాత్రం సిగ్గుపడలేదు. అసలు ఎందుకు సిగ్గుపడతాడు? విప్లవమని, ప్రజాస్వామిక తెలంగాణ అని అంటున్న కాశీం మీద రాజద్రోహ నేరం ఆపాదించడం ఆయనకు తగిన పనే. కాశీం దానికి అరుడే. కాబట్టి కోస్తాంధ్ర పాలకులు వలె నీవూ ఎట్లా రచయిత మీద కుట్ర కేసు పెడతావని ఎవరైనా అడగవచ్చు. అట్లా కూడా అడగాల్సిందే.భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం ఆ మేరకు ప్రభుత్వాన్ని నిలదీయడం గౌరవనీయమే. కుట్ర కేసు పెట్టడం, ఎన్‌కౌంటర్లు చేయడం, కూతురికి బతుకమ్మ కానుకగా కోట్ల రూపాయిలు ప్రభుత్వ ఖజానా నుంచి తీసి ఇవ్వడం, రైతులు వేలాదిగా చచ్చిపోతోంటే కోట్లకు కోట్లు గుమ్మరించి హోమాలు చేయడం కేసీఆర్ వల్గర్ రాజకీయాల్లో భాగమని వాళ్లకు మాత్రం ఎందుకు తెలియదు? సారాంశంలో ఇది రాజ్య స్వభావం అనే సంగతి తప్పక తెలిసే విషయమే.

రచయితలు కుట్రదారులు కాదు.. రాజ్యమే కుట్రదారు అనే సంగతి నలభై ఐదేళ్ల విప్లవ సాహిత్యోద్యమం నడిచిన తెలుగు సమాజానికి, అందునా తెలంగాణ సమాజానికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ తరం విప్లవ రచయితగా, విరసం నాయకుడిగా కాశీం కూడా కుట్ర కేసు ఎదుర్కొంటున్నాడు. కాకపోతే అధ్యయనపరుడని, రాష్ట్రఉద్యమకాలంలో రచయితలతో, సాహిత్యకారులతో సాన్నిత్యంగా ఉండేవాడనే పేరు మోసిన కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాక గత పాలకుల్లాగే తొలి కుట్ర కేసు ఒక కవిమీద పెట్టాడు. ఇది ఆయన వర్గ స్వభావానికి సహజమైనదే. విప్లవ రచయితలకూ సహజమే. కాకపోతే గత పాలకు వలె కేసీఆర్ కూడా అత్యంత నిరాధారమైన తప్పుడు ఆరోపణలతో కాశీం మీద ఈ కేసు పెట్టాడు. కుట్ర కేసు గతంలో ఎన్నడూ రజువు కాలేదు. వాటిలాగే కాశీం ఎక్కడ, ఎలా రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర పన్నాడో ఒక్క వాక్యం కూడా లేని ఆరోపణ చేశారు. ఎందుకంటే కేసే అబద్ధం కాబట్టి. నేరం ఎక్కడ, ఏం జరిగిందో చూపకుండా నేరం ఆపాదించడం అన్నిటి కన్నా కుట్ర. కాబట్టి కుట్రదారు కాశీం కాదు, కేసీఆరే.

# జంగ్ పరివార్‌కీ, సంఘ్ పరివార్‌కీ మధ్య...

ఖాదర్ మొహియుద్దీన్

మిత్రులారా!

విజయవాడ చలసాని ప్రసాద్ నగర్‌లో జరుగుతున్న విప్లవ రచయితల సంఘం 25 వ మహాసభలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నేను స్వాగతం పలుకుతున్నాను.

విజయవాడ నగరంలో విరసం మహాసభలు మొట్టమొదటిసారి జరగటం ఒక్కటే కాదు. ఇంకా అనేక రకాలుగా ఈ మహాసభలకు ప్రాధాన్యం వుంది.

తెలుగు భాష మాట్లాడే ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయిన అనంతరం కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిలో మనం ఈ మహాసభలు జరుపుకుంటున్నాం. తెలుగు భాష మాట్లాడే ప్రజలు నివసించే నేల రెండు ముక్కలై, రెండు రాష్ట్రాలుగా విడిపోవటం చాలామందిని, మరీముఖ్యంగా ఈ నూతన ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజానీకాన్ని తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. అలా మనస్తాపానికి గురయినవారిలో నేను కూడా ఒకణ్ణని మీ అందరిముందూ సవినయంగా మనవి చేసుకుంటున్నాను. విస్తరణ మాత్రమే కాదు, విభజన కూడా సామ్రాజ్యవాద లక్షణమే అని మీ అందరికీ గుర్తు చేస్తున్నాను.

అరబిక్ భాష మాట్లాడే ప్రజలు నివసించే నేల సామ్రాజ్యవాదం చేతుల్లో పడి కుక్కలు చింపిన విస్తరిలా మారిన విషాద సన్నివేశం, అరబ్ ప్రజలు ఇప్పటికీ అనుభవిస్తున్న దారుణమైన దాని దుష్ఫలితాలు మీకు ప్రత్యేకంగా గుర్తు చేయవలసిన అవసరం వుంటుందని నేను భావించటం లేదు.

అప్రస్తుతం అనుకోకపోతే భారత - పాకిస్తాన్ విభజన వెనుకవున్న సామ్రాజ్యవాద కుహకం గురించిన ఒక విషయం కూడా మీ ముందు ఉంచాలని అనుకుంటున్నాను. ఇరవయ్యో శతాబ్దం నాలుగో దశకం నాటికే గల్ఫ్ భూభాగంలో అపారమైన చమురు నిక్షేపాలున్నాయనే వాస్తవం వెలుగులోకి వచ్చింది. అరబ్ ప్రపంచాన్ని ఎలాగైనా సరే తన గుప్పిట్లో పెట్టుకోవాలని సామ్రాజ్యవాదం తీవ్రస్థాయిలో ఒక ఆలోచన చేసింది. చిట్టచివరికి అది ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆ నిర్ణయమే యూదుల కోసం ప్రత్యేక రాజ్యం ఇజ్రాయిల్ ప్రతిష్ఠాపన. రెండో ప్రపంచ యుద్ధంలో యూదులు దిక్కులేని పక్షుల్లా, నరక యాతనలు అనుభవించారు కాబట్టి వాళ్ళకంటూ తమదయిన ఒక దేశాన్ని నిర్మించి ఇవ్వటం నాగరిక ప్రపంచం కనీస కర్తవ్యం అని ధర్మపన్నాలు వల్లించింది సామ్రాజ్యవాదం. నిజంగా సామ్రాజ్యవాదానికి యూదుల మీద అంత ప్రేమే గనక వుండివుంటే యూరప్‌లోనో, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనో ఆశ్రయం కల్పించివుండేది. నిజం అది కాదు. తన భౌగోళిక - రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే అడుగులు వేస్తుంది సామ్రాజ్యవాదం.అరబ్ ప్రపంచం మధ్య తన ఆధిపత్యాన్ని స్థాపించడం దాని అసలు లక్ష్యం. అందుకే అది నూటికి తొంభై అయిదు శాతం మంది యూదుయేతరులైన అరబ్బులు నివసించే పాలస్తీనా గుండెలమీద ఇజ్రాయేల్ రాజ్యనిర్మాణానికి అడ్డమైన పద్ధతుల ద్వారా మార్గం సుగమం చేసింది.

ఇజ్రాయేల్ మత ప్రాతిపదికన ఏర్పడిన రాజ్యం. ఈ భూమిమీద నాగరికతనీ, నాగరికుడైన మానవుణ్ణీ, నాగరిక సమాజాన్నీ నిర్మించింది తానే అని ప్రపంచాన్ని నమ్మించి బతికేస్తున్న పాశ్చాత్య ప్రపంచానికీ, సామ్రాజ్యవాదానికీ మతరాజ్యం నిర్మించాలంటే కుదరదు. దాని ప్రతిష్ఠ దెబ్బ తింటుంది. అది ప్రపంచవ్యాప్తంగా జాతి రాజ్యాలు రూపు దిద్దుకుంటున్న కాలం. కాబట్టి ఒక మత రాజ్యాన్ని, పాకిస్తాన్‌ను నిర్మించే పనిని అది ప్రాచ్య ప్రపంచంతో చేయించింది. మరీముఖ్యంగా ముస్లింలతో చేయించింది.

సామ్రాజ్యవాదం ఆనాడు ఒక మతరాజ్యం మాత్రమే కాదు, ఏకకాలంలో ముచ్చటగా అది మూడు మతరాజ్యాల ఏర్పాటుకు అవసరమైన పునాది రాళ్ళను పరచివెళ్ళింది. ముస్లిం ప్రపంచం విషయంలో సామ్రాజ్యవాదం మొదటినుంచీ ఒక పథకం ప్రకారమే వ్యవహరించిందనే వాస్తవం ఇజ్రాయేల్ నిర్మాణం అనే సామ్రాజ్యవాద పథకంలో స్పష్టంగా ప్రస్ఫుటం అవుతుంది.

మిత్రులారా... అటు జాతీయంగానూ, ఇటు అంతర్జాతీయంగానూ అనేకానేక విపరీత పరిణామాలు చోటు చేసుకుంటున్న ఒకానొక తరుణంలో నిజానికి మనం ఈ మహాసభలు జరుపుకుంటున్నాం. రెండు మాసాల క్రితం నేను ఇదే వేదిక నుంచి ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త జయతి ఘోష్ ప్రసంగం ఒకటి విన్నాను.

ప్రస్తుతం అమలవుతున్న నయా-ఉదారవాద విధానాల ఫలితంగా సామాజిక శాస్త్రాలు అందించిన భావనల తాలూకు నిర్వచనాలన్నీ నిలువునా నీరుగారి పోతున్నాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి అనే భావన కేవలం పేదరికం నిర్మూలనగా కుంచించుకుపోయిందని ఆమె వివరించారు. భాషా కాలుష్యమే ఫాసిజానికి ప్రవేశ ద్వారంగా వుంటుందని చెప్పడం కోసం ఈ అంశాన్ని మీ ముందు ప్రస్తావించాను. పర్షియన్ భాషలో తాలిబాన్ అంటే విద్యార్థి అని అర్థం. కానీ ఇపుడు తాలిబాన్ అంటే టెర్రరిస్టు. అయితే మనం ఆ దశని కూడా అధిగమించి ముందుకొచ్చాం. టెర్రరిస్టును ఇప్పుడు తాలిబాన్ అనవలసిన అవసరం లేదు. ముస్లిం అంటే చాలు. ముస్లిం అనే మాట టెర్రరిస్టు అనే పదానికి పర్యాయపదంగా ఎప్పుడో మారిపోయింది. ఒకప్పుడు ముస్లిం అంటే ముప్పు... ముస్లిం అంటే సమస్య... ఇప్పుడు ఇక నేరుగా ముస్లిం అంటేనే టెర్రరిస్టు. ఆదివాసీ అంటే మావోయిస్టు. ఇదీ పరిస్థితి.

ఈ నేపథ్యంలో మనం సామ్రాజ్యవాదాన్ని గురించీ, హిందుత్వని గురించీ నిర్దిష్టంగా నాలుగు మాటలు మాట్లాడుకుందాం. నిజాలను నిగ్గుదేల్చే ప్రయత్నం ఒకటి చేసి చూద్దాం.

సామ్రాజ్యవాదం అనేక దశల్ని దాటి ముందుకువచ్చింది. ప్రతి దశలోనూ అది మనమందరం నివసించే ఈ ప్రపంచాన్ని

ఉద్ధరించడానికే పుట్టానని చెప్పుకుంది. 19వ శతాబ్దంలో అది ఆయా జాతులను, సమాజాలను ప్రగతి పథంలోకి పయనింపజేయాలనే ఉన్నతాశయంతో వివిధ దేశాలను తన వలసలుగా మార్చుకున్నానని నమ్మబలికింది. అనాగరికులను ఆధునికులుగా మార్చటమే తన అంతిమ లక్ష్యమని నలుగురికీ చెప్పుకుంది. ఆధునికతను తనకు అనుకూలమైన ఒక అస్త్రంలా ఉపయోగించుకుంది. వలసదేశాల ప్రజలను బానిసలను చేసింది. ప్రకృతి వనరుల్ని నిట్టనిలువునా దోచుకుంది. అలా తన దోపిడీ విధానాలకు ఆమోదముద్రను పొందటానికి అది ప్రయత్నించింది.

20వ శతాబ్దంలో అది ప్రజాస్వామ్యాన్నీ, మానవహక్కుల్నీ పరిరక్షించటానికి కమ్యూనిస్టు ప్రపంచంతో పోరాటానికి దిగానని ప్రపంచం ముందు వాదించింది. అలా అది తన స్వార్థానికి సైద్ధాంతిక ఆమోదాన్ని పొందే ప్రయత్నం చేసింది. సోవియట్ యూనియన్ పతనంతో ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిపోయింది.

ప్రచ్ఛన్న యుద్ధం అనంతరం ఇస్లాంనీ, ముస్లింలనీ మొత్తంగా మానవజాతి మనుగడకే ప్రమాదకారులనే ప్రచారం పెద్దయెత్తున ప్రారంభించింది. ఇస్లామిక్ ఫండమెంటలిజం, ముస్లిం టెర్రరిజంల నుంచి ప్రపంచ మానవాళిని పరిరక్షించాలనే మహదాశయంతోనే తాను టెర్రరిజంపై యుద్ధం ప్రకటించానని ప్రచారం చేసుకుంటున్నది. పాశ్చాత్య నాగరికతా పురోగతికి ఇస్లామిక్ ఫండమెంటలిజం, ముస్లిం టెర్రరిజంలు పెద్ద అడ్డంకిగా తయారయ్యాయని చెప్పింది. ఈ తప్పుడు ఆరోపణలకు సైద్ధాంతిక సమర్థనే శామ్యూల్ హంటింగ్‌టన్ రాసిన నాగరికతల సంఘర్షణ. నిజంగా నాగరికతలు సంఘర్షించవు. నాగరికతలు ప్రవాహాల వంటివి. కలిసి కొనసాగే స్వభావం వాటికి సహజంగానే వుంటుంది.

సామ్రాజ్యవాదం, దాని వ్యవస్థీకృత రూపం అమెరికా ఒక పచ్చి అబద్ధాల పుట్ట అని ఈరోజు ప్రత్యేకించి చెప్పుకోవలసిన అవసరం లేదు.

ఇస్లామిక్ ఫండమెంటలిజం నుంచీ, ఇస్లామిక్ టెర్రరిజంనుంచే పాశ్చాత్య ప్రపంచానికీ, మొత్తంగా మానవజాతికీ ప్రమాదం పొంచివుందని అమెరికా చేస్తూన్న వాదనలో వాస్తవం అనేది లేశమాత్రం వున్నా ముందు అది ఎవరితో తలపడాలి? మత ఛాందసవాద విధానాలను అనుసరిస్తూన్న సౌదీ రాచరిక వ్యవస్థతోనా? లేక లౌకిక జాతీయవాద ప్రభుత్వాలతోనా?? అమెరికా చేస్తూవస్తూన్న వాదన గనక నిజమైతే నిస్సందేహంగా అది తలపడవలసింది సౌదీ అరేబియతోనే అని సాధారణ వివేకం కలిగిన ఏ మనిషి అయినా ఇట్టే చెప్పగలడు. కానీ అమెరికా సామ్రాజ్యవాదం ఏం చేస్తున్నది? సౌదీ అరేబియాతో యుద్ధం చేయటం లేదు, పైగా స్నేహ సంబంధాలను నెరపుతోంది.

ఇరాక్, లిబియా, ఈజిప్టు, ఆఫ్రికాలోని లౌకిక జాతీయవాద ప్రభుత్వాలను అది నిర్దాక్షిణ్యంగా, దుర్మార్గంగా కూలదోస్తున్నది. ఇరాక్ తదితర దేశాల పాలకుల్లో కొందరు నియంతల్లాగా వ్యవహరిస్తే వ్యవహరించి వుండవచ్చు. అయినప్పటికీ అవి నూటికి నూరుపాళ్ళూ లౌకిక జాతీయవాద ప్రభుత్వాలు. అందులో అనుమానమే లేదు.

అమెరికా, అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాద దేశాలకూ ఒక విషయం చాలా స్పష్టంగా తెలుసు...

సామ్రాజ్యవాదానికి ఎప్పటికైనా లౌకిక జాతీయవాద ప్రభుత్వాలతోనే తప్ప మత ఛాందసవాదంతో ఎటువంటి ప్రమాదం వుండదని వాళ్ళకు తెలుసు. టెర్రరిజం సృష్టికర్త అమెరికన్ సామ్రాజ్యవాదం. సోవియట్ - ఆఫ్ఘన్ యుద్ధంలో సోవియట్ యూనియన్‌కి వ్యతిరేకంగా ముజాహిదీన్‌లను సృష్టించింది ఎవరు? అమెరికా కాదా? ఒసామా బిన్ లాడెన్ ఎవరి సృష్టి? ఇప్పటికీ బిన్ లాడెన్ గ్రూపుతో అమెరికాకి వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయి.

జరగాల్సిన వినాశనం అంతా జరిగిపోయాక బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇప్పుడు అంటున్నాడు : ఇరాక్ యుద్ధం పర్యవసానమే ఐసిస్ లేదా ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భావం అని...

టోనీ బ్లెయిర్ ప్రకటన ఏం చెబుతున్నది? ఉగ్రవాదాన్ని నిర్మూలించే యుద్ధ వ్యూహాన్నీ, యుద్ధ వ్యూహానికి అవసరమైన ఆయుధ సామగ్రినీ సృష్టిస్తూ ప్రపంచ మానవాళి భవితవ్యంతో చెలగాటం ఆడే ఒకానొక అమానుషమైన నిర్మాణ విశేషమే సామ్రాజ్యవాదం అని స్పష్టం చేస్తున్నది.

అమెరికన్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ ఏమంటున్నాడు?

ఒక దశలో అతడు అమెరికాలోని మసీదుల మీద నిఘా పెట్టడం తక్షణావసరం అన్నాడు...

ఒక దశలో అతడు ముస్లిం అనేవాడు అమెరికా భూభాగంపై అడుగు పెట్టకుండా నిషేధం విధించాలని ప్రతిపాదన చేశాడు... డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఇస్లామిక్ స్టేట్ తలను తెగనరికి అరబ్ ఆయిల్ నిల్వల్ని దోచుకువస్తానని ప్రకటించాడు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయవలసిన ఒక వ్యక్తి ఇంత బాహాటంగా విషం వెళ్ళగక్కుతున్నాడంటే అటు అమెరికాలోనూ ఇటు అంతర్జాతీయంగానూ ఇస్లాంకీ, ముస్లింలకీ వ్యతిరేకంగా వాతావరణాన్ని అమెరికా ఎంతగా విషపూరితం చేసి వుంచిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు సామ్రాజ్యవాదానికీ, ప్రపంచ పెట్టుబడికీ ప్రధాన శత్రువు ఇస్లాం మతం లేదా ముస్లిం సమాజం. ఇది సాక్షాత్తూ సామ్రాజ్యవాదం ప్రపంచ వేదిక మీద బహిరంగంగా ప్రకటించిన వాస్తవం.

అంతర్జాతీయంగా అమెరికా నాయకత్వంలోని జంగ్ పరివార్‌కే కాదు జాతీయంగా సంఘ్ పరివార్‌కీ ముస్లింలు, క్రైస్తవుల వంటి అల్పసంఖ్యాక వర్గమే ప్రధాన శత్రువు మరో వైపరీత్యం. అసలు సిసలైన జాతీయవాదిని తానే అని చెప్పుకుంటూన్న సంఘ్ పరివార్‌కి సిసలైన శత్రువు సహజంగానైతే ఎవరు కావాలి? నూటికి నూరుపాళ్ళూ సామ్రాజ్యవాదం దాని ప్రధాన శత్రువు కావాలి. కానీ అమెరికన్ సామ్రాజ్యవాదానికి నమ్మినబంటులాగా వుంది నరేంద్ర మోడీ ప్రభుత్వం. నరేంద్ర మోడీ అనుసరిస్తూన్న నయా ఉదారవాదానికి ఆధారం ఆధునిక సామ్రాజ్యవాదం.

ఈ దేశంలో పెచ్చుమీరిపోతూన్న ఫాసిజానికి పురాతన సమయంలోనే పునాదులు పడ్డాయి. ఆ జోలికి ఇపుడు నేను వెళ్ళటం లేదు. సంఘ్ పరివార్ నమూనా మోడీ మార్కు గుజరాత్. 2002 నాటి గుజరాత్‌ను దేశవ్యాప్తంగా అమలు పరచడమే సంఘ్ పరివార్ పథకం. ఆ పథకం అమలులో భాగమే ముజఫర్ నగర్ నుంచీ దాద్రీ వరకూ జరిగిన దారుణాలు. వందలాదిమంది ముస్లింలు, దళిత శిశువులు, దభోల్కర్, పన్సారే, కల్‌బుర్గీ, అఖ్లాఖ్‌ల హత్యలు.

కలబుర్గీ హత్యతో దేశవ్యాప్తంగా అవధులను అధిగమించిన అసహనానికి వ్యతిరేకంగా కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు తమకు ప్రభుత్వంనుంచి లభించిన అవార్డులు, పురస్కారాలను పెద్ద యెత్తున తిరస్కరించడంతో దేశవ్యాప్తంగా తలపెట్టబోయిన గుజరాత్ ప్రయోగానికి అడ్డుకట్ట పడింది. ఈ విషయంలో కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు ప్రదర్శించిన ప్రతిస్పందన అసాధారణం. వాళ్ళు తాత్కాలికంగానైనా సరే ఒక పెను ప్రమాదం నుంచి ప్రజల్నీ, దేశాన్నీ పరిరక్షించారు.

జాతీయస్థాయిలో తలపెట్టిన ఒక మహామారణహోమానికి విజయవంతంగా వాళ్ళు అడ్డుకట్ట వేశారు.

అందుకుగాను ఈ వేదికమీంచి వాళ్ళను అభినందించటం మన కనీస కర్తవ్యం అనుకుంటున్నాను. కరతాళ ధ్వనులతో వారిని అభినందించ వలసిందిగా మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటయిన పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అసహనానికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతూన్న నిరసనలకు సమాధానంగా భారతదేశ ప్రజానీకంలో అసహనం అనేది అణుమాత్రం లేదని హోమ్‌మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పదేపదే ప్రకటించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. కవులు, రచయితలు, కళాకారులు, మేధావుల ఆందోళన దేశ ప్రజానీకంలో అసహనం పెరుగుతుందని కానేకాదు. శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా దేశాన్ని పరిపాలిస్తామనీ, ప్రజల జీవన ప్రమాణాలను కనీవినీ ఎరుగని రీతిలో పెంచి దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకు వెళతామనీ ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన పాలకపక్షమైన మీలో అసహనం పెచ్చుమీరిపోయిందనీ, అది మొత్తంగా దేశాన్ని వినాశనం దిశగా తీసుకువెళుతుందనేదే కవులు, రచయితలు, కళాకారులు, మేధావుల విమర్శ.

కేవలం కవులు, రచయితలు, కళాకారులు, మేధావుల నిరసనతోనే ఈ సమస్య సమసిపోదు. వీళ్ళ చర్య సమస్య తీవ్రతను ఎజెండా మీదికి బలంగా తీసుకు వచ్చిందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే అది ఇంతటితోనే ఎంతమాత్రం పరిసమాప్తం కాదు, ఇది ఫాసిజం. నూటికి నూరుపాళ్ళూ ఇది హిందూత్వ మతోన్మాద ఫాసిజం. అక్షరాలా ఇది బ్రాహ్మణీయ అగ్రకుల ఫాసిజం. బ్రాహ్మణీయ అంటే కేవలం కులం కాదు. అది ఒక సామాజిక - ఆర్థిక - రాజకీయ ఫాసిస్టు భావజాలం.

మన సమాజంలోకి ఫాసిజం ఎలా అడుగు పెడుతుందనే విచికిత్స ఇపుడు మనకు ఇక అవసరం లేదు.

మనం పోరాడకుండా వదిలిపెట్టిన యుద్ధాల నుంచి పుట్టుకువస్తుంది ఫాసిజం...

మన కార్యక్షేత్రంలో చేర్చుకోని స్థావరాల్లోంచి...

మన కార్యక్రమంలో గుర్తించలేకపోయిన అంశాల్లోంచి...

మనం సంబోధించని సమస్యల్లోంచి...

మనం వాయిదా వేసుకున్న వాస్తవాల్లోంచి మొలుచుకు వస్తుంది...

ఫాసిజం మూలాన్ని బలహీనదశలో వుండగా కనిపెట్టలేని ప్రజాస్వామిక శక్తుల సుదీర్ఘమయిన ఏమరుపాటులోంచి పుట్టుకు వస్తుంది ఫాసిజం...

పూర్తిస్థాయిలో ఫాసిజం మనముందు ప్రత్యక్షమైందీ అంటే మనం తలపడగలిగిన తావులన్నీ దాని ఆధీనంలోకి పూర్తిగా వెళ్ళిపోయినట్టే లెఖ్క...

ఆపద్ధర్మ యుద్ధంతో ఫాసిజాన్ని అంతం చేయలేం...

ప్రాప్తకాలజ్ఞతతో ఫాసిజాన్ని పరాస్తం చేయలేం...

నేరుగా తలపడి ఫాసిజాన్ని నేలమట్టం చేయలేం...

మౌలికమైన పోరాటంలో తప్ప ఫాసిజం మూలం దొరదు...

ఎన్నికల్లో బీజేపీని ఓడించడంతోనే ఈ సమస్య తీరిపోదు. ఈ సమస్యకు ఒక శాశ్వతమైన పరిష్కారం కావాలి. అందుకు ఒక సుసంఘటితమైన దీర్ఘకాలిక పోరాటం జరగాలి. ఈ పోరాటం కేవలం ఏ ఒక్క సంస్థతోనో సాధ్యం అయేది ఎంతమాత్రం కాదు. ఈ హిందూత్వ భావజాలం కేవలం ఏ ఒక్క ముస్లిం సామాజిక సముదాయానికో లేదా క్రైస్తవ సామాజిక సముదాయానికో మాత్రమే కాదు, మొత్తంగా ఇది పీడిత ప్రజాసమూహాలన్నింటికీ ప్రమాదకారి అనే వాస్తవాన్ని గుర్తించాలి.

ఈ సందర్భంగా నేను ఈ వేదిక మీదినుంచి స్పష్టమైన ఒక విజ్ఞప్తి చేయదలచుకున్నాను. మీ అందరిముందు ఒక ప్రస్తావన పెట్టదలచుకున్నాను.

నేనిప్పుడు ఐడెంటిటీ ఉద్యమాలను ఉద్దేశించి మాట్లాడటం చాలా సముచితం అని భావిస్తున్నాను...

ఐడెంటిటీ ఉద్యమాలు సాధించిన విజయాలతో పాటు ఆ ఉద్యమాలకున్న పరిమితుల్నీ, ఆ పరిమితులవల్ల ఆయా ఐడెంటిటీలకు చెందిన అట్టడుగు వర్గాలకు జరుగుతూన్న నష్టాన్నీ అరమరికలు లేకుండా అంచనా వేసుకోవలసిన సమయం ఆసన్నమైందనే వాస్తవాన్ని అందరికీ గుర్తు చేస్తున్నాను.

వర్గచైతన్యం పేరుమీద, సార్వజనీనత పేరుమీద అస్తిత్వాలకు సంబంధించిన రకరకాల ప్రత్యేకతలను విస్మరించిన మాట ముమ్మాటికీ వాస్తవమే. సందేహం లేదు. మనం ఏమిటో, మన బాధలు, కష్టాలు ఏమిటో ఎవరో చెప్పటం కాదు మన గురించి మనమే చెప్పుకున్నాం. మన ప్రత్యేకతల్ని మరెవరూ మనలాగా శక్తివంతంగా చెప్పలేరని స్పష్టంగా రుజువు చేశాం. అందులో అనుమానం అణుమాత్రం కూడా లేదని నేను ఒప్పుకుంటున్నాను. నిర్దిష్టత మరింత నిర్దిష్టతకు దారి తీసింది. ఒక ఐడెంటిటీని చీల్చుకుని మరిన్ని ఐడెంటిటీలు ముందుకు వచ్చాయి. ఇదంతా ఒక సహజమైన పరిణామక్రమంలో భాగంగానే జరిగింది. సందేహం లేదు. కానీ ఏ ఐడెంటిటీకి ఆ ఐడెంటిటీ దుర్భేధ్యమైన దుర్గాలుగా మారి పీడిత సమూహాల మధ్య సంవాదానికి అసలు స్థానమే లేకుండా చేశాయి.

మిత్రులారా... ఈ పరిస్థితి వల్ల మనం అందరం అపారంగా నష్టపోయాం. మన పీడిత జన సమూహాలు నష్టపోయాయి. మొత్తంగా మానవ సమాజమే నష్టపోయింది. పీడిత జన సముదాయాల విశాల ప్రయోజనాల దృష్ట్యా తిరిగి మరోసారి పునరాలోచన చేయవలసినదిగా దళిత, బహుజన, స్త్రీవాద సముదాయాల ప్రతినిధులకు ఈ వేదిక నుంచి సవినయంగా మనవి చేస్తున్నాను. చరిత్ర మనకిచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం రమ్మని ఆహ్వానిస్తున్నాను. తిరిగి ఈ పీడిత సమూహాలన్నింటినీ వారి వారి ఐడెంటిటీలను పరిరక్షించుకుంటూనే ప్రజాస్వామ్యం దిశగా... లౌకిక వాదం దిశగా... పౌర సమాజం దిశగా... సార్వజనీనత దిశగా... వర్గ చైతన్యం దిశగా... కలసి కొనసాగటానికి అనువైన వాతావరణాన్ని సృష్టించటానికి ఒక సాధారణ వేదిక ఏర్పాటుకు చొరవ తీసుకోవలసిందిగా విరసం మిత్రుల్నీ, పెద్దల్నీ వేడుకుంటున్నాను.

# మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో సాహిత్యోద్యమం

## పి. వరలక్ష్మి

విరసం 25వ మహాసభకు వచ్చిన విప్లవాభిమానుకు, సాహితీ, ప్రజాసంఘాల మిత్రుకు ఆత్మీయ స్వాగతం. కలలనూ, కలాలనూ వెంటాడుతున్న ఫాసిజం సమాజాన్ని కుదిపేస్తున్న సమయంలో జరుపుకుంటున్న ఈ సభల సందర్భాన్ని మేము మంద్రస్థాయి యుద్ధసందర్భం అంటున్నాం. విప్లవోద్యమంపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో భారతప్రభుత్వం చేపట్టిన బహుముఖ యుద్ధం గురించి విరసం గత కొన్నేళ్లగా మాట్లాడుతున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పైకి విప్లవోద్యమంపై సైనికదాడిగా కనపడినా అది సామ్రాజ్యవాద మార్కెట్ అవసరాల కోసం భారత దళారీ పాలకవర్గం చేస్తున్న రాజకీయార్థిక, సైనిక, సాంస్కృతిక భావజాల యుద్ధంగా విరసం గుర్తించి ప్రచారం చేసింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశకు చేరేసరికి సామ్రాజ్యవాద మార్కెట్‌కు ఫాసిస్టు నాయకుడు అవసరమయ్యాడు. కార్పొరేట్ ప్రపంచం మోడీని ప్రధానిగా ఎన్నుకుంది. ఇటు సంఘపరివార్‌కు తన ఎజెండాను వేగవంతం చేసే అవకాశం వచ్చింది. చరిత్ర, సంస్కృతి, కళలు, సాహిత్యం అన్నింటిలోనూ జోక్యం చేసుకుని ధ్వంస రచన సాగిస్తున్నది. ఏ చిన్న సాకు దొరికినా ముస్లింలను, దళితులను హత్యలు చేస్తున్నది. రచయితలనూ, బుద్ధిజీవులనూ రాతా, ఆలోచనా మానుకొమ్మని శాసిస్తున్నది. మరో వైపు మోదీ నిశ్శబ్దంగా కార్మిక హక్కులను, భూమిపై రైతు హక్కును, ప్రకృతి సంపదపై ఆదివాసీ హక్కును రద్దు చేసి దేశం మొత్తాన్నీ బహుళజాతి కంపెనీలకు అప్పగించేపని పూర్తి చేస్తున్నాడు. (అరవై అయిదేళ్ల ఏళ్ల ఇండియన్ రిపబ్లిక్ ఇట్లా ఈ చివరకు వచ్చి చేరింది.) ప్రజలపై పాలకవర్గాలు చేపట్టిన రాజకీయార్థిక, సైనిక, సాంస్కృతిక దాడిని మొత్తంగా మంద్రస్థాయి యుద్ధంగా మేము అర్థం చేసుకుంటున్నాం. ఈ యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ ప్రాణాలర్పించిన వారందరికీ విరసం ఈ సందర్భంగా జోహార్లు చెబుతున్నది. నవయవ్వన ప్రాయంలో వెచ్చని నెత్తురు ధారబోసిన వివేక్, మడకం జోగి, మడకం దేవె, కవిత, సూర్యం, శృతి, సాగర్‌లకు అరుణారుణ జోహార్లు. కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాణంలో, విప్లవ సాహిత్య సాంస్కృతిక ఆచరణలో జీవితమంతా గడిపిన విప్లవ మానవుడు, విరసం స్థాపకుడు కామ్రేడ్ చలసాని ప్రసాద్, తొలితరం సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ ద్రోణవల్లి అనసూయమ్మ స్మరణలో ఈ సభలు జరుగుతున్నాయి. కమ్యూనిస్టు జీవిన విలువలు, విప్లవ రాజకీయాలు ఊపిరిగా బతికిన ఖాన్‌సాబ్, విరసం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన విద్యుల్లత విజయ్‌కుమార్, తొలితరం నక్సల్బరీ నాయకుడు కా.రవూఫ్, ఆదివాసీ హక్కుల గొంతుక బి.డి.శర్మ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షులు కా.మద్దిలేటికి ఈ సందర్భంగా జోహార్లు చెబుదాం. శాస్త్రీయ భావాల ప్రచారానికి హిందుత్వ మూకల దాడులకు గురై ప్రాణాలొదిలిన నరేంద్ర ధబోల్కర్, గోవింద పన్సారే, కలబుర్గిలను, గొడ్డుమాంసం తిన్నాడన్న ఆరోపణతో హత్యకు గురై దేశవ్యాప్తంగా లౌకిక ప్రజాస్వామిక హృదయాల్ని కదిలించిన అఖ్‌లాక్‌ను, అట్లాగే మతోన్మాద దాడుల్లో బలైన వాళ్లందరినీ ఈ సందర్భంగా స్మరించుకుందాం.

ప్రజలపై యుద్ధం-యుద్ధకాలపు సాహిత్యం: 2014 వరంగల్ మహాసభల నుండి ఇప్పటి వరకు గడిచిన రెండేళ్ళ కాలం ప్రజలపై యుద్ధానికి కొనసాగింపు. దండకారణ్య ఉద్యమంపై వైమానిక దాడికి కూడా సిద్ధపడే దశకు చేరుకున్న యుద్ధం కేవలం దండకారణ్య విప్లవోద్యమానికే పరిమితం కాదు. అది ఫాసిస్టు రూపంలో సమాజంలోని అన్ని ప్రాంతాలకు, అన్ని రంగాలకు విస్తరిస్తున్నది. ప్రొ.సాయిబాబా అమానుషజైలు నిర్బంధం ఆయన శరీరాన్ని రోజురోజుకూ ఎలా శిథిలం చేస్తున్నదో అట్లా ప్రభుత్వం సమాజంలో ప్రజాస్వామిక విలువలను దిగజార్చుతున్నది. దేశం మొత్తాన్ని గాలీ వెలుతురూ సోకని అండా సెల్ చేస్తున్నది. ఈ యుద్ధవ్యూహాన్ని మంద్రస్థాయి యుద్ధంగా విశ్లేషిస్తూ 2014లో విరసం ఒక పుస్తకాన్ని ప్రచురించింది. ప్రజలపై యుద్ధాన్ని

---

మిత్రులారా...

చివరిగా ఒకే ఒక్క విషయం చెప్పి నా ప్రసంగాన్ని ముగిస్తాను.

విరసం మహాసభల గురించి విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వరవరరావుగారు పత్రికా విలేఖరులను ఉద్దేశించి మాట్లాడారు. చివరిలో ఒక విలేఖరి ఒక ప్రశ్న వేశాడు.

తెలంగాణాలో కెసిఆర్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలన మీ కలల్ని ఛిద్రం చేసిందా అని అడిగాడు.

కెసిఆర్ మీద మాకు ఏనాడూ భ్రమలు లేవు. తెలంగాణ రాష్ట్రం ఉద్యమాల ద్వారా ఏర్పడదు. కేవలం లాబీయింగ్ ద్వారా మాత్రమే వస్తుందని స్పష్టంగా చెప్పిన కెసిఆర్ ప్రజల తెలంగాణా నిర్మిస్తాడని మేమెలా భ్రమపడతాం. మా కలల్ని ఎవరూ ఛిద్రం చేయలేరు. అంతటి శక్తి ఎవరికీ లేదు అని వి.వి. ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

"సబ్‌సే ఖతర్నాక్ హోతా హై సప్నోంకా మర్‌జానా" అనే అవతార్ సింగ్ పాష్ వాక్యాన్ని కూడా ఆయన ఉదహరించారు. ఆ సమయానికి ఆయన మాటలు నాకు ఎంతో ఆత్మస్థయిర్యాన్ని అందించాయి. ఫైజ్ అహమద్ ఫైజ్ కూడా అన్నాడు. అప్నె బేఖాబ్ కివాడో కొ ముఖఫ్ఫుల్ కర్లో అన్నాడు. కలలు రాని మీ మనోమందిర గవాక్షాలకు తాళాలు వేసుకోండి అన్నాడు. గొప్ప కల గొప్ప కళ అన్నాడు శ్రీశ్రీ. ఈ కలల గురించిన ఒక నిరాశ చాలా కాలంగా నన్ను వేధిస్తోంది. కుడీఎడంగా మనమందరం నక్సల్బరీ తరానికి చెందినవాళ్ళం. భవిష్యత్తును గురించి కలలు గనే శక్తిసామర్థ్యాలు మన తరానికి వున్నంతగా మన తరువాతి తరాలకు వుండటం లేదనే వాస్తవం నన్ను ఇబ్బంది పెడుతోంది. కలలుగనే శక్తి సన్నగిల్లటమంటే జాతి జవసత్వాలు నిర్వీర్యం అయిపోతున్నాయనే అర్థం. ఈ పరిస్థితినుంచి మనం మన భవిష్యత్ తరాలను కాపాడుకోవాలి. కలలుగనే శక్తిసామర్థ్యాలను సయితం మనం మన భవిష్యత్ తరాలకు వారసత్వంగా సంక్రమించేందుకు అవసరమైన సమస్తమైన చర్యలూ తీసుకోవాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తూ ముగిస్తున్నాను, ధన్యవాదాలు...

వ్యతిరేకిస్తూ అదే స్వరంతో ప్రజాప్రత్యామ్నాయం జనతనసర్కార్‌ను సాహిత్యసాంస్కృతిక రంగాల్లో ప్రచారం చేసే పనిని విరసం చేపట్టింది. పత్రికా విలేకర్లు, మేధావులు, రచయితలు దండకారణ్య ఉద్యమాన్ని, జనతనసర్కారును దగ్గరిగా పరిశీలించి సమాజానికి పరిచయం చేశారు. అసలైన ప్రజాస్వామ్యం దండకారణ్యంలో నిర్మాణమవుతున్నదని చెప్పడమే కాదు విరసం క్రాంతికారీ జనతనసర్కార్‌పై హైదరాబాదులో చర్చ నిర్వహించింది. 90 మంది దాకా రచయితలను, ఆలోచనాపరులను కలిసి వారికి దండకారణ్యంపై వచ్చిన సాహిత్యాన్ని అందజేసి మరీ చర్చకు ఆహ్వానించింది.

భారత విప్లవోద్యమ చరిత్రలో కీలక మలుపుగా రెండు విప్లవ పార్టీలు విలీనమై (సిపిఐ. యం.ఎల్. పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్) శక్తివంతమైన ప్రజాప్రత్యమ్నాయ రాజకీయ పార్టీ సిపిఐ (మావోయిస్టు)గా ఏర్పడ పదేళ్లయిన సందర్భంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక హైదరాబాదులో సదస్సును, బహిరంగ సభను ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వందలాది మందిని అరెస్టులు చేసి సభను అడ్డుకున్నాయి. ప్రజాసంఘాలతో కలిసి విరసం పోలీసుస్టేషన్‌లోనే సభను నిర్వహించి ధిక్కారాన్ని ప్రకటించింది. వరుసగా గ్రీన్‌హంట్ వ్యతిరేక సభలను కూడా అడ్డుకుని రాజ్యం మరింత నిర్బంధాన్ని ప్రయోగించింది. ప్రజాసంఘాల నాయకుల ఇళ్ల ముందు (విశాఖలో పౌరహక్కుల సంఘం బాధ్యుల ఇంటి ముందు, హైదరాబాదులో కా.వివి ఇంటి ముందు) కిరాయి మనుషుతో ధర్నాలు చేయించింది. ప్రత్నమ్నాయ రాజకీయాల పక్షాన ఏ ఒక్క గొంతూ వినపడకూడదని ప్రత్యక్ష, పరోక్ష హెచ్చరికలు చేస్తున్నది. తమిళనాడు ప్రజాగాయకుడు కోవన్ మీద రాజద్రోహం కేసు పెట్టి నిర్బంధించారు. తాజాగా ప్రజాకళామండలి కార్యదర్శి కోటిని అరెస్టు చేశారు. ఇక ఆదివాసుల మీద వేలాది కేసు నమోదై ఉన్నాయి. ఆదివాసీ గ్రామాలపై దాడులు, స్త్రీలపై అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయి.

ఇలాంటి సందర్భంలో విప్లవసాహిత్యోద్యమం దండకారణ్య కవిసమయాలను, దండకారణ్య యుద్ధగాథలను, అద్భుతమైన నూతన మానవ సృజనను అవిష్కరిస్తున్నది. దండకారణ్య రచయితలు షహీదా, మిడ్కో, నిత్య, మైనా, సుజాత, సాధన, యామిని, భానుమతి, జహంగీర్ వంటివాళ్లు తెలుగు సాహిత్యంలో సరికొత్త సంచలనాలవుతున్నారు. జాజిపూల పరిమళమై వ్యాపిస్తున్నారు. సామాన్యుల సాహస గాథలను వినిపిస్తున్నారు. వీరిలో ఇద్దరు ముగ్గురు మినహా అందరూ మహిళా రచయితలే. విప్లవ కథ, కవిత్వం గొప్ప పరిణతిని సాధించింది. విరసం సభ్యులు ముఖ్యంగా కొత్తతరం నుండి ఒక ఆకుపచ్చని కలను ఆవిష్కరిస్తున్నారు. వాట్సాప్ తరంలో యుద్ధ గీతమై పిల్లనగ్రోవి తుఫాను రాగం ఆలపిస్తున్నారు. యుద్ధంలో పెనవేసుకున్న అనుబంధాలను, అమరత్వంలో పేగు తెగిన దు:ఖాల ఇతివృత్తాలను చెబుతున్నారు. జైలుగోడలకు కలల రంగులద్దుతున్నారు. విరసం సిటీ యూనిట్ వివిధ ఘటనల సందర్భంలో ప్రయోగాత్మకంగా పొయెట్రీ ఫోల్డర్‌ను కవుల పేర్లు లేకుండా పొయెట్రీ వర్క్ షాప్ టీం సమష్టి సృజనగా వెలువరిస్తున్నది. తాజాగా 'నీచు అంచులపై భూగోళం' అనే పేరుతో కవిత్వం ఫోల్డర్ హిందుత్వ సాంస్కృతిక దాడిని నిరసిస్తూ వచ్చింది. 2014 ఎన్నికల ముందు మోదీ హైదరాబాద్ రాక సందర్భంగా విరసం కవులు కళాకారులతో నిరసన సభ ఏర్పాటు చేసి ఆ సభలో మొదటి పొయెట్రీ ఫోల్డర్‌ను ఆవిష్కరించింది. పాలస్తీనా పై ఇజ్రాయెల్ అమానుష దాడి సందర్భంలో సభ నిర్వహించి రాజకీయార్థిక విశ్లేషణలు అందివ్వడంతోపాటు 'గురి చూస్తున్న గాజా' అనే పొయెట్రీ ఫోల్డర్ ను తీసుకొచ్చింది.

ఈ రెండు సంవత్సరాలలో విరసం పది కథా సంకలనాలను, పది కవితా సంకలనాలను, రెండు నవలలను వెలువరించింది. ఈ రెండు సంవత్సరాల్లో వివిధ ప్రక్రియల్లో విరసం వెలువరించిన పుస్తకాల సంఖ్య సుమారుగా 52. వీటిని హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కడప, వరంగల్ యూనిట్లలో సాహిత్య సభలు పెట్టి పరిచయం చేసింది. వరంగల్ విరసం యూనిట్ ప్రయోగాత్మకంగా రెండు రోజుల పాటు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించి 21 పుస్తకాలను పరిచయం చేసింది.

కొంత లోటు కనిపిస్తున్నప్పటికీ విరసం కొత్త తరం 'విమర్శ ప్రక్రియ' మీద ఇప్పుడిప్పుడే కృషిని ప్రారంభించింది. కథా సాహిత్య విమర్శ మీద (పాకాలలో) రెండురోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించింది. కవిత్వం వర్క్ షాపు ద్వారా కొత్త తరం కవులను పరిచయం చేస్తున్నది. సైద్ధాంతిక రాజకీయ అంశాలపై (కోదాడలో) తాత్విక పాఠశాలను కూడా నిర్వహించింది.

బొబ్బిలిలో సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం అనే అంశం మీద రెండు రోజుల సాహిత్య పాఠశాలను నిర్వహించింది. విరసం ఆవిర్భావదినం సందర్భంలో హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు యూనిట్లలో సాహిత్య, సాంస్కృతిక, రాజకీయార్థిక అంశాలపై సభలు నిర్వహించింది. గుంటూరులో ఆలూరి భుజంగరావు స్మారకోపన్యాసాలు నిర్వహిస్తున్నది.

తెలుగువారికి రెండు రాష్ట్రాలు అదే పాలన, అదే దోపిడీ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇక ఏ మాత్రం వాయిదా వేయలేని స్థితిలో కేంద్రప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లును పార్లమెంటులో ఆమోదించింది. తెలంగాణ ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. అనేక వాగ్దానాలు చేసిన తెలంగాణ బూర్జువా వర్గం అధికారంలోకి వచ్చాక తన వర్గస్వభావాన్నే చాటుకుంది. తెలంగాణ ఉద్యమం సందర్భం నుండి కూడా విరసం తెలాంగాణ ఫ్యూడల్, దళారీ బూర్జువావర్గ స్వభావాన్ని వివరిస్తున్నది. ప్రజాస్వామిక తెలంగాణ సాధించుకోవాలంటే తప్పనిసరిగా జరగవలసిన వర్గపోరాట ఆవస్యకతను కూడా చెబుతున్నది. ఒక రాష్ట్రంగా ఏర్పడటం వల్ల ఒనగూరే ప్రయోజనాలు ఎంత వాస్తవమో, కొత్త రాష్ట్రంలో పాలకవర్గాల దోపిడీ అంతకన్నా వాస్తవం. తెలంగాణ ఆవిర్భావం నాటికే ఇరు రాష్ట్రాల పాలకవర్గాలు కేంద్రంతో కలిసి పెట్టుబడి ప్రయోజనాల కోసం సర్దుబాట్లు చేసుకున్న ఫలితంగా కనీసం భౌగోళిక తెలంగాణ కూడా ఏర్పడలేదు. విధ్వంసక పోలవరం ప్రాజెక్టు కింద ముంపునకు గురికాబోయే ఏడు మండలాను అక్కడి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రాంతంలో కలిపేశారు. విరసం ఆదివాసీల పక్షాన, పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీసి ప్రజలను పెనుప్రమాదంలోకి నెడుతున్న పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిలబడింది. ప్రజాసంఘాల బృందంతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రజల ఆవేదనను అక్షరబద్ధం చేసింది.

రాష్ట్ర విభజన తర్వాత రెండు కొత్త రాష్ట్రాల ప్రభుత్వాలు బూటకపు ఎన్‌కౌంటర్లతోనే తమ పాలనను ప్రారంభించాయి. చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత వారానికే గుంటూరు వద్ద ముగ్గురు కామ్రేడ్స్‌ను కాల్చేశారు. ఆ తర్వాత యువ కామ్రేడ్ సూర్యాన్ని ఏజెన్సీలో బూటకపు

ఎన్‌కౌంటర్ పేర హతయ చేశారు. కేంద్ర ప్రభుత్వ హిందుత్వ ఎజెండాను, కార్పొరేట్ వ్యాపార ప్రయోజలనాను నెరవేర్చే పనిలో పోటీపడుతున్నాయి. ఫక్తు బ్రాహ్మణీయ భావజాలాన్ని బహిరంగంగా వెదజల్లుతూ వేలాది కోట్ల ప్రజాధనంతో పుష్కరాలు, యాగాలు చేస్తున్నాయి. కొత్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని పేరుతో భూదోపిడీకి రియల్‌ఎస్టేట్ దందాకు తెరతీసింది. కనీవినీ ఎరగని రీతిలో డబ్బు చేతులు మారుతున్నాయి. హింస, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. పచ్చని పంటభూములు రియల్ ఎస్టేట్‌గా లంపెన్ కాపిటల్‌కు కేరాఫ్‌గా మారిపోయాయి. చంద్రబాబు ప్రభుత్వం భూసేకరణ పేరుతో భూఆక్రమణకు కుటిలయత్నాన్నీ చేసింది. రాజధాని ప్రాంతంలో విరసం క్షేత్రస్థాయి పరిశీలన చేసి రచనలను వెలువరించింది. మరోవైపు ప్రాంతీయ అసమానతలపై కొత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పుడే రాయలసీమ, ఉత్తరాంధ్ర నుండి నిరసనలు, ఆందోళనలు మొదలయ్యాయి. విరసం అన్ని న్యాయమైన ప్రాంతీయ డిమాండ్లకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్నది. సాహిత్యం ప్రచురిస్తున్నది.

తెలంగాణలో మావోయిస్టు ఎజెండాను అమలు చేస్తానన్న కె.సి.ఆర్ ముఖ్యమంత్రి కాగానే బూటకపు ఎన్ కౌంటర్లు మొదలుపెట్టాడు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్ళిన విప్లవ విద్యార్థి కా.వివేక్ ను మరో ఇద్దరు ఆదివాసీ మహిళా కామ్రేడ్స్ మడకం జోగి, మడకం దేవెలతో పాటు కాల్చి చంపింది తెలంగాణ ప్రభుత్వం. విప్లవ విద్యార్థి కా.వివేక్ అమరత్వం సందర్భంలో విరసం తన 45వ ఆవిర్భావ సభలో 'రచయితలారా మీరెటువైపు' అని పాత ప్రశ్ననే మళ్ళీ వేసింది. వివేక్ స్మృతిలో 'వాట్సాప్ తరం యుద్ధగీతం' కవిత్వం ఫోల్డర్ ను, కవితా సంకలనాన్ని వెలువరించింది. వివేక్ అమరత్వం సమాజంలో అనేక వైపుల నుండి చర్చను లేవనెత్తింది. మళ్ళీ శృతి, విద్యాసాగర్ లను అతి భయంకరమైన చిత్రహింసలకు గురిచేసి ఎన్ కౌంటర్ పేరుతో చంపేయడం పెద్ద ఎత్తున స్పందనను తీసుకొచ్చింది. 371 ప్రజాసంఘాలు, 10 వామపక్షాల అరుదైన కలయికతో తెలంగాణ డెమాక్రటిక్ ఫ్రంట్ ఏర్పడటానికి దోహదం చేసి తెలంగాణ బంద్ దాకా ఆందోళన వెల్లువెత్తింది. ఇందులో విరసం క్రియాశీలక పాత్ర పోషించింది. శృతి తండ్రి కా.సుదర్శన్ విరసం సభ్యుడు. బిడ్డ అమరత్వంపై పాటలు రాసి, గానం చేసి నిజమైన బోల్షివిక్ స్ఫూర్తిని చాటాడు. వరంగల్ ఉపఎన్నిక సందర్భంగా ఎన్నికల్లో పాల్గొనే పార్టీలను ప్రశ్నిస్తూ విరసం, అమరుల బంధుమిత్రుల సంఘం కలిసి కరపత్రాన్ని విడుదల చేశాయి.

ఆర్.టీ.సీ ఉద్యోగుల న్యాయమైన సమ్మెకు సంఘీభావం తెలుపుతూ రెండు రాష్ట్రాల్లోని వివిధ సెంటర్లలో విరసం ఉద్యోగుల ఆందోళనలో పాల్గొన్నది. సమ్మెకు మద్దతుగా కరపత్రం ప్రచురించి పంచింది. రైతుల ఆత్మహత్యల మీద వరంగల్, మేదక్ లలో క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాం. కానీ వెనువెంటనే సాహిత్యాన్ని ప్రచురించలేకపోయాము. ఎన్ని పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ అత్యంత ప్రధానమైన ఈ అంశం మీద వెనువెంటనే పుస్తకం ప్రచురించలేకపోవడం వెలితి.

కామ్రేడ్ చలసాని ప్రసాద్ అమరత్వం: ఇవన్నీ ఇలా ఉండగా కామ్రేడ్ చలసాని ప్రసాద్ హఠాన్మరణం మమ్మల్ని ఎంతో విషాదంలో ముంచివేసింది. కామ్రేడ్ సి.పి స్ఫూర్తిని, ఆయన విప్లవాచరణను విరసం కొనసాగిస్తుంది. ఆయన కృషిని, కమ్యూనిస్టు విలువల్ని ఎత్తిపడుతూ దాదాపుగా విరసం అన్ని యూనిట్లలోనూ రెండు నెలల పాటు సభలు నిర్వహించింది.

విస్తరిస్తున్న హిందూ ఫాసిజం-చిక్కనవుతున్న కాలాలూ, గళాలూ: గత ఆగస్టు 30వ తేదీన ధార్వాడ విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్, కన్నడ సాహిత్య పరిశోధకుడు యం.యం.కలబుర్గి హత్య, అక్టోబరు ఒకటో తేదీన యూ.పీ.లోని దాదారీ గ్రామంలో గోవధ చేశాడని అఖ్లాఖ్ అనే ముస్లిం హత్యతో సమాజం పెను కుదుపునకు గురైంది. గతంలో ఎన్నడూ కనిపించని స్థాయిలో వివిధ వర్గాలు, సమూహాలు, శ్రేణులు విస్తృతంగా ఒక దగ్గరకు చేరుతున్నాయి. కవులు, కళాకారులు, సినిమావాళ్ళు, బుద్ధిజీవులు, శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున తమ అవార్డులను వెనక్కి ఇచ్చేసి నిరసన తెలిపారు. తెలుగు రచయితలూ ఈ నిరసనల్లో భాగం కమ్మని విరసం పిలుపునిచ్చింది. విరసం సభ్యుడు భూపాల్ తనకు లభించిన కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డును, శృతి, సాగర్ బూటకపు ఎన్ కౌంటర్ కు నిరసనగా తెలంగాణ ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని వెనక్కు ఇచ్చారు. కాత్యాయనీ విద్మహే హిందుత్వ హత్యలకు నిరసనగా తన కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డును తిరిగిచ్చేశారు. తెలుగు సమాజంలో రచయితలు పోషించాల్సిన పాత్ర పైన అనివార్యమైన చర్చకు తెర లేచింది. బ్రాహ్మణీయ హిందుత్వ సాంస్కృతిక జాతీయవాదం సమస్త సామాజిక చైతన్యాన్ని, భిన్న సాంస్కృతిక ధారలనూ కబళించే దశకు వచ్చి చేరాక అనివార్యంగా అన్ని సమూహాలు బైటికి రావడం మొదలైంది. ఐక్య కార్యాచరణ వేదికలు ఏర్పడుతున్నాయి. హిందుత్వ ప్రమాదంపై మోడీ ఎన్నిక కావడానికి ముందే విరసం ఐక్య కార్యాచరణను పునరుద్ధరించే చొరవ చూపినప్పటికీ ఇటీవలి పరిణామాల్లోనే హిందుత్వపై ప్రజాస్వామికవాదుల్లో, రచయితల్లో స్పందన వేగంగా వచ్చింది. ఈ క్రమంలో ముందుకొస్తున్న వేదికలు, ఐక్యసంఘటనల్లో విరసం భాగం పంచుకుంటోంది. అదే సమయంలో ఈ సమస్యని సామాజిక అర్థానికే కుదించడం సరికాదని, చారిత్రకంగా హిందూ ఫాసిజానికి గల మతవర్గ కోణాన్ని వర్గపోరాట తాత్విక పునాదిగా విస్తృతంగా ప్రచారం చేయడాన్ని విరసం తన బాధ్యతగా భావించింది. ఈ దిశగా కొన్ని కార్యక్రమాలను హైదారాబాద్ కేంద్రంగా నిర్వహించింది. లౌకిక ప్రజాస్వామిక సాహిత్య సాంస్కృతిక వేదిక (ఎస్.డి.ఎల్.సి.ఎఫ్) ఆధ్వర్యంలో నవంబర్ 23వ తేదీన హైదరాబాదులో నిరసన ప్రదర్శన జరిగింది. ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించినా, అరెస్టులకు సిద్ధపడి రచయితలు, కళాకారులు ముందడుగు వేశారు.

మోదీ ఆవు రాజకీయాలపై 'మోదీ ఆవు కథల అసలు మర్మం' పేరిట విరసం కరపత్రం ప్రచురించింది. వరంగల్ యూనిట్ ఈ కరపత్రాన్ని ఉర్దూలో కూడా వేసి విడుదల చేసింది. ప్రజాసంఘాలతో ర్యాలీ నిర్వహించింది. హైదరాబాదులో ప్రజాసంఘాల ఐక్యవేదికగా ఏర్పడిన 'హిందూ మతోన్మాద వ్యతిరేక వేదిక' ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, బహిరంగ సభల్లో విరసం భాగమైంది. అట్లాగే కర్నూలు, నెల్లూరు యూనిట్లలో సభలు, ఐక్య సంఘటనల్లో భాగంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో విరసం క్రియాశీలకంగా పాల్గొన్నది.

హిందుత్వ వ్యతిరేక సాంస్కృతిక రాజకీయ కార్యాచరణని మరెంతగానో కొనసాగించాల్సిన అవసరం ఉంది. ప్రత్యమ్నాయ సాంస్కృతి, రాజకీయాలను పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి విరసం ఈ మహాసభల నుండి 2017 సాహిత్య పాఠశాల వరకు 'హిందూ ఫాసిజాన్ని ఓడిద్దాం-ప్రత్యమ్నాయ సంస్కృతి

*(మిగతా 54వ పేజీలో...)*

# ఇది మనిషి మీద యుద్ధం

పి. వరలక్ష్మి

విరసం 25వ మహాసభల థీంగా మంద్రస్థాయి యుద్ధం అనే అంశాన్ని ఎందుకు తీసుకోవలసి వచ్చింది? ఏమిటీ మంద్రస్థాయి యుద్ధం అంటే? యుద్ధం అనగానే మనకు సైనిక మోహరింపులు, భౌతిక దాడులు గుర్తుకు వస్తాయి. ఆ రకంగానే చూస్తే మంద్రస్థాయి యుద్ధం అంటే అర్థం తక్కువ స్థాయి యుద్ధమని. అయితే ఇది కేవలం సైనిక సంబంధమైనదే కాదు. ఇది దీర్ఘకాలిక సైనిక రాజకీయార్థిక సాంస్కృతిక వ్యూహం. అమెరికన్ సామ్రాజ్యవాదం, అంతర్జాతీయ పెట్టుబడి రూపొందించిన యుద్ధవ్యూహానికి పెట్టినపేరే 'లో ఇంటెన్సిటీ కాన్ ఫ్లిక్ట్'.

ఈ రోజు విద్యార్థులు, రైతుల ఆత్మహత్యలు, హిందుత్వ హత్యల రూపంలో మన దేశంలో సామాజిక సంక్షోభం అత్యంత తీవ్రస్థాయిలో వ్యక్తమవుతోంది. ఆత్మహత్యలు సామాజికార్థిక రంగాల్లో హీనస్థితిని తెలియజేస్తే, మతోన్మాద హత్యలు మన సాంస్కృతిక, భావజాల స్థాయిని వ్యక్తం చేస్తున్నాయి. వేటికవి విడివిడిగా చర్చకు వచ్చే ఈ వ్యక్తీకరణలన్నిటి వెనక ఒక కామన్ థ్రెడ్ ఉంది. దేశ రాజకీయార్థిక సాంస్కృతిక విధానాలను నిర్దేశించే పాలకవర్గ ప్రయోజనాలున్నాయి. అవి సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రయోజనాలతో కలగలిసి ఉన్నాయి. వీటి వెనక లో ఇంటెన్సిటీ కాన్ ఫ్లిక్ట్ ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం ఉంది. ప్రత్యక్షంగా ఈ యుద్ధ తంత్రాన్ని భారత ప్రభుత్వం దండకారణ్యంలో అమలు చేస్తున్నది. పరోక్షంగా అది ప్రజలపై, మనిషి మనిషిపై రాజకీయ ఆర్థిక సాంస్కృతిక యుద్ధం చేస్తున్నది. ఈ రోజు మనమంతా మంద్రస్థాయి యుద్ధంలో ఉన్నాం. ఒక్క మావోయిస్టులే కాదు దేశం మొత్తం దాని ఎదుర్కొంటోంది. అది మనిషి మీద యుద్ధం. మనిషిని మనిషిగా, సామాజిక మానవుడిగా/ మానవిగా మిగలనివ్వని యుద్ధం.

మంద్రస్థాయి యుద్ధ స్వభావం ఎలా ఉంటుందంటే.. అది మన మానసిక ప్రపంచాన్ని మొత్తం స్వాధీనం చేసుకుంటుంది. తెలియకుండానే మనం దానికి లోబడిపోతాము. చిన్న ఉదాహరణ తీసుకుంటే.. ఇటీవలి వివేక్, సూర్యంల ఎన్‌కౌంటర్ సందర్భంలో తెలుగు సమాజంలోని ఆలోచనాపరులు ఒక వాదనను తీసుకొచ్చారు. ఇరవై ఏళ్లయినా నిండని పిల్లలను ఉద్యమం బలితీసుకుంటున్నది అని. బలితీసుకున్నది రాజ్యం కాదా? ఎన్ కౌంటర్ అంటేనే ఏకపక్ష కాల్పులన్నది స్థిరపడిన అర్థం. ఈ విషయం అందరూ ఒప్పుకుంటారు. పట్టుకునే అవకాశం ఉన్నా చిన్న పిల్లలని ఎలా కాల్చి చంపారు? అనే ప్రశ్న ఎందుకు రాలేదు. ఇది పాత ప్రశ్నే కదా? అరెస్టు చేసి వాళ్ళను మీరనుకునే విధంగా సంస్కరించి వాళ్ళ భవిష్యత్తును కాపాడొచ్చు కదా! ఈ ప్రశ్న ఏ ప్రాధాన్యతల, ప్రభావాల మరుగున పడిపోయింది? విద్యార్థుల కెరీర్ చుట్టూ ఉన్న భ్రమాజనిత వ్యూహంలో మేధావులు కూడా పడిపోయారా? విద్యార్థులు ఉద్యమాలకు దూరమవుతున్నారని, స్వార్థం, సంకుచిత భావాల్లోకి కుంచించుకు పోతున్నారని ఒకవైపు వాదిస్తూ ఉంటారు. భగత్ సింగ్‌నే కాదు, క్యాంపస్ లలో జార్జిరెడ్డి, జనార్దన్‌ల కాలాన్ని, ప్రభావాన్ని గుర్తు చేస్తుంటారు. అటువంటిది వాళ్ళు బూర్జువా భావజాలానికి లోనుకావడం చూడండి. రాజ్యాన్ని ప్రశ్నించడానికి వెనుకాడే సమాజం రాజ్యం వ్యూహంలో చిక్కుకుపోయిందని అర్థం. 'ప్రోగ్రామింగ్ ది మైండ్' అనే సామ్రాజ్య వాద వ్యూహం అది.

## మంద్రస్థాయి యుద్ధవ్యూహం ఎలా రూపొందింది?

నిర్దిష్టంగా చెప్పటం కష్టం. కానీ వియత్నాం చేతుల్లో చావుదెబ్బ తిన్న అమెరికా అంతర్మథనం నుండి వాళ్ళ జాతీయ భద్రతా విశ్వవిద్యాలయం 1980లలో దీనిని రూపొందించిందని డాక్యుమెంట్లు చెప్తాయి. ఇది మూడు రకాల యుద్ధాల గురించి చెప్తాయి. హెచ్చు స్థాయి (ప్రపంచ యుద్ధాలు), మధ్యస్థాయి (దేశాల మధ్య), తక్కువస్థాయి యుద్ధాలు(విప్లవ, జాతి విముక్తి పోరాటాలతో తలపడేవి). మూడో దాన్నే మనం మంద్రస్థాయి యుద్ధమని చెప్పుకుంటున్నాం. దీనిని నేరుగా కాక తీవ్రవాదంపై యుద్ధం, మాదక ద్రవ్యాల నిరోధం కోసం యుద్ధం వంటి పేర్లతో వ్యవహరిస్తుంటారు. వియత్నాం వీర గెరిల్లాలు అమెరికా దురాక్రమణ వ్యూహాన్ని అన్ని విధాలుగా ఛేదించి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. దీంతో యుద్ధం గెలవాలంటే సాయుధ బలం ఒక్కటే సరిపోదు అని అర్థం చేసుకున్న సామ్రాజ్యవాదం అక్కడి నుండి దురాక్రమణల వ్యూహం మరింత పకడ్బందీగా రూపొందించుకున్నది.

ఇది రూపొందే సమయంలోనే ఆఫ్ఘనిస్తాన్లో అమెరికా సోవియట్ సైన్యంతో తలపడుతూ ఒక ప్రయోగం చేస్తోంది. తాలిబాన్ పుట్టుక, ఇస్లాం తీవ్రవాద బూచీ చూపి అమెరికా చేసిన దురాక్రమణ యుద్ధాల కొనసాగింపు నేటికీ నడుస్తున్న చరిత్రే. సోవియట్ పోయాక అమెరికా ప్రయత్నపూర్వకంగా ఒక శత్రువును తయారు చేసుకుంది. ట్విన్ టవర్స్ వెనక ట్రూత్ ఏమిటని రాసిన పరిశోధనాత్మక కథనాలు చదివితే గగుర్పాటు కలుగుతుంది.

మంద్రస్థాయి యుద్ధవ్యూహం (1980ల్లో) నిర్దిష్టంగా రూపొందక ముందే రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక (1954లో) అమెరికా, యూరప్ పెట్టుబడిదారులు బిల్డర్ బెర్గ్ గ్రూపుగా ఏర్పడి పెట్టుబడుల విస్తరణకు రిస్క్ లేకుండా, తమలో తాము యుద్ధాలు చేసుకోకుండా ఒక దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించుకున్నారు. కమ్యూనిస్టు ప్రభావం అత్యధికంగా ఉన్న ఒత్తిడి కూడా ఈ వ్యూహం రూపొందించుకోడానికి ఒక కారణం. ఈ గ్రూపు ఐదు వందల సంవత్సరాల ఎజెండాతో రూపొందిందని చెప్తారు. వీళ్ళు ఆనాడే ప్రపంచ మార్కెట్ లక్ష్యంగా గ్లోబల్ గవర్నెన్స్‌ను స్థాపించాలని తీర్మానించుకున్నారు. సామరస్యంగా మార్కెట్లను పంచుకోవాలనుకున్నారు. ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూటీవో, నాటో, ఇంటర్ పోల్ వగైరాలు గ్లోబల్ గవర్నెన్స్ స్థాపించడానికి ఏర్పాటు చేసుకున్నవే.

సరే, కమ్యూనిస్టులను అంతం చేయాలని కూడా వాళ్ళు ప్రధానంగా అనుకున్నారు. ఇంక వాళ్ళలో వాళ్ళు యుద్ధం చేయకుండా మూడో ప్రపంచ దేశాల్లో వైరుధ్యాలు పరిష్కరించుకోవాలని అనుకున్నారు. అట్లా యుద్ధక్షేత్రాలు మారాయి. పేదదేశాలే సామ్రాజ్యవాద యుద్ధ క్షేత్రాలు. ఇజ్రాయెల్ ను స్థాపించడం వెనక బలమైన సైనిక, ఆర్థిక వ్యూహం ఉంది. అక్కడి నుండి వనరులున్న ముస్లిం దేశాల్లో, దేశాలతో యుద్ధాలు ఎట్లా జరుగుతున్నాయో మనం చూస్తున్నాం. పెట్టుబడిదారీ మీడియా ఏ భావజాలాన్ని

ప్రచారం చేయాలో, ఏ వార్తలు చెప్పాలో, ఏ అభిప్రాయం దిశగా జనాన్ని నడిపించాలో ఎటువంటి శషభిషలు లేని స్పష్టమైన విధానం వారికి ఉంది. బిల్డర్ బర్గ్ గ్రూపులో మీడియా భాగస్వామిగా ఉన్న సి.ఎస్.బి.ఎన్. సంస్థ మాజీ అధినేత రిచర్డ్ సలాంట్ వంటివాళ్లు " మీడియా పని జనానికి ఏం కావాలో అది ఇవ్వడం కాదు, మనం ఏది ఇవ్వాలో అది జనం తీసుకునేలా చేయడం". అని స్పష్టంగా చెప్పారు. ఇటీవలి సంవత్సరాలలో బిల్డెన్ బర్గ్ గ్రూపు గురించి పాశ్చాత్య దేశాల్లో పుస్తకాలు, వ్యాసాలు వస్తున్నాయి. చర్చలు జరుగుతున్నాయి. వాటిని అధ్యయనం చేయొచ్చు.

మంద్రస్థాయి యుద్ధవ్యూహం రూపొందడం వెనక నేపథ్యం ఇది. ఎల్ ఐ సీ వ్యూహం చెప్పే ముఖ్యమైన విషయం ఏమిటంటే "భావజాల యుద్ధం గెలవగలిగితే మరే యుద్ధమూ కష్టం కాదు" అని. ఎల్ ఐ సీ మొత్తంగా నాలుగు ముఖాల వ్యూహం. ఆర్థిక, రాజకీయ, సామాజిక (సాంస్కృతిక, భావజాల సంబంధమైన), సైనిక వ్యూహాల్లో చివరిది అవసరమైనప్పుడు మాత్రమే నేరుగా రంగంలోకి వస్తుంది.

## ఎల్ ఐ సీ ఎలా అమలవుతుంది?

సామ్రాజ్యవాదం దేశాల ఆర్థిక వ్యవస్థల్లో నేరుగా జోక్యం చేసుకుని దాని నడుములు విరగ్గొట్టడంతో పాటు రాజకీయంగా దానికి ఎదురు లేకుండా చేసుకుంటుంది. కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటుంది. విద్రోహ కార్యకలాపాలు చేపడుతుంది. పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం లేదు అని సైద్ధాంతిక ప్రచారం చేస్తుంది. కమ్యూనిజానికి కాలం చెల్లింది అని, సోషలిజం అంటే నియతృత్వం అని దిష్ప్రచారానికి అదే పనిగా కొంతమంది అనుకూల మేధావులను తయారు చేసుకుంటుంది. నిరంత సంక్షోభాలతోనే నడుస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలను కాదు, అది సోషలిస్టు రాజ్యాల వైఫల్యాలను ఊదరగొడుతుంది. ఉదాహరణకు అయాన్ రాండ్ అటువంటి ఒక ఫిలాసఫర్. ఆమె ఫిలాసఫీ అధ్యయనం కోసం అమెరికా యూనివర్సిటీల్లో శాఖలు ఉన్నాయి. స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంతానికి ఆమె ఒక ఛాంపియన్.

సోవియట్ యూనియన్ సోషలిస్టు దేశంగా, అమెరికా వైరి వర్గంగా ఉన్న రోజుల్లో వచ్చిన హాలీవుడ్ సినిమాలన్నిటిలోనూ రష్యా ఒక విలన్. అమెరికా ఏమో ప్రపంచాన్ని రక్షించే హీరో. ఇప్పుడు తీవ్రవాదం అనే విలన్ని అమెరికానే స్వయంగా తయారు చేసుకుందనుకోండి!

ఈ రకమైన సైద్ధాంతిక, సాంస్కృతిక దాడి ఒక వైపు చేస్తూ, ఉద్యమాలను అణచివేయడం, విచ్ఛిన్నం చేయడం, మళ్ళీ తలెత్తకుండా చూసుకోవడం కోసం సైనిక, సాంస్కృతిక, సైద్ధాంతిక దాడులు చేయడం సామ్రాజ్యవాద వ్యూహంలో ఉంటుంది.

## మనదేశంలో ప్రతీఘాతుక యుద్ధతంత్రం :

ప్రతీఘాతుక యుద్ధతంత్రాలు సాధారణంగా ఏ దేశ పాలక వర్గాలకైనా మొదటి నుండి ఉంటున్నవే. మనదేశంలో పాలక వర్గాల సనాతన ధర్మం వర్ణ, కుల వ్యవస్థలనే సామాజిక వ్యవస్థలను రూపొందించుకుని పరిపాలించాయి. మతం ఎక్కడైనా పాలక వర్గాల చేతిలో అయినా భావజాల, సాంస్కృతిక ఆయుధంగా పనిచేస్తుంది. మనం తరచుగా చెప్పుకునే బ్రిటీష్ పాలకుల విభజించు పాలించు సూత్రం ఒక ప్రతీఘాతుక యుద్ధతంత్రం. బ్రిటీష్ వలసవాదం రాజుల మధ్య, ఆదివాసీ మైదాన ప్రాంతాల మధ్య, ఆదివాసీ తెగల మధ్య, హిందూ ముస్లింల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకొని ఐక్య పోరాటాలను దెబ్బతీసింది.

స్వాతంత్రోద్యమంలో మధ్యతరగతిని దారి మళ్లించి రాజీ మార్గం చేపట్టేలా జాతీయ కాంగ్రెసును ఏర్పాటు చేసింది. (అది అహింస ముసుగులో అంతులేని రాజ్యహింసకు ఆజ్యం పోసింది.) స్పష్టమైన రాజకీయ దృక్పథంతో స్వాతంత్ర్యోద్యమం చేపట్టిన విప్లవకారుల (గదర్ వీరులు, భగత్ సింగ్ వంటి వాళ్ళు) పాత్రను తక్కువ చేసి చూసే కుట్రకు పాల్పడింది.

అధికార మార్పిడి తర్వాత ఈ యుద్ధతంత్రాన్ని బ్రిటీషు వారికంటే గొప్పగా భారత ప్రభుత్వం అమలు చేస్తున్నది. కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో అది చేయని ఘోరం లేదు. ఉదా.కాశ్మీర్ ప్రజల స్వతంత్ర పోరాటాన్ని దెబ్బ తీయడానికి అది నకిలీ పోరాట సంస్థలను ఏర్పాటు చేసింది. ఉద్యమం నుండి లౌకికవాద కాశ్మీరీలను విడగొట్టింది. కాశ్మీరీ ముస్లింల మీదికి కాశ్మీరీ పండిట్లను రెచ్చగొట్టింది. వారికి శిక్షణనిచ్చి, ఆయుధాలిచ్చి హంతక ముఠాలుగా తయారుచేసింది. కాశ్మీర్‌ను ఒక విధ్వంస ప్రయోగానికి వేదిక చేసి భారతదేశం లోపల అది ప్రచారం చేసిన అబద్ధాలను చాలామంది కొందరు లౌకికప్రజాస్వామిక వాదులూ నమ్ముతున్నారు.

నక్సలైట్ ఉద్యమం మీద కోవర్టు ప్రయోగాల దగ్గరినుండి సల్వాజుడుమ్ వంటి ప్రతీఘాతుక హంతక సైన్యం, ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్ హంట్ దాకా అమెరికా నిఘా సంస్థల సలహా, సహకారాలతో భారత ప్రభుత్వం అమలు చేస్తోంది. దండకారణ్యంలో అమెరికా సిఐఎ శిక్షణ ఇస్తున్న సైనిక స్కూళ్ళు ఉన్నాయి. అది ఏ లక్ష్యంతో దండకారణ్యం వైపు గురి చూస్తోంది? ఆర్థిక, రాజకీయ లక్ష్యాలు రెండూ ఉన్నాయి- సామ్రాజ్యవాద మార్కెట్ కోసం వనరుల దోపిడి, మావోయిస్టు ప్రత్యామ్నాయ రాజకీయాలను నిర్మూలించడం.

## ఎల్ ఐ సీ వ్యూహం వ్యవస్థలను శిథిలం చేస్తుంది

సామ్రాజ్యవాద మార్కెట్ దేశ ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకొని మార్కెట్ అనుకూల రాజకీయాలను, ప్రభుత్వ విధానాలను, భావజాలాలను, సంస్కృతిని తయారు చేస్తుంది. ఫలితంగా సామాజిక మానవులు మిగలరు. వినియోగదారులే ఉంటారు. ప్రభుత్వం నుండి కుటుంబం దాకా మార్కెట్ లో భాగమవుతాయి. మనిషులు పరాయీకరణ చెందుతారు. అత్యంత దుర్బలులు అవుతారు. ఆత్మహత్యలు అటువంటి రోగగ్రస్త వ్యవస్థకు సంకేతాలు.

భారతదేశం అభివృద్ధి శిఖరాలను అందుకుంటోందని, సూపర్ పవర్ గా అవతరిస్తోందని ప్రభుత్వం చెబుతోంది. ఏ యంగ్ ఇండియా గురించి గొప్పగా మాట్లాడుతున్నారో ఆ యంగ్ ఇండియా ప్రపంచంలోనే అధిక సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతలో మొదటి స్థానంలో ఉంది. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయసు వాళ్ళు ఏటా ప్రతి లక్ష మందిలో 30-40 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. అందులో కూడా ఎక్కువ మంది విద్యార్థులే. 2013లో 2,471 మంది పరీక్షల్లో విఫలమైందుకు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఒక సర్వే తేల్చింది.

ఒక సమాజ వర్తమానమూ, భవిష్యత్తూ యువజనులే. వారు నిస్సహాయంగా చనిపోవడానికి కారణాలు ఎక్కడ వెతకాలి? చాలా సాధారంగా విద్యావ్యవస్థ, కుటుంబంలో వెతుకుతాం. ఎందుకంటే శిశువు సామాజికుడిగా ఎదిగేది కుటుంబం, విద్యావ్యవస్థ పునాది మీదనే. విద్య మార్కెట్ సరుకయ్యింది. కుటుంబం, తల్లిదండ్రులు కూడా మార్కెట్ భావజాలానికిలోనూ కావడం. పిల్లలను సామాజికులుగా తయారు చేయడమా, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా తయారు చేయడమా? అనేది మనలాంటి వాళ్ళ ప్రశ్న. కార్పొరేట్ విద్య తప్ప భవిష్యత్తుకు ప్రత్యామ్నాయం

ఉందా? అని తల్లిదండ్రులు అడుగుతారు. చాలా సింపుల్ గా బి.ఏ. చేస్తే ఉదోగమొస్తుందా, బీటెక్ చేస్తే ఉద్యోగమొస్తుందా అని అడుగుతారు. ఈ ఆలోచనాధోరణి సమాజంలో రావడానికి భౌతిక పరిస్థితులు ఉన్నాయి.

విద్య ఎందుకు అనంటే ఏమీ తెలియని పిల్లలను జ్ఞానవంతులైన మానవులుగా తయారుచేయడానికి, తద్వారా మంచి సమాజాన్ని నిర్మించడానికి అని చెప్పాలి. కానీ. ఎవరినైనా విద్య ఎందుకు అనంటే ఉద్యోగం రావడానికి అనంటారు. ఉత్పత్తిలో భాగం కావడానికి, పని చేయడానికి స్కిల్స్ అవసరం. కానీ విద్య అది మాత్రమే కాదు. చంద్రబాబు నాయుడు చరిత్ర ఎందుకు, సామాజిక శాస్త్రాలు ఎందుకు అని మాట్లాడాడు. బూర్జువా వ్యవస్థ విద్యకు కెరీర్‌కు ముడివేసింది. కెరీరిజం ఇప్పుడు ఒక భావజాలం.

దీన్ని పాలక వర్గాలు ఎలా ఫ్రేమ్ చేస్తాయో ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. వియత్నాం యుద్ధ సమయంలో విద్యార్థులు పెద్ద ఎత్తున అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రదర్శనల్లో పాల్గొన్నారు (అమెరికా విద్యార్థులే). విద్యార్థుల్ని ఉద్యమాలకు ఎట్లా దూరం చేయాలా అన్న ఆలోచన వచ్చింది. విద్యార్థులు నిరంతరం పుస్తకాల్లో, పరీక్షల్లో మునిగిపోయి సామాజిక అంశాల నుండి దూరంగా ఉండాలి. పాలక వర్గ భావజాలాన్ని మాత్రమే, ఆ పరిధిలో ఉండే జ్ఞానం మాత్రమే పొందాలి. ఇలాంటి ఆలోచనల నుండే అస్తమానం పరీక్షలు ఉండే సెమిస్టర్ విధానం వచ్చింది. విశ్వవిద్యాలయాల అర్థమే మారిపోయింది. విద్యార్థుల ప్రపంచం కుచించుకుపోయింది.

మన సమాజంలో పోటీ పరీక్షలు విద్యార్థులను ఎట్లా మానసికంగా నియంత్రిస్తున్నాయో, వారి జ్ఞానాన్ని ఏ పరిధుల్లో ఉంచుతున్నాయో చూస్తున్నాం. విద్య మార్కెట్ సరుకవ్వడం సమాజానికి ఎంత విషాద అనుభవాల నిచ్చిందో పాలకులకు అంత అనుకూల ఫలితాలనిచ్చింది. విద్యార్థులు ఉద్యమాలకు దూరమయ్యారు. పాలకవర్గ భావజాలాన్ని పుణికిపుచ్చుకుంటున్నారు. ప్రైవేట్/ ఫారిన్ విశ్వవిద్యాలయాల బిల్లు దాన్ని మరింత ముందుకు తీసుకుపోనున్నది.

మంద్రస్థాయి యుద్ధ ఆర్థిక పార్శ్వం సామ్రాజ్యవాద మార్కెట్ దాడి. నిజానికి ఇదే దాని ప్రధాన లక్ష్యం. సామ్రాజ్యవాద పెట్టుబడి ఎట్లా దేశ ఆర్థిక వ్యవస్థలో జొక్యం చేసుకొని, నాశనం చేసి దాని పట్టు నిలుపుకుంటుందో నూతన ఆర్థిక విధానాల తర్వాత మనదేశ ఆర్థిక వ్యవస్థ ఏ మార్పులకు లోనైదో చూస్తే అర్థమవుతుంది. కనీసం పాతికేళ్లుగా దీని గురించి మనలాంటి వాళ్ళు మాట్లాడుతున్నారు. మనదేశంలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి రంగం. అత్యధిక శాతం ప్రజల జీవనాధారం. దాని స్థితి ఏమిటంటే అది వినియోగ మార్కెట్ గా సామ్రాజ్యవాద పెట్టుబడి చేతుల్లో చిక్కింది. దేశంలో అపరిష్కృతంగా వదిలేసిన భూమి సమస్య అలా ఉండగా ఉత్పాదక రంగంగా అది బలహీన పడింది. దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్, ఉత్పత్తిదారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా, అటు ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండేలా సంస్కరణలు ఉండాలి. అలా కాక ఇది బహుళజాతి కంపెనీలకు విత్తన మార్కెట్‌గా, పురుగుమందుల మార్కెట్‌గా ప్రయోగశాల చేయబడింది. ఫలితంగానే లక్షలాది రైతుల ఆత్మహత్యలు.

మనదేశంలో భూపోరాటాలు, రైతుకూలీ పోరాటాలు భూమి సమస్యను అడ్రెస్ చేశాయి. 90లలో వ్యవసాయ రంగం కొత్త సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మొదటి దశలో తెలంగాణలో విప్లవోద్యమం రైతాంగ సమితులు పెట్టి రైతుల సమస్యలను అడ్రెస్ చేసింది. అది మినహాయిస్తే రైతులకు సంఘటిత ఉద్యమాలు లేవు.

రైతుల సమస్యలు ఎన్నికల వాగ్దానాలకు పనికొస్తున్నాయి తప్ప వాస్తవికంగా వాటిని అడ్రెస్ చేసే ఉద్యమాలు ఉంటే రైతులు పోరాటాల్లో ఉంటారు. ఇలా పిట్టల్లా రాలిపోరు. మంద్రస్థాయి యుద్ధం మనుషులు తమను తామే అంతం చేసుకునేలా చేస్తుంది.

### హిందుత్వ హత్యలు-రాజకీయార్థిక సాంస్కృతిక మూలాలు:

దేశీయ పాలకవర్గాల చేతిలో సాంస్కృతిక ఆయుధంగా హిందుత్వ మొదటినుండీ ఉంది. ఇప్పుడు ప్రధానంగా రంగం మీదికొచ్చిన సంఘపరివార్ హిందూ ఫాసిజం, దాని సామాజిక సాంస్కృతిక మూలాలు సనాతన బ్రాహ్మణీయ ఆధిపత్య వ్యవస్థలో ఉన్నాయి. బ్రిటీష్ వలసవాదంతో వివిధ సమూహాలు తలపడే సమయంలో జాతీయవాదానికి సనాతనధర్మానికి ముడిపెట్టి హిందుత్వ సిద్ధాంతాన్ని అది రాజకీయ రంగం మీదికి తెచ్చింది. దాని రాజకీయ ప్రతినిధి తిలక్ అయితే భావజాల, సాంస్కృతిక ప్రతినిధి వివేకానందుడు. భారత బూర్జువా, ఫ్యూడల్ వర్గాల ప్రతినిధి అయిన గాంధీది, జాతీయ కాంగ్రెస్‌ది కూడా హిందూ సాంస్కృతిక జాతీయవాదమే. పటేల్ నుండి నెహ్రూ దాకా అందరూ అందులో ఒదిగిపోయి ఆ వర్గప్రయోజనాలు కాపాడారు.

బ్రాహ్మణీయ హిందూ సాంస్కృతిక జాతీయవాదం ఒక్క సంఘపరివార్ భావజాలమే కాదు. దాన్ని మొత్తంగా భారత పాకవర్గాల భావజాలంగా అర్థం చేసుకోవాలి. సనాతన ధర్మం, కులం, అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడి. పునరుత్పత్తి అవుతున్నాయి. అందువల్ల వలసానంతరం ఏర్పడ్డ భారత రిపబ్లిక్ సెక్యురిజాన్ని వక్రీకరించిన అర్థంలో స్థిరపరిచింది. రాజ్యం చేతిలో మతం ఒక ఆయుధంగా ఉంటూ వచ్చింది. మన వ్యవస్థ పనితీరులో సెక్యులరిజం నిజమైన అర్థంలో భాగం కాలేదు. వలస పాలన కానీ, ప్రధాన స్రవంతిగా నడిచిన కాంగ్రెసు రాజకీయాలు కానీ దీని ఫ్యూడల్ శక్తులతో జతకట్టి నడిచాయి. ఇక్కడ మెజారిటీ మతం అనబడేది కులవ్యవస్థ, వర్ణధర్మం కాక మరోటి కాదు. మతం జాతి ఐడెంటిటీగా జాతీయోద్యమంలో ముందుకొచ్చింది. మామూలుగా జాతి భావన బూర్జువా ఆధునికత నుండి వచ్చింది. ఇక్కడ అలాంటి అవకాశం లేకుండా పోయింది. ఈ మతం.. అంటే సనాతన ధర్మంతో జతగట్టిన జాతి కాన్సెప్ట్ సంఘపరివార్ విస్తరణకు, ఎదుగుదలకు అన్ని అవకాశాలు ఇచ్చింది. కాంగ్రెస్ గానీ, మరే పాలకపక్ష పార్టీ గానీ దాన్ని అడ్డుకోవడం మాట అటుంచితే, దానికి ప్రత్యక్ష, పరోక్ష సహకారాలను అందించాయి. మతం రెడీమేడ్ ఆయుధం గనక స్వయంగా కూడా అవి హిందుత్వ ఆయుధాన్ని ధరించాయి. కశ్మీర్ జాతి అణచివేత, సిక్కుల ఊచకోత మొదలుకొని అయోధ్య నుండి ముజఫర్‌నగర్ దాకా అటువంటి అనేక ఉదాహరణున్నాయి. ప్రజాస్వామ్యంలో అతి ప్రధాన అంశం భిన్నత్వాన్ని అంగీకరించి గౌరవించడం. భిన్న సమూహాల్ని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడం. కానీ మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం భిన్నత్వాన్ని వాడుకునే ఓట్ల రాజకీయాల సంకుచిత పరిధిలోనే ఉండిపోయింది. అది ప్రజల నిర్ణాయకశక్తిని ఎప్పుడూ వెలికితీయదు. ఈ స్థితిలో ఉన్న సమాజంలో పాకవర్గ అనుకూల మెజారిటీ భావజాలాన్ని తయారుచేయడం, లేదా పునరుత్పత్తి చేయడం కష్టం కాదు. నిరంతరం దాన్ని జనం మెదళ్ళలోకి చొప్పిస్తూ సమయానుకూలంగా దాన్ని ఎగదోస్తూ ఉండటం కూడా ప్రతీఘాతుక యుద్ధవ్యూహమే. భారతదేశ రాజకీయార్థిక వ్యవస్థ కులవ్యవస్థను, మతతత్వ భావజాలాన్ని పునరుత్పత్తి చేస్తూనే ఉంది.

సామ్రాజ్యవాదం వలసవాదంగా వచ్చి మన దేశంలోని సనాతన ధర్మాన్ని, హిందుత్వను వాడుకున్నట్లే.. వలసానంతరం కూడా ప్రపంచ వ్యాప్తంగా మతంతో దానికి విడదీయలేని సంబంధం ఏర్పడింది. భారత బూర్జువా వర్గం సామ్రాజ్యవాద ఆర్థిక ఆదేశాలకు లోబడి ఉంటుంది కాబట్టి దేశీయ సంస్కృతి గురించి ఎంత మాట్లాడినా సంఘపరివార్‌కు సామ్రాజ్యవాద మార్కెట్ పట్ల అనుకూలత ఎక్కువ. ఎంతగానంటే సంఘపరివార్ రాజకీయ ముఖానికి అతివాద రూపమైన మోడీ కార్పొరేట్ ఇండియాకు, బహుళజాతి పెట్టుబడుకు ప్రతినిధి అయ్యాడు. అటు బహుళజాతి మార్కెట్ తన లక్ష్యాను, ఇటు సంఘపరివార్ తన సాంస్కృతిక జాతీయవాద ఎజెండాను మోడీ ద్వారా వేగవంతంగా ముందుకు కదిలించాలని అనుకున్నాయి. దేని పాత్ర అది నిర్వర్తిస్తూ వస్తోంది. దేశమంతా ఒక పక్క అసహనం గురించి చర్చ జరుగుతోంటే, మరోవైపు పెద్ద చర్చ కాకుండానే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ రైల్వేల ప్రైవేటీకరణ నిర్ణయం జరిగిపోయింది. అటువంటి కనీసం పది పదిహేను నిర్ణయాలు ఒక్క ఏడాది కాలంలోనే కనీస చర్చ లేకుండానే పార్లమెంటులో పాసైపోయాయి. సంఘపరివార్, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు ఒక్కచోటే కలిసిన స్థితికి చేరుకునేసరికి హిందుత్వ హత్యలు, దేశవ్యాప్తంగా లక్షలాది రైతు ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. వ్యవస్థ సంక్షోభానికి రెండూ సాంస్కృతిక, ఆర్థిక ప్రతిబింబాలు.

ముందే చెప్పినట్లు హిందూ మతం అంటే సారాంశంలో కులవ్యవస్థనే. కుల వ్యవస్థ సమాజాన్ని విడదీస్తుంది. జాతి భావన మరి ఎక్కడి నుండి వస్తుంది? దానికి వీళ్ళు ముస్లిం వ్యతిరేకతను తీసుకున్నారు. వీళ్లకు కనీస సామ్రాజ్యవాద వ్యతిరేకత లేదు. ఎందుకంటే సామ్రాజ్యవాద ఆర్థిక ప్రయోజాలతో వీళ్ళ ప్రయోజనాలు కలుస్తాయి. మరో వైపు వీళ్ళ మతం సాంస్కృతిక పునాది కులవ్యవస్థలో ఉంది. అదే విధంగా మార్కెట్ కూడా కులవ్యవస్థను వాడుకుంటుంది. వీళ్ళు కూడా స్వేచ్ఛా మార్కెట్, స్వేచ్ఛాయుత పోటీ అనే బూర్జువా కన్సెప్ట్‌ను, స్థూలంగా పాలక వర్గ కాన్సెప్ట్‌ను రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంగా తీసుకొచ్చారు. జనంలో నరనరానా జీర్ణించుకున్న నిచ్చెనమెట్ల కుల భావన ఫ్యూడల్ అవశేషంగా కాదు, మార్కెట్ తో కూడా కలగలిసి నడుస్తున్నది. ప్రజల ప్రాతినిధ్యం, సోషలిజం పోయి సంక్షేమ రాజ్యం అన్నారు. ఇప్పుడు సంక్షేమ రాజ్య భావన కూడా పోయింది కాబట్టి కొత్త విశ్వవిద్యాలయాల్లో దళితులకు ప్రోత్సాహకాలు.. స్టైఫండ్ వంటివి అవసరం లేదు, లేదా ఉండవు అని చెప్తున్నారు. ఇక హిందుత్వ సంస్కృతిగా బ్రాహ్మణీయ ఆధిపత్య సంస్కృతిని ఆరెస్సెస్ ఎలా చొప్పిస్తూ వస్తున్నాదో గోవధ నిషేధం దగ్గరి నుండి నేరుగా రాజకీయాలు మాట్లాడే పీఠాధిపతులదాకా మనం చూస్తున్నాం.

హిందుత్వతో సాంస్కృతిక పోరాటం తప్పనిసరిగా చేయాల్సిందే. అయితే హిందుత్వ ఏ వర్గ భావజాలానికి పుడుతున్నదో ఆ వర్గంతో రాజకీయ పోరాటం లేకుండా కేవలం సాంస్కృతిక పోరాటం మాత్రమే సరిపోదు. అది కూడా వర్గపోరాటంలో భాగంగా జరగాలి. పాలకవర్గ భావజాలమైన మతంతో పోరాటం పాలకవర్గాలతో పోరాటమే.

ప్రజాస్వామిక పోరాటాలు/వర్గపోరాటాలు ప్రజాస్వామిక సంస్కృతిని, విలువల్ని ఉత్పత్తి చేస్తాయి. నూతన సంస్కృతి, విలువలు వాటంతటవి రావు. అవి పెంపొందించకుండా సమాజంలో హిందుత్వ ప్రభావాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. కాబట్టి మౌలిక మార్పు దిశగా జరిగే పోరాటాలు పాత భావాలతో ఘర్షణాత్మకంగా ఢీకొట్టాలి.

ప్రజల రాజకీయాధికారం ఏర్పడిన/ఏర్పడుతున్న దండకారణ్యంలో విద్యా, వ్యవసాయం, సంస్కృతి ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికగా ఉన్నాయి. దండకారణ్యం యుద్ధాన్ని, మంద్రస్థాయి యుద్ధాన్నీ ఎదుర్కొంటున్నది. సైనిక బలగాలతోనూ, మతాన్ని మోసుకొచ్చే ఆరెస్సెస్ శక్తులతోనూ, విధ్వంస మార్కెట్ ను మోసుకొస్తున్న కార్పొరేట్ శక్తులతోనూ ఒకేసారి పోరాటం చేస్తున్నది. తనదైన ప్రజాస్వామిక సంస్కృతీ రాజకీయాలను నెలకొల్పుకుంటున్నది.

వర్గపోరాట ఆచరణ మంద్రస్థాయి యుద్ధాన్ని ఎదుర్కుంటున్న ఉదాహరణ మళ్ళీ వివేక్, సూర్యంల త్యాగాల వద్దకే వచ్చి మాట్లాడుకుందాం. వివేక్, సూర్యంల అమరత్వం చుట్టూ భిన్న వాదనలు, చర్చలు ఒకవైపు జరుగుతుంటే మరో ఇద్దరు యువకులు శృతి, విద్యాసాగర్ లు రాజ్యం చేతిలో తీవ్ర చిత్రహింసలు ఎదుర్కొని ఆశయం కోసం బలికావడం ఎట్లా సమాజాన్ని కదిలించింది? వారు ఆ మొత్తం చర్చకు, వారి ఆచరణతో, త్యాగంతో సమాధానం చెప్పారు. దాదాపు నాలుగువందల ప్రజాసంఘాలు బూటకపు ఎన్ కౌంటర్ ను నిరసించాయి.

చివరగా సైనిక, రాజకీయార్థిక, ప్రచార రంగాల్లో సామ్రాజ్యవాదం ఎంత దాడి చేస్తున్నదో అర్థం చేసుకోవాలంటే వాటన్నిటినీ అనుసంధానించే మంద్రస్థాయి యుద్ధాన్ని అర్థం చేసులోవాలి. నేడు రాజ్యం మనిషి మనిషి మీదా నిఘా పెడుతోంది. నూటా ఇరవై కోట్ల జనాభా మొత్తాన్నీ అనుమానపు కళ్ళతో చూస్తోంది. సిసి కెమరాలు, వేలిముద్రలు, కంటి రెటీనా గుర్తులు అన్నీ నమోదు చేసుకుంటోంది. రాజ్యం ఎంత ముందు చూపుతో ఉందో నిజానికి అంత ఆత్మ రక్షణలో కూడా ఉంది. అయితే దీన్నంతా చెబితే ప్రభుత్వం దగ్గర ఇంత టెక్నాలజీ ఉంది, అతి పెద్ద సైన్యం ఉంది, శక్తివంతమైన ఆయుధాలున్నాయి, దీనితో పోరాడి గెలవడం సాధ్యమేనా? సాయుధపోరాటం ఎన్నటికి విజయం సాధించేను? అన్న ప్రశ్న వస్తుంది. రాజ్యం కూడా తన శక్తిని ప్రదర్శించి దీన్ని ప్రతిఘటించడమంటే మూర్ఖత్వమే అని చెబుతుంది. అదో మానసిక యుద్ధం. అయితే ప్రపంచంలో విజయవంతమైన పోరాటాలన్నీ సాంకేతికంగా అత్యంత బలంగా ఉన్న శత్రువుతో చాలా బలహీనమైన ఆయుధాలతో ప్రజలు చేసినవే. ఇది పాలకవర్గానికి తెలుసు. అందుకే యుద్ధం అంటే ఆయుధాలే కాదు. శక్తివంతంగా సాయుధ బలగాల మోహరింపు కూడా ఉంటుంది. ఇంకా అనేక పార్శ్వాల్లో పాలకవర్గం యుద్ధం చేస్తోంది. ఆధునిక ఆయుధాలు లేకపోయినా.. ఇతర అనేక విషయాల్లో ప్రజలే శక్తివంతులు. అది వారిని తెలుసుకోనివ్వకుండా యంద్రస్థాయి యుద్ధ వ్యూహం చేస్తుంది. అనేక మాయపొరలు కప్పుతుంది. వాటిని విచ్ఛిన్నం చేసే శక్తి ప్రజల సంఘటిత శక్తిలో ఉంది. లేకపోతే మావోయిస్టుల తుపాకులు, భారత ఆయుధ సంపత్తితో పోల్చితే అత్యంత బలహీనమైనవి. వాటిని చూసి అది ఇంతగా భయపడదు. నాలుగు లక్షల బలగాలు కొన్నాళ్లుగా దండకారణ్యంపై యుద్ధం చేస్తూ విప్లవోద్యమాన్ని అంతం చేయలేక పోవడానికి కారణం ఏమిటో ఆలోచించాలి. పైగా ప్రజలు యుద్ధం మధ్యనే కొత్త వ్యవస్థలను నిర్మించుకుంటున్నారు. దండకారణ్యం ప్రజల బలాన్ని తెలియ జేస్తోంది. అక్కడి ప్రజలు రాజ్యాన్ని, దాని మంద్రస్థాయి యుద్ధాన్ని ఆయుధాలతో ఎదుర్కొంటున్నారు. వాటి వెనుక ప్రజల రాజకీయాలు ఉన్నాయి. వాళ్ల సంఘటిత శక్తి ఉన్నది. విప్లవ వ్యూహం ఉన్నది. ఇవన్నీ తప్పక మంద్రస్థాయి యుద్ధాన్ని నిర్మూలించగలవు.

# హిందుత్వ హత్యలు- సాంస్కృతిక మూలాలు

బాసిత్

అధ్యక్ష, కామ్రేడ్స్!

చలసాని పుట్టిపెరిగిన గడ్డ, ద్రోణవల్లి అనసూయమ్మ నడయాడిన గడ్డ, కాకలుతీరిన కమ్యూనిస్టు యోధుల గడ్డ, తెలంగాణ సాయుధ పోరాట కాలంలో కమ్యూనిస్టు భావధారను అందించిన గడ్డ నుంచి మాట్లాడడం ఉద్విగ్నమె.

మన విషయం మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో... హిందుత్వ హత్యలు... సాంస్కృతిక మూలాలు... విషయంలోకి వెళ్ళే ముందు...

ఇప్పుడే... ఇంతకు ముంద అందిన సమాచారం...

రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట్ మండలం జవహర్‌నగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని గబ్బిలాల పేటలో నిన్న రాత్రి (9-1-2016), కొంత మంది ముస్లింలు, దళితులు కలిసి ఈ రోజు ఆదివారం (10-1-2016) కొబట్టి ఆవును కోసుకోవడం కోసం తెచ్చుకున్నారు. మా 'గోమాత'ను కోసుకుంటారా అంటూ కొంతమంది మార్వాడీలు విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ గూండాలు వారిపైన దాడి చేశారు. ఇద్దరినీ తీవ్రంగా గాయపరిచారని తెలిసింది.

ఈ సంఘటనను విప్లవ రచయితల సంఘం తీవ్రంగా ఖండిస్తోంది.

ఈ దేశంలో దళితులు, ముస్లింలు తమకిష్టమైన ఆహారం తినడాన్ని 'హిందుత్వ' సహించలేకపోతుంది. ఇది అసహనం కాదు. అమానుషం.

అంతేకాదు ఈ దేశంలో ముస్లింలు, దళితులు ఒకే రకమైన ఆహారం కలసి తినగలిగిన కంచం పొత్తు కలిగిన ఆత్మీయ బంధువులు. ఈ కలయికను హిందుత్వ విడగొట్టాలనుకుంటుంది. అలా సాధ్యం కానప్పుడు ఇద్దరినీ రెండు పీడిత వర్గాలను అడ్డ తొలగించాలనుకుంటుంది. ఇది దుర్మార్గం.

అధ్యక్షులు చంద్రయ్య నియోమల్లర్ కవితతో ప్రారంభించారు, కదా! నేనూ కవిత్వంతోనే ప్రారంభిస్తాను.

*పిల్లలకు దాహం వేస్తే పెట్రోలును మీరెప్పుడైనా తాగించారా?*
*పరుగెత్తుతున్న మనవాళ్ళ దారుల్లో ముళ్లను మీరెప్పుడైనా పరిచారా?*
*అమ్మ చంకలో పొదుపుకున్న చిన్న పిల్లల్ని మీరెప్పుడైనా మంటల్లో విసిరారా?*
*కత్తులతో కోసి ముక్కలుగా తరిగి కుప్పలుగా రాసి పోసి దేహాల్ని తగులబెట్టారా?*
*ఇళ్లల్లో సిలిండర్లను లీక్ చేసి ఇంటిల్లి పాదినీ పేల్చేసె గమ్మత్తైన ఆటను మీరెప్పుడైనా ఆడారా?*
*గర్భస్థ పిండాల్ని పెరికి వేసి, త్రిశూలాలకు గుచ్చి మీరెప్పుడైనా ఊరేగించారా?*
*మర్మాంగాల్లో రాడ్లు జొనిపి హింసించడం మీకు తెలుసా!*

హిందు పాలక వర్గం ఇంతగా హింసకు పాల్పడుతున్నది కనుకనే 'హిందుత్వ' మీద చర్చ మళ్లీ మొదలైంది.

విప్లవ రచయితల సంఘం... మార్క్సిజం మీదనో, లెనినిజం మీదనో, మావోయిజం మీదనో కాకుండా 'హిందుత్వ' వంటి మత విషయాల మీద మహాసభల్లో ఎందుకు మాట్లాడుతుందని మీకు సందేహం కలగొచ్చు.

'హెగెల్స్, ఫిలాసఫీ ఆఫ్ లా'కు ముందు విమర్శనాత్మక పరిచయ వ్యాసం రాస్తూ మార్క్స్ - మత వాదం మీద విమర్శ రాజకీయాల మీద విమర్శే అని అంటాడు. అందుకే మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో... హిందుత్వ హత్యల మీద దాని సాంస్కృతిక మూలాల గురించి విరసం మాట్లాడుతోంది.

హిందుత్వ హత్యల వెనుక బ్రాహ్మణీయ వైదిక మత భావజాలం, అది రూపొందించిన వర్ణ వ్యవస్థ, అది నిర్మించిన కుత్సిత నిచ్చెన మెట్ల కులవ్యవస్థ, ఆది తలకెక్కించిన, అన్యమత ద్వేషం తదితర భావాలు మూల కారణాలుగా ఉన్నాయి. ఈ సనాతన భావాలు జర్మన్ ఆర్యుల నాజీయిజంతోను, ఇటలీ నియంత ముసోలినీ ఫాసిజంతోను ప్రేరణపొంది కరడుగట్టిన సాంస్కృతిక జాతీయవాదంగా రూపొందడం జరిగింది. ఈ బ్రాహ్మణీయ హిందూ సాంస్కృతిక జాతీయవాదంలో ప్రజల పలురకాల ప్రశ్నలను, సందేహాలను చిత్తుచేసే బహుముఖ వ్యూహాలు, ఎత్తుగడలు ఉన్నాయి. ఈ వాదం వెనుక ఏకోన్ముఖ ఆధిపత్యవాదం ఇమిడి ఉంది. 'ఒకే ప్రజ - ఒకే జాతి - ఒకే దేశం' అనే నినాదం, అందుకోసమే రూపొందింది. ఈ ఆధిపత్య వాదం అంతిమ లక్ష్యం రాజ్యాధికారం, ఆస్తి పోగేసుకోవడంలో తలమునకలవ్వడం. అడ్డొచ్చిన శక్తుల అంతుచూడడం. రూపం మతం అయినా, సారం రాజ్యాధికారం. అదీ కూడ బ్రాహ్మణుల రాజ్యాధికారం. హిందూ మతం అనేది బ్రాహ్మణుల కోసం, బ్రాహ్మణులు రూపకల్పన చేసుకున్నట్టిది. అందుకే హిందుమతాన్ని Manufactured Religion అంటారు. కనుక దీనిని హిందూమతం అనడం కన్నా బ్రాహ్మణమతం అనడం సముచితంగా ఉంటుంది. అట్లా అనకుండా 'మనమంతా హిందువులం - ధర్మ గంగ బిందువులం' అంటూ విధ్వంసక దారిమళ్లింపు టెక్నిక్‌తో ప్రజలను మూఢత్వం వైపు నెట్టి వాళ్ల సత్తువను నీరుగార్చి, నిర్వ్యాపారులుగా చేయడం వ్యూహాత్మకమె.

అత్యంత నిరుత్సాహక అంశాన్ని, దైనందిన జీవితంలో దాని అవసరం లేకున్నా, దాన్నొక మానసిక అవసరంగా మలిచిన వంచనా శిల్పం మతానిది. రకరకాల రూపాల్లో దాని అణిచివేత, ఆధిపత్య ఆకాంక్షల్ని నెరవేర్చుకుంటున్న హిందుత్వ 1925లో "రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్'గా ఏర్పడ్డాక తన అడుగుల్ని నిర్దిష్టంగా వేయడం ప్రారంభించింది. ఆ అడుగుల లక్ష్యం హిందూ రాజ్యస్థాపన.

ఒక దశాబ్దం కంటె ముందే ప్రముఖ పాత్రికేయులు కుష్వంత్‌సింగ్ ఒక అమెరికన్ పత్రికకు వ్యాసం రాస్తూ "ఇండియాలో ప్రజాస్వామ్యం అంటే బ్రాహ్మణుల వలన, బ్రాహ్మణుల చేత,

బ్రాహ్మణుల కొరకు - అట్లాగే గోమాత కొరకు" అంటారు. అందుకే సామ్రాజ్యవాదం తన బహుళజాతి కార్పొరేట్ ప్రయోజనాల కోసం భారతదేశంలో హిందుత్వను పనిముట్టుగా వినియోగించుకుంటోంది. ఇవ్వాల దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చలోని వివరాల్లోకి వెళ్దాం.

దేశమంతా ఇప్పుడు అసహనం పెరిగింది. మత అసహనం విపరీతంగా పెరగడం వల్లనే నిరసనగా అవార్డుల వాపసీ సాగుతోంది. దేశవ్యాప్తంగా 34 మంది రచయితలు, కళాకారులు, సినిమా పరిశ్రమతో సంబంధం ఉన్నవారు అవార్డులను వాపసు చేయడమో, మత అసహనం మీద మాట్లాడడమో చేస్తున్నారు. కొందరు నిరసన ప్రకటనలకే పరిమితం అవుతున్నారు. "నిరసనలు సరిపోవు... అవార్డులు వెనక్కి ఇవ్వాలి" అని విప్లవ రచయితల సంఘం ఇచ్చిన పత్రికా ప్రకటనకు స్పందించి కాత్యాయినీ విద్మహే, భూపాల్‌లు తమ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను వెనక్కి ఇచ్చేశారు. మరికొందరి మీద అవార్డులు వెనక్కి ఇవ్వాలి అనే ఒత్తిడి పెరుగుతోంది.

లౌకిక, ప్రజాస్వామిక విలువలకు భంగం కలిగినందువల్లనే ఇంత పెద్ద ఎత్తున నిరసన వెల్లువెత్తుతోంది. నిజానికి ఇది ఇంకా పెరగాలి. లేకుంటే ఆవు మాంసం తిన్నందుకో, దాచుకున్నందుకో మనుషుల్ని చంపడమేమిటి? దళితుల్ని ఆలయంలోకి ప్రవేశించారని హత్య చేయడమేమిటి? మనం ఎక్కడికెళ్తున్నాం? మధ్య యుగాల్లోకా?... నిజానికి అంతకంటె వెనక్కి వెళ్లి ఆలోచించాలి.

డి.ఎన్.ఝా రాసిన 'ద మిత్ ఆఫ్ హోలీకౌ' అనే పుస్తకంలో ఆర్యులు, ఎవరైతె బయట నుండి భారతదేశంలోకి వలసవచ్చారని, వచ్చీ రావటంతోనే ఇక్కడి వ్యవసాయ సాంస్కృతిని ధ్వంసం చేసారని అనుకుంటున్నామో వాళ్లు వస్తూ, వస్తూ కొన్ని సంస్కృతిక అంశాలను వెంట తీసుకొని వచ్చారని చెప్పారు. అందులో ఒకటి జంతుబలి, అట్లాగే అశ్వమేధ యాగం, రాజసూయ యాగం వంటిది. వీటిలో జంతువులను బలి ఇవ్వడం ప్రముఖంగా చెప్పుకోవాలి. ఎందుకంటె వాళ్ల దేవుళ్లెవరూ శాకాహారులు కాదు. అందులో ఇంద్రుడైతె గుర్రం, గాడిద, ఎద్దూ, ఆవులను ఇష్టంగా ఆరగిస్తారని నమ్ముతారు. సోమునికి మద్యపానంతో పాటు ఆవు మాసం పసందైన పాకం. వేదాల్లో ప్రస్తావించిన 250 జంతువుల్లో కనీసం 50 జంతువులు బలి ఇవ్వడానికి అర్హమైన వని తైతరేయ బ్రాహ్మణ్యంలో స్పష్టం చేశారని చెప్పారు. అందులోనే 'ఆవు మాంసాన్ని మించిన ఆహారం లేదని' కూడా చెప్పారు. యాజ్ఞవల్క్యుడైతె లేత ఆవు మాంసం ఎంత శ్రేష్టమైందో ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. మనువు కూడా 'అహింస' అంటూనే, ఒంటెను తప్ప పశువులన్నింటిని వివిధ కర్మకాండల సందర్భంగా ఆహారం కోసం చంపవచ్చని చెప్పాడు. యాజ్ఞవల్క్యుడు మరో విషయం చెప్పాడని కూడా అంటారు. శ్రోత్రియ బ్రాహ్మణున్ని పసందైన మాటలతో పాటు, ఒక బలిష్టమైన ఎద్దు మాంసాన్ని ఆహారంగా వండి స్వాగతం పలకాలని తన న్యాయ ధర్మ శాస్త్రంలో ఉటంకించాడంటారు.

మహాభారతంలో ద్రౌపది, జయధృతునికి, ధర్మరాజు ఎద్దు మాంసం గురించి చేసిన వాగ్దానం గుర్తు చేస్తుంది. అట్లాగే పాండవులు దేశ బహిష్కార సమయంలో జంతు మాంసం మీదే జీవించారని చెప్తారు.

రామాయణంలో కూడా జంతుబలులు సర్వసాధారణ విషయం. రాముడు కూడా దశరథుడు వేలాది జంతువుల్ని బలి ఇచ్చాకే లేటు వయసులో శృంగ మహర్షి దయవలన పుట్టాడని చెప్తారు. సీత యమునా నదికి వేయి ఆవుల్ని, వందల జారుల మద్యాన్ని రాముడు బలి ఇస్తానన్నాడని గుర్తు చేస్తుంది. రంతిదేవుడు వందలాది ఆవుల్ని చంపి తన నిత్యాన్నదానంలో భాగంగా ప్రతిరోజు వడ్డించేవాడని చెప్తుతారు.

ఇట్లాంటి నేపధ్యంలో - ఆవు మాంసం దాచాడని, దాద్రీలో అక్టోబర్ 1, 2015లో 'మహ్మద్ అఖ్లాఖ్' అనే 50 ఏళ్ల ముస్లింను కొట్టి చంపారు. అడ్డం వచ్చిన కొడుకును తీవ్రంగా గాయపరిచారు. కూతురును నానా దుర్భాషలాడారు. ఢిల్లీలో కేరళ భవన్‌లో ఆవు మాంసం విందు జర్గుతోందని హిందూ మత సంస్థలు 'రభస' సృష్టించారు.

బీఫ్ తింటానన్నందుకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్యను ముక్కలుగా నరుకుతామన్నారు. లింగాయత్‌లు హిందూ మతంలో భాగం కాదన్నందుకు కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత కల్బుర్గిని గత ఆగస్టు 30, 2015న హత్య చేశారు. గత వేసవిలో పెరుమాళ్ మురుగన్‌పై పెరియార్ మాటల్ని ఉటంకించినందుకు ఛాందస వాదుల దాడి చేశారు. 2013లో నరేంద్ర దబోల్కర్ అనే హేతువాదిని, గత ఎప్రిల్ 16న గోవింద పన్సారే అనే వామపక్ష వాదిని హిందూత్వ మూకలు చంపివేసాయి.

ఉత్తరప్రదేశ్ అమీర్‌పూర్‌లో దేవాలయంలోకి ప్రవేశించిన 90 ఏళ్ల దళిత వృద్ధున్ని సజీవ దహనం చేశారు. హర్యానాలో ఫరీదాబాద్‌లో ఒక దళిత కుటుంబం ఇంట్లో నిద్రిస్తుండగా అగ్ర కులాలకు చెందినవారు ఇంట్లో పెట్రోలు పోసి తగులబెట్టారు. ఆ దహన కాండలో ఇద్దరు చిన్నారులు మాడిమసైపోయారు.

2002, అక్టోబరు 15వ హర్యానాలోనే ఝుజార్ జిల్లా, దులవా గ్రామంలో ఆవును చంపి చర్మం తొలుస్తున్నారనే ఆరోపణతో 5 గురు దళితుల్ని తల్వార్లతో నరికి చంపారు. కాశ్మీర్‌లో షేక్ అబ్దుల్ రషీద్ అనే ఎమ్మెల్యే ఆవు మాంసంతో విందు ఇచ్చాడని బీజేపి ఎమ్మెల్యేలు అసెంబ్లీ హాలులో మీడియా చూస్తుండగానే దాడి చేశారు. హర్యానా లోనే పావురాల్ని దొంగిలించాడనే ఆరోపణతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, 14 ఏళ్ల దళితబాలుడ్ని కేసుల్లో ఇరికించినారు. తెల్లారి అదే బాలుడు రోడ్డుమీద శవమై కనిపించాడు. 2012లో ఓయూలో జరిగిన పెద్దకూర పండుగపై ఏబివిపి గూండాలు విఫల దాడికి ప్రయత్నించారు. 2004లో ఆవును హత్య చేశారని ఢిల్లీ సమీపంలోని దుల్యానియాలో 2 వేల మంది హిందూ మూకలు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి అక్కడికక్కడే 4 గురు దళితుల్ని కత్తులు, గొడ్డళ్లతో నరికి చంపారు. గత ఏప్రిల్‌లోనే మహ్మద్ తరఫ్దాద్ అనే ముస్లిం యువకున్ని ఆవుల్ని దొంగ రవాణా చేస్తున్నాడనే ఆరోపణతో ఒక చెట్టుకు కట్టి గొలుసులతో బంధించి హిందూ శ్లోకాలను బలవంతంగా కొట్టుకుంటూ చదివించారు 'గో సంరక్షణ దళం' వారు. ఆవును చంపడం అనేది హిందూ అమ్మాయిని రేప్ చేయడంతోను, హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేయడంతోను సమానమని' ఒక ఆర్.ఎస్.ఎస్. ప్రముఖుడు అంటాడు.

ఇట్లా ముస్లింల మీద, దళితుల మీద దాడులు, హత్యాకాండ ఎప్పుడు మొదలయ్యాయి? దళితుల మీద దాడులకు సంబంధించి హిందువులది పెద్ద హింసాత్మక చరిత్ర, హిందూమత గర్భంలోనే దళితుల పట్ల హింసాత్మకత దాగి ఉంది. ముస్లింల పట్ల చెప్పనక్కరలేదు. దేశవిభజన, అంతకుముందు బెంగాల్ విభజన

మధ్యయుగాల ముస్లిం పాలకుల ప్రవేశాలు ముస్లింల పట్ల వాళ్లకు వ్యతిరేకతను, ద్వేషాన్ని పెంచాయి. ముస్లిం వలస పాలకులు పోయారు. ఇక్కడే పుట్టి పెరిగిన ముస్లిం ప్రజల మీద హిందుత్వ ద్వేషం కట్టలు తెంచుకుంది.

హిందువులలో ముస్లింలపట్ల ద్వేషాన్ని పెంచడంలో వలస వాదులైన బ్రిటిష్ వారి పాత్ర ఎంతైనా ఉన్నది. మధ్యయుగాన్ని ముస్లింల యుగమని బ్రిటిష్‌వారు ప్రచారం చేసారు. అలా ప్రచారం చేయడంలోనే బ్రిటిష్ చరిత్రకారుల కుట్ర దాగి ఉంది.

మధ్యయుగం భూస్వామ్య రాచరికం యధేచ్ఛగా సాగిన కాలం. రాజా ముస్లిం అయినా, హిందువైనా ఆధిపత్యంతోనే వ్యవహరిస్తాడు. బ్రిటిష్ వలసవాద నీతిలో బలవంతులైన, ధృఢ చిత్తులైన ముస్లిం రాజులను ప్రత్యేకంగా క్రూరులుగా చిత్రీకరించడం కాదనలేని విషయమని ప్రముఖ చరిత్రకారిణి రోమిల్లా థాపర్ చెప్పడాన్ని మనం మరిచిపోరాదు.

ముస్లింల పాలనలో హిందువులు బానిసలుగా బతికారన్నది కూడా వాస్తవం కాదు. హిందూస్తాన్, కర్ణాటక వంటి శాస్త్రీయ సంగీతకారులు మొఘులుల కొలువుల్లో కచేరీలు చేసేవారని కూడా ఆమె మనకు గుర్తు చేస్తారు.

తులసీదాస్ రామచరిత మానస్, వాల్మీకి రామాయణాన్ని గానం చేసే బెంగాలి, హిందీ వక్తలు, మీరా భజనలు ఇవన్నీ ముస్లింల పాలనతో బానిసలుగా 'మగ్గిన' హిందువులు చేసిన సాంస్కృతిక కార్యకలాపాలు. ముస్లిం పాలకులు వారిని బానిసలుగా చూశారనడంలోని 'ఔచిత్యాన్ని' అర్థం చేసుకోవచ్చు.

8వ, 9వ శతాబ్దంలో కొద్దిమంది అరబ్బులు రాష్ట్ర, కూటుల కొలువుల్లో చేరి ఇక్కడి సంస్కృతిలో కలిసిపోయారు. స్థానిక కులాల వారితో అంతర వివాహాలకు సైతం వారు వెనుకాడలేదు. అట్లా అంతర వివాహాలు జరుపుకొని కొన్ని కొత్త కులాలు ఏర్పడడానికి కూడా కారణమయ్యారు. ఉదాహరణకు బోహ్రాలు, నవాయత్‌లు, మాపిలాలు ఇంకా చాలా అట్లా ఏర్పడిన కులాలే. అట్లాగే కాశ్మీరులో కూడా ఇటువంటి కొన్ని సమూహాలు ఏర్పడినాయని రోమిల్లా థాపర్ అంటారు. 'కనుక ముస్లింల పాలనతో హిందువులు బానిసలుగా మగ్గినారనేది మిధ్య' అని చెప్పొచ్చునంటారామె. మరోపక్క యూరప్‌లో నాగరికతా చిహ్నాలేవి అభివృద్ధి చెందని కాలంలో భారతదేశంలో గొప్ప నాగరికత, వినియోగ వస్తువులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి మొఘులుల కాలంలోనే జరిగాయంటారు. మత భావాలతో ఔరంగజేబు ఇబ్బంది కలిగించినాడనుకొన్నా, 17వ శతాబ్దంలో అత్యంత బలవంతులైన చక్రవర్తులలో ఒకడుగా పరిగణింపబడ్డారని ప్రముఖ చరిత్రకారులు క్రిస్‌బ్రేజియర్ అభిప్రాయపడ్డారు.

మైసూరు కేంద్రంగా చేసుకొని పరిపాలన సాగించిన టిప్పుసుల్తాన్ గొప్ప బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతో పాటు, భూసంస్కరణలు చేపట్టిన మొట్టమొదటి పాలకుడిగా చరిత్రకెక్కాడు.

మధ్యయుగాల్లో ముస్లిం పాలకులు దండయాత్రలు చేశారని, హింసాత్మక దేశ విభజనకు ముస్లింలు కారకులని బ్రిటిష్ వలస పాలకులు చేసిన విషప్రచారాన్ని విశ్వసించి, వలసవాదుల 'విభజించు, పాలించు' నీతితో పన్నిన వలలో చిక్కుకొని ఎన్నిసార్లు అమాయక ముస్లిం ప్రజానీకంపై విధ్వంసక దాడులకు పాల్గొన్నారో లెక్కే లేదు.

## ముస్లింలపై హిందుత్వ దాడుల చరిత్ర :

దేశ విభజన పూర్వం, తర్వాత ముస్లింలపై హిందుత్వ వాదుల దాడులకు లెక్కలేదు. చెదురు, ముదురుగా అక్కడొకటి, ఇక్కడొకటి జరిగినట్లుగా అన్పించినా వాటన్నింటిని గుదిగుచ్చి చూస్తే ముస్లింలపై హిందుత్వ విద్వేషం ఎంత ప్రస్ఫుటంగా ఉందో అర్థం అవుతుంది. ఒక 1954 నుండి 1982 మధ్యలోనే 6933 సంఘటనలు జరిగాయి.

దేశ విభజనకు ముందు ముంబాయిలోను, కలకత్తాలో చెలరేగిన అల్లర్లు, 1946 బీహార్ అల్లర్లు, 1964 కలకత్తా కొట్లాటలు, 1969 గుజరాత్ అల్లర్లు 1980 మొరాదాబాద్ అల్లర్లు, 1983 నెల్లీ మారణకాండ, 1969-89 గుజరాత్, మొరాదాబాద్ భాగల్‌పూర్ అయోధ్య తదితర దేశవ్యాప్త హింసాకాండ, 1987 హాషింపూరా మరణకాండ, 1992 బాబ్రీ మస్జిద్ విధ్వంసం తర్వాత బొంబాయి అల్లర్లు 2002 గుజరాత్ మారణకాండ, 2006 వడోదరా అల్లర్లు, 2008 భైంసా అల్లర్లు, 2014 ముజఫర్‌నగర్ హింసాకాండ, 2014 అస్సాం హింసాకాండ 2015 దాద్రీలో హిందూ మూకల ఆధ్వర్యంలో చిత్రవధ.

ముస్లింలకు వ్యతిరేకంగా తరుచుగా జరిగే దాడులన్నీ హిందూ మూకల వల్లనే. చాలా సంఘటనలు ఉత్తర, తూర్పు రాష్ట్రాలలోనే ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో ఇస్లామో ఫోబియాను సృష్టించి పశ్చిమోత్తర ప్రాంతాల్లో కూడా అల్లర్లకు పాల్పడిన చరిత్ర భారదేశంలో కన్పిస్తున్నది. అట్లా సృష్టించిన అల్లర్లలో పైన పేర్కొన్న 1946లో జరిగిన బీహార్ అల్లర్లు, 1983లో అస్సాంలో జరిగిన నెల్లీ అల్లర్లు, 1992 బాబ్రీ మస్జీద్ విధ్వంస అనంతర అల్లర్లు, గుజరాత్ మారణకాండ 2002లలో పెద్ద ఎత్తున ముస్లింల ఊచకోత జరిగింది.

దేశ విభజనాంతర హింసాకాండలో ఒక 1950లోనే 10,000 మందికి పైగా ముస్లింలు చంపబడ్డారు.

1954 నుండి 1982 వరకు జరిగిన 6933 సంఘటనల్లో అసంఖ్యాకమైన ముస్లింలు చంపబడ్డారు.

1989లో ఉత్తర భారతమంతా పెద్ద ఎత్తున భారీ హింసాత్మక చర్యలు హిందూత్వ చర్యలు చేపట్టడంలో జమ్మూ-కాశ్మీర్ స్వయం ప్రతిపత్తి కాంక్షలను అణిచివేసే పథకం ఉందని 'ప్రవీణ్‌స్వామి' అనే చారిత్రక పరిశీలకుడు అంటాడు.

చాలా మంది సామాజిక శాస్త్రవేత్తలు, పరిశోధకుల అభిప్రాయమేమంటే, ఈ మొత్తం హింసాత్మక చర్యల వెనుక సంస్థాగత మద్దతు ఉందని, మరీ ముఖ్యంగా బి.జె.పి. శివసేనల వంటి రాజకీయ పార్టీల వెనుక ఉన్న సంస్థలని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు.

ఈ హత్యలు ఎక్కడైతే బి.జె.పి. ఎన్నికల్లో బాగా వ్యతిరేకత ఎదుర్కొనే నియోజకవర్గాలలో మరీ ఎక్కువగా జరుగుతున్నాయని రాహేల్ దత్తీవాలా, మైఖేల్ బిగ్స్ అనే పరిశీలకులు చెప్తున్నారు. 1989లో ఉత్తర భారతదేశంలో ప్రణాళిక బద్ధంగానే బి.జె.పి. శిలాన్యాస్ పేరుతో ముస్లింల మీద దాడులకు, హింసాకాండకు పాల్పడింది. విస్తృత ఎన్నికల ప్రయోజనాల మీది యావతోనే అనే విషయాన్ని మనందరం చూశాం. ఆ తర్వాతనే ఆ పార్టీకి సింగిల్ డిజిట్ నుంచి మూడంకెల సంఖ్య దాకా పార్లమెంట్ స్థానాలు, రాష్ట్రాల్లో అధికారం, స్థానిక సంస్థల్లో బలోపేతం కావడం కూడా మనందరికీ తెలుసు. సామాజిక, మానవ శాస్త్రాల పరిశోధకుడు స్టాన్లీ జెయరాజ తంబయ్య ఏమంటాడంటే 1989లో భాగల్పూరులో జరిగిన హింసాకాండ, 1987లో హాషింపురాలో

జరిగిన హత్యలు 1980లో మొరాదాబాద్‌లో జరిగిన హత్యాకాండ అన్నీ కూడా వ్యవస్థీకృతంగా చేసిన హత్యలేనని 1990లో శివసేన చేసిన హింసాకాండ వారిని ఎన్నికల్లో గెలిపించిందని 2002లో నరేంద్రమోడీ ఆధ్వర్యంలో బీ.జె.పి. జరిపిన హత్యాకాండ ద్వారానే ఎన్నికల లబ్ధిని వారు పొందారని 'రాంపున్నాని' అనే సామాజికవేత్త, ఉద్యమకారుడు అంటారు. ఇవ్వాళ దేశానికి ప్రధానిగా ఉన్న నరేంద్రమోడీ గుజరాత్ నమూనానే దేశం మొత్తం మీద రుద్దుతాడా, ఇప్పటిదాకా వల్లిస్తున్న 'అభివృద్ధి' మంత్రానికే పరిమితం అవుతాడా జాగ్రత్తగా పరిశీలించాలని జ్ఞానప్రకాశ్ అనే సామాజికవేత్త హెచ్చరిస్తున్నాడు.

ఎందుకంటె ఈ ప్రమాదం 1980లోనే విశ్వహిందూ పరిషత్, బాబ్రీమస్జీద్ ఉన్న చోటనే రామమందిరం కడతామని ప్రచారాన్ని తీవ్రం చేసి, బీ.జె.పి.తో తన రాజకీయ కంఠస్వరం పెంచుకోవడంతోనె ఒక మలుపు తిరిగింది.

సెప్టెంబరు 1990 నాటికి ఎల్.కె. అద్వాని రథయాత్ర మొదలుపెట్టి, హిందూ జాతీయ వాదాన్ని తీవ్రతరం చేయడంతో దేశ వ్యాప్తంగా ముస్లింలలో భయాందోళనలు పెరిగాయి. లల్లూప్రసాద్ యాదవ్ అద్వానీని అరెస్టు చేసి నిరోధించగలిగినా 1,50,000 మంది కరాసేవకులు బాబ్రీమస్జిద్ కట్టడం వరకు చేరుకొని 1992 డిసెంబరు 6న కట్టడాన్ని నేలమట్టం చేశారు. దాంతో ఒక విశ్వాస విధ్వంసం జరిగిపోయింది. అప్పటిదాక ఈ దేశ లౌకిక విలువల మీద, రాజ్యాంగం రాసుకున్న ప్రజాస్వామిక విలువల మీద పెట్టుకున్న ఆశలన్నీ ఆడియాసలయ్యాయి.

మరొవైపు అద్వానీని అరెస్టు చేసినందుకు వి.పి.సింగ్ మంత్రివర్గానికి మద్దతు ఉపసహరించుకొని, ఆ తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల మెజారిటీ సాధించి కేంద్రలోను, ఉత్తరప్రదేశ్‌లోను ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. మరోవైపు వి.పి.సింగ్ మండల్ కమీషన్ రిపోర్ట్ బయటికి తీసి బి.సి.లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని ప్రకటించిన వెంటనే రిజర్వేషన్లు అమలు చేయడం ఇష్టంలేని బ్రాహ్మణీయ హిందుత్వ భావాజాలం గల ఆర్.ఎస్.ఎస్. శక్తులు అద్వానీ చేత రథయాత్ర జరిపించాయని కూడా పరిశీలకుల విశ్లేషణ.

బాబ్రీమస్జిద్ విధ్వంసం తర్వాత చెలరేగిన అల్లర్లలో మళ్ళీ పెద్ద ఎత్తున ముస్లింలే చనిపోయారు. ముస్లింల అస్తిత్వానికి, గౌరవానికి సూచికగా నిలబడ్డ 400 సంవత్సరాల చరిత్ర గల నిర్మాణం కుప్పకూలిపోయింది. పైపెచ్చు ఆపైన చెలరేగిన విద్వేషక, విధ్వంసక, హత్యాకాండలో వేలాది మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. ముంబాయి, సూరత్, అహ్మదాబాద్, కాన్పూర్, ఢిల్లీ, భూపాల్ తదితర ప్రాంతాల్లో 2000 పైగా ముస్లింలు చంపబడ్డారని అధికారక లెక్కలు చెప్తున్నాయి. ముంబాయిలో ఒక శివసేన ఆధ్వర్యంలోనె 900 మందికి పైగా ముస్లింలు చంపబడ్డారు. 9000 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగింది.

బాబ్రీ మస్జిద్ విధ్వంసం తర్వాత ఇండియన్ ముజాహిదీన్ తన ఉగ్రవాద చర్యలకు మస్జిద్ కూల్చివేత సంఘటన కూడా ఒక కారణంగా చూపుతారు. టెర్రరిజం ఒక భూతంలా కొందరికి అనిపించవచ్చు కాని ప్రపంచ వ్యాప్తంగా కూడా ఇటువంటి చర్యలేవో మూలకారణంగా ఉంటాయన్న ఊహసైతం వారికి రాదు.

'గుజరాత్ గాయంగా' సాహితీ ప్రపంచంలో పేర్కొనబడే గోద్రా అనంతర దాడుల్లో ముస్లిం స్త్రీలు, పురుషులు, చిన్న పిల్లలు సైతం దారుణ చిత్రహింసలు, అత్యాచారాలు శారీరక హింస కు గురయ్యారనేది అందరికీ తెలిసిందే.

ఇంతటి మారణకాండకు అయోధ్య నుంచి వస్తున్న సబర్మతి ఎక్స్‌ప్రెస్ నాలుగు బోగీలు తగులబడడం వెనుక టెర్రరిస్ట్ చర్య కారణమని అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఎలాంటి ఋజువు లేని ప్రకటన చేయడంతో రెచ్చిపోయిన హిందూత్వ మూకలు తెగబడి ముస్లిం సమాజం మీదికి దాడులకు దిగినాయి. మొబైల్ ఫోన్‌లతో సమన్వయం చేసుకొని విధ్వంసకాండను కొనసాగించారు. వీళ్లే కాక పోలీసు కాల్పుల్లో కూడా ముస్లింలే చనిపోయారు. ఫిబ్రవరి 28 రోజున మోరాజి చౌక్, చారోడియా చౌక్ జిల్లాల్లో 40 మంది ముస్లింలు పోలీసు కాల్పుల్లో మరణించారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక దేశాల ప్రతినిధులతో కూడిన అంతర్జాతీయ నిజనిర్ధారణ కమిటి తన నివేదికలో "ముస్లిం స్త్రీలను భయకంపితులను చేయడానికి హిందుత్వ మూకలు లైంగిక హింసాకాండను ఒక వ్యూహాత్మక విధానంగా అమలు చేశారని" తెలిపారు.

250 మంది బాలికలు, స్త్రీలను గ్యాంగ్ రేప్ చేసి గుర్తు తెలియకుండ కాలబెట్టారని ఒక అంచనా. పిల్లలు సజీవంగా గాని, నిర్జీవంగా గాని కాల్చివేయబడ్డారు. కాల్చి, నరికి చంపిన పిల్లలను సామూహికంగా ఒకే గోతిలో పాతరపెట్టారు. ముస్లిం మహిళల గర్భాలు చీల్చి, వాళ్ల పిల్లల్ని బయటికి తీసి వాళ్లకు చూపించి మరీ చంపారు. నరోడ పాటియాలో 96 మందిని అందులో 46 మందిని స్త్రీలను ఒకే గోతిలో పాతరపెట్టారు. కొన్ని కుటుంబాలకు కరెంటు షాక్ ఏర్పాటు చేసి చంపారు. స్త్రీలను నగ్నంగా బట్టలూడదిసి మర్మాంగాల్లోకి వస్తువుల్ని దూర్చి మరీ చంపారు. మహిళలపై జరిగిన రేప్‌లు, హింసాత్మక చర్యలు హిందూత్వ మూకల జాతి విధ్వంసక రాజకీయ వ్యూహాత్మక కార్యక్రమంలో భాగంగానే జరిగాయని కల్పనా కన్నాబిరాన్ అప్పటి సంఘటనలపై స్పందిస్తూ అన్నారు. ఇంకా మహిళలపై ఆసిడ్ దాడులు, గర్భిణీ స్త్రీలపై హింసాత్మక చర్యలు, పిల్లలను తల్లిదండ్రుల ముందే చంపడం వంటి చర్యలు జరిగాయి. ఇదంతా మామూలేనని ఇట్లాంటి లైంగిక అత్యాచారాలు, మహిళలపై అనుచిత హింసాకాండ ఇదే మొదటిసారి కాదని జార్జి ఫెర్నాండెజ్ తమ కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ అన్నారు.

ముస్లిం స్త్రీల పట్ల, పిల్లల పట్ల జరిగిన హింసాకాండ గురించి రేణు ఖన్నా ఒక వ్యాసంలో లైంగిక హింస ఎంత భయంకరంగా జరిపారో రాసారు. స్త్రీలను బలవంతంగా నగ్నంగా మార్చి సామూహిక రేప్‌లు, గ్యాంగ్‌రేప్‌లు, మర్మాంగాల్లో వస్తువుల చొనిపి, రొమ్ములను కత్తిరించి, గర్భాన్ని చీల్చి, లైంగిక అవయవాల్ని చీల్చి, స్త్రీల శరీరాంగాలపై హిందూ మత చిహ్నాలను ముద్రించి, రకరకాలుగా చిత్రహింసలకు గురిచేసి చంపారని రేణుఖన్నా తన వ్యాసంలో పేర్కొన్నారు.

భయంకరమైన ఒళ్ళు గగుర్పొడిచే టెక్నిక్స్‌తో హిందూత్వ మూకలు చాలా సంఘటనల్లో ఉద్దేశపూర్వక విధ్వంసకాండ జరిగిన రుజువులున్నాయని 'కన్సర్న్ సిటిజన్స్ ట్రిబ్యునల్' వారు పేర్కొన్నారు. ఒక వర్గ ప్రజల్ని మొత్తంగానే అణిచివేయడానికి, దమన కాండకు గురిచేయడానికి హిందూత్వ మూకలు పాల్పడ్డాయని అన్నారు.

చిన్న పిల్లలకు కాల్చివేయడం, రేప్ చేయడం, చంపివేయడం వంటివి హిందూత్వ పేరిట మూకలు నేర్పాయని పర్యావరణవేత్త

వందనా శివ అన్నారు.

"ఇషాన్ జాఫ్రి హిందూత్వ మూకలతో స్త్రీలను వదిలివేయమని ప్రార్థిస్తే... వినకుండా "జై శ్రీరాం" నినాదాల్తో మూకలు స్త్రీలను నగ్నంగా వీధుల్లోకి బయటికి లాగి 'జైశ్రీరాం' అననందుకు తలల్ని నరికి వేరుచేసి మంటల్లోకి విసిరేసాయి. చిన్న పిల్లల్తో సహా మొత్తం కుటుంబాన్ని మంటల్లో మసి చేసారు.' అని డియోనె బున్సా' జాఫ్రిల హత్యాకాండ గురించి రాస్తూ అంటాడు.

## కాశ్మీర్ ప్రజలపై హింసాకాండ :

కాశ్మీరంటే భారత్, పాకిస్తాన్‌లకు పంచుకుతినే ముక్కే కాని, అది 'కశ్మీరియత్' అనే ఒక సజీవ సంస్కృతి అని, అది ఒక ప్రత్యేకమైన జాతి అని అది ఒక స్వతంత్ర్య జాతిగా, రాజ్యాంగా తనకు ఉండే హక్కు గలదని గానీ గుర్తించడం లేదు. అక్టోబర్ 1947లో 'ఆజాద్ కాశ్మీర్' అనే ప్రాంతాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకోవడాన్ని సాకుగా చూపి 'జమ్మూకాశ్మీర్' భూభాగాన్ని తమ ఆధీనంలోకి భారత్ ప్రభుత్వం వారు తెచ్చుకున్నారు

భారత్, పాకిస్తాన్‌ల మాదిరిగా కాశ్మీర్ కూడా ఒక స్వతంత్ర్య రాజ్యాంగ ఉండాలన్న కాశ్మీరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'షేక్ అబ్దుల్లా' కాశ్మీర్‌కు ప్రధానిగా మొదటి, చివరి స్వేచ్ఛా ఎన్నికలైన 1951 సంవత్సరంలో ఎన్నికయ్యాడు. భారత్‌లో లాగా కాకుండా, నష్టపరిహారం లేకుండా ఫ్యూడల్ దొరల భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలైన హిందువులు, సిక్కులు, ముస్లింలకు భూములు పంచారు.

కాశ్మీరు స్వతంత్ర్య రాజ్యంగా వుండాలన్న మహారాజా 'హరిసింగ్' కోరికను మొదట ఆర్.ఎస్.ఎస్. కూడా సమర్ధించి పండిత ప్రేమనాథ్‌డోగ్రా నాయకత్వంలో ఉద్యమం కూడా నడిపారు. కాని హిందూ మతోన్మాద జాతీయ దురహంకారంతో షేక్ అబ్దుల్లా నాయకత్వంలో ఆ ప్రయత్నం జరగడం సహించలేక కాంగ్రెస్‌తో కుమ్మక్కై పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కూడా కాశ్మీర్ పండిట్ కావడం వల్ల కుట్ర పూరితంగా 1953లో షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసి తర్వాత బర్తరఫ్ చేశారు.

ఆనాటి నుండి ఈనాటి దాక 62 సం॥రాల పాటు క్రూర హింసాకాండ కాశ్మీరులో అమలు చేస్తూ వస్తున్నారు.

కాశ్మీర్‌కు, హిందువులైనా, ముస్లింలైనా తామంతా 5000 సం॥ల సుదీర్ఘ చరిత్ర గలిగిన 'ప్రత్యేక జాతిగా' జె.కె.ఎల్.ఎఫ్. ప్రకటిస్తుంటె బి.జె.పి. లాంటి హిందూ మతోన్మాద సంస్థలు హిందూ, ముస్లింలుగా ప్రజలను చీల్చాలని చూస్తున్నాయి.

విలీనమైనా, స్వతంత్రంగా ఉండాలని భావించినా, ప్రజలకు దాన్ని మరొకసారి తెలియపర్చె అవకాశం ప్లెబీసైట్‌ను 1952 ఢిల్లీ ఒప్పందం అమలును ఎందుకు వ్యతిరేకిస్తున్నట్లు?

హిందూ జాతీయ భావోద్వేగం, భారతరాజ్యాంగాన్ని నిరంకుశంగా మార్చి కాశ్మీరీ ప్రజల గొంతు నొక్కి వేయడం లేదా?

## దళితులపై దాడులు, హత్యాకాండ :

కరుడుగట్టిన హిందూమత, అగ్రకుల దురహంకారం ఈ దేశంలో దళితులు ఆత్మగౌరవంతో బతికే పరిస్థితులు లేకుండా చేస్తున్నాయి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ, దాన్ని పెంచిపోషిస్తున్న హిందూ మతోన్మాదం వల్లనే ఈ దేశంలో దళితులపై దాడులు చేస్తున్నవారు పాలకుల అండదండతో పోలీసుల కాపలా నడుమ యధేచ్ఛగా చేస్తున్నారు. తామే ప్రజాప్రతినిధులుగా స్థిరపడి దౌర్జన్యాలకు అధికారిక ప్రతిపత్తి ఇస్తున్నారు.

ఈ దేశంలో కుల వివక్ష, కుల సంబంధిత హింస వివిధ రూపాల్లో జరుగుతున్నాయి. 'హ్యూమన్ రైట్స్ వాచ్' నివేదిక ప్రకారం "దళితులు, ఈ దేశ మూలవాసులపై వివక్ష, బహిష్కారం, హింస ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. చట్టాలు, విధానాలు వారి రక్షణకు బలమైన ఆధారంగానే ఉన్నాయి కాని ఎక్కడా వాటిని, చిత్తశుద్ధితో విశ్వసనీయంగా అమలు జరిపిన దాఖలాలు లేవు."

ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? కులవ్యవస్థలో అట్టడుగు మెట్టైన దళితులు, తామూ మనుషులమేనని గుర్తింపుకోసం పరితపిస్తున్న క్రమంలో అగ్రకుల బ్రాహ్మణీయం హిందూ మతవాదులు కరుకుగా వారి కుత్తుకలను ఉత్తరిస్తున్నారు.

బ్రాహ్మణీయ హిందూ చాతుర్వర్ణ వ్యవస్థలో దళితులు భాగం కాదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు మాత్రమే వాళ్ల హిందూ మత వ్యవస్థలో భాగం. కనుక దళితుల్ని మనుషులుగా వాళ్లు చూడలేదు. పంచములుగా తర్వాత గుర్తించినా వాళ్ల విధి, చాతుర్వర్ణాలకు సేవ చేసుకోవడమే. ఈ సమాజంలోని చాతుర్వర్ణాలు అసహ్యించుకొనె పారిశుధ్య పనులు చేసే అత్యంత జాగుప్సాకరమైన పశువుల కంటె హీనమైన స్థానాన్నే వారికిచ్చారు.

దేశవ్యాప్తంగా వారిపై జరిగిపిన దాడులే దానికి ఋజువుగా నిలుస్తున్నాయి. కీల వేన్మాణి (డిసెంబర్ 25, 1968), పూలన్‌దేవిపై సామూహిక అత్యాచారం (1981) కారంచేడు (1985), రణవీర్‌సేనా దాడులు (1990), చుండూరు (1991), బతాని తోల (1996), (బీహార్) మారణకాండ, లక్ష్మణ్‌పూర్ బాత్ (1991), నెత్తుటి మడుగు (1997), మేలవాలవు మారణకాండ, తమిళనాడు (1997), రాంబాయి హత్య, ముంబాయి (1997), వేంపెంట మారణకాండ (1998) ముత్తంగ సంఘటన, కేరళ (2003), ఖైర్లాంజి మారణకాండ, మహారాష్ట్ర (2006), రాజస్థాన్ దళితులపై హింసాకాండ (1999-2002), మీర్జాపూర్, హర్యాన హత్యకాండ (2011), ధర్మపురి హింసాకాండ (2012), లక్ష్మింపేట మారణకాండ (2012), మరక్కం హింసాకాండ తమిళనాడు (2013), జావ్‌భేదా, మహారాష్ట్ర (2014), జాట్ దళిత హింసాకాండ రాజస్థాన్ (2015)

ఇన్ని సంఘటనలు జరుగుతున్నా, ఇంతమంది చనిపోతున్నా చట్టాలు, రాజ్యాంగ విధి విధానాలు వారికి రక్షణ కల్పిస్తున్నాయని చెప్పబడుతున్నా నిందితులు ఎవరికీ చట్టపరమైన శిక్షలు పడిన దాఖలాలు అంతంత మాత్రమే. ఒక్క చుండూరు, ఉదంతాన్ని తీసుకున్నా మనకు దళితులపై హత్యాకాండ జరిపినా తప్పించుకోవచ్చుననే అభిప్రాయాన్ని ఈ బ్రాహ్మణీయ హిందూ అగ్రకుల పాలక వ్యవస్థ కలుగజేస్తుంది.

ప్రకాశం జిల్లా, చుండూరు గ్రామానికి చెందిన ఏడుగురు మాలలు జాలాది మత్తయ్య, జాలాది ఇమ్మాన్యుయేల్, జాలాది ఇస్సాక్, మల్లెల సుబ్బారావు, మంద్రు రమేష్, దేవరపల్లి జయరాజ్, సంకురు శ్యాంసన్‌లతో పాటు ఒక మాదిగ యువకుడు అంగల కుదురు రాజమోహన్ మొత్తం ఎనిమిది మంది, 1991 ఆగ్రస్టు 6న పట్టపగలు 11 గం॥ల సమయంలో చుండూరు, మనేరు, మోదుకూరు,

ముప్పంగివారి పాలెం గ్రామాలకు చెందిన రెడ్డి, కాపు కులాలకు చెందిన హంతక మూకలు చుండూరు దళితుల్ని వెంటాడి వేటాడి నరికి చంపారు. నాలుగు రోజుల తర్వాత 8 శవాలు తుంగభద్ర కాలువలో ఉబ్బి, పురుగులు పట్టి బయటపడ్డాయి. పురుగులు పట్టి ఉబ్బి ఉన్న మంద్రు రమేష్ శవాన్ని చూసిన అతని అన్న పరిశుద్ధరావు గుండె పగిలి చనిపోయాడు. హంతకుల అరెస్టుకై ఉద్యమం నడుపుతున్న కొమ్మెర్ల అనిల్‌కుమార్‌ను నిరాహారదీక్ష శిబిరంలోనే పోలీసులు కాల్చి చంపారు. ఛలో ఢిల్లీ కార్యక్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం గుద్ది గూడురు లేయమ్మ అక్కడికక్కడే చనిపోయింది.

16 సంవత్సరాల తర్వాత 2007 జూలై 31న చుండూరు ప్రత్యేక కోర్టు తీర్పు ప్రకటించింది. ఆ తీర్పులో 21 మందికి జీవితఖైదు, 39 మందికి సంవత్సరం జైలు శిక్ష విధించింది.

2014 ఏప్రిల్ 22న జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, జస్టిస్ ఎం.ఎస్.కె. జైస్వాల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఆ 56 మందిని నిర్దోషులుగా విడుదల చేస్తూ తీర్పు ఇచ్చింది.

మరి చుండూరు దళితుల్ని గొడ్డళ్లతో నరికి, బరిసెలతో పొడిచి, తుంగభద్రలో కలిపింది ఎవరు?

మానవత్వం కోల్పోయి అగ్రకులోన్మాదంతో వీరంగం సృష్టించే హంతక మూకలు కోర్టుల్లో నిర్దోషులుగా విడుదలైతే ఇక దళిత, పీడిత కులాల మానప్రాణాలకు రక్షణ ఎక్కడ?

## క్రైస్తవులపై దాడులు, హత్యలు :

ఒడిషా రాష్ట్రం, కాంధమాల్ జిల్లా (2008)లో హిందుత్వ మూకలు 50 మంది క్రిష్టియన్‌లుగా మారిన గిరిజనులను చంపి వేసారు. 730 ఇండ్లను తగుల బెట్టారు. ముంబాయిలో 2010లో కలకత్తా, మదర్ థెరిసా మిషనరీ చారిటీకి చెందిన-71 సంవత్సరాల క్రైస్తవ సన్యాసిని గ్యాంగ్ రేప్ చేసారు. డిసెంబర్ 2014 నుండి ఆర్ఎస్ఎస్ క్రైస్తవులను తిరిగి హిందువులుగా మార్చే ఘర్ వాపసీ చేపట్టింది. ఇంత చేసినా క్రైస్తవులు ప్రతిస్పదించరాదని హిందూ మూకలు ఆశిస్తున్నాయి. సెప్టెంబర్ 14, 2015న గర్భంతో ఉన్న ఒక క్రైస్తవ మహిళను, క్రైస్తవ పిండం ఈ లోకాన్ని చూడబోతున్నదని తలచి చంపివేశారు. క్రైస్తవులు భారత జనాభాలో 2.5% మాత్రమే. చాలా చిన్న సమూహం. ఇంత చిన్న సమూహం భారతీయ దళిత బాలబాలికలకు అత్యంత విలువైన విద్యను అందించారు. ఒక్క 2015లోనే 85 క్రైస్తవ వ్యతిరేక సంఘటనలు జరిగాయి. ఇంకా ఎన్నో. ఇలాంటి దారుణ హత్యకాండాలు సంభవించాయి.

## హిందుత్వ సాంస్కృతిక మూలాలు :

హిందుత్వ సాంస్కృతిక మూలాలు బ్రాహ్మణీయ వైదిక మత ఫాసిస్టు భావజాలంలో ఉన్నాయి. ఇందుకు వేదకాలంలోనె బీజాలు పడ్డాయి. మరింత నిర్దిష్టంగా చెప్పాలంటె రామాయణ కాలంలో. రాముడు దండకారణ్యంలో చంపిన రాక్షసులు ఎవరోకాదు. ఆదివాసులు. రాముని పద్నాలుగేళ్ల వనవాసం ఎందరో ఆదివాసుల ప్రాణాల్ని బలి తీసుకుంది. గడ్డం పెంచుకున్న ఋషులు, మునులు ఆ కాలపు జమిందారులు. వేలాది ఎకరాల జాగీర్లు మునుల ఆశ్రమాలు ఆ జాగీర్ల రక్షణ కోసమె మునులు యజ్ఞ యాగాదులు చేశారు. యజ్ఞ యాగాదులు అంటె పెద్ద ఎత్తున జంతువుల్ని బలి ఇచ్చి జల్సాగా విందు, వినోదాల్లో తేలియాడడం.

ఇవ్వాళ కే.సి.ఆర్. చేస్తున్న చండీయాగం కూడా తెలంగాణ జాగీరుమీద తన కుటుంబ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడం కోసమే. ఆమరావతి చుట్టుపక్కల, వేలాది రైతుల పొట్టగొట్టి 30 వేల ఎకరాలు లాక్కున్న తోటి భూకబ్జాదారుడు చంద్రబాబునాయుడుతో 'అతిపెద్ద ప్రజాస్వామ్య' దేశానికి 'అతి పెద్ద' వాడైన రాష్ట్రపతి హైదరాబాదులో ఉన్నపుడే తన వినోదాన్ని పంచుకున్నాడు.

అయితే మన విషయం హిందుత్వ సాంస్కృతిక మూలాలు వేదాలు, పురాణాల్లోనే ఉన్నాయన్నది. భగవద్గీతలో కృష్ణుడు, అర్జునున్ని తన వాళ్లు, పరాయి వాళ్లు అని చూడకుండా చంపమని ప్రోత్సహిస్తాడు.

వలస పాలన కాలంలో బ్రిటిష్‌వాడు ఉప్పందించిన ద్విజాతి, సిద్ధాంత భావనను వీరసావర్కర్ అందుకొని 'హిందుత్వ' అనే పుస్తకం రాసి, ముస్లిం విద్వేష సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి దేశం మీదికి వదిలాడు. దాంతో హింస చెలరేగింది. మత కల్లోలాలు దావనంలా వ్యాపించాయి. ఆ తర్వాతనే మహ్మద్ ఇక్బాల్, మహ్మదాలి జిన్నా మెజారిటీ హిందువులున్న దేశంలో మనలేమనే భావనతోనే వేరే దేశం కావాలని కోరుకున్నారు.

దేశంలో స్త్రీలపై జరుగుతున్న హత్యాకాండ, అత్యాచారం, అణిచివేతకు కూడా హిందుత్వమే కారణం. 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అనే మనుస్మృతి గురించి మనకు తెలియంది కాదు. కనుక స్త్రీలందరికీ, దళిత స్త్రీ నుంచి బ్రాహ్మణ స్త్రీ దాకా అందరికీ హిందూమతం వ్యతిరేకమైంది. స్త్రీల హక్కుల్ని కాలరాసిన పురుషుడి హింసాత్మక రాజ్య స్వభావానికి హిందూమతమే ఊతం.

## ప్రజలపై హింసాకాండ - సామ్రాజ్యవాద మిలాఖత్ - ముద్రస్థాయి యుద్ధం :

ఈ దేశంలో ముస్లింలపై, క్రైస్తవులపై, దళితులపై జరిగిన హత్యలన్ని హిందుత్వ హత్యలే స్త్రీలపై అణిచివేతకు కూడా హిందూ మనుధర్మమే కారణం. పారిశ్రామిక విప్లవం జరిగి, పెట్టుబడిదారీ మార్కెట్ ఎకానమి విధానాలు అమల్లోకి వచ్చి, అనివార్యంగా స్త్రీల ఉత్పత్తి శక్తి ఆవిష్కారమైందని మార్క్స్ అంటాడు. కాని హిందుత్వ ఫ్యూడల్ భావజాలం స్త్రీలను అణిచివేసి పురుషుల అడుగులకు మడుగులొత్తె పనిముట్టుగానే చూస్తుంది.

జాతీయోద్యమ కాలం నుంచి కూడా హిందుత్వ శక్తులు బ్రిటిష్ వలస పాలకుల కంటె ఈ దేశంలోని ముస్లింలే ప్రధాన శత్రువులన్నట్లు ప్రచారం చేశాయి. బ్రిటిష్‌వారు, ముస్లింలు బయటి నుంచి వచ్చినా, ముస్లింలు ఈ దేశ ప్రజలలో కలిసిపోయారు. ఢిల్లీ నుంచి దక్కను దాకా పరిపాలించినా మత మార్పిడుల మీద దృష్టి పెట్టలేదు. హిందూమతం నుంచి ముస్లింలుగా మారిన వారున్నప్పటికి వారికి ముస్లింల మతంలో దక్కే గౌరవం కోసమే ఆ మతంలోకే ఇష్టపూర్వకంగా వెళ్లారు. 'చిల్లర దేవుళ్లు' నవలలో దాశరథి రంగాచార్య చెప్పింది తప్పు. దళితులు హిందూ అగ్రకుల బ్రాహ్మణుల చేత అంటరానివారుగా వెలవేయబడడం వల్లనే ఆత్మగౌరవం కోసం ముస్లింలుగా మారారు తప్ప నవాబుల ఒత్తిడి వల్ల కాదు. హిందుత్వ శక్తులు 'కలకత్తా ఓడ రేవు నుండి దేశ సంపదనంతా దోచుకెళ్లి లండన్ మహానగరాన్ని నిర్మించుకున్న బ్రిటిష్ వారికంటే ముస్లిం పాలకులే దుర్మార్గులు అన్నట్లు ప్రచారం చేసారు. పైగా రాజులు, పాలకులు

ఎట్లాగు దుర్మార్గులే అనుకున్నా, ఇక్కడి ప్రజలతో మమేకమైన సాధారణ ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని వెళ్లకక్కుతూ శత్రుపూరిత వైఖరి తీసుకున్నారు. అట్లా ప్రచారం చేసిన వారిలో వీరసావర్కర్, హెగ్డేవార్, గోవాల్కర్, దేవరస్, బి.యస్. ముంజా, పరమానంద, స్వామి దయానంద సరస్వతి తదితరులు. వీళ్ళు నిజానికి ప్రజల తలకాయల్లోకి హిందుత్వ విషాన్ని ఎక్కించిన సిద్ధాంతకర్తలు. అయితే బ్రిటిష్ పాలకుల ముందు సాగిలపడ్డారు. జాతీయోద్యమంలో వీళ్ల పాత్ర ఏమీలేదు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంలో అరెస్టయిన వాజపేయ్ కోర్టులో మాట్లాడిన మాటలే ఇందుకు సాక్ష్యం.

స్థానికులైన దళితుల పట్ల, ముస్లింలపట్ల, క్రైస్తవుల పట్ల, ఆదివాసుల పట్ల హింసాత్మక వైఖరి, సంపన్నవర్గాల ప్రయోజనాలు కాపాడడం కోసం సామ్రాజ్యవాదులతో మిలాఖత్ వైఖరిని హిందుత్వ తీసుకున్నది. శతాబ్దాలుగా తమ మెదళ్లను వలసవాదులకు, సామ్రాజ్యవాదులకు అర్పించుకున్నది. వాళ్లిచ్చే కొలువుల్లో ఇమిడిపోయింది.

గత మూడు దశాబ్దాలుగా 3 లక్షల భారతసైన్యం 70 వేల కాశ్మీరీయువతను పొట్టన బెట్టుకున్నది.

మాజీ బ్రిగేడియర్ పోన్వర్ బాధ్యుడిగా కాంకేర్, బస్తర్, బిలాస్‌పూర్, మాడ్ దండకారణ్యములు సైనిక శిబిరాలు, బేస్ క్యాంప్‌లతో ఆదివాసులను చంపి లేదా నిర్వాసితులను చేసి ఈ మొత్తం భూభాగాన్ని కార్పొరేటు, బహుళజాతి సంస్థలకు అప్పగించే పనిని విధేయంగా చేపట్టింది. (మోఢీత్వం), సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ముంద్రస్థాయి యుద్ధ తంత్రంగా విస్తరించి భారతదేశంలో హిందుత్వతో మిలాఖత్ అయ్యింది.

## హిందుత్వ సాంస్కృతిక మూలాలతో మంద్రస్థాయి యుద్ధతంత్ర నిర్వహణ :

మంద్రస్థాయి యుద్ధం ప్రధానంగా సైనిక రాజకీయార్థిక సాంస్కృతిక వ్యూహం. అది దీర్ఘకాలికమైంది. అంతర్జాతీయ ఆశ్రిత పెట్టుబడి రూపొందించిన ప్రతీఘాతుక యుద్ధ తంత్రం. ఇది 1. ఆర్థిక, 2. భావజాల, 3. మతం, 4. విద్యాసాంస్కృతిక రంగాల్లో చాపకింద నీరులా ప్రజల మెదళ్లలోకి తన యుద్ధ తంత్రాన్ని నెమ్మదిగా చొప్పిస్తుంది.

గ్లోబల్ గుత్త పెట్టుబడిదారీ దశలో సామ్రాజ్యవాదం సమస్త వనరుల్ని తన గుప్పిట్లోకి తెచ్చుకోవడంలో భాగంగా తృతీయప్రపంచ దేశాల భావజాల, సాంస్కృతిక రంగాల్లోకి క్రమక్రమంగా ప్రవేశిస్తుంది. సామ్రాజ్యవాదం అట్లా తన అధ్యయన బృందాలను వివిధ దేశాలను పంపుతుంది. కనీసం వియత్నాం యుద్ధకాలం నుంచి అమెరికా ఆధ్వర్యంలో ముద్రస్థాయి యుద్ధ తంత్రం తృతీయం ప్రపంచ దేశాల్లోకి విస్తరించి నయానా, భయానా ఆయా దేశాల పాలకుల్ని తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవడం మొదలైంది. ఇప్పుడది మరింతగా విస్తరించి ఇంటర్నెట్, ఫేస్‌బుక్కుల్లోకి ప్రవేశించి తద్వారా ప్రపంచ ప్రజలందరి వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడింది.

సామ్రాజ్యవాదం తన బహుళ జాతి, కార్పొరేటు ప్రయోజనాలు ఎవరివల్ల సాధ్యం అవుతాయని భావిస్తుందో ఆ బూర్జువా పాలకవర్గానికి ఏయే రూపాల్లో తన చేయూత అవసరమో ఆయా రూపాల్లో అందిస్తుంది. భారతదేశంలో హిందుత్వ సాంస్కృతిక జాతీయ వాదుల 'దేశభక్తికి', 'మోఢిత్వ' అభివృద్ధి నమూనాగా రూపొంది సామ్రాజ్యవాదానికి ఊడిగం చేయడానికి ఎలాంటి అభ్యంతరం ఉండకపోవడమే మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో హిందుత్వ పాత్ర.

ప్రజలు మతావలంబనా మూఢత్వంలో కొట్టుకుపోతున్నంతకాలం బూర్జువా పాలకవర్గానికి తిరుగుండదు. ఎంతో కొంత ప్రజామోద రూపంలో ఉన్న మతాన్ని బూర్జువావర్గం తన కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉపయోగించుకొంటుంది. కనుక ఇక్కడి బూర్జువా వర్గానికి హిందూమతం ఒక ఆయుధం. ఆ ఆయుధంతో మతావలంబకులైన ప్రజల్ని ఎంతకాలమైన దోపిడి చేయవచ్చు. దీంతోపాటు వేరే మతాన్ని ద్వేషించే నిషా తలకెక్కిస్తే ఆ ఉన్మాదంలో వాళ్ళు కొట్టుక చస్తుంటే పాలకవర్గ ఆనందానికి అవధులుండవు. ఈ వికృత క్రీడలో రసానందాన్ని పొందె బూర్జువా పాలక వర్గాన్ని సామ్రాజ్యవాదం ముద్రస్థాయి యుద్ధసందర్భంలో తన్మయ పారవశ్యంతో వినియోగించుకొంటుంది.

## ప్రజల విముక్తి మార్గం :

హిందుత్వ హత్యలకు సాంస్కృతిక మూలాలు వేదాల్లో ఉన్నాయనుకున్నాం. వేదకాలం నుండి ఇవ్వాళ దండకారణ్యంలో ప్రజల స్వావలంబ జనతన సర్కార్ మినహా భారతదేశ సంపదను అనుభవిస్తున్న దోడిపిదారుల వ్యక్తరూపాలు ఏమైనా, ప్రజలమీద దేశమంతా తీవ్రమైన హింస కొనసాగుతున్నది. భారత పాలకవర్గం హిందూ మత రూపసారాల్లోకి సంపూర్ణ పరిణామం చెందింది. పెరి ఆండర్‌సన్ తన 'ఇండియాలో దాగిన హిందూస్థాన్' అనే పుస్తకంలో భారతదేశంలోని అన్నీ రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య వ్యవస్థలలో హిందూ అంశే అంతర్లీనంగా పని చేస్తూ ఉంటుందని చెప్పారు. ఈ ప్రభావం నుంచి నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టులు కూడా బయటపడలేదు. "రాజ్యం రూపు రేఖలనీ, స్వేచ్ఛకూ, అణచివేతకూ మధ్యనున్న సరిహద్దులనీ, దేన్నీ అనుమతించాలి, దేన్నీ నిషేధించాలి వంటి అంశాలన్నింటినీ చాపకింది నీరులాగా ఇండియాలో దాగి ఉన్న 'హిందూ' అంశే నిర్దేశిస్తోందని కూడా అన్నారు. భారతదేశంలో వామపక్షాలు కూడా... రాజకీయంగా ఎంతో అవగాహన స్థాయి ఉన్నవారమని చెప్పుకునే నాయకులు కూడా హిందుత్వను సరియైన పదునుతో ఎదిరించలేకపోతున్నారు. ఫ్రాన్స్‌లో లాగా భారతదేశంలోనూ కమ్యూనిస్టులు మర్యాదస్తుల్లాగా వ్యవహరిస్తున్నారని ఆయన అభిప్రాయ పడ్డారు. ఇవ్వాళ హిందుత్వ భారత పాలకవర్గంగా రూపొందింది. అది ఏ వర్గ ప్రయోజనాల్ని ఆశించి, ఏ వర్గ ప్రజల్ని అణిచవేస్తుందో తనను తాను స్పష్టం చేసుకున్నది. ఇప్పుడు భారతదేశంలోని భూస్వామ్య శక్తులు, దళారి నిరంకుశ పెట్టుబడిదారులూ, సామ్రాజ్యవాదం కనుసన్నల్లో దేశాన్ని ఒక యుద్ధభూమిగా మార్చారు.

అడవులను ఆక్రమించి, ఏర్‌బేస్‌లు నిర్మించి సైనిక విమానాలతో ఆకాశ యుద్ధంతో ఆదివాసీలను, వారికి అండగా నిలబడి, మధ్య భారతంలోని వనరులను కాపాడుతున్న జనతన సర్కార్‌ను అంతం చేయడానికి తలపడుతున్నారు.

మైదాన ప్రాంతంలో ముస్లింలు, క్రైస్తవులు, దళితుల మీద దాడులతో భీతావహం సృష్టించి వాళ్ల ఆర్థిక వనరుల్ని ఏమైనా ఉంటె వాటిని ధ్వంసం చేయడం, భూముల్ని గుంజుకోవడం చేస్తున్నారు.

హిందూ మత ఆచార, వ్యవహారాలన్ని స్త్రీలకు హింసాత్మకమైనవే.

# కార్పోరేట్ వ్యవసాయం - రైతు ఆత్మహత్యలు

**ఉజ్వల్**

"దుక్కిదున్నిన దేశమంతట
దుఃఖం ఉంటుందా..."
కాపు నడిసిన భూమి మీద
మేపే తగ్గిందా...!!

ఇది తెలంగాణ పల్లెల్లో ప్రజల నాల్కలపై నర్తించే పాట. మరీ ముఖ్యంగా పాలమూరు జిల్లా ప్రజలు రాత్రుళ్లు అన్నాలు తిన్నంక అరుగుల మీదనో, వాకిట్లోనో కూర్చొని ముచ్చట్లు పెట్టుకునే కాలంలో ఎక్కడ నలుగురు జతగూడితే అక్కడ ఎక్కడెక్కడి విషయాలో మాట్లాడుకునేవేళ పాడుకునే పాట ఇది.

దుక్కిదున్నిన దేశంలో దుఃఖం ఉండరాదనీ, కాపు నడిచిన భూమి మీద మేపు తగ్గరాదని ఆశ్వాసిస్తూ అవి ఎందుకు లేకుండా పోతున్నాయని ఆక్రోశిస్తూ మనందరి హృదయాలు శృతి చేసే పాట ఇది.

తరతరాలుగా ఈ భయాలే అందరి గుండెల్లో గూడుకట్టుకుని ఉంటున్నాయంటే ఆశ్చర్యం లేదు. కాస్త అటుఇటుగా తెలంగాణలోని. అన్ని జిల్లాలోనూ ఇదే ఘోష

ఇప్పుడెమో ప్రపంచమే తలదించుకునేలా అందరికీ అన్నం పెట్టే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పోయిన సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండువేలమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే వారిలో తెలంగాణాకు చెందినవారు పద్నాలుగువందల మంది కాగా 'కోస్తారాయల సీమ ప్రాంతాలకు చెందినవారు ఆరువందలమంది.

సామాజిక రంగాలన్నీ సంక్షుభితమై ఎక్కడ చూసినా ప్రజలంతా అన్యాయంతో తలపడుతున్న కాలం.

వ్యవస్థీకృత దోపిడీ దౌర్జన్యాలతో ఏగలేక బిగుపిడికిళ్ళె ఉద్యమ దారులవైపు చూస్తున్న కాలం కూడా.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల నోటికాడి కూడు చేతిలోని ఉపాధే కాకుండా తలమీది నీడనూ కాళ్ళ కింది నేలనూ కొల్లగొడుతూ ఎదురు తిరిగిన దేశ పౌరులపైకే పాలకులు యుద్ధాన్ని సంధిస్తున్న కాలం ఇది.

యుద్ధమంటే పురాణ కథల్లో లాగా విల్లంబులు - కత్తులూ కటారుల కవాతు కనపడదు. అత్యాధునిక మారణాయుధ బాంబులూ - బుల్లెట్లు జడివానగా కురిసే ప్రకంపనలూ వినిపించవు. చాపకింది నీరులాగా మన స్పృహలోకి రాకుండానే మన చుట్టూ అల్లుకుని మనల్ని వెంటాడే యుద్ధం. మన నీడలో దాగి, మన అలవాటై, మన అవసరమై మనలో ఒకటై మన ఉదాసీనతలో తిష్టవేసి నిరాఘాటంగా, నిశ్శబ్దంగా పాలకులు అత్యంత క్రూరంగా అమలు చేస్తున్న ఈ మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో నిలబడి మనమిక్కడ రైతు ఆత్మహత్యలపై చర్చించుకుంటున్నాం!

సామ్రాజ్యవాద దేశాలు తమలో తాము కలహించుకోవడం ద్వారా అనుభవ పూర్వకంగా రెండు ప్రపంచ యుద్ధాల్లో పొందిన జ్ఞానంతో యుద్ధ రూపాన్ని మార్చుకుని వలస దేశాలపై మంద్రస్థాయి యుద్ధా అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి సామ్రాజ్యవాద దేశాలు..

ఈ మంద్రస్థాయి యుద్ధ దాడి నాలుగు రూపాలుగా కొనసాగుతుంది. అవి (1) ఎకానమిపై దాడి, (2) భావజాలం రూపంలో దాడి, (3) మతం రూపంలో దాడి, (4) విద్య రూపంలో దాడి. ఎకానమీలో భాగంగా మార్కెట్‌ను ధ్వంసం చేసి, మనుషుల్ని మానసికంగా దుర్భలుల్ని చేసి పోరాడే తత్వాన్ని దూరం చేయడం మంద్రస్థాయి యుద్ధ లక్షణం.

రిపీటెడ్‌గా కరువులు, నష్టాలకు గురిచేసి వ్యవసాయరంగాన్ని నాశనం చేసి రైతుకు దిక్కు తోచని పరిస్థితి కల్పించడం అన్నమాట.

సారాంశంలో వర్గపోరాట సమస్య ఇది.

వ్యవస్థ రోగగ్రస్థతకు నిదర్శనం ఆత్మహత్యలు అన్నాడు మార్క్స్. మనం ఉంటున్న సమాజం ఎంత రోగగ్రస్థమై పోయిందో దినపత్రికల్లోని పతాక శీర్షికల్లో మనం రోజూ చదువుతూనే ఉన్నాం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, వాళ్ళ కన్నీళ్ళకూ సృజనాత్మకమైన పరిష్కారాలు అందించేదే రాజకీయం అంటారు.

ఆరున్నర దశాబ్దాల స్వాతంత్ర్యమూ, ప్రపంచంలోనే అతిపెద్దదిగా కీర్తించబడుతున్న రాజ్యాంగమూ, ప్రజాస్వామ్యమూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం ప్రకటించుకున్న ప్రణాళికలూ ఇంకా...

కనుక దోపిడీ పాలక వర్గాల చేతిలో ఆయుధంగా మారిన మతాన్ని అంతరింప చేయడానికి అవసరమైన భావజాలరంగ పోరాటం, అట్లాగే ఆ మత భావజాలం ఏ వర్గాలకి పుడుతుందో, ఆ బ్రాహ్మణ దోపిడి మతవర్గంతో, ఆది నిర్మించిన కుత్సిత నిచ్చెన మెట్ల కులవ్యవస్థతో రాజీలేని రాజకీయ పోరాటం తక్షణ అవసరం.

ఒక శాస్త్రీయ రాజకీయ, సాంస్కృతిక పోరాటంతో మాత్రమే మన ముందున్న ప్రజలకు శత్రువుగా నిలబడ్డ బ్రాహ్మణీయ మతోన్మాదాన్ని ఎదుర్కొన్న గలుగుతాం.

"మసీదు రాళ్లతో పొదిగిన మీ సింహాసనం
ఇపుడు, రక్తహారతులు కోరుతుంది.
మానవ మాంస నైవేద్యాలు కోరుతోంది.
కంకాళాల మాలల్ని కోరుతోంది.
మానవతుల మానాల్ని కోరుతోంది.
గుజరాత్ గాయాల్ని కోరుతోంది. "
...
ప్రపంచ మానవ న్యాయస్థానం ముందు బోనులో
హిట్లర్ సరసన మీ చోటు స్థిరపడిపోయింది.
గుజరాత్ గాయం పీడకలై మిమ్మల్ని వెంటాడి తీరుతుంది.
(గుజరాత్ గాయం...నుంచి)

ఇంకా... ఎన్నో నివేదికలూ... రిపోర్టులూ... సమీక్షలూ.. చట్టాలూ చట్టసభలూ... ఇవన్నీ ఉండి కూడా ప్రజలు వేలాదిగా అసహజ మరణాల పాలైపోతున్నారంటే ప్రభుత్వాలూ, వాటి రాజకీయాలూ వాటి సృజనాత్మకత ఏమౌతున్నట్లు?!

గడిచిన రెండు మూడు దశాబ్దాలుగా భారతదేశంలో 60 శాతంపైగా ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగంలో అభివృద్ధి ఘోరంగా మందగించి తీవ్ర సంక్షోభానికి నిలయంగా మారిపోయింది. రెక్కల కష్టంపై ఆధారపడి ఆరుగాలం చిన్నా పెద్ద అనకుండా కుటుంబమంతా తలమునకలై ఉండి కూడా రైతుల జీవితాలు అతలాకుతలమై పోతున్నాయి. అప్పులపాలై రైతులు శవాలుగా మారి స్మశానాలపాలై పోతుంటే దేశాధినేతలూ, బడాబడా పెట్టుబడిదారులూ అంతులేకుండా పోగవుతున్న ఆస్తుల్ని కూడబెట్టుకునేందుకు విదేశీ బ్యాంకుల పొదుపు ఖాతాల పనుల్లో తీరికలేకుండా తలమునకలై పోతున్నారు.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఆఫ్ ఇండియా ప్రచురించిన వార్షిక నివేదికలో ఒక్క 2014 సంవత్సరంలోనే దేశవ్యాప్తంగా 5,650 పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది. పదేళ్ళు వెనక్కి వెళ్ళిచూస్తే ఈ దశాబ్దంలోనే 2004లో అత్యధికంగా 18,241 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా సంభవించిన మొత్తం ఆత్మహత్యల్లో ఒక్క వ్యవసాయరంగపు రైతుల ఆత్మహత్యలే 11.2 శాతం ఉన్నాయంటే వ్యవసాయరంగ సంక్షోభ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

జాతీయాదాయానికి 15 శాతం వాటా కేవలం వ్యవసాయ రంగం నుండే అందుతూ 70% జనాభా తమ జీవనాధారం కొరకు వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నారు. స్థూల జాతీయాదాయాన్ని పెంచుకునే ఆదుర్దాలో భారత పాలకవర్గం చేపడుతున్న ప్రజాకంటక పథకాలు, అనుసరిస్తున్న దివాళకోరు విధానాల్లో భాగంగా 1982లలో ఐఎంఎఫ్ అప్పుతో మొదలైన ఆధునీకరణ 1991ల నుండి మరింత ముమ్మరమై ప్రపంచీకరణంగా పడగెత్తి రైతాంగాన్నీ, సమస్తవృత్తుల ప్రజానీకాన్నీ పనుల్లోంచి వెలివేసి అన్ని పనుల్లోనూ భారీ యంత్రాల్ని ప్రవేశపెట్టి ప్రజల్ని పస్తులపాలు, అప్పులపాలుచేసి పొట్టచేత పట్టుకొని దేశదేశాలు తిరిగే వలస దైన్యానికి గురిచేసింది. గత పదేళ్ళలో ఇలాంటి ప్రభుత్వాల ప్రజాకంటక విధానాలవల్ల రెండున్నర లక్షలమంది రైతులు దేశ వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఈవిధంగా ప్రపంచీకరణ ప్రారంభమైన 1990 దశకం నుండి వ్యవసాయరంగంలో వృద్ధిరేటు క్షీణిస్తూ రెండు దశాబ్దాల కాలంలో ఒక్క శాతానికి దిగజారింది. ఇది రైతుల జీవితాలలో విషాదంగా ప్రతిఫలిస్తున్నది.

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు వ్యవసాయసంక్షోభం జీవితాల్ని గురించి ఆలోచించండని దేశ రాజధాని ఢిల్లీలో రైతు ఆత్మహత్యకు పాల్పడితే చట్టసభలోళ్ళ మనసు కరుగుతుందనుకున్నాడేమో! కరగడానికి అదేమన్నా మంచా? అది కరుడుగట్టిన బండరాతి శిల. ఆ రైతన్న త్వరపడ్డాడు, పొరపడ్డాడు.

దేశవ్యాప్తంగా 2014 సంవత్సరంలో రాష్ట్రాలవారీగా ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల వివరాలివిగో.

ఆంధ్రప్రదేశ్‌లో-160, తమిళనాడు-68, కర్నాటక-321, కేరళ-107, తెలంగాణ-898, మహారాష్ట్ర-2568, ఛత్తీస్‌ఘడ్-443, మధ్యప్రదేశ్-826, గుజరాత్-45, ఉత్తరప్రదేశ్-63, సిక్కిం-35, అస్సాం-21, హర్యానా-14, పంజాబ్-24, హిమాచల్‌ప్రదేశ్-32, జమ్మూకాశ్మీర్-12.

ఒకవైపు ప్రపంచమంతా అన్నంపెట్టే రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వాల హత్యలేనని గొంతెత్తుతుంటే ఇవి తమ వైఫల్యాలు కావని, వాటికి కారణాలు వేరే ఉన్నాయని, అవి మతి స్థిమితం లేనివో, ప్రేమలో విఫలం అవ్వడం వల్లనో, వ్యసనాలకు బానిసలవ్వడం చేతనో, ప్రభుత్వాలిచ్చే పరిహారాలు దండుకోవడానికనీ, ఇలాంటివే ఇంకా ఎన్నో నైతిక పతన కారణాలని నిస్సిగ్గుగా మాట్లాడుతూ రైతులను అపహాస్యం చేయడానికి విఫలయత్నం చేస్తున్నాయి కేంద్ర రాష్ట్ర పాలకవర్గాలు. ప్రజలు ఎదుర్కొంటున్న చావుబతుకుల మౌలిక సమస్యల నుండి దృష్టి మరల్చడానికి కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి పార్టీకి చెందిన ప్రధానమంత్రి మోదీ గోమాంస రాద్ధాంతం లేవదీసి గందరగోళం సృష్టిస్తున్నాడు మరోవైపు.

రైతు ఆత్మహత్యలకు కారణాలు కనుక్కోవడంలో భాగంగా దేశవ్యాప్తంగా హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు నిజనిర్ధారణలు చేసి ప్రకటించిన వివరాల ప్రకారం 85% దాకా రైతుల ఆత్మహత్యలకు కారణాలు ప్రభుత్వాల విధానాలేనని, సామ్రాజ్యవాద దేశాలకు రెడ్ కార్పెట్ పరుస్తూ దేశాన్ని దోచుకుపోవడానికి, సంపదలు కొల్లగొట్టుకు పోవడానికి యుపిఎ నుండి ఎన్‌డిఎ దాకా అన్ని ప్రభుత్వాలూ, పార్టీలూ ప్రపంచీకరణ విధానాలు అమలు చేయడమే కారణంగా తేల్చారు. కమతాలు చిన్నగా ఉండడం, వేస్తున్న పంటల మీద సరైన అవగాహన లేకపోవడం లాంటివి కూడా 5 శాతం దాకా కారణాలని తేల్చి చెప్పారు. ఈ విధంగా దేశమంతా అసహజ మరణాలకు గురైనవారు మొత్తం 1 లక్ష 31వేల 666 కాగా ఇందులో రైతుల ఆత్మహత్యలు 5,650. మొత్తం అసహజ మరణాలలో ఇవి 4.3%.

ఈ 5650 రైతు ఆత్మహత్యలలో మహిళా రైతుల వివరాలు బయటికి రావడం లేదు. ఆకాశంలో సగంగా పిలువబడుతున్న మహిళలు అన్ని రంగాల్లో కూడా పురుషులతో సమానంగానే కాకుండా మరింత అధికంగానే సమస్యలను ఎదుర్కొంటున్నట్లే వ్యవసాయంలో కూడా ముందు భాగంలో ఉంటూ ఆ రంగంలోని సంక్షోభానికి బలి అవుతున్నారు. అట్లా చూస్తే వ్యవసాయరంగ సంక్షోభానికి బలి అవుతూ 472 మంది మహిళా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పురుష రైతులు 5178 ఆత్మహత్యలు చేసుకున్న వారిలో ఉన్నారు. వయసుల వారీగా కూడా విశ్లేషిస్తే 18 సం.లోపు ఉన్నవారు 1శాతం ఉంటే, 18-30 సంవత్సరాలలోపు వాళ్ళు 23%, 30-60 మధ్య 65.7%, 60 సం.పైన 10.2% నమోదయ్యారు. దీని ప్రకారం చూస్తే 30-60 సం.ల మధ్య వయసు వాళ్ళే అత్యధికంగా 65.7% ఆత్మహత్యలకు పాల్పడినట్లు అర్థం చేసుకోవచ్చు.

పైన కనపర్చిన రైతు ఆత్మహత్యల వివరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 160 మంది రైతులు, తెలంగాణాలో 898 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు నమోదైనది. వాస్తవంగా ఈ సంఖ్య ఇంకా ఎక్కువనే ఉంటుంది. మన తెలంగాణలో రాష్ట్రం ఏర్పడిన 5 నెలల్లో జరిగిన రైతు ఆత్మహత్యలపై రైతు రాజ్య వేదిక అనే ఒక సంస్థ నిజనిర్ధారణ చేసింది. నిజానికి ఈ రైతు ఆత్మహత్యల సమస్యపై

తీవ్రంగా చలించిపోయి తమ బాధ్యతగా ఎన్నో సంస్థలు సంఘాలు రైతు కుటుంబాలను కలిసి రైతుల్ని ఇంతగా కుంగదీసే వ్యవసాయ రంగ కారణాల్ని ఎక్కడికక్కడ అధ్యయనం చేయడం ప్రారంభించాయి. మొదట్లో అవి రైతు ఆత్మహత్యలే కావని బుకాయించడానికి ప్రయత్నించిన ప్రభుత్వాలు వాటిపై రోజురోజుకూ చర్చ పెరిగిపోతుండడంతో ఆ సంఖ్యను కుదించి చెప్పడం మొదలుపెట్టాయి. అట్లా తొమ్మిది వందలపైగా తేలిన రైతు ఆత్మహత్యల సంఖ్యను తెలంగాణ ప్రభుత్వం కేవలం 79 మంది మాత్రమే ఆత్మహత్య చేసుకున్నారని అధికారికంగా ప్రకటించింది నిస్సిగ్గుగా.

ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ విధానాల ఫలితంగా, ఉత్పత్తి వ్యయాలు విపరీతంగా పెరిగిపోయి నీటివసతి లేక విత్తన, ఎరువుల, పురుగుమందుల మాయాజాలంతోడై అప్పులపాలై మార్కెట్ హింసకు గురిచేయబడి ఆదుకునే ఆదెరువులేక ప్రాణాలు తీసుకుంటూ రైతులు దీనంగా ప్రభుత్వాలవైపు చూస్తుంటే రుణమాఫీ సాధ్యంకాదని చెబుతున్న ప్రభుత్వాలు బడా పారిశ్రామికులకు లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా అప్పులిచ్చి తర్వాత ఎన్నో సాకులతో ఆ అప్పులన్నీ రద్దు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకు వివిధ పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన రూ. 34వేల కోట్ల రుణాన్ని 2013-14 సంవత్సరంలో మాఫీ చేసినట్లు డిసెంబర్ 1, 2014నాడు కేంద్రమంత్రి జయంత్‌సిన్హా రాజ్యసభకు నివేదించినది నిజంకాదా! గత సంవత్సరం మొండి బకాయిలుగా ప్రకటించిన వాటిలో ఇవి కేవలం 34 శాతం మాత్రమే. ఇంకా 66 శాతం అప్పులను ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ కూడా ఇస్తుందొక వైపు.

రాజ్యసభ సభ్యుడు కింగ్‌ఫిషర్ విమాన సంస్థ అధినేత మద్యం వ్యాపార నిషా సామ్రాజ్యాన్ని యధేచ్ఛగా పరిపాలిస్తున్న విజయ్‌మాల్యాకు ఎన్నివేల కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందజేసిందో అందరికీ తెలిసిందే. ఆస్ట్రేలియాలో గనుల తవ్వకానికి అదాని గ్రూప్‌కు ఒక బిలియన్ డాలర్ల గ్రాంట్‌ను ఎస్‌బిఐ ఇటీవలే విడుదల చేసింది. ఈ ఆరుదశాబ్దాల కాలంలో వందల సంఖ్యలో ఉన్న పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయలు ఉదారంగా ఆర్థిక సహాయ రూపంలో ప్రభుత్వం ఇస్తుంది కాని కోట్లలో ఉన్న పేద సన్నకారు రైతులకు అప్పు మాఫీ అంటే అదేదో తనకు తెలీని, అసాధ్యమైన విషయంగా నటిస్తూ ప్రజల వత్తిడి పెరుగుతుంటే నామమాత్రపు రుణమాఫీ చేసి చేతులు దులుపుక్కొని ప్రభుత్వంపై రైతు అప్పుల్ని రద్దు చేయడం మూలంగా ఇన్ని కోట్ల భారం పడిందని పతాక శీర్షికల్లో ప్రకటనలు గుప్పిస్తుంది ప్రభుత్వం. సామ్రాజ్యవాద విధానాల దాసోహంలో భాగంగా గజదొంగలుగా ఎదుగుతున్న పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ దేశాన్ని ఊడ్చిపెడుతూ రైతుల బతుకుల్లో హాహాకారాలు రేపుతూ పచ్చగా ఉండాల్సిన పల్లెసీమల్ని పోటీపడి స్మశానాలుగా మారుస్తున్నాయి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు.

తమ బతుకులు తెల్లారతాయని తెగించి పోరాడి తెలంగాణ సాధించుకుందామని కోటి ఆశలతో ఎదురుచూసిన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతు ఆత్మహత్యలే! జిల్లాల వారీగా చూస్తే వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలలో రైతుల ఆత్మహత్యలు మరీ ఎక్కువగా ఉన్నాయి. పాకాల, రామప్ప లాంటి పెద్ద పెద్ద జలాశయాలున్న వరంగల్, సప్త సముద్రాలుగా పిలువబడే శ్రీవారి సముద్రం, రంగ సముద్రం, రుద్ర సముద్రం లాంటి ఏడు అతిపెద్ద చెరువులుండీ కూడా రెండు జీవనదులు పారుతూ కూడా మహబూబ్ నగర్‌లలో రైతుల ఆత్మహత్యలంటే ఎట్లా అర్థం చేసుకోవాలే! ఇక మెదక్ అయితే కెసిఆర్ ప్రాతినిధ్య జిల్లా.. మామిడాకుల తోరణాలుగా వేలాదిమంది రైతుల వారిబిడ్డల శవాల్ని కంఠహారంగా తొడిగిన తెలంగాణ పాలనను ప్రపంచమంతా పంటికింద శోకాన్ని అదిమిపట్టి చూస్తున్నది.

దశాబ్దకాలంగా మరీ ముఖ్యంగా ఈ రెండు మూడేళ్ళలో ఆత్మహత్య జరగని రోజు లేకుండా మహబూబ్ నగర్‌జిల్లాలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. 2014 సంవత్సరంలో జిల్లాలో రికార్డైన ఆత్మహత్యలు డెబ్బై పైగా ఉంటే ఈ 2015లో 150 డిసెంబర్ వచ్చేదాకానే రికార్డ్ అయి ముగిసేనాటికి 200 దాటిపోయేట్లున్నది.

పాలమూరు అధ్యయన వేదికగా జిల్లాలోని రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు జెఎసి భాగస్వామ్య ఉద్యోగ విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి 64 మండలాలలో రైతు ఆత్మహత్యలు మరీ ఎక్కువగా జరిగిన 44 మండలాలను ఎంపిక చేసుకొని బాధిత కుటుంబాలను కలవడానికీ, పల్లెల్లో ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్న విషాదంలో చిక్కుకున్న ప్రజలను సమీకరించి రైతు ఆత్మహత్యల పరిస్థితుల్ని వారి ద్వారా విని ఆత్మహత్యలు పరిష్కారం కాదు ఇది వ్యవసాయ సంక్షోభం. ప్రభుత్వ విధానాల వైఫల్యం కారణం, అందరం కూడి ప్రభుత్వంతో పోరాడుదాం అని ఒక ధైర్యం చెప్పే ప్రయత్నం మేం చేశాం.

ఆ వివరాలు మాట్లాడుకునేకంటే ముందు పాలమూరుగా పిలువబడే మహబూబ్‌నగర్ జిల్లాను గురించి కొన్నిమాటలు.

40 లక్షల జనాభాతో సగటున 2000 జనసాంద్రతతో 1470 గ్రామాలున్న మహబూబ్‌నగర్ జిల్లా 18,432 చ.కి.మీ. విస్తీర్ణంతో 65.70% సాగుయోగ్యమైన భూమితో, 3.03 లక్షల హెక్టార్లు పరుచుకున్న అడవులతో, ఆస్‌బెస్టాస్, సిల్స్‌నాల్‌క్వాస్, బంకమన్ను, గ్రానైట్ కొల్లాపూర్ ప్రాంతంలో అరుదైన క్వార్జ్, అభ్రకము తదితర ఖనిజ సంపదను తన గర్భంలో దాచుకున్న నేల ఇది. నల్లమల మొదటి అడుగులు, టేకు, నల్లమద్దిన బట్టగడప, జిట్రేగి లాంటి విలువైన కలపనిచ్చే వృక్షసంపద, 2 వందల కిలోమీటర్లు పరివాహక ప్రాంతంగా సాగిపోయే క్రిష్ణానది దానికి ధీటుగా రైతుకూలీలకు నేనున్నానని భరోసా ఇచ్చే తుంగ భద్రానది, సముద్రాల్ని తలపించే చెరువులూ ప్రసిద్ధిగాంచిన వాగులు పాలమూరు సొంతం. (జిల్లాలో ప్రాజెక్టులు) కల్వకుర్తి (1975), భీమా(1956) కోయిల్‌సాగర్, నెట్టెంపాడు (1980), జూరాల (1956), రాజోలిబండ (1967) కాకరవాణి ప్రాజెక్టులతో నీటికి వ్యవసాయానికీ పశుసంపదకు మారుపేరుగా పాల ఉత్పత్తుల్లో ప్రఖ్యాతిగాంచినందున పాలమూరుగా నామకరణం పొందిందంటారు ఇక్కడి పెద్దలు విశ్వనాథసత్యనారాయణ ఈ పాలమూరు జిల్లా మీదుగా ప్రయాణం చేస్తుంటే వాహనంలో నిద్రపట్టిందని అది జడ్చర్లను దాటుతుండగా ఏదో మధురమైన చల్లని పంటల వాసన సోకి నిద్రలేచి విచారిస్తే "జలచర"గా జలాలకు ప్రసిద్ధి పొంది పైరు

పంటలతో విలసిల్లే నేటి జడ్చర్ల అని ఆ పంటల ప్రశాంత వాతావరణమే తనను నిద్రలేపిందని చరిత్రగా రాయబడింది ఈ జిల్లా గురించే. తుంగభద్ర, క్రిష్టానదిలో ప్రవహించే నీటిలో మన జిల్లా నీళ్ళు 25 శాతమనీ అంచనావేసిన శాస్త్రవేత్తలు నీటిని ఆపుకోకపోతే జిల్లా ఎడారిగా మారుతుందని చేసిన హెచ్చరిక నిజమైంది.

జూరాల, ఆడుకునే పిల్లలకు విమానం బొమ్మ ఇచ్చినట్లు ఈ జిల్లాకు బచావత్ కమిటి మనసు కరిగి ఇచ్చిన డ్యాం, దీన్ని జూరాల చెరువు అంటాం మేం. ఈ జూరాల, ఆర్‌డిఎస్ తదితర నీటిపారుదల వనరులన్నింటినీ కలిపితే 60 లక్షల ఎకరాలకు నీరు అందే వనరులున్నాయని ప్రభుత్వాలు చెబుతూనే ఉంటాయి. మా పొలాలకు జూరాల, ఆర్‌డిఎస్ నీళ్ళే రావడంలేదని, నమ్ముకుని వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు మొత్తుకుంటూనే ఉంటారు.

ఏడాదికేడాది క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతుంటే వేసిన పంటకు పెట్టిన పెట్టుబడులు ఎల్లక రైతులు అల్లాడుతూ అనాదిగా స్వతంత్ర దేశంలోనైతేనేమి సొంత రాష్ట్రంలోనైతేనేమి వలసలపాలై పోతూనే ఉన్నారు. అందుకే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గుర్తింపు "పాలమూర్ లేబర్". దగుల్బాజీ పాలన గ్రహణమై పట్టినందుకూ, ఒళ్ళు దాచుకోకుండా పనిచేసే తత్వం తమకే స్వంతమైనందుకు జిల్లా జనాభాలో సగందాకా వలసల్లో తరలిపోతుంటారు. బొంబాయి, సూరత్ లాంటి ఇంకా ఎన్నో మహానగరాల్లో దేశవ్యాప్త కట్టడాల్లో పారేది వీళ్ళ చెమటనే. రాయచూర్‌లాంటి చోట మన జిల్లా గ్రామాల పేరిట ప్రత్యేకమైన వీధులే ఉన్నాయి.

వందల సంవత్సరాల రాచరిక సంస్థానాధీశుల, దేశ్‌ముఖ్‌ల ఆధిపత్యం కింద, గద్వాల, జటప్రోలు, సూగూరు, గోపాలపేట, ఆత్మకూరు, అలంపూరు సంస్థానాలుగా రాచరిక భూస్వామ్య సంబంధాల సాంస్కృతిక బందనాలలో మగ్గి నిజాం నిరంకుశ పాలనలో తలపడిందీ జిల్లా.

ఎంతగా భూస్వామ్య అణచివేతలకు గురైనప్పటికీ తెలంగాణా సాయుధ పోరాటమూ, స్వాతంత్రోద్యమ ప్రభావాలకు కొంత వరకు లోనైనప్పటికీ వలసవాదానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం స్థానిక భూస్వామ్య వ్యవస్థతో తేల్చుకునే పోరాటంగా కాకుండా భూస్వామ్య వ్యవస్థతో సర్దుబాటు చేసుకొని రాజీపడే ధోరణే కొనసాగి వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్రోద్యమ నిజస్వరూపానికి దర్పణంగా నిల్చిందీ జిల్లా.

దేశ వనరుల దోపిడి నిరాటంకంగా కొనసాగించడంలో భాగంగా వలసపాలకులు గ్రామీణ ప్రాంతాల నుండి ముఖ్యంగా అడవుల నుండి సహజ వనరులను తరిలించుకుపోవడానికి రైల్వే వ్యవస్థను ప్రారంభించడం మొదలయ్యాక రైల్వేలైను నిర్మాణపు పనుల్లో నియుక్తులైన పాలమూరు కూలీలు స్వాతంత్ర ప్రకటన అనేది జరిగాక కూడా యధేచ్ఛగా తరలించుకుపోతున్న సంపదతో పాటు వలస కూలీలుగా సొంత ఊరిని వదిలి పొట్టచేత పట్టుకుని తరలిపోయారు దేశదేశాలు.

నిజానికి జిల్లాలోని అన్ని వనరులూ (జల, మానవ, భూ) జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చియుంటే జిల్లా స్వరూపమే వేరుగా వుండేది. పాలమూరు భూస్వామ్య వర్గం ఈ విషయంలో అత్యంత దుర్మార్గమైన పాత్ర నిర్వహించినందువల్ల, అభివృద్ధి తమ ఉనికిని, పెత్తనాన్ని అంతం చేస్తుందని పసిగట్టి జాగ్రత్తపడి ఎప్పుడూ ఏ చిన్న మార్పును ఆహ్వానించడంలో కాకుండా అడ్డుకోవడంలో, అణచివేయడంలో ముందున్నారు.

ఉదాహరణకు చెప్పుకోవాలంటే, జిల్లాలో భూములు ఎవరిపేరిటనైనా ఉండనీ కృష్ణానదీ జలాలు పొలాలకు దక్కించుకుందామనీ ప్రజల, పొలాల, పశుపక్షాదుల దాహార్తి తీర్చుకుందామని 80లలో విప్లవ పార్టీ పిలుపు అవగాహనలో భాగంగా ఇక్కడి గద్వాలప్రాంత ప్రజా ప్రతినిధి పాగపుల్లారెడ్డిని కలవడం జరిగింది. ప్రజలకు కూలీలైనా దొరుకుతాయి. పొలాలొద్దుగానీ పొలాలకు నీళ్ళ కోసం ప్రజా ప్రతినిధులు ముందుకు రావచ్చుకదా... అన్నప్పుడు... ఒక్కక్షణం ఆలస్యం చెయ్యకుండా "ఇప్పుడు నీళ్ళు మాత్రమే, కూలీలు మాత్రమే అని దింపి, నీళ్ళు పొలాలకిచ్చాక ఎర్ర జెండాలు పాతుదామనా?!" అని తన అభివృద్ధి వ్యతిరేక స్వభావాన్ని నగ్నంగా బయటపెట్టుకున్నాడు.

యూరప్‌లో పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్యవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి దాన్ని కూలదోస్తేనే అభివృద్ధి సాధ్యపడింది. ఫ్రెంచి విప్లవం లాంటి విప్లవం దానికి అవసరమైందన్నది ఇక్కడ గుర్తించాల్సిన విషయం.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఉత్పత్తి సంబంధాలు మౌలికంగా మారి ఉంటే ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందేవి. 1956లో రూపుదాల్చిన జూరాలా ప్రాజెక్టు 50 ఏళ్ళకు పైగా నత్తనడక నడిచి 18 టి.ఎం.సి. లకొరకని ప్రారంభించి 11.24 టి.ఎం.సి.లకే కుదించి దాన్నొక చెరువు స్థాయికి దిగజార్చారు. ప్రజల, పొలాల దాహార్తీ హాహాకారాల ముందు.

ఇలాంటి చారిత్రిక ద్రోహాల, కుట్రల పర్యవసానం ఫలితంగానే ఇవ్వాళ రైతులు ఆత్మహత్యల పాలై తనువులు చాలించుకుంటున్నారు. రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వాల హత్యలే, ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేస్తున్న రైతు వ్యతిరేక, ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద దోపిడీ అనుకూల విధానాల ఫలితం గానే ఇవ్వాళ దేశానికి అన్నంపెట్టే రైతు జీవితం సంక్షోభం పాలయ్యింది.

ఏ పంట వెయ్యాలన్న ఆలోచన దగ్గర నుండి వేయాల్సిన విత్తనం సాగు చేయాల్సిన ఎకరాలు, సాగుచేసే పద్దతి, చల్లాల్సిన ఎరువులూ వాడాల్సిన యంత్రాలు, కోత కోయాల్సిన సమయమూ, అమ్ముకోవాల్సిన పద్దతీ ఒక్కటేమిటి సేద్యం తన సంపూర్ణ జ్ఞానంతో అనుభవంతో ఆహ్లాదంగా చేసి తీసిన పంటతో ఇంటి, ఊరి అవసరాలు పోను బయటి ప్రపంచానికి కూడా పిడికెడు ముద్ద అందాలనుకుంటూ సేద్యాన్ని పవిత్ర కార్యంగా చేసిన రైతు ఇవ్వాళ ఏమీ తెలియక ఏవీ తమకర్థం కాక జనం అందరి ఆకలితీర్చే సాంప్రదాయ పంటలైన జొన్నలు, మినుములు, పెసర్లు, సజ్జలు, కొర్రలు, ఆర్కలు, ఎరువులే అవసరం లేని బుడమ, గొర్రవడ్లు వదిలేసి వాణిజ్య, పెట్టుబడిదారులకు కోట్ల లాభాలు ధన రాశులుగా కురిసే పొగాకు, పత్తి, వేరుశనగ, పొద్దుతిరుగుడు, వరి, మక్కజొన్నలు తదితర సంకర జాతి టర్మినేటర్ విషం విరజిమ్మే పురుగుపంటలు వేయాల్సిన, ప్రాణాలు కోల్పోవాల్సిన, ఆలు పిల్లలు దిక్కులేని పక్షులై పొలాలు సారం కోల్పోయి నిర్జీవమై పోయి, పల్లెలన్నీ వలస భాటపడితే అడవులూ, భూములూ వేలాది ఎకరాలు పెత్తందారీ నయా దోపిడీ కొనసాగించే దేశవిదేశీ బడా బడా

పెట్టుబడిదారుల, కార్పొరేట్ తిమింగిలాలకు ధారాదత్తం అయిపోయే విధానాలు రైతు నెత్తిన రుద్దబడుతున్నాయి.

మేం అధ్యయన వేదికగా 5 రోజులు 3, 4 వాహనాలలో 15-20 మందికి తగ్గకుండా 44 మండలాలు తిరిగి ప్రజలతో - బాధ్యత కుటుంబాలతో పంచుకున్న అనుభవాల్లోంచి ఇంతకీ ఇన్ని బాధలున్నా ప్రజలెందుకు వ్యవసాయాన్ని వదులుకోకుండా చేస్తున్నారు? వేరే వృత్తి చూసుకోవచ్చు కదా? వ్యవసాయ వృత్తి లాభంలేదు దాన్నే ఎందుకు పట్టుకువేళ్ళాడడం అన్న మాటలు ప్రజా జీవితానికి దూరంగా ఉంటూన్న తను వ్యవసాయ కుటుంబాలనుండి వచ్చిన అనుభవాలూ వాసనలు వదులుకొని సంక్షేమ పథకాల అమలుపేరిట ప్రజాధనాన్ని పాలకులు తమ బొక్కసాల్లో వేసుకోవడానికి ఆడుతున్న పార్లమెంటరీ నాటకంలో విదూషకులుగా మారి తెల్లబట్టలు, జనాన్ని నిలువునా ముంచే ఫైనాన్స్‌లు, రియల్ ఎస్టేట్‌లు, ఆరోగ్యాల పేరిట, విద్యపేరిట బహుళ వ్యాపారాలు చేస్తూ, బయటి అస్తిత్వ, కుల, మత, వృత్తి ఉద్యమాల్లోకి చొరబడి చక్రం తిప్పే స్థాయికి ఎదిగిన దళారీలు ఇలాంటి చాలా ప్రశ్నలు వేస్తున్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయం అంటే ఏమిటి? ఎందుకు అనేది కొంత మాట్లాడుకుందాం. కల్టివేషన్, వ్యవసాయం, సేద్యం, కాపుదనం, జిరాత్, ఇట్లా పలుపేర్లతో పిలువబడుతున్నది కుమ్మరి, కమ్మరి, మంగలి, దర్జీ... ల్లాగా ఇట్లా కేవలం ఒక వృత్తేనా?

కాదు వ్యవసాయం వృత్తి మాత్రమే కాదు. అది మనిషి పశువునుండి మానవుడిగా మారే క్రమంల్లో పరిణామంలో శ్రమలోంచి పొడుచుకొచ్చిన ఒక సూర్యోదయం. మిగతా జంతుజాలాలతో పశుపక్షాదులతో చెట్టు చేమలతో పాటు ప్రకృతి వొడిలో స్వేచ్ఛగా విహరిస్తూ ఆకలి దప్పుల కోసం ప్రకృతిపై ఆధారపడుతూ అడవి జీవనం సాగిస్తున్న క్రమంలో శ్రమలోంచి పుట్టుకొచ్చిన అనుభవంతో జ్ఞానంతో ఎక్కడో మొలిచిన చెట్టు దగ్గరికి వెళ్ళి ఆకలి అవసరం తీర్చుకోవడం కాకుండా లభించని కాలంలో కూడా తను అనువైనదని భావించి ఎంచుకున్నచోట దాని విత్తనాల్ని దాచి, విత్తి మొలకెత్తే ఏర్పాట్లు చేసి ఆహారం పొందిన క్రమంలో ఈ శ్రమ ఫలితంగా ఆవిష్కరింపబడింది వ్యవసాయం. అప్పటి తన, తన పరిమిత జాతి అవసరాల నిమిత్తం తన శ్రమను జోడించి చేసుకున్న ఉత్పత్తి దాన్ని స్వాధీనం చేసుకునేందుకు పుట్టుకొచ్చిన దురాలోచన, దానికి తోడైన అంగబలం పెత్తనంగా మారి అధికారంగా స్థిరపడే దశకు వేల సంవత్సరాల ప్రయాణమై సాగివచ్చిన చరిత్ర ఉన్నదీ వ్యవసాయానికి. అందువల్ల వ్యవసాయం ఒక వృత్తి కాదు, అదొక జీవన విధానం... సంస్కృతీ సౌరభం.

వ్యవసాయానికి ఏమేం కావాలి? అది దేనిమీద ఆధారపడి ఉంటుంది? భూమి మీద ఉన్న సమస్త జీవజాలానికి ఆకలి తీర్చే స్వభావం సహజంగానే కల్గియుండే వ్యవసాయం దాన్ని సాగుచేసే రైతుల ప్రాణాలే ఎందుకు తీస్తున్నది అన్న విషయాలు ఇప్పుడు చర్చిద్దాం.

వ్యవసాయానికి ప్రప్రథమంగా కావాల్సింది భూమి. ఈ భూమిని సేద్యానికి అనువుగా చేసుకోవాలి. ఆ తరువాత ఏకాపు కోరితే దాని విత్తనం లేదా మొలక కావాలి. మనం చదును చేసుకున్న మడిలో అది విత్తబడాలి. అందుకు నీరు కావాలి. నీటితో పదును బార్చిన మడిలో విత్తనాలో, మొక్కలో నాటి దాని రక్షణ కోసం కంచె కూర్చాలి. ఆ మడివెంట వుండి దాని ఆకలి దప్పులు తీర్చాలి. భూతల్లి గర్భంలోంచి వేర్లు అందించిన బలం ఆకై పూతై పంట చేతికొస్తుంది. ఈ పంట కోసం శ్రమను ధారపోసినోళ్ళందరికీ అది హక్కుగా దక్కి వాళ్ళ ఆకలీ, అవసరమూ తీర్చాలి. ఇది తొలిదశ. భూమి ఏ ఒక్కరిదో కాకుండా అందరిదీ అయిన దశలోని తొలి ఉత్పత్తి ఇది.

ఈ దశలో అపరిష్కృత స్థాయిలో ఘర్షణలు లేవు. అది రైతు హాయిగా బతికిన కాలం. ఇవ్వాళ భూమిపై హక్కు ఎవరిదో అయి ఉంటుంది. విత్తనాలు మన పంటల్లోంచే ఏరి తీసిపెట్టుకునే దశ ఎప్పుడో వెళ్ళిపోయింది. పాకెట్లుగా విత్తనాలు ధరల సంకెళ్ళలో ఉన్న కాలమిది. అవి వేయడానికి నీరు అది కూడా పరాయిదైపోయిందిప్పుడు. నదులు తరలించుకుపోబడుతున్నాయి. భూగర్భజలం డబ్బున్న మారాజుల అదుపాజ్ఞలలో, అటునుంచి 5,6 వందల మీటర్ల, కరెంటు మోటార్లకు కూడా అందనంత లోతుకు తరుమబడ్డది.

ఏవేళ కావేళ గొంతు తడవక వాడుపట్టే మొలకలు, సారంలేని భూమికి వేలాది రూపాయల కృత్రిమ ఎరువుల అవసరం, అట్లో ఇట్లో లేచినిలిచిన పేనంతా పురుగుమందల దాడి, దాన్ని తరిమే పురుగుమందు, దానికోసం రైతు బతుకు కంపెనీల ఆర్గనైజర్ల పాదాల కింద తాకట్టు, ఇన్ని సుడుల్లోంచి, కుదుపుల్లోంచి కళ్ళుతెరిచినా కల్లంలో రాలనని మొరాయించిన ధాన్యం, దాన్ని ఎగరేసి రైతు ఆశల పంటను తన్నుకు పోవడానికి డేగ రెక్కలతో కాచుకు చూస్తున్న మార్కెట్ తోడేలు... ఇది అంతులేని జూదం. సేద్యం ఇక్కడ కనికట్టు. ఇప్పుడు దాన్ని వెలకట్టు.

చేసిన అప్పులు, పిల్లల రోగాలూ, రొప్పులూ, సదువులూ, నోరు తెరుచుకున్న విత్తన ఆర్గనైజర్లూ, కోరలు పదునెక్కిస్తూ సావుకార్లూ, చిట్టచివరికి సేద్యం నుంచి బహిష్కృతమై మార్కెట్ కూలీలైనా, సేట్ల సేతిలో వసిముట్లైనా దబాయింపుల హమాలీ చేతివాటం "నూరొచ్చెకాడ పదన్నారాక పాయె", ఏం మొఖం బెట్టుకొని ఇంటికి పోవాలె!

"సావొద్దంటరు ఎట్లబతకాలె?"

ఇదీ ఇవ్వాళ ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతు వేస్తున్న మౌలికప్రశ్న.

ఇక్కడ వ్యవసాయరంగంలో ఇన్‌పుట్స్‌గా వాడే ఉత్పత్తి కారకాల వాస్తవస్థితి మరికొంత వివరంగా మాట్లాడుకుందాం...

1. భూమి : పైన చెప్పుకున్నట్లు భూమి, వ్యవసాయంలో అత్యంత ఆవశ్యకమైన ప్రాథమిక కారకం. స్వాతంత్రానికి పూర్వం మరియు ఆ తరువాత కూడా భూమి భూస్వాముల చేతిలో ఉండేది సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం, భూదానోద్యమాల ప్రచారం ఫలితంగా ఈ జిల్లాలో కూడా భూ గరిష్ట పరిమితి చట్టం కళ్ళు కప్పడానికి ఎంతో కొంత భూమి లేని రైతుల చేతికి మారింది. స్వాతంత్ర్య పోరాట కాలంలో సాయుధరైతాంగ పోరాటం దున్నేవానికే భూమి "నినాదంతో ఉద్యమం ఊపందుకున్నది. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఇదే నినాదాన్ని ముందు పెట్టి ఉద్యమ విరమణ తర్వాత ఎన్నికల రాజకీయాల్లోకి దిగబడి పోరాడి భూమి సాధించుకుందాం మాకు ఓటేయండని వామపక్ష పార్టీ అంటే ఉద్యమ సందర్భంలో పొందిన భూమి తరువాత్తరువాత పేద రైతుల

చేతుల్లోంచి భూస్వాముల ఖబ్జాల్లోకి వెళ్ళడం ప్రారంభమవుతుంటే ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ తమను గెలిపిస్తే పోరాడాల్సిన అవసరమే లేకుండా, రక్తపాతం అస్సలు లేకుండా దున్నే వాళ్ళందరికీ భూమి ఉచితంగా మేమే ఇస్తాం అని సోషలిస్టు ముసుగులోంచి దుర్నీతితో రైతుల్ని గందరగోళపరిచే నినాదం ఇస్తాడు నెహ్రూ ఈ సందర్భంగానైన ఈ కుట్రను మాటాడుకోకపోతే నేరం చేసినట్లే!

రైతు ఆత్మహత్యలకు భూమి లేకపోవడం ప్రధాన కారణంగా మా గుర్తింపుకొచ్చింది. ఒకటి అర ఎకరాలు భూమి ఉండి అది సరిపోక మరో 3, 4 ఎకరాలు కౌలుకు తీసుకుని సేద్యం చేస్తే గిట్టుబాటవుతుందని భావించిన రైతులు కౌలు కట్టలేక ప్రైవేట్ పంట అప్పులు పెరిగిపోయి పురుగుల మందు సీసానో, ఉరితాడో అందుకున్నారు. భూములు కలిగి యుండడాన్ని బట్టి రైతుల్ని 4 కేటగిరీలుగా చేయవచ్చు.

1. మార్జినల్ ఫార్మర్స్ - ఒక హెక్టారుకన్నా తక్కువ భూమి గలవాళ్ళు.
2. స్మాల్ ఫార్మర్స్ 1-2 ఎకరాల మధ్య భూమిగలవాళ్ళు (హెక్టారు కన్నా తక్కువ)
3. మీడియం ఫార్మర్స్ 2-10 హెక్టార్లు గలవాళ్ళు
4. లార్జ్ ఫార్మర్స్ 10 కన్నా ఎక్కువ హెక్టార్లున్నవాళ్ళు

మొదటి రెండు కేటగిరీలకు చెందిన పావు-అర హెక్టారు నుండి 2 హెక్టార్ల మధ్య భూమి ఉన్న రైతులే (27.9% + 44.5%) మొత్తం 72.4% ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ దశాబ్దంలో ఆకర్షణీయమైన స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) పేరిట ఊర్లకు ఊర్లే ప్రభుత్వాల, నాయకుల, జిల్లా ఉన్నతాధికారుల బ్రోకరిజంతో బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం అయిపోయాయి. సెజ్‌లంటే దేశంలోనే దేశీయ చట్టాలకు అనుమతిలేని విదేశీ భూ భాగాలన్నమాట. రైతులంతా మాయమాటల భ్రమల్లో పచ్చని పంటలు పండే తమ పొలాల్ని కోల్పోయి తమ పొలాల్లోనే దినసరి కూలీలుగా దిగజార్చబడ్డారు. పోలేపల్లి నుండి విశాఖ పట్నం దాకా అంతటా స్పెషల్ ఎకనామిక్ జోన్‌గాను, కోస్టల్ కారిడార్‌గాను పేరు ఏదైతేనేం భూ దురాక్రమణకు నిదర్శనలే. దీనికి ఉదాహరణగా పదమూడు వందల ఎకరాల భూమి కోల్పోయిన జడ్చెర్ల పోలేపల్లి, ముదిరెడ్డిపల్లి, గుడ్లగండ తాండాల్ని చూపవచ్చు. ఆ భూముల్లో బహుళజాతి బంట్లుగా అరవిందో,సెల్యూలోజ్, కార్తికేయ, నీతో, హెట్రోడ్రగ్స్, చైనా లెదర్, సింగపూర్ ఫెదర్ ఫ్యాక్టరీలు బుసలు కొట్టడం ప్రారంభించాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారం వెలగబెడుతున్న నాయకుల కనుసన్నలలో ఆనాడు జరిగిపోయిన తంతు ఇది. తెలంగాణ రాష్ట్ర అధికార ఫత్వా చేజిక్కించుకున్నాంక ఇప్పుడు ఏకంగా అనధికారంగా ఆక్రమణకు గురైన వందలవేల ఎకరాల భూముల్ని శాశ్వతంగా వశపర్చడానికి తెలంగాణ ప్రభుత్వం రెగ్యులరైజేషన్ జీవోలే విడుదల చేసింది.

## 2. విత్తనాలు :

గతంలో వ్యవసాయమంతా రైతు కళ్ళముందే జరిగేది. అన్నీ అర్థమయ్యేది. పంటకు కావాల్సిన విత్తనాలు ఇంట్లోనే అందుబాటులో ఉండేవి. పండిన పంటలోంచో తోటి రైతుల దగ్గర చేబదులుగానో కాకపోతే చాటుకు చాట 'నాగు' గానో తెచ్చుకునే వాళ్ళు. విత్తనాల నాణ్యతా తెలిసివచ్చేది. శ్రీశైలం జలాశయం నిర్మాణంలో లక్ష ఎకరాల రేగడి భూమిని కోల్పోయి 67 గ్రామాలు ముంపుకు గురై ఎలాంటి ఉపాధి భద్రత, తగిన నష్ట పరిహారం అందక తమ జీవితాల్ని త్యాగం చేసి 30, 40 ఏళ్ళుగా ఇస్తామన్న కొలువుల కోసం లాఠీ దెబ్బలు సైతం తిని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో గద్దెనెక్కిన పార్టీ విద్రోహాలకు భంగపడి వలస పక్షులై చెట్టుకొకరుగా తరలిపోయి తనువులు చాలిస్తున్న దైన్యం కళ్ళముందు కదలాడుతూనే ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇక్కడి రైతులు త్యాగం చేసి విలపిస్తుంటే ప్రాజెక్టు నిర్మాణంతో తరలించుకుపోయిన అక్రమ నీటితో పెరిగిన ఉత్పత్తులతో వాటి మిగులు విలువను విత్తనోత్పత్తి పురుగుల, ఎరువుల మందుల వ్యాపారంలో పెట్టి, నేల సారాన్నీ రైతు సత్తువనూ ఏకకాలంలో కొల్లగొట్టి శాస్త్రవేత్తలకే అంతుపట్టని భయంకర రోగాలల్లో అప్పుల్లో ముంచి ఇక్కడి రైతుల్ని శవాలుగా మార్చుతున్నారు.

ఇట్లా మిగులు దోపిడీ విలువ వ్యవసాయరంగంలో అమానవీయ వ్యాపారీకరణ - కార్పోరేటీకరణకు దారులు వేసింది. విత్తనాలు ప్రతిసారీ పాకెట్లుగానే కొనాలి. వేలాది రూపాయలు పెడితేగానీ ఒక్క పాకెట్ విత్తనం రాని పరిస్థితి ఏర్పడింది. అన్ని వంగడాలకు సంబంధించి టర్మినేటర్ విత్తనాలతో కంపెనీలు దోపిడీకి దిగితే ప్రభుత్వాధినేతలు పర్సంటేజీలకు అమ్ముడై ఏజెంట్లతో విచ్చలవిడిగా విత్తనాలు అమించగలిగే వృత్తిగా, అప్పుగా అందించి తోలు తీసి మరీ వసూలు చేసే మాఫియా నెట్‌వర్క్‌ను విస్తరించుకున్నాయి. ఈ విత్తన సాలెగూట్లో రైతు చిన్న పురుగులా చిక్కుకుని అల్లాడుతున్నాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పుడు వ్యవసాయరంగంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఆంగ్లేయుల పాలన నాటికన్నా ఘోరమైన దోపిడి జరుగుతున్నది. విత్తనాలు, పనిముట్లు తదితర కారకాల విషయంలో బహుళ జాతి కంపెనీల జోక్యం మితిమీరిపోతున్నది ఒకటేమిటి ప్రభుత్వ యంత్రాంగమంతా కంపెనీల ఆదేశాలతో నడిచే దౌర్భాగ్యం వచ్చింది.

అమెరికా కనుసన్నలలో ఈ విత్తన వ్యాపారమూ కల్తీ జోరుగా సాగిపోతున్నాయి. మోన్‌శాంటో, మహికో తదితర కంపెనీలు మన దేశ రైతాంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. విషపూరితమైన టర్మినేటర్ విత్తనాల్ని విచ్చలవిడిగా అమ్మకానికి పెట్టాయి. అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్‌లోని 7 జిల్లాలలో టర్మినేటర్ విత్తనాల సాగు జరుగుతున్న విషయం కర్నాటక రైతు సంఘం చొరవతో మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లిలో కూడా సాగవడాన్ని గుర్తించిన రైతులు పంటకు నిప్పు పెట్టారు కూడా. మోన్‌శాంటో బోల్‌గార్డ్ పత్తి విత్తనమది. వేరుశనగలో పచ్చపురుగుకు కంట్రోల్ చేయడానికని ప్రయోగానికి మాత్రమే (గ్లాస్‌ల్యాబ్‌లో) అనుమతి పొంది పర్యావరణానికీ, తోటి పంటలకూ, పండిన నేలకూ భయంకరమైన క్యాన్సర్ అంటించే రోగాల్ని వాసన ద్వారా, పైరు మీంచి వీచే గాలి ద్వారా, చెట్ల ఆకుల ద్వారా వ్యాప్తిచేసే ఇలాంటి ప్రయోగాలకు మన చట్ట సభలు కూడా బుకాయింపు అనుమతులు ఇవ్వడానికి దిగజారితే ఇక రైతుకు రక్షణ ఏముంటుంది.

హైబ్రిడ్ విత్తనాల్లాంటివే టెర్మినేటర్ విత్తనాలని ప్రచారానికి దిగిన యలమంచిలి శివాజీ లాంటోల్లు వెనకేసుకురావడం పత్తి, పొగాకు వంటి వాణిజ్య పంటలేస్తే ఏమైతదని వకాల్తా పుచ్చుకోవడమంటే గాలి

సోకితే కూడా విషం చిమ్మే టర్మినేటర్ విత్తనాల్ని అమ్మడానికి తోడ్పడినందువల్ల ఎవరెవరికి ఎంతెంతటి ప్రయోజనాలు, సూట్‌కేసులూ ఆఫర్లున్నాయో అర్థం చేసుకోవచ్చు.

బహుళ జాతి ఈ టర్మినేటర్ విత్తనాల ప్రభావం మన దేశ వ్యవసాయ రంగాన్నే కాదు మనదేశ సార్వభౌమత్వాన్నీ కూడా దెబ్బ తీస్తున్నది.

మహికో, మోన్‌శాంటోలాంటి బహుళజాతి విత్తన కంపెనీల టర్నోవర్ 35000 కోట్లు అంటే మనదేశ బడ్జెట్ కన్నా ఎక్కువన్నమాట. ఇలాంటి కంపెనీలు మన పార్లమెంటు అసెంబ్లీల్నీ, ప్రభుత్వాల్నీ నోట్ల కట్టల్ని లాలీపాప్‌లుగా అందిస్తూ లోబర్చుకోవడం ఎంత సులభమో!

డంకెల్ డ్రాఫ్ట్ మీద సంతకాలు చేసి సరళీకరణ విధానాలకు పాల్పడుతూ ప్రభుత్వరంగాన్ని ప్రయివేటు సంస్థలకు అమ్మి విదేశీ పెట్టుబడుల రక్షణ, వారిమీద ఈగవాలని భద్రత చర్యలతో ప్రపంచ బ్యాంకు ముందు సాగిలబడి అన్ని కండీషన్లు ఒప్పుకొని తెచ్చుకుంటున్న అప్పులు దండుకుంటున్న ఈ పార్టీలు ప్రభుత్వాలు రైతుల్ని చంపుతున్నాయంటే నిజంకాదా!?

### 3. పెట్టుబడి - అప్పులు - బ్యాంకు రుణాలు - మాఫీ

వ్యవసాయం కోసం రైతు దగ్గర పెట్టుబడి మిగలని దైన్యం వెంటాడుతున్నది. ఏదో పరకో ఉంటే ఏమిటికీసాలదు, ప్రభుత్వ బ్యాంకులు రుణాలిస్తాయని తిరిగితే సవాలక్ష కారణాలతో కండీషన్లు పెట్టి తిప్పి తిప్పి పొలం తక్కువుందని, కౌలు రైతు నీకెట్లా లోను అని, పొలాల్లో పనిచేసుకోవాల్సిన రైతుల విలువైన కాలాన్ని వృథా చేసి ధనిక రైతులకే ఏజెంట్ల ద్వారానే అప్పులు అందే పరిస్థితి వల్ల ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్ళక తప్పని పరిస్థితి రైతుకు కల్పించబడుతున్నది. పంటచేతికి రాక, ఏడాదికేడాది పెరిగే వడ్డీ రైతుల్ని ఆత్మహత్యలకు బలిచేస్తున్నది. నిరుపేద రైతులకు అప్పులు రద్దని నాయకులు అంటుంటే మరోవైపు బ్యాంకులు ఆదేశాలు లేవని కట్టి తీరాల్సిందేనని హుకూంలు జారీచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇదంతా ప్రభుత్వమూ బ్యాంకులూ కలసి ఆడుతున్న నాటకమని రైతు ఎప్పుడో గ్రహించాడు. కోటాను కోట్ల అప్పుల్ని తీసుకుని ఎగ్గొట్టే బడా పారిశ్రామికుల అప్పులు గౌరవప్రదంగా సకల లాంఛనాలతో రద్దు చేస్తున్న ప్రభుత్వాలు రైతులపై యుద్ధం ప్రకటించాయి.

### 4. నీరు

తెలంగాణలోని అన్ని జిల్లాలాగే పాలమూరు జిల్లాలో వ్యవసాయం ప్రధానంగా నీటి వసతి లభ్యతపై ఆధారపడి సాగే మెట్ట సేద్యం. అన్నీ ఎర్రమట్టి నేలలు. ఒకే ఒక్క ఆధారం వర్షం. గత 40 సంవత్సరాలుగా చూస్తే వర్షాలు ఎలా కుంచించుకు పోతున్నాయో అర్థమౌతుంది. జిల్లాలో సగటు వర్షపాతం ఎన్నడూ 60 మి.మి. మించలేదు.

జిల్లాలో అత్యంత దుర్భిక్ష ప్రాంతంగా సమీప భవిష్యత్తులో దేశంలోనే ఎడారిగా మారే లక్షణాలున్న ప్రాంతంగా 1985-86 లలో ఉపగ్రహం గుర్తించిన ప్రాంతం మన పాలమూరులోని గట్టు మండల ప్రాంతం కావడం, అదీ రెండు నదుల మధ్య నడిగడ్డగా ప్రసిద్ధిగాంచిన గట్టు మండల ప్రాంతం కావడం ఇక్కడి కరువుకు దుర్భిక్షానికి నిలువెత్తు నిదర్శనం.

వేసిన పంట కట్టిన తడితో దూపదీరక అల్లాడుతుంటే కన్నతల్లివోలే కలత చెందిన రైతన్న అప్పుచేసి అయినా ఈ పంట బిడ్డను కాపాడుకుందామని బోరు వేయ సంకల్పిస్తాడు. ఒక్క బోరుకు ఒక లక్ష పైగా ఖర్చుచేసి నీరు సాలక, అసలే పడక 1, 2, 3, 4 దాకా బోర్లు వేసి చూసి అప్పులతో కుదేలైపోతున్నాడు రైతు.

### 5. ఎరువులు - పురుగు మందులు

విత్తనాలు ఎలా బహుళజాతి బంధిఖానాలో చిక్కి రైతు ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయో, వేసిన విత్తనం ఎదగడానికి, ఏడాదికేడాది పొలం సారాన్ని దిగమింగే బహుళజాతి విష ప్రభావాల ధాటికి నిస్సారమైపోతున్న పొలానికి కొత్త బలం కోసం మళ్ళీ బహుళజాతి సంస్థల ఎరువుల్ని కొని వాడి వీటన్నింటి మూలంగా పంట ఎదగక ఒక చింత, ఎదిగి నిండా పురుగు పట్టి మరో ఆ పురుగును చంపడానికి పెస్టిసైడ్‌ల కొరకు అప్పులు. ఈ మాయాజాలం అర్థం కాక పురుగు మందు మింగి గుడ్లుతేలేస్తున్నాడు రైతు.

ఇన్ని దాడుల నుండి పంటను రక్షించుకొని చేతికొచ్చింది గంజ్ మార్కెట్‌కు తీసుకుపోతే గిట్టుబాటు ధర ఉండదు. 1 పాకెట్ విత్తనం మొక్కజొన్న 1400 కొనితెస్తే ఇన్ని తిప్పలు పడి పండిచ్చి మార్కెట్‌కు అమ్మకానికి తెస్తే 1 క్వింటాలుకు 1200 రూపాయలు రేటు. ఇదే ఎక్కువ అని సావుకార్లందరూ కూడబలుక్కొని అంటుంటే ఎకరాకు 2 లక్షలు ఖర్చు చొప్పున 4 ఎకరాలకు 8 లక్షలు ఖర్చు చేస్తే పంట అమ్మితే లక్షన్నర కూడా రాకపోతే ఎవరికి కట్టేది ఇంటికి ఏ ముఖం పెట్టుకుపోయేది అని అచ్చంపేట గంజ్‌లో ఆక్రోశంతో రోధించిన బిచ్చాలు నన్ను నిద్రపట్టని రాత్రులకు గురిచేశాడు. ఇవ్వాళ రైతు బిచ్చాలు కాని బాగమ్మ లక్ష్మక్క గానీ ముద్దాయిలు గాదు. నేరస్థులు అంతకన్నా కాదు. ప్రభుత్వాలు సామ్రాజ్యవాద ఏజంట్లై తాము ప్రయోజనాలు కాపాడుతామని, రక్షణ కల్పిస్తామని ఏ రైతులకు, కూలీలకు రాజ్యాంగాలపై ప్రమాణం చేసి హామీ ఇచ్చారో అవి మరచి రైతుకూలీల్నీ, ఈ దేశ ప్రజానీకాన్నీ అంతం చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తుంటే అధైర్యపడి ఆత్మహత్యలు వద్దు సంఘటితమై పోరాడుదాం అదిగో అక్కడ జనతన సర్కార్‌లలో పరిష్కారముందని చెప్పదల్చుకున్నాను నిస్సంకోచంగా.

నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా రైతు కూలి పోరాటాల్ని నిర్మించుకుని వ్యవసాయిక విప్లవం విజయవంతం చేసుకోవడం ద్వారా మాత్రమే రైతుల జీవితాల్ని కబళించిన ఈ సంక్షోభాలన్నింటి నుండి రైతుకు నిజమైన రక్షణ సాధ్యమవుతుంది.

ప్రత్యామ్నాయ విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్, బ్యాంకింగ్ తదితర రంగాలుగా దశాబ్ద కాలంగా ముప్పైటదాడుల మధ్య ఊపిరి పోసుకొని శాఖోపశాఖలుగా విస్తరించి జనతన సర్కార్లుగా ఎదలు తీసి ఎదుగుతున్న ఒక నూతన సమాజం ఆవిష్కృతమైంది దండకారణ్యంలో! అక్కడ సాగళ్ళు అదృశ్యం కాకుండా తుపాకి చేతపట్టి వ్యవసాయం చేస్తున్నారు అడవి బిడ్డలు.

ఇక్కడ అవి మన దగ్గర లేవు కాబట్టి నాగళ్ళు అదృశ్యం అవుతున్నాయి.

# రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు - అగ్రకులతత్వం

సి.కాశీం

1990లో నేను మహబూబ్‌నగర్ జిల్లా లింగాల మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. చాలా నియమ నిబంధనలతో చదువు చెప్పేవాళ్లు. పాఠశాల దాటి బయటికి వెళ్లే అవకాశం దొరికితే మాకొక సంబరం. అట్లాంటి సమయంలో రాడికల్ విద్యార్థులు ఒక రోజు మా పాఠశాలకు వచ్చారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి మమ్మల్ని బయటికి తీసుకెళ్లారు. రోడ్ల మీద ర్యాలీ చేయించారు. అన్ని పాఠశాలల విద్యార్థులను కలిపి ర్యాలీ చేయించటం గొప్ప అనుభూతిని ఇచ్చింది. అంతేకాదు, మేమిచ్చిన నినాదాలు మాలో నూతన ఉత్తేజాన్ని ఇచ్చాయి.

'మండల్ కమీషన్‌ను అమలు చేయాలి'

'అవకాశాలకు అడ్డొస్తే అడ్డంగా నరికేస్తాం'

'ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యత వర్థిల్లాలి'

టీనేజ్‌లో ఈ నినాదాలు కొత్తగా అనిపించాయి. విషయం అర్థం కాకపోయినా ఏదో తెలియని అలజడి. రోడ్ మీదికి వచ్చి నినాదాలు ఇవ్వటం మొదటి సారి. ఈ నినాదాలు - రాజకీయాలు అర్థంకావటానికి ఇంకో ఐదేళ్లు పట్టింది. కాని ఆ రోజు మేము రోడ్ మీద నినాదాలు ఇస్తూ ర్యాలీగా సాగుతుంటే అగ్రకులాల పిల్లలు మాత్రం అరుగుల మీద నిలబడి మావైపు కోపంగా చూసారు. ఎందుకో, ఆరోజు అర్థం కాలేదు. కాలేజీ చదువుల్లోకి వచ్చాక ఆనాటి వాళ్ల కోపానికి కారణం తెలిసొచ్చింది. వివిధ సందర్భాలలో అగ్రకుల అధ్యాపకులు, విద్యార్థులు 'కోటా' గాళ్లని మాట్లాడుతున్నప్పుడు అనుభవంలోకి వచ్చింది.

మండల్ కమీషన్ కాలంలో వచ్చినంత తీవ్రంగా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు ఈ పాతిక సంవత్సరాలలో రాలేదు గాని, అంతకంటే బలంగా రిజర్వేషన్ విధానాన్ని నీరుగార్చే కుట్రలు ఉధృతమయ్యాయి. వివిధ రూపాలలో మొన్నటి హార్థిక్ పటేల్ (గుజరాత్) వరకు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. మన చుట్టూ ఉండే ప్రజాస్వామిక వాదులలో కూడా వ్యతిరేక భావనలు అప్పుడప్పుడు బయటపడుతున్నాయి. రిజర్వేషన్ అనుభవించే కులాలలో కూడా తమ కింది కులానికి వాటా దక్కాలనే డిమాండ్ వచ్చినప్పుడు అట్లాంటి వ్యతిరేక ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇది కూడా అగ్రకుల స్వభావం నుంచి వచ్చిన భావజాలమే. వీటన్నింటిని అర్థం చేసుకోవటానికే విరసం తన 25వ రాష్ట్ర మహాసభలలో ఒక పాఠంగా ఈ విషయాన్ని ఎంచుకున్నది. పాలకులు ప్రజలను మతం పేరుతో, కులం పేరుతో విభజిస్తూ పోరాడే ప్రజల మధ్య ఐక్యతను దెబ్బ తీస్తున్నారు. సంక్షేమ పథకాల చుట్టూ ప్రజలను ఎంగేజ్ చేస్తూ తమ దోపిడి విధానాలను కొనసాగిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా, బంగారు తెలంగాణ, స్వర్ణాంధ్ర నినాదాలతో పేద, మధ్య తరగతి ప్రజలలో భ్రమలు కల్పిస్తున్నారు. యజ్ఞాలు, యాగాలు, యోగాల విషవలయంలో యువతను నిమగ్నం చేస్తున్నారు. వినాయకచవితి, దేవి నవరాత్రులు, అయ్యప్ప, ఆంజనేయస్వామి మాలలు ధరించటం మొదలైన భక్తి కార్యక్రమాలలో నిరుద్యోగులను ముంచుతూ సామాజిక సమస్యల మూలాలను అర్థం చేసుకోకుండా చేస్తున్నారు. యువజనసంఘాలు, అభిమాన సంఘాల ఏర్పాటు, క్రికెట్ లాంటి క్రీడల నిర్వహణ చుట్టే యువతను తిప్పుతూ నిరుద్యోగం గురించి అడగకుండా, పోరాడకుండా చేస్తున్నారు. భారతజాతి అనే భావన వైపు, రామజన్మభూమి వైపు ప్రజల ఆలోచనలను మల్లిస్తూ పాలకులకు వ్యతిరేకమైన ఆందోళనలు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రజల మధ్య వైరుధ్యాన్ని సృష్టించి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. హార్థిక్ పటేల్ నిర్వహించిన ప్రతిఘాతక ఆందోళన కూడా ఈ కోవలోకే వస్తుంది.

సైద్ధాంతికంగా చూసినప్పుడు పాలకులు వ్యవహరించే ఈ తీరంతా మంద్రస్థాయి యుద్ధంలో భాగమే. యుద్ధం ఆర్థిక, రాజకీయ, మానసిక యుద్ధాలుగా ఉంటుంది. ప్రజల పోరాట పటిమను దెబ్బతీయటానికి పాలకులు నిరంతరం ఇట్లాంటి ప్రతిఘాతక విధానాలకు, ఆందోళనలకు పురుడు పోస్తుంటారు. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు కూడా మంద్రస్థాయి యుద్ధంలో భాగమే. రక్తంబొట్టు చిందకుండా మనిషి విధ్వంసం కావడం ఈ కాలపు యుద్ధనీతి. అట్లాంటి మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో నిలబడి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలలో ఉండే అగ్రకులతత్వాన్ని మాట్లాడుకోవటం సముచితంగా ఉంటుంది.

ఈ వ్యాసంలో 'ఆందోళన' అనే పదాన్ని నెగిటివ్ అర్థంలోనే వాడుతున్నాను. నిజానికి పాలకవర్గాల విధానాలకు, అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలు చేసేది పాజిటివ్ అర్థంలో ఆందోళన అవుతుంది. కాని ప్రజలకు వ్యతిరేకంగా జరిగేది ప్రతిఘాతక ఆందోళన అవుతుంది. కనుక ఈ అర్థంలోనే ఆందోళన అనే పదాన్ని ఈ వ్యాసంలో ప్రయోగిస్తున్నాను. ఈ వ్యాసాన్ని అధ్యయన సౌలభ్యం కోసం ఈ క్రింది విధంగా విభజిస్తున్నాను.

1. రిజర్వేషన్ భావన పుట్టుక
2. రిజర్వేషన్ చరిత్ర
3. రిజర్వేషన్లు ఎందుకు
4. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు
5. అగ్రకుల అహంకారం

## 1. రిజర్వేషన్ భావన పుట్టుక:

'రిజర్వేషన్' అనే పదానికి ప్రత్యేక వసతులు కల్పించుట అని అర్థముంది. భారత సమాజంలో వేల సంవత్సరాలుగా కొనసాగిన అసమానతల వలన అణచివేతకు గురైన కొన్ని కులాలకు సమాజంలో కొన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. బ్రిటిష్ పరిపాలన కాలంలోనే ఈ భావన పుట్టింది. ఈ భావన పుట్టటానికి అలౌకిక

కారణాలేమిలేవు. లౌకిక కారణాలే మూలమయ్యాయి. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదివాసులు, రైతులు, సంస్థానాదీశులు, సన్యాసులు, దళితులు, ముస్లింలు, అనేక తిరుగుబాట్లు చేసారు. విడివిడిగా జరిగిన ఈ తిరుగుబాట్లు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అస్థిర పర్చాయి. సువిశాలమైన భారతావనిలో ఈ నిరసనలను అణచివేయటం బ్రిటీష్ వాడికి సాధ్యంకాలేదు. ముఖ్యంగా ఆ అన్ని తిరుగుబాట్ల గుణాత్మకమైన వ్యక్తీకరణ 1857 తిరుగుబాటు. నిజానికి ఇది చరిత్రలో సిపాయిల తిరుగుబాటుగా నమోదైనా, అన్ని వర్గాల, కులాల ప్రజలు ఇందులో పాల్గొన్నారు. కనుక ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకురావాలని భావించింది. ముఖ్యంగా తిరుగుబాటులో ఎక్కువ సంఖ్యలో పాల్గొన్న ప్రజలు దళితులు, వెనుకబడిన కులాలు, ఆదివాసులు. ఈ మూడు వర్గాల ప్రజలను మచ్చిక చేసుకోవాలని, అందుకు కొన్ని వసతులు, రాయితీలు వారికి కల్పించాలనే ఆలోచన బ్రిటిష్ పార్లమెంట్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి దూరంగా భాగస్వామ్యం లేకుండా ఉంటున్న ప్రజలను భాగం చేసుకోవడానికి ఉన్న అడ్డంకులను పరిశీలించింది.

ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వ ఉద్యోగులలో అగ్రవర్ణాలే ఉన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులు, ఇంగ్లీష్ విద్య అందటం వలన అప్పటికే విద్య నేర్చుకొని ఉండిన బ్రాహ్మణులు వెంటనే ప్రభుత్వంలో దొరికిన అవకాశాలను అంది పుచ్చుకున్నారు. విద్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలను తమ చేతుల్లో పెట్టుకున్నారు. 1851 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని ప్రభుత్వం ఒక పరిశీలన చేసింది. వివిధ కులాల అక్షరాస్యత, ఉద్యోగ వివరాలు, సామాజిక స్థితిగతులు, జీవన పరిస్థితులు మొదలైన విషయాలను ప్రాతిపదికగా తీసుకొని సర్వే నిర్వహించారు. దీని ఆధారంగా ఒక రిపోర్టును తయారు చేసారు. ఈ రిపోర్టు ఆశ్చర్యకరమైన విషయాలను వెల్లడించింది. దేశంలో వివిధ సంస్థానాలలో, నేరుగా బ్రిటీష్ వారి ఆధీనంలో ఉన్న ప్రాంతాలలో బ్రాహ్మణేతర కులాలకు విద్య, ఉద్యోగాలలో కనీస ప్రాతినిధ్యం లేని విషయం బయట పడింది. ఈ విషయాన్ని బ్రిటీష్ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బ్రాహ్మణేతరకులాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లేక పోవటం వలన బ్రిటీష్ ప్రభుత్వంపై వారికి వ్యతిరేకత పెరిగింది. ఫలితంగా 1857లో జరిగిన తిరుగుబాటులో ఈ కులాలన్ని భాగమయ్యాయని జాన్ విల్సన్ అనే బ్రిటీష్ అధికారి ప్రభుత్వానికి తెలియ జేసాడు. కనుక బ్రాహ్మణేతర కులాలకు విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన సూచించాడు. దాని కోసం ఆకులాలకు ప్రత్యేక వసతులు కల్పించాలనే ఆలోచన వచ్చింది. అట్లా భారతదేశంలో రిజర్వేషన్ అనే భావన పుట్టింది. ఈ భావనకు బ్రిటీష్ అధికారులే మూలమయ్యారు.

## రిజర్వేషన్ల చరిత్ర

భారతదేశంలో రిజర్వేషన్ల చరిత్ర ముస్లీం ప్రజలతోనే ప్రారంభమైంది. వాళ్లు ప్రత్యేక మతంగా ఉండటం వలన కూడా వెంటనే వాళ్ల హక్కులను సాధించుకోగలిగారు. ముస్లీంలు 1857 తిరుగుబాటులో ప్రధాన పాత్ర వహించటం కూడా ప్రభుత్వం వాళ్లను శాంత పర్చటం కోసం కూడా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలోనే అగ్రకులాలతో పోటీ పడలేమని గుర్తించిన ముస్లింలు ప్రత్యేక నియోజక వర్గాల కోసం డిమాండ్ చేసారు. ఈ డిమాండ్‌ను అంగీకరించిన బ్రిటీష్ ప్రభుత్వం 1878లో అహమ్మద్ ఖాన్‌ను వైశ్రాయ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆయన 1886లో ముస్లీం ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించాడు. విద్యా, ఉద్యోగ రంగాలలో ముస్లీం స్థితిగతుల మీద విస్తృతంగా ఈ సమావేశంలో చర్చించారు. ముస్లింలు ఇంగ్లీష్ విద్యను అభ్యసించక పోవటం వలన చాలా నష్టపోరాయని ఈ సమావేశం గుర్తించింది. అంతేకాకుండా వీళ్ల ప్రభుత్వం ముందు రెండు నిర్దిష్ట ప్రతి పాదనలు పెట్టారు. ఒకటి ముస్లీంలకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని రెండు సివిల్ సర్వీస్ ఉద్యోగాల ఎంపిక కోసం హిందువులకు, ముస్లీంలకు నిర్వహిస్తున్న ఒకే పరీక్షను రద్దుచేసి వేర్వేరు పరీక్షలు నిర్వహించాలని అహమ్మద్‌ఖాన్ నాయకత్వంలో ప్రతినిధి బృందం ఈ డిమాండ్స్‌తో లార్డ్‌మింటోకు వినతిపత్రం ఇచ్చింది. ముస్లీం ప్రతినిధుల డిమాండ్స్‌ను మింటో అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ మోర్లేకు పంపాడు. మోర్లే దీనిని ఆమోదించాడు. 1909లో ముస్లీంలకు ప్రత్యేక నియోజకవర్గాల బిల్లుకు ఆమోదం లభించింది. మొదటి డిమాండైన సివిల్ సర్వీసు ఉద్యోగాల ఎంపికకు ప్రత్యేక పరీక్ష అంశం మాత్రం ఆమోదం పొందలేదు. ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వమే అధికారికంగా కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే పద్ధతిని ప్రారంభించింది.

అయితే ఇది కేవలం ముస్లీంలకే పరిమితం కాలేదు. ముస్లీం సమాజం సాధించిన ప్రత్యేక నియోజక వర్గాల ప్రభావం మిగతా సమాజంలోని బ్రాహ్మణేతర కులాలపై పడింది. కుల వ్యవస్థలో తీవ్ర ప్రకంపనాలు మొదలు కావటానికి ఇదొక ప్రాతిపదికగా మారింది. అనేక శూద్ర కులాలు, అతి శూద్ర కులాలు (దళితులు) సిక్కు, క్రైస్తవ మతస్థులు కూడా తమకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలనే డిమాండ్‌ను బ్రిటీష్ ప్రభుత్వం ముందు పెట్టారు. అదే విధంగా తమ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ రంగాలలో ప్రత్యేక అవకాశాలు, కేటాయింపులు ఉండాలని డిమాండ్ చేశారు. కేవలం డిమాండ్స్ వద్దే ఆగిపోకుండా ఉద్యమాలు కూడా చేసారు. కుల జనాభాను సమీకరించి కుల సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వం మీద ఒత్తిడిని తీవ్రం చేసారు. ముస్లీంలను, శూద్ర, అతి శూద్ర కులాలను భారతీయ సమాజం నుంచి చీల్చి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న జాతియోద్యమానికి ప్రజల మద్దతు లేదని చెప్పటానికి బ్రిటిష్ వాళ్లు చేస్తున్న కుట్రగా కొందరు దీనిని వ్యాఖ్యానించారు. ఇది పాక్షిక సత్యమే అయినప్పటికి సామాజిక వాస్తవికతను ఆనాటి బ్రాహ్మణీయ సమాజం అర్థం చేసుకోలేదు. దళితులను, శూద్రకులాలను సమాజానికి దూరం చేసారు. అంటరాని తనాన్ని పాటించారు. విద్యకు దూరం ఉంచారు. ఇన్ని కారణాలను మరుగు పర్చి బ్రిటిష్ ప్రభుత్వ ప్రయత్నాన్ని సాకుగా చూపెట్టే ఆలోచనను ఇక్కడి అగ్రకుల సమాజం చేసింది. పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద పాలకుల స్వభావం ప్రజలను చీల్చటమే అనటంలో ఏమాత్రం సందేహం ఉండనక్కర్లేదు, కాని సామాజిక వాస్తవికత అనుకూలంగా లేకపోతే కూడా పాలకులు చేయగలిగేది ఏమీ ఉండదు. ఏదిఏమైనా ముస్లీంలు సాధించిన ప్రత్యేక నియోజక వర్గాలు దేశంలోని అన్ని వెనుకబడిన కులాల హక్కుల సాధనకోసం జరగబోయే ఉద్యమాలకు పునాదివేసాయి.

## సంస్థానాలు - రిజర్వేషన్లు: సాహుమహారాజ్ కృషి

1885లో బరోడా(గుజరాత్) సంస్థానానికి రాజైన శాయాజీరావు గైక్వాడ్ కింది కులాల్లో విద్యను ప్రోత్సహించడానికి 30 పాఠశాలలను

ప్రారంభించాడు. అందరికి నిర్బంధ ఉచిత విద్యను అందించాలని ఉత్తర్వులు జారీ చేసాడు. ఇది రిజర్వేషన్ లాంటి ఉత్తర్వులు కానప్పటికి కింది కులాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ప్రయత్నం. 1890లో మైసూర్ ప్రభుత్వం కూడా అంటరాని వాళ్ల కోసం రెండు పాఠశాలల్ని ప్రారంభించింది. సంస్థానాలతో రిజర్వేషన్ చరిత్ర గురించి చెప్పాల్సి వస్తే కొల్హాపూర్ (మహారాష్ట్ర) సంస్థానాధీశుడు ఛత్రపతి సాహు మహారాజు గురించి చెప్పాలి. ఈ దేశంలో విద్య, ఉద్యోగ రంగాలలో శూద్రులకు, అతిశూద్రులకు రిజర్వేషన్ కల్పించిన మొదటి వ్యక్తి. 1902లో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసి బ్రాహ్మణుల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. అయినా మొక్కవోని ధైర్యంతో దళితులు, వెనుకబడిన కులాలవైపు నిలబడ్డాడు. ఆయన ఈ రిజర్వేషన్ విధానాన్ని ముందుకు తీసుకురావటానికి ఒక సైద్ధాంతిక ప్రాతిపదికను ఆధారం చేసుకున్నాడు. బొంబాయి మాజీ గవర్నర్ లార్డ్ సిడెన్‌హామ్‌కు సాహూ రాసిన లేఖ ద్వారా ఆయన ప్రాతిపదికను అర్థం చేసుకోవచ్చు. "భారతదేశంలోని దక్కన్ ప్రాంతం శతాబ్దాలుగా బ్రాహ్మణాధిక్యత కింద నలిగిపోతున్నది. మతపరమైన విషయాల్లో మాత్రమే కాక, రాజకీయాలు, వాణిజ్యం, విద్య, ఆర్థిక విషయాలు వంటి అన్నిరంగాల మీద బ్రాహ్మణుల పెత్తనమే కొనసాగుతున్నది. ఈ దేశంలోని సాధారణ ప్రజల ప్రయోజనాల రక్షణ కోసం ప్రత్యేకమైన చర్యలు తీసుకోవటం అవసరం. లేకపోతే వాళ్లు బ్రాహ్మణ యాజమానుల ఆధిపత్యంలో నిస్సహాయంగా నలిగిపోకతప్పదు. ఈ ప్రజల రక్షణకు సరైన మార్గం ప్రాంతీయ కౌన్సిళ్లలోనూ, బ్రిటిష్ ప్రభుత్వ యంత్రాంగం లోనూ కింది కులాల ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించటమేనని నా అభిప్రాయం" (ఛత్రపతి సాహూ మహారాజ్: 2007 పుట.80) కొన్ని సంవత్సరాల పాటైన కింది కులాలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేయాలని సాహు భావించాడు. సాహు చేసిన ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అంతేకాదు కాంగ్రెస్‌లో అతివాదిగా పేరుపొందిన తిలక్ 'కేసరి' పత్రికలో రిజర్వేషన్లకు వ్యతిరేకమైన అభిప్రాయాలను వ్యక్తం చేసాడు. దర్భంగా మహారాజు దళితులకు, వెనుకబడిన వారికి విద్య అవసరం లేదని వాదించాడు. 'ఆ వర్గాల పిలులు చదువుకోవడానికి బడికి వెళ్తే మా పొలాలలో పనిచేసేది ఎవ్వరని' అన్యాయంగా అడిగాడు.

ప్రభుత్వం తీసుకునే చాలా నిర్ణయాలు కింది కులాలకు ఉపయోగకరమైనవైతే బ్రాహ్మణ అధికారులు అవి అమలుకాకుండా అడ్డుకుంటున్నారు. అంతేకాకుండా వాటికి విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేసిన చాలా సందర్భాలను సాహు ప్రత్యక్షంగా ఎదుర్కొన్న తీరును వివరించాడు. బ్రాహ్మణ అధికారులకు భయపడి కొన్ని సందర్భాలలో బ్రిటిష్ అధికారులు కూడా నిర్ణయాలు తీసుకునే విషయంలో ఉదాసీనంగా ఉన్న సందర్భాలను సాహు ఎన్నింటినో పేర్కొన్నాడు. మెజారిటీ ప్రజలకు రిజర్వేషన్లు వద్దని వాదించే మైనారిటీ ప్రజలను అనుమానించకపోతే తప్పు పాలకులది అవుతుందని ఆయన భావన. తాము భగవంతుని అవతారమని చెప్పే బ్రాహ్మణులు మొత్తం సమాజాన్ని తమ చెప్పుచేతుల్లో పెట్టుకున్నారు. కిందికులాల ప్రజల కర్మ క్రతువులకు రుసుం చెల్లించి బ్రాహ్మణుల మీద ఆధారపడవల్సి వస్తుంది. ప్రజల జీవితమంతా మతపరమైన విషయాలతో ముడిపడి ఉంటుంది. ఫలితంగా బ్రాహ్మణుల ఆధిపత్యం ఈ ప్రజల మీద కొనసాగుతుంది. "అందుకే కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం వారి మీద వుందని" సాహు బలంగా వాదించాడు. జడ్జీలూ, పోలీసులూ, కోర్టు గుమస్తాలూ బ్రాహ్మణులే అయినప్పుడు తమకు ఏ మాత్రం న్యాయం జరగదని కిందికులాల వాళ్లు అనుకుంటారు. కనుక సంబంధిత ఉద్యోగాలలోకి ఈ కులాలు ప్రవేశించాలంటే రిజర్వేషన్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఆనాటి సమాజంలో పాఠశాల, ~ళాశాలల్లో మొత్తం బ్రాహ్మణులే దర్శనమిస్తుంటారు. ఈ స్థితి మారాలంటే కనీసం ఇరవైఏళ్ల పాటైనా ఉద్యోగాల్లో, పాలనారంగంలో కింది కులాలకు రిజర్వేషన్లు కల్పించాలని సాహు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి స్పష్టమైన సూచనలు చేసాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి సూచనలు చేసే ముందు సాహు వాటిన్నింటిని తన రాజ్యంలో అమలుచేసి చూపాడు. తన సంస్థానంలోని ప్రతి బ్రాహ్మణేతర కులానికి ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసి అందరికి విద్యను అందుబాటులోకి తెచ్చాడు. 1902 నుంచి 1922 వరకు చాలా నిర్దిష్టమైన చర్యలను సాహు చేపట్టాడు. దీని వలన కొల్హాపూరు సంస్థానంలో మొదట బ్రాహ్మణ విద్యార్థులు 2,522 మంది వుండగా, వెనకబడిన కులాల విద్యార్థులు 8,088 మంది, అస్పృశ్య కులాల నుండి 234 మంది విద్యార్థులున్నారు. 1922 సాహు మరణించేనాటికి బ్రాహ్మణ విద్యార్థుల సంఖ్య 2722 అయితే వెనకబడిన కులాల సంఖ్య 21,027 మందీ, అస్పృశ్య విద్యార్థులు 2,162 మందీ వున్నారు. దీనంతటికి కారణం సాహు 1902లో తెచ్చిన రిజర్వేషన్ చట్టమే. వెనకబడిన కులాలు, అస్పృశ్యులు విద్యావంతులు కావటం వలన బ్రాహ్మణ కులాల్లో కలవరం మొదలైంది. ఈ చట్టం వలన కొల్హాపూరు సంస్థానంలో మొదటిసారిగా ప్రభుత్వ ఉద్యోగాల్లోకి బ్రాహ్మణేతరులు ప్రవేశించారు. అట్లే కులకర్ణి, పాటిల్(గ్రామాధికారులు) ఉద్యోగాలలో ఎన్నో ఏళ్లుగా బ్రాహ్మణులు ఉండేవారు. దానిని తిరగరాస్తూ బ్రాహ్మణేతర కులాలకు ఆ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత సాహుదే. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని బ్రాహ్మణులు సాహు మీద తీవ్రమైన నిరసనను వ్యక్తం చేసారు. కొల్హాపూరు నుండి వెలువడే సమర్థ్(1906, ఆగస్టు 8వ సంచిక) పత్రికలో ఇలా రాసారు.

"బ్రాహ్మణ సమాజమంతా యిప్పుడొక తీవ్రమైన నిషేధానికి గురయ్యింది. వెనకబడిన కులాలను అభివృద్ధి చేస్తున్నామనే సాకుతో, కీలకమైన పదవులన్నింటినీ మరాఠాలకు కట్టబెడు తున్నారు. ఆఫీసులన్నీ మరాఠా ఉద్యోగులతో నిండిపోతున్నాయి. ఆ కులాల్లో తగినంతమంది విద్యావంతులు లేకపోయినప్పటికీ, మరాఠాలయితే చాలునన్న అర్హతతో ఉద్యోగాలను వాళ్లకు అప్పగిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వోద్యోగాలన్ని అసమర్థులతో నిండుతున్నాయి. ఈ పరిణామాల వల్ల బ్రాహ్మణులందరూ భవిష్యత్తు గురించిన ఆందోళనతో భయకంపితులయి పోతున్నారు" ఇవ్వాళ అగ్రకులాలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో ముందుకు తీసుకొస్తున్న 'ప్రతిభ' సిద్ధాంతానికి మూలాలు ఇక్కడే ఉన్నాయి. ఆనాటి కాంగ్రెస్‌లో ఉదారవాదులుగా ముద్రవున్నవాళ్లు కూడా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. రనడే కాంగ్రెస్‌లో మితవాది. ఆయన ఒక సందర్భంలో మాట్లాడుతూ "చేతిలో అధికారం వుంది గనుక కింది కులాలకు ఉద్యోగాలు కట్టబెట్టవచ్చు. కాని, మనతో సమానమైన సమర్థతతో వాళ్లా బాధ్యతలను నిర్వహించగలరా? అన్నదే నా ప్రశ్న" (ఛత్రపతి సాహు మహారాజ్; 2007 పుట.22) అని అన్నాడు. అతివాదైనా, మితవాదైనా

బ్రాహ్మణుడైతే చాలూ రిజర్వేషన్‌ను వ్యతిరేకించటానికి ప్రాతిపదిక వుంటుంది. సాహు అస్పృశ్య కులాలను కూడా ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చాడు. వారికి వివిధ ఉద్యోగాలలో అవకాశాలు కల్పించాడు. అంతేకాదు అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేసాడు. అస్పృశ్యుల కోసం పెట్టిన ప్రత్యేక పాఠశాలలను రద్దుచేసి అందరూ ఒకే పాఠశాలలో చదువుకునేలా చర్యలు తీసుకున్నాడు. 1919లోనే అస్పృశ్యత పాటించటం నేరమని చట్టం చేసాడు. 1920లో వెట్టి నిర్మూలన చట్టం చేసాడు. రాజ కుటుంబంలోని వివిధ ఉద్యోగాలలోకి అస్పృశ్యులను తీసుకోవటం వలన వాళ్లూ అందరితో సమానంగా సంచరించే అవకాశం ఏర్పడింది. ఈ దేశంలో రిజర్వేషన్ అనే భావనను స్పష్టమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక అవగాహనతో అర్థం చేసుకొని ఎన్ని అడ్డంకులు ఎదురైనా అమలుచేసిన మొదటివ్యక్తి సాహు కావటం వలన ఇంత వివరంగా ఆయన గురించిన ప్రస్తావన చేయవల్సి వచ్చింది.

మైసూరు సంస్థానం దివాన్ విశ్వేశ్వరయ్య వెనుకబడిన కులాలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించటానికి కొన్ని చర్యలు చేపట్టాడు. 1914లో కింది స్థాయి ఉద్యోగాలను ఈ కులాలకు రిజర్వు చేసారు. 1916లో 25 శాతం ఉద్యోగాలను అర్హత వున్న వెనుకబడిన కులాలకు రిజర్వు చేసారు. వెనుకబడిన కులాల ప్రజలు చేసిన ఉద్యమం ఫలితంగా మైసూరు ప్రభుత్వం కమ్యూనల్ జీవోను జారీ చేసింది. దీని ప్రకారం వెనుకబడిన కులాలకు ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1922లో కలకత్తా ప్రెసిడెన్సీలో బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి మూడు ఉద్యోగాలలో ఒక ఉద్యోగాన్ని నామశూద్రులకు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నది. 1919లో మాంటెంగ్ చెమ్స్ ఫర్డ సంస్కరణలో భాగంగా వెనుకబడిన కులాలకు పరిపాలన సంస్థలలో భాగస్వామ్యం ఉండాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కల్పించారు.

## సైమన్ కమీషన్-రిజర్వేషన్లు:

బ్రిటిష్ ప్రభుత్వం తరపున రిజర్వేషన్ విధానం మీద నిర్దిష్టంగా పరిశీలన చేయడానికి వేసిన కమీషన్ ఇది. దేశవ్యాపితంగా వివిధ సంస్థానాలలో, ప్రెసిడెన్సీలలో వెనుకబడిన, దళిత కులాలు నిత్యం ప్రభుత్వానికి విరివిగా విజ్ఞప్తులు ఇచ్చాయి. ప్రజలు తమ తమ కులాల కింద సమీకరించబడి తమ హక్కుల గురించిన డిమాండ్స్‌ను ప్రభుత్వం ముందుపెట్టారు. ఇన్నిరకాల నిరసనలు, డిమాండ్లు, విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1919లో మాంటెంగ్-చెమ్స్‌ఫర్డ సంస్కరణలు ప్రవేశపెట్టాక కింది కులాలలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి సైమన్ కమీషన్ వచ్చింది. ప్రతీకులం తమకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని కూడా అనేక విజ్ఞప్తులు ప్రభుత్వం ముందుకు తెచ్చాయి. ఇది కూడా సైమన్ కమీషన్‌కు ఒక ప్రాతిపదిక. ప్రత్యేక ఎన్నికల నియోజక వర్గాల డిమాండ్స్‌ను పరిశీలించ టానికి వచ్చిన సైమన్ కమీషన్‌లో సభ్యులుగా భారతీయులు ఎవరు లేరనే సాకుతో జాతీయ కాంగ్రెస్, హిందు మహాసభ, అగ్రవర్ణాలు దీనిని బహిష్కరించమని పిలుపునిచ్చాయి. కాని తమిళనాడు, ఆంధ్రలో జస్టిస్ పార్టీ, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ ఈ కమీషన్‌కు స్వాగతం పలికారు. కమీషన్ ముందు హాజరై తమ కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని విన్పించారు. అన్ని విషయాల మీద సమగ్ర అధ్యయనం చేసిన కమీషన్ 1929లో రిపోర్టును బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పిస్తూ కింది కులాలకు ఉద్యోగాలలో, కౌన్సిల్స్‌లో సరైన ప్రాతినిధ్యం లేదని చెప్పింది. దీని గురించి సమగ్రంగా చర్చించి ఒక విధాన నిర్ణయం తీసుకోవాలంటే రౌండ్ టేబుల్ సమావేశాలు అవసరమని భావించింది.

## రిజర్వేషన్లు-అంబేద్కర్

"డా॥అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాలకు, రాజకీయ హక్కులను పార్లమెంట్‌లోనూ రాష్ట్ర చట్టసభలలోనూ తగిన ప్రాతినిధ్యాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాలలో తగిన సభ్యత్వాన్ని, ప్రభుత్వ సర్వీసులలో ఉద్యోగాలలో రిజర్వేషన్ ద్వారా తగిన ప్రాతినిధ్యాన్ని సంపాదించి పెట్టారని"(అద్వితీయుడు; 2014 పుట.95) జస్టిస్ పున్నయ్య విశ్లేషణను పరిశీలిస్తే భారతదేశంలో వెనుకబడిన, ఎస్సీ, ఎస్టీలకు, ముస్లింలకు, స్త్రీలకు, వికలాంగులకు రిజర్వేషన్లు అందటానికి అంబేద్కర్ చేసిన కృషి అర్థమవుతుంది. అవమానాల జీవితం నుంచి పుటం పెట్టిన బంగారంలా ఎదిగిన అంబేద్కర్ ఆ అవమానాలకు కారణమైన వ్యవస్థను మార్చటానికి జీవితాన్ని అంకితం చేసాడు. తన పోరాట క్రమంలో ఎక్కడా రాజీ పడకుండా (రాజీ పడాల్సి వస్తే తన వర్గ ప్రయోజనాల కోసమే..) అగ్రకుల బ్రాహ్మణీయ సమాజంతో పోరాటం చేసాడు. అణచివేతకు గురైన కులాలకు రిజర్వేషన్ల లాంటి పరిమిత ప్రయోజనాలైన నెరవేరాలని గాంధీ అండ్ కాంగ్రెస్‌తో ఒకరకంగా యుద్ధమే చేసాడు. "అస్పృశ్యులు ఇస్లాం మతం లేదా క్రైస్తవ మతం స్వీకరించినా తాను అభ్యంతరం వ్యక్తం చేయబోనని అస్పృశ్యతకు రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకించగలనని"(డబ్ల్యు-ఎన్.కుబేర్-అంబేద్కర్ 2012 పుట.120) గాంధీ అంటే ఆ గాంధీతో తలపడి రిజర్వేషన్లు సాధించి పెట్టిన యోధుడు అంబేద్కర్.

అనేకమంది సంస్కరణవాదులు, సామాజిక విప్లవ కారులు, బ్రిటిష్ అధికారులు వెనుకబడిన, దళిత, ఆదివాసీ ప్రజల పట్ల సానుభూతితో 1885 నుంచి ప్రవేశపెడ్తూ వచ్చిన రిజర్వేషన్ విధానానికి అంబేద్కర్ తన కాలంలో సైద్ధాంతిక దృక్పథాన్ని ఇచ్చాడు. తనకు ముందు జరిగిన అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగానే అంబేద్కర్‌కు ఈ దృష్టి ఏర్పడింది. ఏ మనిషికైనా తనకు ముందు ఉండిన సామాజిక వాతావరణం, తన కాలంలో చుట్టూ నిర్మాణమై ఉన్న సామాజిక స్థితియే అతని దృక్పథాన్ని, ఆలోచనను నిర్ణయిస్తుందని తత్వశాస్త్రం చెబు తుంది. కనుక అంబేద్కర్ అట్లా నిర్మాణ మయ్యాడు. 1918 నుంచి ఆయన పూర్తికాలం సామాజిక కార్యాచరణలోకి ప్రవేశించాడు. ఈ కాలం నుంచే కింది కులాలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసాడు. సైమన్ కమీషన్ ముందు ప్రత్యేక నియోజక వర్గాలు, రిజర్వేషన్లు కావాలని కోరాడు, మొదటి(1930) రెండో(1931) రౌండ్ టేబుల్ సమావేశాలలో అంటరాని వర్గాల ప్రతినిధిగా పాల్గొని తమ ప్రజల హక్కుల సాధన కోసం గొంతు విన్పించాడు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ ఎరవాడ జైలులో గాంధీ నాటకాన్ని రసాభాసం చేసాడు. పూనా ఒడంబడిక ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు సాధించిపెట్టాడు. రాజ్యాంగ ముసాయిదా కమిటి చైర్మన్‌గా రాజ్యాంగ పరిషత్తు సమావేశాలలో విస్తృతమైన చర్చలు చేసి రిజర్వేషన్లకు సైద్ధాంతిక దృక్పథాన్ని కల్పించాడు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీలకు శాశ్వతంగా, బీసీలకు ఇతర అణచివేయబడిన వర్గాలకు

రిజర్వేషన్లు అందడానికి కావల్సిన పునాదిని రాజ్యాంగంలో రూపొందించాడు. ఇది స్థూలంగా రిజర్వేషన్ల చరిత్ర.

## రిజర్వేషన్లు ఎందుకు

రిజర్వేషన్లు అనేవి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో అమలు చేయాలన్నది రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయం. మొదటి రెండు రంగాలలోను రిజర్వేషన్లు అమలవుతున్నట్లు పైకి కన్పిస్తుంది. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే అక్కడ కూడా పాక్షికంగానే అమలవుతున్నాయి. ఇక రాజకీయ రంగంలోనైతే అగ్రకుల నాయకుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి రిజర్వేషన్లు అమలవుతుంటాయి. సంపదలో రిజర్వేషన్లు ఎలాగూ లేవు. వాస్తవానికి రిజర్వేషన్లు ఎవరి జనాభా దామాషా ప్రకారం వారికి సంపద దక్కేటట్లు ఉండాలి. కాని ఈ దేశంలో సంపద మీద హక్కు ఉన్న అగ్రకులాలు తమ ఇష్టారీతిగా అమలుచేసే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఉండటం నామమాత్రమైన విషయమే. రాజకీయాలలో కూడా ప్రత్యక్ష ఎన్నికలలో రిజర్వేషన్లు ఉంటాయే తప్ప నామినేటెడ్ పదవులకు రిజర్వేషన్లు ఉండనే ఉండవు. కనుక రిజర్వేషన్లు అనేవి విద్య, ఉద్యోగ రంగాలకు సంబంధించినవే.

విద్యకు, ఉద్యోగాలకు పుస్తక జ్ఞానమే గీటురాయి. పుస్తక జ్ఞానమంటే కేవలం అక్షరాలు మాత్రమే కాదు, అక్షరాల వెనుక ఉండే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలు. అంటే ఒక సమాజానికి చెందిన భావజాలాన్ని నేర్చుకుంటూనే అందులో అంతర్భాగంగా విషయ పరిజ్ఞానాన్ని కూడా పొందుతాం. ఈ రోజు మనం నేర్చుకుంటున్న విద్యలో అగ్రకుల బ్రాహ్మణీయ సంస్కృతి, భావజాలం మాత్రమే ఉంటాయి. దీనికి తోడు మనం మూడు శతాబ్దాలుగా అలవాటు చేసుకున్న సామ్రాజ్యవాద సంస్కృతి కూడా ఉంటుంది. సంస్కృత భాషలో వేదాలను, ఇతిహాసాలను,పురాణాలను నేర్చుకున్నది అగ్రకుల బ్రాహ్మణులు, వీళ్లే ఇంగ్లీష్ విద్య ఈ దేశంలో వచ్చేసరికి దానినీ నేర్చుకున్నారు. కనుక పుస్తక జ్ఞానాన్ని అందుకోగలిగింది అగ్రకుల బ్రాహ్మణులే. ఈ విద్య వీళ్లకు ఒంట పట్టినంత సులభంగా ఇతర కులాలకు రాదు. కనుక విద్యా, ఉద్యోగ రంగాల మీద ఈ అగ్రకులాలే ఆధిపత్యం కలిగి ఉంటాయి. అందుకే అణచివేతకు గురైన కులాలు, వేల సంవత్సరాలుగా చదువులకు దూరంగా ఉన్న సమూహాలు రిజర్వేషన్లు కావాలని అడగడం, ఈ ప్రజాస్వామిక డిమాండ్‌కు అందరూ మద్దతు తెలియచేయటం. అమెరికా, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోకి గత ముప్పై ఏళ్లుగా వెళ్తున్నది అగ్రకులాలే. అక్కడి సంస్కృతితో, భాషతో పోటీ పడలేక వీళ్లు ఆ దేశస్థులతో సమానంగా ఎదుగ లేకపోతున్నారు. కనుక అక్కడ తమకు ప్రత్యేక రాయితీలు కావాలని అడుగుతున్నారు. విదేశాలకు వెళ్లిన అగ్రకులాలు రాయితీల కోసం అడగటం ఎంత న్యాయమైనదో, మన దేశంలో వేల సంవత్సరాలుగా సంపదకు, చదువుకు దూరమైన కులాలు ఇక్కడ రిజర్వేషన్లు అడగటంలో కూడా అంతే న్యాయముంది. సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలతో ఉత్పత్తిని సృష్టించే మనుషులు, ఆ ఉత్పత్తిని పరాన్నభుక్కులు అపహరిస్తుంటే ఎన్నడూ అడ్డు చెప్పలేదు. వాళ్లు మాతోటి మనుషులే కదా! అని ఆదరించారు. అట్లాంటి శ్రమజీవుల పిల్లలకు రిజర్వేషన్లు కల్పించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. చెప్పులు కుట్టినవాళ్లు, బట్టనేసినవాళ్లు, గొంగడి అల్లినవాళ్లు, కుండ తయారుచేసినవాళ్లు, కర్రు-నాగలిని రూపొందించినవాళ్లు, మురికి బట్టలు ఉతికినవాళ్లు, వెంట్రుకల్ని కత్తిరించినవాళ్లు ఇట్లా వీళ్లంతా సమాజ పురోగమనంలో భాగమయ్యారు. వాళ్ల వృత్తిని సామాజిక బాధ్యతగా గుర్తించి చేసారు. ఏనాడు నిరాకరించలేదు. కొందరిని మాత్రమే చదువుకొమ్మని చెప్పి వీళ్లందరు కష్టపడ్డారు కదా! మరి వాళ్లు కూడా చదువు కుంటామంటే అవకాశాలను కొందరి వద్దనే కేంద్రీకరించుకుంటే ఎట్లా?

'సమానులైన వారు లేదా ఒకే విధమైన వారికి మాత్రమే చట్టం సమానంగా ఉండాలి, కాని అదే అసమానుల మధ్య వర్తించదు' అనే అంబేద్కర్ భావన రిజర్వేషన్లకు ప్రాతిపదిక. ఆర్టికల్ 14 'ప్రత్యేక ప్రయోజనాలు కలవారు, లేదా సమాన ప్రయోజనాలు గల వారితో అసమానులుగా ఉన్నవారికి సమానత్వం కల్పించటానికి, ఉద్దేశించబడినది కాదు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీలకు సమాన అవకాశాలు కల్పించటం కోసం రిజర్వేషన్లను ఒక హక్కుగా అంబేద్కర్ కోరారు. ఎస్సీలకు హక్కులు, అక్షరం నిరాకరించబడ్డాయి. కనుక వాళ్లు ప్రస్తుత సమాజంలో అగ్రకులాలతో సమానం కాదు. "గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు, పెత్తందార్లూ అగ్రకులాల నుండి వచ్చినవారే. పట్టణ ప్రాంతాల్లో పెద్ద వ్యాపారులూ, పెద్ద పెట్టుబడిదార్లూ, ఉన్నత అధికారులూ అగ్రకులాల నుండి వచ్చినవారే. అలాగే కొద్దీ గొప్ప భూమి కలిగిన పాలిత ధనిక, మధ్యతరగతి రైతుల్లో అత్యధికులు అగ్రకులాల వారే"(శంబూకుడు-రిజర్వేషన్లపై; 1991 పుట.29) ఇక మిగిలింది ఎవరు? ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీంలు, వీళ్లు పేదలు. భూమి లేదు. సంపద లేదు. సమాజం కల్పిస్తున్న అన్నిరకాల అవకాశాలను మొదట తన్నుకపోగల అవకాశాలు సంపద కలిగిన అగ్రకులాలకే దక్కుతున్నాయి. మరి ఈ పేదలైన కులాలు అగ్రకులాలతో పోటీపడేది ఎప్పుడు? కనుక అసమానుల మధ్య పోటీని నివారించాలంటే రిజర్వేషన్లు ఒక ఉపశమనం.

## రిజర్వేషన్లు సరిగ్గా అమలవుతున్నాయా?

భారత రాజ్యాంగంలోని పార్ట్-III ప్రాథమిక హక్కులు-సాధారణ వివరణ అనే అధ్యాయంలో ఆర్టికల్ 14 నుంచి ఆర్టికల్ 16 వరకు సమానత్వం అనే భావనను రాజ్యాంగ నిర్మాతలు పొందుపర్చారు. రిజర్వేషన్లకు సంబంధించిన ప్రస్తావన కూడా ఈ మూడు అధికరణలలో నిర్దేశించబడింది. 1950 జనవరి 26 నుంచి భారత సంవిధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. 65 ఏళ్లు గడిచాయి. కాని ఫలితాలను చూస్తే నిరాశాజనకంగా ఉన్నాయి. అగ్రకుల పాలకులు సాధ్యమైనంత వరకు రిజర్వేషన్లు అమలుకాకుండా చూసారు. పాలకులకు అగ్రకుల అధికారులు కూడా తోడయ్యారు. రిజర్వేషన్లను ఉపయోగించు కోవటానికి దళితులు తమ అర్హతలను పెంచుకుంటున్నప్పటికి చాలా ఉద్యోగాలు ఇప్పటికి ఖాళీగా ఉంటున్నాయి. వేలాది బ్యాక్‌లాగ్ పోస్టులు రాష్ట్రస్థాయిలోనూ, లక్షలాది బ్యాక్‌లాగ్ పోస్టులు కేంద్ర స్థాయిలోనూ ఉండిపోతున్నాయి. విద్యాలయాలు నిరుద్యోగులను తయారుచేసే కర్మాగారాలుగా మారిపోతూ లక్షల్లో నిరుద్యోగులు రోడ్ల మీద తిరుగుతున్నారు. ఇంతమంది అర్హులైన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు ఉన్నప్పటికి అగ్రకుల పాలకులు ఖాళీలను నింపటం లేదు. ఇదొక రకమైన సామాజిక వివక్ష. కేంద్రీయ విద్యాలయాలైతే ఇంకా

అగ్రహారాలుగా విలసిల్లుతున్నాయి. కొన్ని సంస్థలలోకైతే ఇప్పటికి దళితులకు ప్రవేశమే లేదు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫస్టు ర్యాంకు వచ్చినా వాళ్లకు రిజర్వేషన్‌లోనే సీటును కేటాయించే అగ్రకుల అధికారులు ఎందరో ఉన్నారు. చైతన్యం ఉండి నిలదీస్తే తప్ప ఓపెన్ కేటగిరిలో సీటు దక్కటం లేదు. ఎంత కష్టపడి చదివినా విశ్వవిద్యాలయ అగ్రకుల ఆచార్యులు 'గోల్డ్‌మెడల్' దళితులకు ఇవ్వరు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గురించి అధ్యయనం చేసి సూచనలు, సలహాలు ఇవ్వటానికి ఒక పార్లమెంటరీ కమిటి ఉంటుంది. అది ప్రతీ సంవత్సరం ఈ కులాల స్థితిగతులపై నివేదికను తయారుచేసి పార్లమెంట్‌కు ఇస్తుంది. ఈ కమిటి కొన్నిసార్లు సంవత్సరాలకు సంవత్సరాలు సమావేశం కూడా కాదు. పార్లమెంట్ ఏర్పాటు చేసిన కమిటి తీరే ఈ విధంగా ఉంటే ఇతర సంస్థల పనితీరు ఏ విధంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. ఈ కమిటి 1988లో తన నివేదికను సమర్పిస్తూ రైల్వే శాఖలోని 28 రకాల ఉద్యోగాలలో రిజర్వేషన్ నిబంధనలను అమలు చేయలేదని తెలియజేసింది. ఇప్పటికీ చాలారకాల కేంద్ర సంస్థలలో 27 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు నోచుకోవటం లేదు. బీసీ రిజర్వేషన్‌ను ఎలాగు పాటించడం లేదు. కానీ ఎస్సీ, ఎస్టీలకు, ఎం.ఫిల్, పిహెచ్.డి కోర్సులలో రిజర్వేషన్‌ను పాటించవల్సిన అవసరం లేదని యుజిసి(యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్) 2002లో సర్క్యులర్ జారీచేసింది. అది ఇప్పటికీ అమలవుతున్నది. ఫలితంగా చాలామంది ఎస్సీ, ఎస్టీలు పరిశోధన రంగానికి దూరమవుతున్నారు. ఫలితంగా వాళ్ల జ్ఞానం ఈ సమాజానికి అందకుండా అగ్రకులాలు కుట్ర చేస్తున్నాయి.

## రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు

రాజ్యాంగాన్ని తు.చ.తప్పకుండా అమలు చేస్తామని, రాజ్యాంగ బద్ధంగా నడుచుకుంటామని ఎమ్మెల్యే నుంచి రాష్ట్రపతి వరకు చట్టసభల ప్రతినిధులందరూ ప్రమాణం చేస్తారు. కాని అందరూ తు.చ.తప్పకుండా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ అమలు సందర్భంలో తేలిపోయింది. 65 ఏళ్లుగా రిజర్వేషన్లను అమలు జరపకుండా సాధ్యమైన మేరకు అగ్రకుల పాలకులు, అధికారులు వ్యవహరిస్తూ వస్తున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడలో ఉంటే రిజర్వేషన్లు అమలు చేయవల్సి వస్తుందనే కుట్రతో వాటిని ప్రైవేట్ పరం చేస్తున్నారు. చాలా చాకచక్యంగా రిజర్వేషన్లను అమలుచేసే బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. రిజర్వేషన్ల అమలు పరిస్థితి ఇలా ఉంటే అగ్రకుల, భూస్వామ్య ముద్దుబిడ్డలు, పత్రికలు, సంస్థలు రిజర్వేషన్ కమిట్‌మెంట్‌ను దెబ్బతీసేలా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలకు పూనుకుంటున్నారు. ఆనాటి రనడే, తిలక్, గాంధీల నుంచి ఈనాటి అరుణ్‌శౌరి, హార్థిక పటేల్ వరకు ఈ కుట్ర కొనసాగుతున్నది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగానే రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతున్నాయి. కనుక వీటి పట్ల అగ్రకుల పాలకులకు, అధికారులకు వ్యతిరేకత ఉన్నప్పటికి దానిని బహిరంగంగా కాకుండా ఎక్కువసార్లు వివిధ అంతర్గత రూపాలలో వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ కులాలకు రిజర్వేషన్ అయితే 1950 నుంచి వచ్చింది గాని, వాళ్లు దాని దరిదాపుల్లోకి రావటానికి ఇరవై ఏళ్లు పట్టింది. అంటే 1970 దశకంలో. ఎనభైల నాటికే అగ్రకులాలు అన్ని సంస్థలలోకి చేరిపోయారు గనుక ఎస్సీ, ఎస్టీల వలన వారికి పెద్ద నష్టం లేదు. ఇంకోవైపు 80వ దశకంలో ప్రైవేటీకరణ మొదలైంది. ఎప్పుడైతే బీసీల రిజర్వేషన్ అంశం ముందుకు వస్తుందో అప్పుడు అగ్రకులాలు రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకు బహిరంగంగానే సిద్ధమవుతున్నారు. అయితే ఇది బీసీలకు కల్పించే రిజర్వేషన్ అనేది ఉండకూడదని మొదలవుతుంది. ఇది భారతదేశంలో అగ్రకుల బ్రాహ్మణీయ భావజాలం నుంచి, తత్వం నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనగా మనం అర్థం చేసుకోవాలి. ఈ ఆందోళన వెనుక కేవలం కుల అంశం మాత్రమే లేదు. భూస్వామ్య, అగ్రకుల బ్రాహ్మణీయ, పెట్టుబడిదారి లక్షణాలు ఈ ఆందోళనలో ఇమిడి ఉన్నాయి. దోపిడి వర్గ ప్రయోజనాలను కాపాడుకునే లక్ష్యంతో ఈ ఆందోళనలు మొదలవుతున్నాయి. విలువల కోణంలో చూసినప్పుడు భూస్వామ్య, అగ్రకుల బ్రాహ్మణీయ ఆధిపత్య విలువలను కాపాడుకోవటం కోసం నూతన పద్ధతులలో ఈ ఆందోళనలు ముందుకు వస్తున్నాయి.

"రిజర్వేషన్ వ్యతిరేకులు తమ ఉన్నత, మధ్యతరగతి వర్గాల లక్ష్యాలను కాపాడుకోవటానికి గాను అసమ్మతిని ప్రజాస్వామ్య పద్ధతుల పరిధి నుంచి తోసివేసి నూతన తరహా సైద్ధాంతిక పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఈ రోజు పాత విలువల స్థానే ఏర్పడుతున్న కొత్త సంబంధాలు మనముందున్న మార్గం ఏదో ఎంచుకోవల్సిన బాధ్యతను గుర్తుచేస్తున్నాయి"(బాధితుల మీదే బండలు; 1990 పుట.18) రిజర్వేషన్ అనే విషయాన్ని నిరంతరం వివాదాస్పద సమస్యగా మార్చడానికి కొందరు నిరంతరం ప్రయత్నం చేస్తుంటారు. అగ్రకుల పాలకులు ఒక పథకం ప్రకారం తమకు అనుకూలమైన సెక్షన్ ద్వారా, సాధనాల ద్వారా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక భావజాలాన్ని ప్రోది చేస్తూ రెచ్చగొడుతుంటారు. రిజర్వేషన్లను మానవతవాదుల నుంచి విప్లవకారుల వరకు అందరూ సమర్థిస్తారు. ఎవరి కారణాలు, ఎవరి సిద్ధాంతాలు వారికి ఉన్నాయి. కాని చాలా సందర్భాలలో మానవతావాదాన్ని ప్రదర్శించే అగ్రకుల ప్రజలు రిజర్వేషన్ల విషయంలో ఇంత ప్రతిఘాతకంగా మారడానికి కారణాలను విశ్లేషిస్తే దీనికి కారణం కూడా అగ్రకుల పాలకులే. వారి విధానాలే. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు ప్రారంభమైనప్పుడల్లా రెండు విషయాలు ముందుకు వస్తున్నాయి.

1. రిజర్వేషన్ విధానాన్ని రద్దు చేయడం.
2. కుల ప్రాతిపదికపై ఉండే రిజర్వేషన్ విధానాన్ని రద్దుచేయడం.

ఈ రెండు డిమాండ్ల వెనుక ఉన్నది అగ్రకుల స్వభావమే. అంతిమంగా రిజర్వేషన్ విధానాన్ని లేకుండా చేయడమే ఈ ఆందోళన వెనుక ఉన్న లక్ష్యం. వ్యతిరేక ఆందోళనల చరిత్రను గమనిస్తే మనకు ఈ విషయం బోధపడుతుంది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించటం ఒక రూపం. ప్రత్యక్ష ఆందోళనలకు దిగటం రెండో రూపం. ఈ ఆందోళనలు 1970లలో ముందుకొచ్చాయి. అగ్రకులాలకు, ఆధిపత్యానికి నిలయాలైన గుజరాత్, బీహార్ రాష్ట్రాలలో ఇవి మొదలైనాయి. గుజరాత్ రాష్ట్రంలో వెనుకబడిన కులాల రిజర్వేషన్లను 10 శాతం నుంచి 50 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో అగ్రకులాలన్నీ ఏకమై ఆందోళనకు దిగాయి. పెంచిన రిజర్వేషన్లను రద్దు చేయటమే

కాకుండా అప్పటికే ఉన్న 10 శాతం రిజర్వేషన్లను కొనసాగించటంలో ఉన్న సమంజసాన్ని ప్రశ్నిస్తూ ఒక పరిశీలన కమిటీని ఏర్పాటు చేసేవరకు ఈ ఆందోళన కొనసాగింది.

1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనంతరామన్ (ఐఏఎస్) అధ్యక్షతన ఒక కమీషన్ నియమించింది. ఈ కమీషన్ బీసీ కులాల మీద అధ్యయనం చేసి వాళ్లకు రిజర్వేషన్ కల్పించాలని కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ప్రభుత్వం 1970లో బీసీలకు 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి వ్యతిరేకంగా అగ్రకులాలు ఏకమై ఆందోళనకు సిద్ధమయ్యారు. మరోవైపు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా అగ్రకుల కోర్టు కావటం వలన 1971లో బీసీ రిజర్వేషన్లు చెల్లవని తీర్పు నిచ్చింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే, సుప్రీంకోర్టు రిజర్వేషన్లను సమర్థించింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో 1977-78 సంవత్సరాలలో బీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. ఈ రిజర్వేషన్లను మరింతగా పెంచాలంటూ బీసీ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి ఫలితంగా 1981లో మురళీధర్‌రావు కమీషన్‌ను వేసారు. ఈ కమిటి రిపోర్టు ఆధారంగా 1986లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 25 శాతం రిజర్వేషన్లను 44కు పెంచుతూ జీవో జారీచేసాడు. దీంతో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన రాజుకున్నది. అగ్రకుల భూస్వాముల ముద్దుబిడ్డలు హైదరాబాద్ నగర రోడ్ల మీదికి వచ్చి నానా బీభత్సం సృష్టించారు. చివరికి మళ్లీ అగ్రకుల హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు ఎవ్వరూ వెళ్లలేదు.

## మండల్ కమీషన్ నివేదిక-రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు

భారతదేశ రిజర్వేషన్ల చరిత్రలో మండల్ కమీషన్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఆందోళననే అతిపెద్దదిగా చెప్పవచ్చు. ఈ సందర్భంలో మొత్తం రిజర్వేషన్ విధానం మీదనే దేశవ్యాపితంగా చర్చ జరిగింది. రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా అగ్రకుల మీడియా వండివార్చిన వార్తలు, కథనాలు, పాలకుల స్వార్థ ప్రయోజనాలు, దోపిడివర్గ ప్రయోజనాలు కలిసి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన జరిగింది. 1950లో అమల్లోకి వచ్చిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 46లో బలహీనవర్గాలు అని బీసీల గురించి పేర్కొన్నారు. ఆర్టికల్ 340 ప్రకారం అవసరమనుకుంటే సామాజికంగా-విద్యాపరంగా వెనుకబడిన వర్గాల వారికి కల్పించవల్సిన వసతుల గురించి కమీషన్ నియమించవచ్చు చెప్పింది. దీని ప్రకారమే మద్రాస్ రాష్ట్రంలో పెరియార్ పోరాట ఫలితంగా బీసీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తూ 1951లో మొదటి రాజ్యాంగ సవరణ చేసారు. ఈ రిజర్వేషన్ సౌకర్యాన్ని కేంద్ర సర్వీసులకు వర్తింపచేయాలనే ఉద్యమం దేశవ్యాపితంగా ఊపందుకున్నది. బీసీల స్థితిగతులను పరిశీలించటానికి 1953లో కాకా కాలేల్కర్ కమీషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ కమీషన్ దేశవ్యాపితంగా 2399 బీసీ కులాలు ఉన్నట్లు గుర్తించింది. కాని బీసీల అభివృద్ధి కోసం కేంద్రం ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదు. 1961లో కేంద్రం రాష్ట్రాలకు లేఖ రాస్తూ మీమీ రాష్ట్రాలలోని బీసీ కులాలకు తగినట్లుగా రిజర్వేషన్ ఇచ్చుకొమ్మని సూచించింది. కాకా కమీషన్ అట్లా అటకెక్కింది. 1977లో జనతాపార్టీ కాకా కమీషన్‌ను అమలుచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పింది. గెలిచిన తర్వాత కాకా కమీషన్‌ను పక్కనపెట్టి 1978లో బి.పి.మండల్ ఆధ్వర్యంలో కమీషన్‌ను నియమించింది. 1980 డిసెంబర్ 31న మండల్ తన నివేదికను ప్రధాని ఇందిరాగాంధీకి సమర్పించాడు. అనేక ఒత్తిడీల వలన 1990 ఆగస్టు 7న నాటి ప్రధాని వి.పి.సింగ్ మండల్ కమీషన్ నివేదికను అమలుచేస్తున్నట్లు ప్రకటించాడు. దీన్ని వ్యతిరేకిస్తూ అగ్రకులాలు దేశవ్యాపితంగా ఆందోళనలకు దిగారు. అలజడులు, ఆందోళనలు, ఆత్మహత్యలు, బంద్‌లు, ధ్వంసాలతో దేశమంతా అట్టుడికిపోయింది. చివరికి 1993 నుండి సుప్రీంకోర్టు తీర్పుతో కేంద్ర విద్య, ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు బీసీలకు పాక్షికంగా అమలవుతున్నాయి. అయితే ఈ సందర్భంలో వచ్చిన ఆందోళనలో వ్యక్తమైన అగ్రకులతత్వం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రిజర్వేషన్ల పట్ల వ్యతిరేకంగా వ్యక్తమైన ఆందోళన వెనుక ఉన్న అగ్రకుల హిందు మతోన్మాద శక్తుల గురించి, వాళ్లు ముందుకు తెచ్చిన ప్రతిఘాతక రూపాల గురించి చర్చించుకోవాలి.

ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు రిజర్వేషన్లు అందించటమంటే అగ్రకులాలు ఏదో కోల్పోతున్నట్లు బాధపడుతున్నారు. తమ జేబుల్లోవి ఇస్తున్నట్లు భావిస్తున్నారు. 52 శాతంగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని బి.పి.మండల్ అగ్రకులాలకు ఎంతగా విన్నవించిన వారి నుంచి వ్యతిరేక స్పందననే వ్యక్తమైంది. బీసీ ప్రజలను విద్యా, ఉద్యోగాలలో భాగం చేయటం వలన ఈ దేశ పాలనలో భాగమయ్యామనే భావన వారిలో కలుగుతుంది, నైతికంగా 'మేము ఈ దేశ ప్రజలమేననే ఆలోచన వారిలో వస్తుంది'. "ఒబిసి రిజర్వేషన్లు ఇతరులకు కడుపుమంట కావచ్చు. భారతదేశాన్ని వదిలిపోయేటప్పుడు బ్రిటిష్ వారూ కడుపుమంటతో బాధపడ్డారు. దక్షణాఫ్రికాలో తమ అణచివేతను నల్లవారు ప్రశ్నించినప్పుడు తెల్లవారు కడుపుమంట చూపారు. 20%గా వున్న అగ్రకులాలు మిగిలిన ప్రజలను సామాజిక అన్యాయానికి గురిచేసినప్పుడు నిమ్నకులాలు కూడా బాధపడ్డాయి. రిజర్వేషన్ల వ్యతిరేకులు చేసే వాదనలన్నీ ఉన్నత వర్గీయుల 'కడుపు మంట'నే సూచిస్తాయి."(మహాజనం మాసపత్రిక; సెప్టెంబర్ 2015.పుట.69) బి.పి.మండల్ చేసిన ఈ కామెంట్స్ వాస్తవ పరిస్థితిని అద్దంపట్టాయి. ఈ సామాజిక వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా, కనీసం వాటి గురించి ఆలోచించకుండా రిజర్వేషన్‌ను గుడ్డిగా వ్యతిరేకించాలనే అగ్రకులతత్వం ఈ ఆందోళనల వెనుక ఉంది.

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు వచ్చినప్పుడల్లా అగ్రకులాలు, భూస్వాములు, పాలకులు, మీడియా ఏకమై దూరదృష్టితో ఈ ఆందోళనలను రెచ్చగొడుతున్నారు. రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన భౌతిక శక్తులను తయారుచేస్తున్నారు. ప్రయత్న పూర్వకంగానే ఒక దాడికి కావల్సిన చెత్తను తయారుచేసి పెడుతున్నారు. వీరు సృష్టించిన ఈ భావజాలం తర్వాతి తరాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. సాధారణంగా పాలకులు ప్రజల కోసం ప్రవేశపెట్టే రిజర్వేషన్ లాంటి సంస్కరణలను ప్రజల మీద ప్రేమతో కాదు, సమాజంలో తీవ్రమవుతున్న సంక్షోభాన్ని పక్కదారి పట్టించటం కోసం వీటిని ఉపయోగిస్తుంటారు. అగ్రకుల పేదలను కూడా రెచ్చగొట్టి లేనిపోని విషయాలను వాళ్లలో నూరిపోసి రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా కూడగట్టటంలో పాలకులకు ఒక ఉద్దేశం ఉంటుంది. అదేమంటే, పాలకుల విధానాల పట్ల అన్ని కులాలలో ఆగ్రహం వ్యక్తమవుతూ ఉంటుంది. ఈ ఆగ్రహాన్ని తగ్గించటం లేదా పక్కదారి పట్టించటం లాంటి పనులు పాలకులు చేస్తారు. కనుక

రిజర్వేషన్ వ్యతిరేకతను ఆ ప్రజలలో ప్రోది చేసి వారి పోరాట చైతన్యాన్ని పక్కదారి పట్టిస్తారు. ప్రజలలో వచ్చిన ఈ ప్రతిఘాతక ఆందోళన కేవలం రిజర్వేషన్ల విధానాన్ని వ్యతిరేకించటం వరకే పరిమితం కాకుండా సమాజ మార్పు కోసం జరుగుతుండిన పోరాటాల మీద ఆ ప్రభావం ఉంటుంది. రిజర్వేషన్లను పొందలేని వర్గం సహజంగానే పొందుతున్న వర్గంపై ఈర్ష్యా భావాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఈ సంకుచిత భావజాలాన్ని పెంపొందించే చర్యలను పాలకులు చాలా జాగ్రత్తగా చేపడుతారు. ఈ విధంగా రిజర్వేషన్ విధానాన్ని పరిహాసానికి గురిచేసే ప్రయత్నం పాలకులు చేస్తారు. ఏ సంస్కరణ విషయంలోనైనా ఇదే వ్యవహారశైలి ఉంటుంది. రిజర్వేషన్లను సమర్థిస్తూ పాలకులు ప్రకటనలు చేస్తుంటారు. ఈ ప్రకటనలతో పాటు వాటికి వ్యతిరేకమైన భావజాలాన్ని కొన్నిసార్లు బాహాటంగాను, మరికొన్నిసార్లు కనపడని రూపాల్లోను వ్యక్తం చేస్తుంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజల పట్ల జాలి కురిపిస్తున్నట్లు ప్రకటించే పాలకులు, అదే సందర్భంలో ఈ వర్గాల ప్రజల పట్ల అగ్రకులాలకు ద్వేషం కలిగేటట్లు కూడా చేయగలుగుతారు. ఉదాహరణకు 'ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కొనసాగుతాయని' చెప్పే బదులు ప్రతీ పదేళ్ల కొకసారి వారికి రిజర్వేషన్లు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయటం వలన అగ్రకుల ప్రజలలో స్పర్థలను రాజేస్తూ ఉంటారు. బీసీ రిజర్వేషన్ విషయంలోనైతే రాష్ట్రానికో విధానం ఉంది. అంటే రాష్ట్రాల వారిగా ప్రజలను రెచ్చగొట్టి పాలకులు పబ్బం గడుపుకోవచ్చు.

## రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు-అగ్రకులతత్వం:

మండల్ కమీషన్ సందర్భంలో కాని, అంతకు ముందూ ఆ తర్వాత రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నది ఎక్కువగా పట్టణ మధ్యతరగతి, ఉన్నత అగ్రవర్గాల సైద్ధాంతిక ప్రతినిధులు. పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న మధ్యతరగతిలోనూ, ఎగువ తరగతిలోనూ ఉన్నది కేవలం అగ్రకులాలే. కనుక రిజర్వేషన్ వ్యతిరేకులు అగ్రకులతత్వంతోనే వ్యవహరిస్తున్నారనే విషయాన్ని వేరే చెప్పనక్కర్లేదు. భూస్వామిలోనూ, బ్రాహ్మణులలోనూ, అగ్రకులాలలోనూ ఆధిపత్య భావాలు ఉంటాయి. ప్రజలందరు తమ చెప్పుచేతల్లో ఉండాలని, వాళ్ల బతుకుదెరువు కోసం తమ మీద ఆధారపడాలని వీళ్లు కోరుకుంటారు. సమాజంలో వచ్చిన ఏ అవకాశాన్నైనా ముందు వీళ్లే పొందాలనుకుంటారు. అది విద్య అయినా, ఉద్యోగాలైనా, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమైనా. 'మేం తెలివి కలిగిన వాళ్లం కనుక జ్ఞానం మా సొత్తు, మిగతా కింది కులాలు మా నుంచి జ్ఞానాన్ని అర్థించాలి, అవసరమైన మేరకే మేం అందిస్తాం, దేనికోసమైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు మా మీద ఆధారపడాలి. ఆ కులాలకు స్వతంత్ర మనుగడ ఉండకూడదని' అగ్రకులాలు అనుకుంటాయి. అందుకే కొన్ని ఉపరితల అవకాశాలైన ఈ కులాలకు అందుతున్నాయంటే అగ్రకులాలు జీర్ణించుకోలేవు. తమ ఆధిపత్యం పోతుందనే భావనకు గురవుతారు. తమలో వివిధ రూపాల్లో ఉన్న అగ్రకుల తత్వాన్ని బయటపెట్టుకుంటారు. ఈ సందర్భంలో వాళ్లు ఎంపిక చేసుకున్న నిరసన రూపాలు, ఉపయోగిస్తున్న భాష వారిలో ఇమిడి ఉన్న అగ్రకులతత్వాన్ని వ్యక్తం చేస్తుంది. మొత్తంగా రిజర్వేషన్ పాలసీనే వ్యతిరేకిస్తూ, సమాజంలో అణచివేయబడుతున్న మనుషుల కోసం జరిగే ఏ ప్రయత్నం పట్లనైనా అసహనం వ్యక్తం చేసే ధోరణిని పెంచుకుంటున్నారు.

రిజర్వేషన్ పట్ల అగ్రకులతత్వాన్ని ప్రదర్శించే సందర్భంలో మూడు విషయాలను వాళ్లు ఆధారం చేసుకుంటున్నారు.

1. ప్రతిభను ముందుకు తీసుకరావటం
2. మీడియాను ఉపయోగించుకోవటం
3. దళితులు చేసే వృత్తులను నిరసన రూపాలుగా వాడుకోవటం.

## ప్రతిభ:

ఈ దేశంలో రిజర్వేషన్ చర్చ వచ్చినప్పుడల్లా వెంటనే అగ్రకులాలు ముందుకు తీసుకవచ్చేది 'ప్రతిభ' నినాదం. అగ్రకులాలే ప్రతిభావంతులైనట్లు, తల్లి గర్భం నుంచే ప్రతిభను హారంగా ధరించి బయటికి వచ్చినట్లు, మిగతా ఉత్పత్తి కులాలకు ప్రతిభ లేనట్లు వీళ్లు ప్రచారం చేస్తారు. నిజానికి 'ప్రతిభ' అనే భావన పెట్టుబడిదారి సమాజాలకు, అగ్రకుల బ్రాహ్మణీజానికి సంబంధించినది. భారతదేశంలో బ్రాహ్మణిజం జ్ఞానాన్ని కేంద్రీకరించుకుంటుంది. సంస్కృత భాషలోనే జ్ఞానాన్ని ఇమిడ్చి, ఆ భాషను వేరే కులాలు నేర్చుకోకుండా ఆంక్షలు విధించే చరిత్ర బ్రాహ్మణిజానికి ఉంది. ప్రతిభ తమ ఒక్కరి సొత్తుగా ప్రచారం చేసుకుంటూ విద్య ద్వారా మిగతా కులాల మీద ఆధిపత్యం చలాయించే లక్షణం బ్రాహ్మణిజానిది. దీనిని మించిన శక్తి కలిగినది పెట్టుబడిదారి అత్యున్నత దశ అయినా సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదం సామూహికతను ధ్వంసం చేస్తుంది. వైయక్తికతకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తిగొప్పతనాన్ని నిలబెడుతుంది. ఉత్పత్తి శక్తుల కృషిని పక్కకుపెట్టి వ్యక్తులు సాధించిన విజయాలను గొప్పగా కీర్తిస్తుంది. సమాజం మొత్తానికి ఉండే జ్ఞానాన్ని అలక్ష్యం చేసి వ్యక్తిగత ప్రతిభను పొగుడుతుంది. కనుక బ్రాహ్మణిజమైన, సామ్రాజ్యవాదమైన 'ప్రతిభ'కు ప్రాధాన్యతను ఇస్తుంది. భారతదేశంలోనైతే ఆ ప్రతిభ అగ్రకులాలకే ఉంటుందని బ్రాహ్మణిజం అంటుంది. పెట్టుబడిదారి విధానమైతే ప్రతిభ పెట్టుబడిదారులకే ఉంటుంది కనుకనే యాజమానులం కాగలిగామని చెబుతుంది. అందుకే రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ముందుకొచ్చిన ప్రతిభ వాదన వెనుక అగ్రకుల బ్రాహ్మణిజం, సామ్రాజ్యవాద భావజాలం ఉంది.

రిజర్వేషన్లు అమలుచేయటం వలన ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతుందనే ఒక డొల్లవాదనను ముందుకు తెస్తుంటారు. ఒకరకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు ప్రతిభ లేదని చెబుతూ వాళ్లను కించపర్చే నినాదాలు ముందుకు వస్తున్నాయి. రిజర్వేషన్ల వలన దేశానికి ప్రతిభ అందకుండా పోతుందని అగ్రకులాలు ఏడుస్తున్నాయి. ఈ ప్రతిభ వాదాన్ని పూర్వపక్షం చేయటం కష్టమైన పనేం కాదు. ప్రతిభ అంటే ఏమిటి? ప్రతిభ ఎవరిలో ఉంటుందని కాస్త సావదానంగా ఆలోచిస్తే అసలు విషయం బయటికొస్తుంది. శ్రమ చేయకుండా దోపిడి చేస్తూ బతికేవాడు ప్రతిభావంతుడా లేక దేశ సంపదను సృష్టిస్తూ కనీసం ఐదు వేళ్లు నోట్లోకి పోని మనుషులు ప్రతిభావంతులా, అంటే చాలా సహజంగానే ఉత్పత్తి కులాలే ప్రతిభావంతులనే సమాధానం వస్తుంది. సమాజ పరిణామంలో ప్రధాన పాత్ర వహించే శ్రమజీవులు లేకుండా తెల్లబట్టల వాళ్లకు జీవితమే లేదు. ఈ తెల్లబట్టల వాళ్లు సాధించిన ప్రతిభ ఏదైనా ఉంటే అది శ్రమజీవులు, ఉత్పత్తి కులాలు పెట్టిన భిక్షనే అవుతుంది.

చచ్చిన పశువును మోసుకెళ్లి దాని చర్మానికి రంధ్రాలు పడకుండా వలిచి, లందలో నానపెట్టి, తంగేడు చెక్కను అందులో కలిపి

కంపువాసన కొడుతున్న తోలును చేతులతో శుభ్రం చేసి దానిని వాకిట్లో పర్చి సున్నం, ఉప్పు రుద్ది శుభ్రంగా తయారుచేసి సువాసన వచ్చేలా మార్చిన తర్వాత తోటి మనిషి కాళ్లకు మెత్తని పరుపులాంటి చెప్పులను కుట్టించిన మాదిగని మించిన ప్రతిభావంతులు ఈ దేశంలో ఎవరున్నారు? మురికి పట్టిన మనిషి బట్టలను సవుడులో కలిపి, కుండలో ఉడుకబెట్టి మల్లెపువ్వులా చేసి ఇచ్చిన చాకలివాళ్లను మించిన తెలివి ఎవరికి ఉంది? ముక్కు ముఖం లేని మట్టి ముద్దను సారె మీద పెట్టి కుండగా మార్చినవాళ్లు, తమ నరాలే దారాలుగా మార్చి బట్టను నేసినవాళ్లు, వెంట్రుకలను కత్తిరించిన మంగలివాళ్లు, భూమిలో సాలుతోలి విత్తనం వేసి పండించినవాళ్లు నాగలి, కర్రుకు జీవకళ అద్దినవాళ్లు వీళ్లందర్ని ప్రతిభావంతులు కాదనేది ఎవరు? ప్రతిభ అంటూ ఉంటే ఈ దేశంలో మొదటి ప్రతిభావంతులు వీళ్లే. ఆ తర్వాతే ఎవరైనా. వేల సంవత్సరాలు వీళ్ల ప్రతిభను మెక్కుతున్న ఈ తెల్లబట్టల వాళ్లు ఉత్పత్తి కులాల ప్రతిభావంతులకు ప్రతిఫలం ఏమిచ్చారు? శూన్యం. దోపిడి చేసారు. ఇవ్వాళ నాలుగు అక్షరాలు నాలుక మీద మొలువగానే ప్రతిభావంతులమని విర్రవీగుతూ వేల సంవత్సరాలుగా చదువుకు దూరమైన నిజమైన ప్రతిభావంతుల పిల్లలకు చదువుకావాలంటే, ఉద్యోగం కావాలంటే ప్రతిభావాదాన్ని ముందుకు తెస్తున్నారు, ఈ అప్రతిభవాదులు.

బాలగోపాల్ చెప్పినట్లు తిట్టుకు తిట్టే సమాధానం అనుకుంటే మీ తెల్లబట్టల ప్రతిభ ఈ దేశానికి ఏమిచేసింది? 65 ఏళ్లుగా ఈ దేశాన్ని పాలిస్తున్నది అగ్రకులాలకు చెందినవాళ్లే. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, మీడియా అధివతులు, భూస్వాములు 90 శాతానికి పైగా అగ్రకులాలకు చెందినవాళ్లే. వీళ్లే ప్రతిభావంతులు అనుకుంటే 65 ఏళ్లలో భారతదేశాన్ని ఎక్కడికి తీసుకెళ్లారు. 55 కోట్ల నిరక్షరాస్యులు, 39 కోట్లు అన్నంలేని వాళ్లు, 5 కోట్ల నిరుద్యోగులు, లంచగొండితనం, దేశాన్ని విదేశాలకు తాకట్టుపెట్టడం, హత్యలు, అత్యాచారాలు-ఈ దేశాన్ని ఈ స్థితిలోకి తెచ్చింది ఈ 'ప్రతిభ'వంతులేగా! వైద్యం సరిగ్గా అందక చచ్చిపోయే రోగులు, చేసిన వైద్యం సరైనది కాక ప్రాణాలు కోల్పోయేవారు ఎందరో ఉన్నారు. ఇంజనీర్లు కట్టిన ఎన్నో కట్టడాలు కూలిపోతున్నాయి. డాక్టర్లు, ఇంజనీర్లు ఈ ప్రతిభావంతులే మరీ! వీళ్లందరు హిందువులు ధర్మగంగ బిందువులు, అగ్రకులాల బంధువులు. ఇప్పటికీ 5 శాతం కూడా మించని ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, నాయకులు, అధికారులు ఈ దేశం ఈ క్షీణస్థితికి రావటానికి కారణమని ఎవ్వరైనా చెప్పగలరా? ప్రతిభకు కొలమానం మార్కులనుకుంటే ఆ మార్కులు వేస్తున్నది కూడా అగ్రకులాలే అధికం. మార్కులే ప్రతిభను నిర్ణయించలేవు; మనిషికి ప్రతిభ కంటే విలువలు ముఖ్యం. ఎంత ప్రతిభావంతుడైనా విలువలు లేకపోతే ప్రయోజనం లేదు. కనుక సమాజానికి కావల్సింది విలువలే కాని ప్రతిభ కాదు. శ్రమలో భాగంగా సామూహిక వ్యక్తీకరణగా ఉన్న తెలివే ప్రతిభ అవుతుంది తప్ప దోపిడిలో నుంచి విలువలు లేని మార్కుల తెలివి ప్రతిభ ఎన్నటికి కాదు.

ప్రభుత్వం రోజు రోజుకు అవకాశాలను కుదించి ప్రభుత్వ రంగాన్ని పెట్టుబడిదారులకు అప్ప చెప్పుతుంటే దాని గురించి మాట్లాడకుండా, ఉన్న కొద్ది అవకాశాలలో రిజర్వేషన్ అమలు విషయానికి వచ్చేసరికి అగ్రకులాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రతిభ గుర్తుకు వస్తుంది. అవకాశాలు పెంచటం కోసం పాలకుల మీద పోరాడే దానికి బదులు బాధితుల మీదే బండలు వేస్తున్నారు. తండ్రి దోపిడి చేసి సంపాదించిన ఆస్తిని 'ప్రతిభ' లేకపోయినా కొందరు కొడుకులకు వారసత్వంగా అందుతున్నది. తండ్రి రాజకీయ నాయకుడైతే ప్రతిభ లేకపోయినా కొడుకు మంత్రి అవుతున్నాడు. అగ్రకులాల కోసం ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ రంగంలో ఏ మాత్రం ప్రతిభ లేకపోయినా డబ్బులు చెల్లిస్తే సీటు దొరుకుతుంది, ఉద్యోగం దొరుకుతుంది. మరి రిజర్వేషన్లను వద్దనేవాళ్లు పుట్టుకతోనే పొందుతున్న ఈ రిజర్వేషన్ల గురించి మాట్లాడరేం? భూమి దున్నేవాడికి ఆ రంగంలో ప్రతిభ ఉన్నట్లు, కనుక భూమి మీద హక్కు అతనికే ఉండాలికదా? పరిశ్రమలో వస్తువుల్ని సృష్టిస్తున్న వాడికి ఆ రంగంలో ప్రతిభ ఉన్నట్లు, మరి కంపెనీ ఆ ప్రతిభావంతుడి చేతుల్లోనే ఉండాలి కదా! అంటే ఆస్తి విషయానికి వచ్చేసరికి ఎలాంటి ప్రతిభ లేకుండానే వారసత్వంగా అందవచ్చు. కాని నాలుగు జీతపురాళ్ల వచ్చే ఉద్యోగం విషయానికి వచ్చేసరికి ప్రతిభ ముందుకొస్తుంది. భూములలో, సంపదలో, ప్రైవేట్ సంస్థలలో వాళ్లకు రిజర్వేషన్లు ఉండవచ్చు, కాని పబ్లిక్ సెక్టారులో మాత్రం ఉత్పత్తి కులాలకు రిజర్వేషన్ అవసరం లేదు. ఈ అగ్రకుల ప్రతిభావంతులనే ఉద్దేశించి ఆనాడు బ్రిటిష్‌వాళ్లు 'మీకు మీ దేశాన్ని పరిపాలించే అర్హత లేదు, అందుకే మీకు స్వాతంత్ర్యం ఇవ్వటం లేదని' అన్నారు. బ్రిటిష్ వాళ్లన్నది నిజమందామా? కాదు. అందుకే అందరం కలిసి పోరాటం చేసి బ్రిటిష్ వాన్ని సాగనంపాం. 'ఈ దేశంలో ఉన్న జ్ఞానం మొత్తం యూరప్‌లో ఉండే ఒక అలమారలోని సగం జ్ఞానానికి సరిపోదని' మెకాలే అన్నది ఈ అగ్రకుల ప్రతిభావంతుల గురించే, అయినా మెకాలే తెల్లజాతి అహంకారంతో ఈ మాట అన్నాడని అందరం భావించాం, వ్యతిరేకించాం. కనుక ప్రతిభ వాదాన్ని ముందుకు తేవటం కేవలం అగ్రకుల తత్వమే తప్ప మరొకటి కాదని అర్థం చేసుకోవాలి.

## మీడియాను ఉపయోగించుకోవటం:

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనల సందర్భంలో అగ్రకులాలు మీడియాను ప్రధానంగా ఉపయోగించుకుంటారు. తద్వారానే తమలోని అగ్రకుల తత్వాన్ని ప్రచారం చేసుకుంటారు. పైగా దేశంలో మీడియా అంతా అగ్రకులాలదే. ఈ మీడియాను ఉపయోగించుకొని కృత్రిమ ఆందోళనలను కూడా అగ్రకులాలు సృష్టించగలుగుతున్నాయి. పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన ఈ పత్రికలు, కట్టుకథలనే ప్రచారం చేస్తాయి. ముఖ్యంగా మండల్ కమీషన్ వ్యతిరేక ఆందోళన సందర్భంగా మీడియా పూర్తిగా అగ్రకుల స్వభావాన్ని చాటుకున్నది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, దాని సంపాదకుడు అరుణ్‌శౌరి ఈ విషయంలో చాలా ముందున్నారు. "విద్యార్థులారా! విద్యార్థేతరులారా భారత జాతీయ ప్రయోజనాల పరిరక్షణ బాధ్యతతో, గాంధేయ మార్గంలో మీ రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా కొనసాగించండి. ఉధృతం చేయండి. వివిధ సంఘాలు, పార్టీలు మీ అవకాశవాదాన్ని వీడి బహిరంగంగా బయటికి రండి. దేశాన్ని నాశం చేసే ఈ విషయాల నుండి జాతిని కాపాడండి(సంపాదకీయం-15 ఆగస్టు, 1990) ఒక జాతీయ పత్రికకు సంపాదకుడిగా ఉండి అరుణ్‌శౌరి లాంటి ఎమర్జెన్సీని వ్యతిరేకించిన వాడే ఇలా రాస్తే మిగతా పత్రికల సంగతి చెప్పరాదు. సంపాదకుడిలా కాకుండా అగ్రకులంలో పుట్టినవాడిగా తన

అహంకారాన్ని చాటుకున్నాడు. ఆయన జాతిని కాపాడమని కోరాడు, జాతి అంటే ఆయన దృష్టిలో 15 శాతం అగ్రకులాలే, 85 శాతం బడుగులు ఆయన జాతిలో లేరు.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలోనే 1988 ఏప్రిల్ 17న ఒక వార్త వచ్చింది. 'రిజర్వేషన్లు ఉండాలి' అని ఒకటికి పదిసార్లు రాసి చివరికి చూడండి ఎలా ముగించారో. "పబ్లిక్ సర్వీసులలో పైకి ఎదగడానికి ఈనాడు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం ప్రతిభ కాదు. శక్తి కాదు. నీవు పుట్టిన కులము అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం' అని రిజర్వేషన్ వ్యతిరేక భావజాలాన్ని చొప్పించింది. చాలా జాగ్రత్తగా వాక్యం మధ్యలో ఇట్లాంటి అగ్రకుల తత్వం బయటికివస్తుంది. 1989లో ఏప్రిల్ 28న ఈనాడులో కులదీపునయ్యరు వ్యాసం రాస్తూ రిజర్వేషన్ల కారణంగా తమకు నష్టం జరుగుతున్నదని ప్రతిభ ఉన్నవాళ్లంతా నిరాశకు గురవుతున్నారని రాసాడు. అంటే రిజర్వేషన్లు పొందుతున్నవారంతా ప్రతిభ లేని వారని ఆ వ్యాసం అంతర్గతంగా చెబుతున్న సారాంశం. ఇప్పటికి ఉద్దేశ పూర్వకంగానే అగ్రకుల మీడియా రిజర్వేషన్ వ్యతిరేక భావాలను సందర్భానుసారంగా వ్యాపింపచేస్తుంది. హార్దిక్‌పటేల్ ఉద్యమ సందర్భంలో లోక్‌సత్తా పార్టీ నాయకుడు జయప్రకాశ్ నారాయణ ఆంధ్రజ్యోతిలో వ్యాసం రాస్తూ కులప్రాతి పదికన కాకుండా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని రాసాడు. ఇదోరకంగా రిజర్వేషన్ పాలసీని దెబ్బతీసే కుట్ర. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాకు ప్రాధాన్యత బాగా పెరిగింది. సోషల్ మీడియాలో మొత్తం అగ్రకులాల ఆధిపత్యం నడుస్తున్నది. బాధ్యతా రాహిత్యంగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎన్నో కామెంట్లు సోషల్ మీడియాలో పెడుతున్నారు. వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండి, ఇంటర్‌నెట్ ఉపయోగించగలిగిన ఆర్థిక స్థోమత ఉంటే ఇష్టమొచ్చిన కామెంట్స్ సోషల్ మీడియా పెట్టవచ్చు. ఈ అవకాశం మెజార్టీగా అగ్రకులాలకే ఉంటుంది.

## దళితులు చేసే వృత్తులను నిరసన రూపాలుగా వాడుకోవటం

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళనలు ప్రారంభమైనప్పుడల్లా అగ్రకులాలు వాడుతున్న నిరసనరూపాలు చెప్పులు కుట్టటం, బూట్ పాలిష్ చేయటం, రోడ్లు ఊడ్వటం ఈ మూడు ప్రధానం. ఇవి కాకుండా ఇంకే రూపాన్ని ఎన్నుకున్నా అవి కూడా ఏదో రకంగా దళితుల కుల వృత్తులే అయి ఉంటాయి. ఇందులో వ్యక్తమవుతున్న అగ్రకుల తత్వాన్ని పరిశీలిస్తే... రిజర్వేషన్ దళితులకు, బీసీలకు ఇస్తున్నారు, కనుక వాళ్లు చేస్తున్న వృత్తులను సంకేతంగా తీసుకోవటం. అట్లే అవి నీచమైన వృత్తులని సమాజానికి చెప్పటం. రిజర్వేషన్ వ్యతిరేకులు సమాజంలో కొన్ని వృత్తులు నీచమైనవని, మరికొన్ని గొప్పవని చెప్పటంలోని వారి అగ్రకులతత్వం బయటపడుతుంది. మాకు ఉద్యోగాలు రాకపోతే బూట్ పాలీష్, రోడ్లు ఊడ్వటం, చెప్పులు కుట్టటం లాంటి వృత్తులే మాకు గతి అని ఆ వృత్తులను చులకన చేస్తూ చూపించటం, వేల సంవత్సరాలుగా ఆ వృత్తులు చేస్తున్న వాళ్ల జీవితాల గురించి ఏనాడు ఆలోచించని అగ్రకులాలకు ఆ వృత్తులను అవమానించే హక్కు ఎక్కడిది? కోటాగాళ్లు అని, దేవుని బిడ్డలని, సర్కారుకు పుట్టినోళ్లని రకరకాల మాటలతో దళితులను కించపర్చే పనికి అగ్రకులాలు పూనుకుంటున్నాయి.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఆందోళన-అగ్రకులతత్వం:

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో ఉండే అగ్రకులతత్వమే కింది కులాలకు కూడా వ్యాపించింది. ఈ దేశంలో నిచ్చెనమెట్ల సమాజంలో బ్రాహ్మణీయ భావజాలం అన్ని కులాలలో వ్యాపించి ఉంటుంది. సామాజిక న్యాయం కోణంలో రిజర్వేషన్లను చూస్తే అట్టడుగున ఉన్నవాళ్లకు మొదట అందాలి. రిజర్వేషన్ల విషయంలో అంబేద్కర్ ఆలోచన కూడా ఇదే. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను భారతదేశంలోనూ ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోను మాలలు అధికంగా, తర్వాత మాదిగలు అనుభవించారు. మిగతా 59 కులాలకు ఆ ఫలితాలు అందలేదు. అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలితాలు అందాలని దండోరా ఉద్యమం వచ్చినప్పుడు కొందరు మాలలు వర్గీకరణను వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చారు. రిజర్వేషన్‌ను వ్యతిరేకించే సందర్భంలో అగ్రకులాలు ఏ విషయాలనైతే ముందుకు తీసుకొచ్చాయో అవే విషయాలను మాల నాయకత్వం ముందుకు తెచ్చింది. దళితుల మధ్య ఐక్యత దెబ్బతింటుందని, ప్రతిభ దెబ్బతింటుందని మాట్లాడారు, రాసారు. వీళ్లు కులం రీత్యా అగ్రకులాలు కాకపోవచ్చు, కాని అగ్రకులతత్వం పనిచేయటం వలన ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకించారు. ఇప్పటికీ ఆ సమస్య ఇరవై ఏళ్లుగా అపరిష్కృతంగా ఉంది. అగ్రకులాలను విమర్శించే ప్రతి సందర్భంలో అంతర్గతంగా ఉండే ఈ సమస్య ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణలో ముందుకు వస్తుంది. న్యాయమైన డిమాండ్స్ ముందుకొచ్చినప్పుడల్లా ఇట్లాంటి ప్రతిఘాతక ఆందోళనలు పుట్టుకొస్తున్నాయి. విచిత్రమేమిటంటే వర్గీకరణ కావాలని కోరుకున్నవాళ్లు, మేధావులు, నాయకులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను వ్యతిరేకించారు. ఈ అన్ని సందర్భాలలో సామాజిక న్యాయం అనే భావన కంటే స్వార్థ ప్రయోజనాలే ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. కనుక సామాజిక న్యాయం కోసం సైద్ధాంతిక అవగాహనను పెంచుకోవటం వలననే ఈ సమస్యలను అధిగమించగలం.

## హార్దిక్‌పటేల్ పటీదార్ల ఆందోళన-అగ్రకులతత్వం:

2015లో గుజరాత్‌కు చెందిన హార్దిక్‌పటేల్ 'మమ్మల్ని ఓబిసిలో చేర్చండి లేకపోతే రిజర్వేషన్‌ను తొలగించండనే' నినాదంతో ముందుకు వచ్చాడు. మాకు అన్నం పెట్టండి లేదంటే మేము ఎవ్వరిని తిననియ్యమనే పద్ధతిలో వీళ్లు మొదలయ్యారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, గుజరాత్, ఢిల్లీ, బాంబే పలుచోట్ల దేశ విదేశాలలో బలమైన వ్యాపారాల కలిగిన పటీదార్లు ఇవ్వాళ రిజర్వేషన్స్ అడగటంలో ఏమాత్రం న్యాయం లేదు. వీళ్ల వెనుక ఆర్ఎస్ఎస్, బిజెపి ఉండి ఉద్యమాన్ని నడిపిస్తుంది, దీని ఉద్దేశ్యమేమిటంటే రిజర్వేషన్ విధానాన్ని మరోసారి చర్చనీయం చేసి దానిని రద్దు చేయాలన్నదే వీరి లక్ష్యం. అంతిమంగా ఈ ఆందోళన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దుచేయించే వైపుగా వీరి ప్రయత్నం. బిజెపి అధికారంలో ఉన్న ఈ సందర్భంలో ఈ వాదనను ముందుకు తెచ్చారు. ఒకవేళ ఇది సాధ్యంకాకపోతే, కనీసం రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికగా ఇచ్చే విధంగా చర్చను మళ్లించవచ్చునని వీరి కోరిక. కుల ప్రాతిపదికన సామాజిక వివక్షను అనుభవించిన కులాలను సమాజ స్రవంతిలోకి తీసుకరావటం కోసం రిజర్వేషన్లను రాజ్యాంగ నిర్మాతలు ఉద్దేశించారు.

అంతేకాని ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లను ఇవ్వలేదు. ఒకవేళ అదే జరిగితే అగ్రకులాలలోని పేదలే మొత్తం రిజర్వేషన్‌ను అనుభవించే ప్రమాదం ఉంది. "సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాం సాధించాలనీ, స్థితిగతులలోనూ, సౌకర్యాలలోనూ, అవకాశాలలోనూ ఉన్నా అంతరాలను తొలగించాలనీ, షెడ్యూల్డు తెగలతో సహా బలహీనవర్గాల విద్యా, ఆర్థిక అవసరాలను తీర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలనీ రాజ్యాంగం ఇంత స్పష్టం చేసిన తరువాత కులం ప్రాతిపదిక మీద రిజర్వేషన్లను ఏమని వ్యతిరేకిస్తారు"?(రిజర్వేషన్లు-ప్రజాస్వామిక దృక్పథం; 2013. పుట.29) అని బాలాగోపాల్ స్పష్టమైన వివరణ ఇచ్చారు.

ఇక ఇటీవల 'క్రీమిలేయర్' వాదన ముందుకు వస్తుంది. 1997లో బి.జె.పి అధికారంలో ఉన్నప్పుడు ఈ వాదన ముందుకు వచ్చింది. తిరిగి 2015లో ముందుకు వస్తుంది. ఈ దేశంలో ఎవరి ఆదాయ పరిమితిని ఎవరు ఎట్లా నిర్ణయం చేయగలరు. ఉదా: వ్యవసాయం చేసుకునే రైతు ఆదాయం ఒక క్లర్క్ కంటే ఎక్కువగా ఉండవచ్చు, అంతమాత్రాన రైతు అభివృద్ధి చెందినట్లు కాదు, క్లర్క్ వెనుకబడినట్లు కాదు. క్లర్క్ చదువుకున్నాడు, ఉద్యోగంలోకి కూడా వచ్చాడు. కాని రైతు ఇంకా అక్షరజ్ఞానానికి దూరంగా ఉన్నాడు. అందుకోసం వర్గ సమాజం ఉన్నంతకాలం ఈ దోపిడి వ్యవస్థలో సామాజిక అణచివేతకు గురవుతున్న ప్రజలకు రిజర్వేషన్లు ఉండాల్సిందే. రిజర్వేషన్లు అనేవి కొన్ని ఉపశమనాలే తప్ప విముక్తి మార్గాలు కావు. కనుక ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు తమకు రాజ్యాంగం ప్రకారం దక్కవల్సిన అవకాశాల కోసం పోరాడుతూనే, సంపదపై హక్కు కోసం జరిగే పోరాటాలలో భాగం కావాలి. ఈ వర్గాలు తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ విముక్తి కోసం చేస్తున్న పోరాటాలకు అగ్రకులంలో ఉండే పేదలు మద్దతుగా నిలబడి అగ్రకుల దోపిడి పాలకులను ఓడించటంలోనే అందరి విముక్తి ఉంది.

**జ్ఞాపికలు**


1. అంబేద్కర్ రచనలు-ప్రసంగాలు-9; 1994, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
2. శంబూకుడు రిజర్వేషన్లపై 1991-విజృంభణ ప్రచురణలు
3. బాధితుల మీదే బండలు; 1990-సమతా సంఘటన
4. రిజర్వేషన్లు; 1990-ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
5. కె.బాలగోపాల్ రిజర్వేషన్లు 2013-పర్‌స్పెక్టివ్
6. ఎన్.కె.ఆచార్య భారత సంవిధానం 2008-ఏసియా లా హౌస్
7. అద్వితీయుడు; 2014-హైదరాబాద్ బుక్‌ట్రస్ట్
8. డబ్ల్యు.ఎన్.కుబేర్ అంబేద్కర్ 2012-ప్రజాశక్తి
9. కాత్యాయని ఛత్రపతి సాహు 2007-హైదరాబాద్ బుక్ ట్రస్ట్
10. అను.రివేరా; మంద్రస్థాయి యుద్ధం; 2014-విరసం
11. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు; 2015-నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్
12. మహాజనం(మాసపత్రిక); సెప్టెంబర్ 2015
13. నడుస్తున్న తెలంగాణ(మాసపత్రిక); అక్టోబర్ 2015


---

*(25వ పేజీ తరువాత...)*

రాజకీయాలను ఎత్తిపడదాం' అనే నినాదాన్ని కేంద్ర కర్తవ్యంగా తీసుకొని పనిచేయాలని, ఈ అంశంపై విస్తృతంగా సాహిత్యాన్ని వెలువరించాలని నిర్ణయించింది. ఈ పనిలో లౌకిక ప్రజాస్వామిక శక్తులన్నిటినీ కలుపుకుపోతూ విశాల ప్రాతిపదికన ఇప్పటికే జరుగుతున్న ప్రయత్నాలకు విరసం మరింత తోడ్పడుతుందని తెలియజేస్తున్నది.

బోల్షివిక్ విప్లవ విజయానికి వందేళ్ల సందర్భం:2017 నాటికి బోల్షివిక్ విప్లవ విజయానికి వందేళ్లు పూర్తవుతాయి. ఆ ఏడాది మే నాటికే నక్సల్బరీకి యాభై ఏళ్ళు నిండుతాయి. 2018 మార్క్స్ 200వ జయంతి. 2019 అక్టోబర్ నాటికి చైనా విప్లవానికి డెబ్బై ఏళ్ళు. వందేళ్ళకు, యాభై ఏళ్ళకు ఏ ప్రత్యేకతా లేదు కానీ ప్రస్తుత సంక్షుభిత వాతావరణంలో బూర్జువా ప్రజాస్వామ్యం పూర్తిగా విఫలమైపోయి, ఫాసిస్టు రూపు తీసుకుంటున్న దశలో చారిత్రక మైలురాళ్లను గుర్తించుకునే సందర్భాలు వస్తున్నాయి.

ఒక వైపు దేశం తర్వాత దేశం సామ్రాజ్యవాద మార్కెట్ సంక్షోభంలో కూరుకుపోతున్నది. సామ్రాజ్యవాదుల దురాక్రమణ యుద్ధాల్లోనో, అవి ప్రేరేపిస్తున్న అంతర్యుద్ధాల్లోనో నెత్తురోడుతున్నాయి. ఫాసిజం మానవజాతిని తిరోగమనం వైపు తోసేస్తూ ఉంది. మరోవైపు ఈ దుర్మార్గమైన వ్యవస్థకు ప్రత్యామ్నాయమే లేదని చెప్పే సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రత్యామ్నాయ ప్రయత్నాలను, స్వావలంబన ఆర్థిక విధానాలను(ఇంకా ఏవైనా మిగిలి ఉంటే) హింసాత్మకంగా నిర్మూలించేందుకు తెగబడుతున్నది. బూర్జువా ప్రజాస్వామ్యం మానవాళికిచ్చిన హామీలు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం హాస్యాస్పదంగా తయారైనాయి. విప్లవాలకు ఎంత పరిపక్వమైన పరిస్థితులు ఉన్నా ప్రస్తుత దశలో సోషలిస్టు విప్లవ శక్తుల బలం తగినంతగా లేదన్న మాట కూడా వాస్తవం. అయితే శక్తివంతమైన కార్మికవర్గ విప్లవాలు కనిపించనప్పటికీ సామ్రాజ్యవాద మార్కెట్ అత్యాశపట్ల, విపరీతమైన సంపద కేంద్రీకరణ పట్ల, తీవ్రతరమవుతున్న అసమానతలపట్ల వ్యతిరేకత బలపడుతున్నది.

ఈ పరిస్థితుల్లో సోషలిజం పక్షాన, వర్గపోరాటం పక్షాన, పీడిత ప్రజల పక్షాన శక్తివంతంగా సైద్ధాంతిక పోరాటం చేయవలసిన అవసరాన్ని విరసం గుర్తిస్తున్నది. పైన చెప్పిన చారిత్రక ఘట్టాలను వర్తమాన సన్నివేశం వద్దకు తీసుకొచ్చి నాలుగేళ్లలో విస్తృతంగా మార్క్సిజంపైన, సోషలిస్టు ప్రత్యామ్నాయం పైన అధ్యయనం, చర్చ, సాహిత్య ప్రచురణ చేపట్టాలని జూన్ 7న జరిగిన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో విప్లవ రచయితల సంఘం తీర్మానించింది. 'సోషలిజమే ప్రత్యామ్నాయం, నక్సల్బరియే భారత విప్లవ పంథా' అనే నినాదంతో సైద్ధాంతిక, భావజాల రంగాల్లో నిర్దిష్ట కార్యాచరణతో పనిచేయాలని నిర్ణయించింది. సైద్ధాంతిక రంగంలో వర్గపోరాట ఆచరణతో 'వ్యవస్థను అర్థం చేసుకోవాలన్నా, మార్చాలన్నా మార్క్సిజమే మార్గం' అన్న సత్యాన్ని ఎలుగెత్తి చాటాలని, ఈ పనిలో భావసారూప్యత ఉన్న సంస్థలతో, వ్యక్తులతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది.

సాహిత్య సాంస్కృతిక రంగాల్లో ఫాసిజానికి వ్యతిరేకంగా మార్క్సిజం, లెనినిజం, మావోయిజం వెలుగులో ప్రత్యామ్నాయ రాజకీయ సాంస్కృతిక భావజాల వేదికగా మరింత శక్తివంతంగా విరసం పనిచేస్తుందని 25వ మహాసభల సందర్భంగా మరోసారి తెలిజేస్తున్నాం.

విప్లవం వర్ధిల్లాలి.
విప్లవాభివందనాలతో
విరసం కార్యదర్శి

# మంద్రస్థాయి యుద్ధ సందర్భంలో..
# 'హిందూ ఫాసిజాన్ని ఎదిరిద్దాం, ప్రత్యామ్నాయ సంస్కృతీ రాజకీయాలను ఎత్తిపడదాం' అనే పిలుపునిచ్చిన విరసం 25వ మహాసభలు

జనవరి 9,10 తేదీల్లో ఆత్మహత్యలు, హిందుత్వ హత్యలు మాంద్రస్థాయి యుద్ధసందర్భం అంశం కేంద్రంగా విరసం 25వ మహాసభలు విజయవాడలో కామ్రేడ్ చలసాని ప్రసాద్ నగర్ (మొగల్రాజపురం), బీడీ శర్మ హాలులో (సిద్దార్థ కాలేజీ ఆడిటోరియం), కామ్రేడ్ ద్రోణవల్లి అనసూయమ్మ వేదికపై విజయవంతంగా జరిగాయి.

ఉదయం 10.30కు నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, కలబుర్గి, అఖ్లాక్‌ల ప్రాంగణంలో వతాకావిష్కరణతో కార్యక్రమం ప్రారంభమయ్యింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు పతాక ఎర్రజెండాను ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలోని రంగబయలులో బూటకపు ఎన్ కౌంటర్ లో అమరుడైన కామ్రేడ్ సూర్యం తల్లి రత్తమ్మ, తల్లి సుబ్బయ్య ఆవిష్కరించారు. అమరుల స్థూపాన్ని వరంగల్ జిల్లా మేడారం ఎన్‌కౌంటర్ లో అమరుడైన విద్యాసాగర్ తల్లిదండ్రులు లత, సుధాకరరెడ్డి ఆవిష్కరించగా విరసం పతాకాన్ని అదే బూటకపు ఎదురుకాల్పుల్లో అమరురాలైన శృతి తల్లిదండ్రులు రమ, సుదర్శన్ ఆవిష్కరించారు. విరసం పతాక గీతాన్నివిరసం సాంస్కృతిక బృందం ఆలపించింది. ప్రజాకళామండలి కార్యదర్శి కోటి రెండురోజుల క్రితమే జైలు నుండి విడుదలై తన బృందంతో కలిసి అమర కళాకారులపై పాట పాడారు.

సుమారు 11.30కి సభ ప్రారంభమైంది.

మహాసభల్ని ప్రారంభించాల్సిన సి.వి. తీవ్ర అనారోగ్యం కారణంగా రాలేకపోయారు. ఈ విషయం తెలుపుతూ తన సందేశాన్ని పంపించారు. "ఈనాడు దేశంలో భయంకరమైన మత పరిస్థితులు ఉన్నాయి. అంధమత విశ్వాసాలు విజృంభిస్తున్నాయి. అందువలన సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం నేడు ఎంతో అవసరం. 25వ విరసం మహాసభలు జయప్రదంగా జరగాలని కోరుతున్నాను." - సి.వి.

**సౌహార్ద్ర సందేశాలు ఇచ్చిన వారు :**

దివికుమార్ (జనసాహితి), కొండపల్లి మాధవరావు (అరసం), నారాయణ (సాహితీ స్రవంతి), మల్లీశ్వరి (ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక), కె.ఎస్.సి.బోస్ (సంగమం), ఎన్.అంజయ్య (సోషల్ సైన్సెస్ ట్రస్ట్), బుడ్డిగ జమీందార్ (అభ్యుదయ వేదిక), కోయ వెంకటేశ్వర్లు (ప్రజా సైన్సు వేదిక), సామల రమేశ్ బాబు (అమ్మ నుడి సంపాదకులు), రాఘవాచారి (విశాలాంధ్ర), తాటిశ్రీకృష్ణ (విమర్శకులు), కృష్ణ (కులనిర్మూలన పోరాట సమితి), కోటి (ప్రజా కళా మండలి), అయ్యన్న (నాస్తిక సమాజం), అంజమ్మ (అమరుల బంధుమిత్రుల సంఘం), ఆంజనేయులు (పౌరహక్కుల సంఘం), దేవేంద్ర (చైతన్య మహిళా సంఘం), కొండారెడ్డి (ప్రగతిశీల కార్మిక సమాఖ్య), క్రాంతి కుమార్ (దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం), మహేశ్ (తెలంగాణ విద్యార్థి వేదిక)

**మహాసభ ఆమోదించిన తీర్మానాలు :**

1. ప్రొఫెసర్ సాయిబాబాను వెంటనే విడుదల చేయాలి. అరుంధతీరాయ్ పై కంటెంప్ట్ ఆఫ్ కోర్టు ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలి

పద్నాలుగు నెలల అండాసెల్ నిర్బంధం తర్వాత కామ్రేడ్ జి.ఎన్.సాయిబాబా బొంబాయి చీఫ్ జస్టిస్ డివిజన్ బెంచ్ మొదట మూడునెలలు, ఆ తర్వాత మరో మూడు నెలలు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. అది కూడా షరతులతో కూడిన బెయిలు. ఢిల్లీలో ఉండాలని, తీవ్ర అనారోగ్య స్థితిలో ఉన్నాడు గనుక చికిత్స చేయించుకుంటూ ఆసుపత్రి రిపోర్టు కోర్టుకు అందజేయాలని. ఈ ఆరునెలల కాలంలో ఆయన న్యూవర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉండి చికిత్స చేయించుకోవాలసి వచ్చింది. ఆ తర్వాత కూడా క్రమం తప్పకుండా అవుట్ పేషంటుగా చికిత్స అవసరం అని ఆ ఆసుపత్రి నివేదిక ఇచ్చింది. జి.ఎన్.సాయిబాబా కున్న తొంభై శాతం అంగవైకల్యంతోపాటు జైలు నిర్బంధంలో ఆయనకు గుండె, నరాలకు సంబంధించిన జబ్బులు, గుండెపోటు, మధుమేహం వంటి చాలా వ్యాధులు బయట పడినాయి. ఇటువంటి సంక్లిష్టమైన అనారోగ్యానికి చికిత్స చేయగల ఆసుపత్రి ఢిల్లీలో అది ఒక్కటే ఉన్నది. ఈ స్థితిలో కూడా ఆయన గడ్చిరోలీలో కేసు వాయిదాకు హాజరయ్యారు. ఆయన తీవ్ర అనారోగ్య స్థితిని చూసి గడ్చిరోలి సెషన్స్ కోర్టు ప్రతి వాయిదాకు రానక్కర్లేదనీ మినహాయింపు ఇచ్చింది.

ఇటువంటి స్థితిలో సాయిబాబా కాలపరిమితి లేని బెయిల్ కొరకు నాగపూర్ హైకోర్టు సింగిల్ బెంచ్ ముందు పిటిషన్ వేస్తే అది నిరాకరించబడింది. తనకన్న పై స్థాయిలో ఉన్న బెంచీ ఇచ్చిన తాత్కాలిక బెయిల్ వారం రోజులు మిగిలి ఉండగానే నాగపూర్ జైలుకు వెళ్ళి తనకు తాను అప్పగించుకోవాలని నలభై ఎనిమిది గంటల గడువు విధించింది. ఆయన చిన్నతనంలోనే వచ్చిన పోలియో వల్ల ఏర్పడిన అంగవైకల్యమే తప్ప అదనపు అనారోగ్యం జైలు నిర్బంధం వల్ల వచ్చిందేమీ లేదన్నది. ఆయన నాగపూర్ హై సెక్యూరిటీ జైలులో అండా సెల్ లో ప్రభుత్వ విశ్రాంతి గృహంలో అత్యంత ప్రముఖులు పొందే ఆతిథ్యం పొందుతున్నాడని వ్యాఖ్యానించింది.

జి.ఎన్.సాయిబాబా జైలు జీవితం ఏడాది పూర్తి చేసుకున్నా సందర్భంగా ఔట్ లుక్‌లో అరుంధతీ రాయ్ ఆయనను ప్రజలపై జరుగుతున్న యుద్ధంలో యుద్ధఖైదీగా అభివర్ణించింది. గ్రీన్ హంట్ ఆపరేషన్ పేరుతో ప్రజల మీద జరుగుతున్నా యుద్ధాన్ని ఆయన

ఖండిస్తూ దేశవ్యాప్త ప్రచారానికి పూనుకున్నాడు గనుకనే ఆయనను నిర్బంధించారని అభిప్రాయపడింది. ఆ వ్యాసం 'ప్రజల్ని ప్లేగు వ్యాధి వలె ఆక్రమించిన మావోయిజాన్ని బలపరచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కించపరచడానికే రాసిందని అదే కోర్టు ఆమెకు కాంటెంప్ట్ ఆఫ్ కోర్టు నోటీసు కూడా జారీ చేసింది. ఒకవైపు సాయిబాబాకు బెయిల్ నిరాకరిస్తూ గుజరాత్ మారణకాండకు బాధ్యులయి, యావజ్జీవ శిక్ష పొందిన కొడ్నానీ, భాయీ భజరంగ్ వంటి వాళ్ళకు బెయిల్ ఇవ్వడాన్ని, అమిత్ షాను నిర్దోషిగా భావించడాన్ని తప్పుపట్టినందుకు కోర్టు ఆమె న్యాయస్థానాలను అగౌరవపరుస్తున్నదని వ్యాఖ్యానించింది.

ఆదివాసులపై, ఆదివాసుల మధ్య నిలబడిన వాళ్ళను సంఘటితపరచి పోరాడుతున్న మావోయిస్టులపై బహుళజాతి కంపెనీల దళారీగా రాజ్యం చేస్తున్న దాడిలో భాగమే సాయిబాబా, అరుంధతీ రాయ్ లపై కోర్టు చేసిన అభిశంసన, వ్యాఖ్య, తీర్పు. భావప్రకటనా స్వేచ్ఛను నైసర్గిక హక్కుగా భావించే ప్రతి ఒక్కరూ ఈ తీర్పును నిరసిస్తూ కాంటెంప్ట్ ఆఫ్ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని గొంతెత్తాలని, ఉద్యమించాలని విప్లవ రచయితల సంఘం విజ్ఞప్తి చేస్తున్నది.

**2. ఒడిసా ఇటుకబట్టీ కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటూ ప్రాణాలు తీస్తున్న యజమానులను శిక్షించాలి:**

తెలంగాణ రాష్ట్రంలోని ఇటుకబట్టీల్లో పనిచేయడానికి ఒడిసా నుండి కార్మికులు పొట్ట చేతపట్టుకొని వలస వస్తుంటారు. బట్టీల యజమానులు ఒప్పందాల పేరుతో వారిని కట్టు బానిసలు చేసుకుంటూ ప్రాణాలు చిదిమేస్తున్నారు. పని కుదుర్చుకునేందుకు ఒడిసాలోని సర్దార్లతో (దళారీలు) ఒప్పందం కుదుర్చుకుంటారు. కార్మికులకు రోజు కూలీ 200 ఇస్తామని చెప్పి తీరా ఇక్కడికి వచ్చాక కుటుంబంలో ఇద్దరికీ కలిపి 200 ఇస్తూ దోపిడి చేస్తారు. కోడి కూత నుండి మొదలుకొని మధ్యాహ్నం భోజన సమయం మినహాయిస్తే రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా ఒడిసా కార్మికులతో పనిచేయించుకుంటారు. రోజుకు 20 గంటల దాకా కూడా వెట్టి చాకిరీ చేయించుకుంటారు. గత 30 సంవత్సరాలుగా ఇలా భాష రాని రాష్ట్రంలో వారు బాధలేన్నోపడుతున్నారు. వారు ఉండడానికి ఏర్పాటు చేసిన ఆవాసాలు పందుల గుడిసెలను మరపించేలా ఉంటాయి. తల్లిదండ్రుల వెంట వచ్చిన చిన్న చిన్న పిల్లలతో కూడా ఇటుకలు మోయిస్తుంటారు. అనారోగ్యం పాలైనా కార్మికుల పై కనికరం చూపకుండా పనిలోకి రావాల్సిందేనని చిత్రహింసలు పెడతారు. ఒక గర్భిణీ మహిళను కొట్టి చంపిన ఘటన ఒకటి ఇటీవలే చోటుచేసుకుంది. యజమానులు మహిళలు గర్భం దాల్చకుండా మాటలు ఇచ్చి పనిచేయించుకుంటారు. తిండి నిద్ర సరిగా లేకపోవడం, దుర్భరమైన పరిసరాల్లో జీవించడం, పని భారం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలు, వీటికి తోడు యాజమానుల దెబ్బలు తట్టుకోలేక కార్మికులు పారిపోతుంటారు. అలా పారిపోయేవారిని రైల్వేస్టేషన్లలో, బస్టాండుల్లో పట్టుకొని కొట్టి చంపుతున్నారు. కార్మికులు పారిపోకుండా బట్టీల చుట్టూ కరెంటు తీగలు ఏర్పాటు చేయడం మూలాన వాటికి తగిలి చనిపోయిన ఘటనలున్నాయి. యజమానులు చాలా తేలికగా శవాలను పూడ్చి పెడతారు. ఈ దారుణాలను కార్మిక శాఖ అధికారులు, పాలకులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. హక్కుల సంఘాలు వీటిని వెలికి తీసినా, కేసులు నమోదు చేసినా శిక్షలు పడ్డ ఉదాహరణలు లేకపోవడం సిగ్గుచేటు. ఇటుకబట్టీల్లో కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

**3. ఎసైండ్ భూములు పేదలకే చెందాలి**

నిలువనీడ లేని పేద ప్రజలు ఆవాసం కల్పించుకోవడం కోసం కేటాయించిన ఇళ్ల స్థలాలు, అసైండ్ భూములు, అలాగే అనేక సందర్భాలలో ఇలాంటి పేద ప్రజలు సమిష్టి చైతన్యంతో ఆక్రమించుకొని ఏళ్ల తరబడి నివాసముంటున్నవివిధ రకాల ప్రభుత్వ భూముల్ని క్రమబద్ధీకరిస్తామని, ఆ భూములపై, ఇళ్లపై శాశ్వత హక్కు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. 100 గజాల లోపు స్థలాలను క్రమబద్ధీకరిస్తామని, దీని మూలంగా పేదలకు లబ్ది చేకూరుతుందని పాలకులు హంగామా చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే ఎసైండ్ భూములు ఆక్రమించుకున్న వాళ్ళలో పేదాలు మాత్రమే కాక సంపన్న వర్గాలకు చెందిన, పాలక పార్టీలకు చెందిన పెద్దమనుషులు కూడా ఉన్నట్లు తేలింది. వీళ్ళ ఆక్రమణలను కూడా క్రమబద్ధీకరించడానికి పరిమితిని 1000 గజాలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కుటిల ప్రయత్నం వల్ల ఎన్ని వందల కోట్ల రూపాయలు చేతులు మారతాయో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎంత లబ్ది పొందుతారో అందరికీ తెలిసిన విషయమే. దీని వల్ల పేదలకు లబ్ది చేకూరడం కాదు, మరింత నష్టం కలుగుతుంది. పేదలకు చెందాల్సిన అసైన్డ్ భూములన్నీ బడా వ్యాపారస్తుల చేతుల చేతుల్లోకి సునాయాసంగా వెళ్లిపోతాయి. ఈ కుటిల యత్నాన్ని విరమించుకొని నిజమైన పేదల గృహావసారాల కోసం ఎసైండ్ భూముల్ని కేటాయించాలని విరసం డిమాండ్ చేస్తున్నాడి.

**4. బాక్సైట్ తవ్వకాల జీవోను పూర్తిగా రద్దు చేయాలి:**

బాక్సైట్ తవ్వకాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 97ను తాత్కాలికంగా ఉపసంహరించుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నపుడు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించాడు. అధికారంలోకొచ్చాక బహుళజాతి సంస్థల ఆదేశాల మేరకు జీవో నెం. 97ను విడుదల చేశాడు. విశాఖ ఏజెన్సీలోని ఆదివాసులు, ప్రజలు, ప్రజాస్వామికవాదుల తీవ్రవ్యతిరేకత, ఉద్యమాల కారణంగా ఆ జీవోను ఉపసంహరించుకున్నాడు. అయితే ఆదివాసుల అంగీకారంతో తవ్వకాలు జరుపుతామని ఇప్పటికీ చెబుతున్నాడు. దీనిని విరసం తీవ్రంగా ఖండిస్తున్నది. ఆదివాసులను, పర్యావరణాన్ని విధ్వంసం చేసే బాక్సైట్ తవ్వకాల జీవోను పూర్తిగా రద్దు చేయాలని విరసం డిమాండ్ చేస్తున్నది.

**5. భూమిక ప్రియాంకల హంతకులను శిక్షించాలి :**

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మూడుచెక్కల పల్లి గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినులు భూమిక, ప్రియాంకలు సెలవులకు వారి గ్రామాలకు వెళ్ళి తిరిగి నవంబర్ 23న పాఠశాలకు వచ్చారు. నవంబర్ 24 నుండి అదృశ్యమైనారని తెలిసి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిని ప్రశ్నిచారు. వారు నల్లబెల్లి ఎస్సైకి కంప్లైంట్ చేసి తల్లిదండ్రులపైనే కేసు బుక్ చేయించారు. పోలీస్

స్టేషన్ లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే ఎలాంటి విచారణా చేపట్టాక నిర్లక్ష్యం చేశారు పోలీసులు. డిసెంబర్ 27న కుక్కలు ముక్కలు పట్టుకొస్తే మృతదేహాలు బయటపడినవి. అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి ముక్కలుగా నరికి హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని విరసం డిమాండ్ చేస్తున్నది. విచారణ జరిపి పాఠశాల సిబ్బందిపై చర్య తీసుకోవాల్సింది పోగా తల్లిదండ్రులపైనే కేసు నమోదు చేసిన నల్లబెల్లి ఎస్సైపై ఎస్.సి.,ఎస్.టీ. అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విరసం డిమాండ్ చేస్తున్నది. గిరిజన మంత్రులు, ఎం.ఎల్.ఏలు, ఎం.పిలు ఎవరూ స్పందించకపోవడం గర్హనీయం.

**6. విదేశీ, ప్రైవేట్ యూనివర్శిటీల బిల్లును వెనక్కి తీసుకోవాలి :**

నేడు దేశంలో ప్రపంచీకరణను వేగవంతం చేస్తూ విద్యను వ్యాపార సరుకుగా మార్చి, పేదవారికి విద్య అందకుండా చేస్తూ, డబ్బు ఉన్నోడికే విద్యా అందుబాటులోకి తీసుకొచ్చే గాట్స్ ఒప్పందంలో భాగంగా విదేశీ యూనివర్శిటీలను, ప్రైవేట్ యూనివర్శిటీలను దేశంలోకి అనుమతించే ఒప్పందంపై భారత్ సంతకం పెట్టకూడదు. జ్ఞానానికి కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయకుండా సామ్రాజ్యవాద, పెట్టుబడిదారులకు, మల్టీ నేషనల్ కంపెనీలకు ఉపయోగపడే విదేశీ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నది. దీని వల్ల ఎస్.సి, ఎస్.టి, బి.సి. మైనారిటీ విద్యార్థులకు విద్య దూరమయ్యే ప్రమాదముంది. విద్యార్థులకు హక్కుగా రావాల్సిన స్టైఫండ్ రద్దు చేస్తూ చదువుకోవాలంటే బ్యాంకు లోన్లు తీసుకునే విధానం రాబోతున్నది. ఒక వైపు మనువాదాన్ని సిలబస్ లో చొప్పిస్తూ, విద్యలో మతోన్మాద భావాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ, మరోవైపు ప్రైవేట్ యూనివర్శిటీల బిల్లును కేంద్ర ప్రభుత్వం తెస్తున్నది. దీనిని తక్షణం వెనక్కి తీసుకోవాలి.

**7. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఐదుగురు దళిత విద్యార్థుల సస్పెన్షన్, సాంఘిక బహిష్కరణ అత్యంత దుర్మార్గం :**

అట్టడుగు వర్గాల ముఖ్యంగా, శూద్ర, అతి శూద్ర వర్గాల ప్రజలకు విద్యను, స్వేచ్ఛను నిరాకరించింది సనాతన హిందూ ధర్మం. దీన్ని మనువు రాసిన ధర్మశాస్త్రం క్రీ.శ. 4వ శతాబ్దంలో వ్యవస్థీకృతం చేసింది. తదనంతర భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాల పాలకులు కుల వ్యవస్థను కాపాడుతూ వస్తున్నారు. దళిత వర్గాల ప్రజలపై ఆధిపత్య కులాహంకారులు భౌతిక, మానసిక దాడులకు పాల్పడటం ప్రస్తుత బి.జె.పి పాలకులతో రెట్టింపు అయ్యింది. విద్యా కార్పొరేటీకరణతో పాటు కాషాయీకరించబడుతున్న ప్రమాదంలో మనమున్నాం. పాఠశాలలు మొదలుకొని విశ్వవిద్యాలయాల స్థాయి వరకు మనుధర్మ శాస్త్రం సృజనాత్మకంగా అమలవుతున్నది. విశ్వవిద్యాలయాల్లోకి ప్రవేశిస్తున్న తిలితారామ్ దళిత విద్యార్థులపై దాడులు, బహిష్కరణలు మరింత ఎక్కువయ్యాయి.

హైదారాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులుగా ఉన్న ఐదుగురు దళిత విద్యార్థుల సస్పెన్షన్ మనముందున్న ప్రత్యక్ష ఉదాహరణ. బి.జె.పి ప్రభుత్వం చేత ఇటీవల యాకూబ్ మెమన్ ను ఉరితీసింది. ఈ చర్యకు వ్యతిరేకంగా, మొత్తంగా ఉరిశిక్షలకు వ్యతిరేకంగా మాట్లాడిన అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ కు చెందిన ఐదుగురు దళిత విద్యార్థులను యూనివర్సిటీ యాజమాన్యం బహిష్కరించింది. అంతేకాకుండా వారిని సాంఘిక బహిష్కరణ చేస్తూ వారు కేంటీన్ కు, లైబ్రరీలకు వెళ్ళకూడదని, వారితో ఎవరూ సహకరించకూడదని ఉత్తర్వులు ఇచ్చింది. ఒక ఉన్నత విద్యాకేంద్రం ఇంత దుర్మార్గంగా ఖాప్ పంచాయితీలా వ్యవహించడాన్ని విరసం తీవ్రంగా ఖండిస్తోంది. హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి విరసం సంఘీభావం ప్రకటిస్తోంది.

(ఈ తీర్మానం చేసిన వారం రోజులకే ఆ అయిదుగురు విద్యార్థుల్లో ఒకరైన వేముల రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడు.)

**8. కొత్త ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం పచ్చని పంట పొలాలను ప్రభుత్వం దురాక్రమించడాన్ని నిరసిస్తున్నాం :**

చంద్రబాబు ప్రభుత్వం సామదానభేధ దండోపాయాలన్నీ ప్రయోగించి నవ్యాంధ్ర రాజధాని కోసమని చెప్పి కానీ వినీ ఎరగని రీతిలో భూ ఆక్రమణ చేస్తున్నది. లాండ్ పూలింగ్ పేరుతో 9.2, 9.3 పట్టాల పేరుతో చేస్తున్నదంతా నయవంచన తప్ప మరోటి కాదు. ఎంత సేకరించినా ప్రభుత్వ పెద్దలకు రియల్ ఎస్టేట్ మాఫియాకు దాహం తీరకున్నది. మొదట రైతులకు ఇవ్వటం ఇష్టం లేకపోతే తీసుకోమన్నది. న్యాయమైన నష్టపరిహారమన్నది. రాజధాని స్థలంలో వాటా అన్నది. రైతులను చీల్చింది. అసైన్డ్ భూములున్న పేదలను బెదిరించింది. ప్రతిఘటించిన గ్రామాల్లోకి పోలీసు బలగాలు దింపింది. మూడు నాలుగు పంటలు పండే మాగాణి భూములను, దేశానికి తిండి పెట్టే తల్లి వంటి భూములను వేలాది ఎకరాలు ప్రైవేట్ రియలేస్టేట్ చేతుల్లో పెట్టింది. తమవర్గం వారికి అందినంతా ఇచ్చింది. రాజధాని పేరుతో జరుగుతున్న భూదోపిడి విరసం తీవ్రంగా ఖండిస్తున్నది.

**9. కాల్ మనీ దోపిడి లంపెన్ పెట్టుబడి దుర్మార్గమే :**

విజయవాడలో వెలుగు చూసిన కాల్ మనీ వడ్డీ వ్యాపారాల దుర్మార్గాలు నవ్యాంధ్రప్రదేశ్ ఏ దిశలో ముందుకుపోతోందో తెలియజేస్తున్నాయి. రాజధాని కేంద్రంగా జడలు విప్పుకున్న రియల్ ఎస్టేట్ ఎన్నో దారుణాలకు కారణమవుతున్నది. ఉత్పత్తిని ధ్వంసం చేస్తూ వచ్చిన డబ్బు లంపెన్ కాపిటల్ గా కేంద్రీకృతమై కొత్త కొత్త దోపిడీ విధానాలను తీసుకొస్తున్నది. విజయవాడలో బట్టలైన కాల్ మనీ మాఫియా వ్యవహారం ఫైనాన్స్ పెట్టుబడికి పుడుతున్న విషపురుగులకు ఒక ఉదాహరణ. ప్రభుత్వ ఆర్థిక విధానాలు అవసరాలకు ఎంతకైనా సిద్ధపడి అప్పులుచేసే స్థితికి ప్రజల్ని దిగలాగుతున్నవి. ఎంతకైనా తెగించి అందినకాడికి దోచుకునే మాఫియాను ప్రోత్సహిస్తున్నవి. కాల్ మనీ కొంతమంది వడ్డీ వ్యాపారుల దుర్మాగ్గం మాత్రమే కాదు. అది ఈ వ్యవస్థ దుర్మార్గం. ప్రభుత్వ భూదోపిడి, సింగపూర్ పెట్టుబడుల రాజధాని ఇటువంటి వ్యవస్థలను ఇంకా ఇంకా తయారు చేస్తాయి. సంఘటిత రాజకీయార్థిక పోరాటాలే దీనికి పరిష్కారం.

హిందుత్వ ఎజెండాను అమలుచేస్తున్న ఏ.పి., తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ హిందుత్వ ఎజెండాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు వేగవంతంగా అమలుచేస్తూ

అడుగడుగునా ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన సెక్యులరిజాన్ని ధ్వంసం చేస్తూ ఉన్నాయి. చంద్రబాబు, చంద్రశేఖరావులు ఇద్దరూ పుష్కరాల పేరుతో ప్రభుత్వ సొమ్ము వెచ్చించి నిర్వహించడమే కాదు, భారీగా హిందూ మత ప్రచారాన్ని, మూఢ విశ్వాసాలను ప్రచారం చేశాయి. నదుల్ని కలుషితం చేసినట్లుగానే సమాజాన్ని, ప్రజల ఆలోచనల్ని కలుషితం చేశాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రారంభం రోజు తన ఇంటి నిర్మాణం వలె బ్రాహ్మణులతో పూజలు యజ్ఞాలు చేయించాడు చంద్రబాబు. చంద్రశేఖరరావు ఏకంగా పది రోజుల పాటు యాగమే చేశాడు. గోవధ నిషేధం, యాగాలు, యోగాలు, వాస్తు మూఢత్వాలు అధికారికంగా అమలుచేస్తూ ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని ఘోరంగా ఉల్లంఘిస్తున్నాయి. హిందుత్వ ప్రచారంలో తెలుగు రాష్ట్రాలు బి.జె.పీ ప్రభుత్వాన్నే మించిపోయాయి. దీన్ని విరసం తీవ్రంగా ఖండిస్తూ ప్రభుత్వ మతతత్వ విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలని సెక్యులర్ ప్రజాస్వామిక వాదులకు విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

**10. కేంద్ర ప్రభుత్వం మూడో దశ గ్రీన్ హంట్ పేరుతో మరింత తీవ్రతరం చేసిన ప్రజలపై యుద్ధాన్నివెంటనే నిలిపేయాలి :**

మావోయిస్టు ఉద్యమాన్ని అణచేసి దండకారణ్యాన్ని, ప్రకృతి సంపదను మొత్తంగా బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికి ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 2009లో ప్రజలపై యుద్ధాన్ని ప్రారంభించింది. అంతకుముందే సల్వాజుడుమ్ పేరుతో ప్రైవేటు హంతకు ముఠా చేత ఆదివాసీ గ్రామాలకు గ్రామాలు మొత్తంగా కాల్చి బూడిద చేసిన ప్రజలపై పెద్ద ఎత్తున హత్యాకాండ జరిపింది. ఆపరేషన్ గ్రీన్ హంట్ అంతకు మించిన స్థాయిలో పోలీసు, పారా మిలిటరీ, ఇతర ప్రత్యేక దళాలు లక్షల మందితో కోడిన బలగాలు యుద్ధం అనదగ్గ స్థాయిలోనే అణచివేత చేపట్టింది. అది రెండు దశలు దాటుకొని మూడో దశకి చేరుకుంది. మూడోదశలో నేరుగా సైన్యాన్ని దించాలని వైమానిక దాడులు కూడా చేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. దండకారణ్యం, ముఖ్యంగా దక్షిణ బస్తర్ పై వైమానిక, సైనిక దాడులు చేస్తున్నారు. సల్వాజుడుమ్ 2 ఏర్పాటు చేయడానికి మహేంద్ర కర్మ కొడుకు చవీంద్ర కర్మకు కేంద్రం, ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాయి. మూడో దశ గ్రీన్ హంట్ మరింత తీవ్రస్థాయిలో గ్రామాలపై దాడులు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు చేస్తున్నది. ప్రజలపై ఈ దుర్మార్గమైన యుద్ధాన్ని గురించి మాట్లాడుతున్న మేధావులపై, ప్రజాసంఘాలపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధిస్తున్నది. దీనిపై మీడియా కూడా పాలక వర్గాల అనుకూల నిశ్శబ్దం పాటిస్తున్నాయి. ప్రజాస్వామికవాదులంతా ఆపరేషన్ గ్రీన్ హంట్ అనబడే ప్రజలపై యుద్ధాన్ని నిరసించాలని విరసం విజ్ఞప్తి చేస్తున్నది.

ఆవిష్కరించిన పుస్తకాలు: రెండురోజుల సభల్లో మొత్తం ఇరవై పుస్తకాలు, రెండు కవిత్వం ఫోల్డర్ల ఆవిష్కరణ జరిగింది.

| పుస్తకం | ప్రచురణ | ఆవిష్కర్త |
|---|---|---|
| జనాతన రాజ్యం (పాణి) | విరసం | వివి |
| మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు | విరసం | కొండారెడ్డి |
| ఫాలింగ్ (నల్లూరి రిక్మిణి కథ) | విరసం | పాణి |
| దండకారణ్యంలో చలసాని ప్రసాద్ | విరసం | భూపాల్ |
| సాహసయోధురాలు (గజ్జెల సరోజ రచనలు) | విరసం | కూర్మనాథ్ |
| దండకారణ్య కథలు | విరసం | అరసవెల్లి కృష్ణ |
| లొంగిన ప్రతిసారీ (కిరణ్ కవిత్వం) | విరసం | మాచర్ల మోహనరావు |
| చిగురించే పాదం (మేడక యుగంధరరావు కవిత్వం) | విరసం | తాయమ్మ కరుణ |
| అమర శ్రుతి (వరంగల్ యూనిట్ కవిత్వం) | విరసం వరంగల్ యూనిట్ | ఉదయ్ |
| మందిపాట ఒరవడిలో (సిటీయూనిట్ కవిత్వం) | విరసం సిటీయూనిట్ | తాటి శ్రీకృష్ణ |
| కలం యోధుడు చెరబండరాజు (చెంచయ్య) | విరసం | రత్నమాల |
| దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్ర (పునర్ముద్రణ) | విరసం | భాస్కర్ |
| సీమ గొంతుక వినండి (అరుణ్ వ్యాసాలు) | విరసం కర్నూలు యూనిట్ | కళ్యాణరావు |
| కాశీం కవిత్వం | స్నేహ ప్రచురణలు | ఎన్.వేణుగోపాల్ |
| తెలంగాణ సాహిత్య వ్యాసాలు (కాశీం) | స్నేహ ప్రచురణలు | క్రాంతి |
| పోరుపల్లి(పాలమూరు అధ్యయన వేదిక కవిత్వం ఫోల్డర్) | పాలమూరు అధ్యయన వేదిక | కాకరల |
| మానవులు (రాఘవాచారి దీర్ఘకవిత ఫోల్డర్) | పాలమూరు అధ్యయన వేదిక | సి.యస్.ఆర్.ప్రసాద్ |
| ఈలం విముక్తి పోరులో మహిళలు | శ్రామిక వర్గ ప్రచురణలు | ఖాదర్ మొహియుద్దీన్ |
| కవిత్వంతో మూలాఖత్ (ఎన్.వేణుగోపాల్) | స్వేచ్ఛా సాహితి | సుదర్శన్ |
| అమరుడు కామ్రేడ్ సంజయ్ | దిక్సూచి | కిరణ్ |
| రైజింగ్ సన్ (సూర్యం స్మృతి) | సూర్యం మిత్రులు | అన్నపూర్ణ |
| సామ్రాజ్యవాద దోపిడి మండలాలు (రత్నమాల) | నూతన ప్రచురణలు | వివి |

# ప్రపంచ ప్రసిద్ధ సోవియట్ విప్లవ రచయిత ఫెదయేవ్ నవల 'వెనుకంజ'

నాగభూషణ్

(1)

రష్యాలో బోల్షివిక్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అక్టోబరు విప్లవం, ఆ విప్లవకారులకే ఆశ్చర్యం కలిగించేంతగా అతి తక్కువ రక్తపాతంతో విజయం లభించడం తెలిసిందే. ప్రపంచంలోనే తొలిసారిగా ఏర్పడ్డ కార్మిక, కర్షక ప్రభుత్వం, సోషలిజం ధ్యేయంగా, ఒక నూతన తరహా పాలన అయినా సోవియట్లు అనబడే ఒక రకమయిన ప్రజా కౌన్సిళ్ల పాలనను ప్రవేశపెట్టి, లక్ష్యసాధన కోసం చిత్తశుద్ధితో ప్రయత్నించింది. అయితే విజయం సాధించినంత తేలిగ్గా నూతన ప్రభుత్వం మనుగడ సాగించలేకపోయింది. దాన్ని కూలగొట్టి, తిరిగి పాత పాలన అయిన దోపిడీ పాలనను తీసుకొచ్చేందుకు విప్లవ ప్రతీఘాతకులు తీవ్రంగా ప్రయత్నించారు.

వ్యాపారులూ, ధనిక రైతులూ కరువును సాకుగా తీసుకుని ధాన్యాన్ని చీకటి బజారుకు తరలించడంతో వేలాది ఆకలి మరణాలు సంభవించాయి. దీనికి తోడు బూర్జువాలు, పెట్టుబడిదారులూ రవాణ వ్యవస్థను విచ్ఛిన్నం చేశారు. పలు అరాచక చర్యలకు తెగబడ్డారు. ఉద్యోగులకు లంచాలిచ్చి, రెచ్చగొట్టి ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేసేలా అక్రమ ప్రయత్నాలు సాగించారు. పలు శాఖల ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. నల్లనూర్ల దండులూ, భూస్వాములూ తమ గూండా దళాలతో బందిపోటు చర్యలకూ, దొంగతనాలకూ తెగబడ్డారు. ఇదంతా ఒకపక్క. కాగా మరోపక్క పెట్టుబడిదారులూ, రాజరికవాదులూ, రాజీవాద సోషలిస్టులూ, భూస్వాములూ, వ్యాపారస్థులూ, ఉన్నత వర్గాలూ, వారి తాబేదారులూ, తెల్ల సైన్యాలూ కలిసి, అమెరికా, బ్రిటన్, జపాన్ వగైనా 13 సామ్రాజ్యవాద దేశాల ప్రత్యక్ష, పరోక్ష సైనిక, ఆయుధ, ఆర్థిక మద్దతుతో - పొత్తిళ్లలోని శిశువైన విప్లవ ప్రభుత్వాన్ని తెగతార్చేందుకు భయంకర దాడులకు పూనుకున్నారు. దాంతో ప్రపంచ శ్రామిక వర్గబాంధవుడైన వ్లదీమిర్ ఇల్యీచ్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం, ఆ దాడుల్ని ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తూనే, రోజులు లెక్కపెట్టుకోసాగింది. దేశంలోని అత్యధిక ప్రాంతం ప్రతిఘాతకుల దురాక్రమణలోనే ఉంది. ఎంత కాలం మిగిలిన ప్రాంతంలో ప్రభుత్వం మనుగడ సాగించగలదో వారికి తెలియకుండా ఉంది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ఎర్రసైన్యం ప్రాణాలకు తెగించి సామ్రాజ్యవాదుల్ని, ప్రతీఘాతుకుల్ని ఎదుర్కోసాగింది. వీరికి శ్రామిక వర్గంలోని వివిధ పౌరులూ, రైతులూ, ఇక కార్మికులైతే చెప్పేపనేలేదు - ఇచ్చిన తోడ్పాటు చరిత్రలోనే అత్యంత అరుదైన విషయం. అంత వరకూ దోపిడీ వర్గాల చేత పీడించబడిన వీరంతా చరిత్రలోనే తొలిసారిగా ఈ ప్రభుత్వం తమది అని ధైర్యంగా చెప్పుకుని, తలెత్తుకొనే తరుణం ఇప్పుడు వచ్చింది. అయితే ఆ అధికార ఫలాల్ని వీరు ఇంకా పొందక మునుపే, ఈ నూతన ప్రభుత్వం కూలిపోతే, ఇక ఎన్నటికీ ఆ ఫలాలు తమకు దక్కవన్న సంగతి వారు గ్రహించగలిగారు. అందువల్ల వారు ప్రభుత్వం, పార్టీల పిలుపునందుకుని అందుకోవడంతోనే, లక్షలాదిగా తరలివచ్చి ఎర్ర సైన్యానికి అండగా, వేలాది గెరిల్లా దళాలుగా ఏర్పడి ముష్కర తెల్ల సేనల్నీ, సామ్రాజ్యవాదుల్నీ అడుగడుగునా అడ్డుకుంటూ, చికాకులు పెడుతూ, తమదైన రీతిలో ప్రతిదాడులు చెయ్యసాగారు. అయితే అపార ఆయుధ, ధన బలాలకు తోడు, శిక్షణా కల శత్రువుల్ని ఎదుర్కోవడంలో గెరిల్లా దళాలు తీవ్రనష్టాలకు గురికాసాగాయి. వీరికి ఏ మాత్రం శిక్షణ లేదు. అప్పటికప్పుడు ప్రజారాశుల్నుంచి వీరు వచ్చారు. వీరికున్న ఆయుధాలు కూడా నాటువి. అవి కూడా తగినన్ని లేవు. దాంతో వీరు అసంఖ్యాకంగా మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ సమాజంలో అత్యధిక సంఖ్యాకులైన శ్రామికవర్గాలు విప్లవ ప్రభుత్వం పట్ల తమకు గల ప్రేమాభిమానాల వల్ల అసంఖ్యాకంగా గెరిల్లా దళాల్లో చేరి శత్రువులతో తలపడ్డారు. చివరికి సామ్రాజ్యవాద దేశాలు కూడా ఆశ్చర్యపడేట్లుగా విప్లవ ప్రభుత్వం విజయం సాధించింది. ప్రతీఘాతం తోక ముడిచింది. ఈ విధంగా రష్యన్ అంతర్యుద్ధం విప్లవ ప్రభుత్వాన్ని సగర్వంగా తలెత్తుకొనేట్లు చేసి, ఆత్మవిశ్వాసంతో పాలనపై దృష్టి పెట్టేలా చేసింది. ఈ చరిత్ర అంతా తెలీకపోతే, ప్రస్తుత నవల "దళం"లోని కథ పాఠకులకు అర్థంగాక, అయోమయానికి గురిచేస్తుంది. ఇక ఈ నవలలోని కథాంతాన్ని గురించి కూడా ఈ సందర్భంగా ఒక మాట చెప్పుకోవాలి. శత్రువులపై పోరాడిన ఈ నవలలోని విప్లవ దళం, సాధారణ నవలల్లో లాగా గాక, ఇందులో ఓటమి పాలైనట్లు, విచ్ఛిన్నమైన వందల సంఖ్యలోని దళంలో చివరికి 19 మంది మాత్రమే మిగిలినట్లు చెప్పబడింది. విప్లవ ప్రభుత్వం నడిచేటప్పుడు, ఒక యువ రచయిత తన నవలని ఇలా ముగించడానికి ఎంతో ధైర్యం కావాలి. అది ఈ రచయితలో సమృద్ధిగా ఉన్నదని ఈ ఒక్క నవలేగాక, ఇతర నవలలూ, అలాగే ఆతడి జీవితం విషాదాంతం అయిన తీరు మనకు తెలియపరుస్తాయి. ఏమైనా ఈ నవలని ఇలా ముగించడంలో రచయిత చెప్పదలచుకున్నది ఇది. శత్రువు బలంగా ఉన్నప్పుడు ఓటమి తప్పదు. అయితే విప్లవంలో ఎన్నో ఓటములు అంతిమ విజయానికి ఆలంబనలు! పాఠకులు ఈ అంశాన్ని సరిగానే గ్రహించడానికి ఈ నవలకు లభించిన పాఠకాదరణే రుజువు. ఈ ఆదరణే ఈ యువ రచయితలకు దేశ వ్యాప్త గుర్తింపు తీసుకువచ్చింది. రష్యన్ భాషలో "ౘ్రబిచీవీజీళీ" (వెనుకంజ) పేరుతో 1927లో ఈ నవల వెలువడగా, ఆంగ్లంలో "ఊనీలి ౘ్రళితిశ" పేరుతో వెలువడి, 'ఊనీలి శ్రీరిదీశిలిలిదీ' పేరుతో (దళంలో చివరకు మిగిలిన వారు 19 మంది) ప్రసిద్ధి పొందింది. ఈ నవల 1953లో తెలుగులో ఉమారాజ్ 'దళం' పేరుతో అనువదించగా (సంక్షిప్తం) విశాలాంధ్రవారు ప్రచురించారు.

ఈ నవలలోని సాహిత్య మర్మాలు మొదటి సారి చదివినప్పుడు

అర్థం కావు. రెండోసారి, మూడోసారి చదువుతుంటే అవి ఒక్కొక్కటి అర్థమై, రచయిత పట్ల గౌరవం పెరుగుతుంది. అంతేగాక విప్లవంలోని తుపాకులు అవగతమవుతాయి. ఈ సందర్భంగా ఇందులో గెరిల్లా దళాలు ఉపయోగించిన భాష, ఆలోచనలు, ప్రవర్తన గురించి కొంత వివరించాల్సిన అవసరం ఉంది. దళంలోని గెరిల్లాలంతా శ్రామిక రంగం నుండి వచ్చిన వారే. ఇందులో ముఖ్యపాత్రలు కొన్ని గని పనివారివి. అందువల్ల వీరి ప్రవర్తన, మోటు సరసం, భాష వారికి సంబంధించిందే. గెరిల్లాలు పార్టీ సభ్యులు కారు. పల్లె జనం, నాగరికతకు దూరంగా ఉన్నవారు. ఇక ఇందులో నర్సుగా పనిచేసిన 'వార్యా' విషయానికి వస్తే, ఆమె ప్రవర్తన పాఠకులకు జుగుప్సాకరంగా కనిపిస్తుంది. వివాహేతర లైంగిక చర్యలకు పాల్పడటం, పట్టణం నుంచి వచ్చిన 'మెచిక్' పట్ల వ్యామోహితురాలవడం, ఆమె పట్ల 'ఛిజ్' వెంపర్లాట... ఇదంతా చూసిన సామాన్య పాఠకులు... విప్లవమంటే ఇదేనా? అనే భావానికి లోను కావడం జరగవచ్చును. ఇక విప్లవ వ్యతిరేకులకైతే కావలసినంత నిందా ప్రచారానికి ఉపకరిస్తుంది కూడా. అయితే వాస్తవాన్ని గమనిస్తే, ఇందులోని ఏ పాత్రా నేల విడిచి సాము చెయ్యలేదు. వార్యా ఒక వేశ్య. మధ్యలో పెళ్లి అనేది చేసుకున్నా, ఆ భర్త కూడా ఆ సంబంధాల్ని పట్టించుకోడు. ఒక్క మెచిక్ విషయంలోనే అసూయపడతాడు. ఇక మెచిక్ విషయానికి వస్తే, అతడొక అందమైన పట్టణం నుంచి వచ్చిన యువకుడు. విప్లవం పట్ల ఒక ఆకర్షణతో పోరుబాట పట్టినా, అందులో తగిలే ఎదురు దెబ్బల్నీ, కఠిన క్రమశిక్షణనూ తట్టుకోలేక పలాయన మంత్రం పఠిస్తాడు. వార్యా వేశ్య అయినా దయామయి. రోగుల పట్ల, బాధితుల పట్ల ఆమె ఎంతో నిబద్ధతతో స్పందిస్తుంది. మెచిక్ పట్ల ఆమె ఆకర్షణ పిల్లల కోసమే. ఇంకా ఇందులో మొరోజ్కాలాంటి మొరటు సాహసిక వ్యక్తులూ, బాక్లనోవ్, గొంచరోవ్, మెతెలిత్సా లాంటి నిజమైన వీరులే గెరిల్లా పోరాటాల్లో కీలక వ్యక్తులు. ఇక దళం కమాండెంట్ లెవిన్‌సన్ నిజమైన విప్లవకారుడూ, నాయకుడూ, మార్గదర్శీ. అంతేగాక ఇతడు యూదు జాతికి చెందిన యువకుడు. మనదేశంలో ఉన్నత వర్గాలకు దళితులూ, గిరిజనులూ ఎలా అలుసో, కొన్ని పాశ్చాత్య దేశాల్తో పాటు రష్యాలోనూ యూదులంటే అలా అలుసు. జార్ కాలం నుండీ యూదులపై దాడులూ, హననాలూ సామాన్యమైన విషయం. అలాంటి యూదువాడైన లెవిన్‌సన్‌ని రచయిత నవలా నాయకునిగా స్వీకరించడమే గాక, గొప్ప ఆదర్శమూర్తిగా చిత్రీకరించాడు.

ఇంతటి విశిష్ట అంశాలతో కూడిన ఈ నవలలోని కథాంశాలను తెలుసుకునే ముందు, ప్రపంచ శ్రామిక వర్గ అగ్రగామి రచయితా, ప్రసిద్ధ సోవియట్ విప్లవ రచయితా అయిన ఫెదయేవ్ జీవిత చిత్రంలోని వెలుగు నీడల్ని గమనిద్దాం. స్టాలిన్ కాలంలో రచయితగా, రచయితల సంఘాల్లో బాధ్యునిగానూ మాత్రమే గాక, ప్రజా జీవితంలోనూ ఉన్నత స్థానంలో ఉన్న ఫెదయేవ్, స్టాలిన్ అనంతరం కృశ్చేవ్ కాలంలో విషాదకరంగా ఆత్మహత్య చేసుకోవడానికి దారి తీసిన అంశాలనూ పరిశీలిద్దాం.

## ఫెదయేవ్ జీవితం - రచనలు

ఫెదయేవ్ పూర్తి పేరు అలెక్సాండ్ర్ అలెక్సాండ్రోవిచ్ ఫెదయేవ్. ఫెదయేవ్ అని పలకడం కన్నా ఎక్కువగా 'ఫెదీవ్'గానే రష్యన్లు పలుకుతారు. ఒక వృత్తి విప్లవకారుల కుటుంబంలో ఫెదయేవ్ 1901వ సంవత్సరం డిసెంబరు 11న (24) "త్వేర్" గవర్నరేట్‌లోని 'కిమేరీ'లో జన్మించాడు. ఈ పట్టణాన్ని ఆ తర్వాత 'కలీనిన్ ఓబ్లాస్ట్'గా పిలుస్తున్నారు. 1908లో ఇతని కుటుంబం దూర ప్రాచ్యానికి తరలిపోయింది. 1908 నుంచి 1912 దాకా ఇతడు 'చుగయేవ్క', 'ప్రిమోర్‌స్కీ క్రయ' ప్రాంతాల్లో పెరిగాడు. 1912 నుంచి 1918 దాకా ఫెదయేవ్ 'వ్లదివోస్తోక్'లోని వాణిజ్య పాఠశాలలో చదివాడు. అయినప్పటికీ ఫెదయేవ్ 1918లో తన 16వ ఏట బోల్షివిక్ పార్టీలో చేరి, విప్లవ ప్రతీఘాతక తెల్లసేనలతోనూ, సామ్రాజ్యవాదులతోనూ జరిగిన అంతర్యుద్ధంలో 1918 నుంచి 1920 దాకా గెరిల్లా పోరాటాల్లో పాలు పంచుకున్నాడు. ఆ తర్వాత 1921లో 'క్రాన్‌స్టాడ్ట్'లో జరిగిన సోవియట్ వ్యతిరేక తిరుగుబాట్లను ఎదుర్కొన్నాడు. ఈ యుద్ధాల్లో ఫెదయేవ్ రెండుసార్లు తీవ్రంగా గాయపడ్డాడు.

ఆ తర్వాత ఫెదయేవ్ 1921-1924 మధ్య మాస్కోలో గల గనుల అకాడమీలో చదివాడు. అయినప్పటికీ ఫెదయేవ్ ప్రభుత్వ ఉద్యోగంలో చేరడానికి ఇష్టపడక, పార్టీ పని చెయ్యడం కోసం మొదట 'క్రాస్నోదార్' ఆపై 'రోస్తోవ్ - ఆన్ - దార్'లకు వెళ్లి 1924 నుంచి 1926 వరకూ ఆ పనిలో నిమగ్నమయ్యాడు.

ఒక పక్కన పార్టీ పని చేస్తూనే ఫెదయేవ్, సాహిత్య రంగంలోనూ ఉధృత కృషి చేశాడు. ఇతడి మొదటి రచన 1923లోనే వెలువడింది. "కరువుకు వ్యతిరేకంగా" (Against Current) అనే పేరు గల ఈ నవలిక "ఆమ్‌గున్‌స్కీ రెజిమెంటు పుట్టుక" పేరుతో ఇది 1934లో పునర్ముద్రించబడింది. 1924లోనే ఫెదయేవ్ 'రజ్లీవ్' (ఎగిసిన అల) అనే నవలను ప్రచురించాడు. ఇది "The Flood" పేర ఆంగ్లంలో అనువదించబడింది.

1927లో ఫెదయేవ్ సోవియట్ రష్యా అంతర్యుద్ధాన్నీ, అందులో తన పోరాట అనుభవాల్నీ జోడించి, వాస్తవిక సంఘటనలతో కూడిన ఒక గొప్ప నవల 'రజ్‌గ్రమ్' (వెనుకంజ) పేర వెలువరించాడు. ఇంతకుముందే చెప్పుకున్నట్లు ఈ నవల ఆంగ్లంలో 'The Rout' పేర అనువదించబడింది గానీ, 'The Ninteen' పేర ప్రసిద్ధికెక్కింది. ఈ నవలలో సామ్రాజ్యవాదుల దన్నుతో బూర్జువాలూ, వ్యాపారుల, ఉన్నత వర్గాల ధన, ఆయుధ బలంతో బలిసిన తెల్ల సేనల చేతిలో గెరిల్లా పోరాట యోధులు దూరప్రాచ్యంలో పొందిన పరాజయాలను తనదైన శైలితో ఫెదయేవ్ అద్భుతంగా చిత్రించాడు. ఈ నవలతో ఫెదయేవ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి అయి, ఆ రోజుల్లో రష్యాలో ప్రచారంలో ఉన్న బూర్జువా సాహిత్య సిద్ధాంతాలైన ప్రకృతివాదం, నైరూప్యవాదం, భావుకత్వవాదాల్ని ఈ నవల తీవ్రంగా వ్యతిరేకించింది. ఫదీవ్ వాస్తవిక జీవితానికి ప్రాతినిధ్యం వహించాడు. నైతిక ఔన్నత్యంపై వెలుగును ప్రసరింపజేస్తూ, వ్యక్తిశీల నిర్మాణానికి ప్రాముఖ్యం ఇచ్చాడు. తన నవలలో ప్రతిపాదించబడిన ఈ సిద్ధాంతం గురించి ఫదీవ్ ఇలా అభివర్ణించాడు :

"... సోవియట్ అంతర్యుద్ధంలో మానవ ప్రాణులన్నీ ఎంపిక చేసుకొన్న మార్గంలో ఒక బాధాకరమైన అనుభవాన్ని పొందాయి. ఏమైనా హానికరమైన ప్రతిదీ విప్లవం వల్ల తుడిచి వెయ్యబడుతుంది. అయితే విప్లవ యుద్ధం అసమర్థమైనదైనప్పుడు, ప్రతిదీ నెమ్మదిగా లక్ష్య రహితంగామారి, అందులోంచి విప్లవ అంశ తీసెయ్య బడుతుంది. కానీ, విప్లవానికి దారి తీసే ప్రతి వాస్తవిక కారణమూ లక్షలాది ప్రజల్ని

పోరాటాల్లో రాటుదేలేట్లు చెయ్యడమేగాక, వారి ఆలోచనల్ని వికసింపజేసి, వారి మానసిక ఎదుగుదలకు కారణమవుతుంది. దాంతో సహజంగానే ప్రజల వైఖరిలో సమూల మార్పు వస్తుంది..."

ఈ నవలలోని కథానాయకుడూ దళం కమాండెంటూ అయిన లెవిన్‌సన్ పాత్రలో - ఉన్నత స్థాయిలో ఉండే కమ్యూనిస్టు నైతిక విలువల్నీ, అదే విధంగా అతడు తన సహచరులపై తీవ్రంగా నెరపిన బోల్షివిక్ ప్రభావాన్నీ ఫెదీవ్ అత్యద్భుతంగా చూపించాడు. అందువల్లనే 1920వ దశకపు సాహిత్య విమర్శకులు - ఒక నూత్న తరహా సృజనాత్మక రీతిలో విప్లవ మానవుని దర్శింపజేసిన అద్భుత కళారూపంగా ఈ నవలను అభివర్ణించారు.

ఇక ఫెదయేవ్ 1929లో తన బృహన్నవల "ఊసీలి జిళిరీశి ళితీ శినీలి ఏఖిళీవీలి" (ఆఖరి యుగం) రాయడానికి పూనుకొని, తన మొదటి సంపుటిని 1930కే పూర్తి చేశాడు. కానీ ఆ తర్వాత సంపుటులు (2-4) 1940కి గానీ పూర్తి చెయ్యలేకపోయాడు. అంతేగాక ఆ తర్వాత సంపుటిని రాయనేలేదు. ఆ విధంగా 1920లో మొదలుపెట్టిన ఈ సంపుటిని 1940 దాకా రాస్తూనే ఉన్నాడు గానీ, అది అసంపూర్తిగానే ఉండిపోయింది. ఈ సంపుటులు రాయడంలో ఇంత ఆలస్యం కావడానికి కారణం ఈ కాలంలో అతడు ఎక్కువ భాగాల్ని సాహిత్య సంఘాల నిర్వహణ కోసం వెచ్చించడమే. అదీగాక ఫెదీవ్ ఈ నవలలో చెప్పదలుచుకున్న విషయాలు విస్తృతమైనవి కావడం కూడా ఒక కారణం. అత్యంత ప్రాచీన కాలం నాటి మానవుడు తన అనుభవాలతో ఆదిమ కమ్యూనిజం వ్యవస్థ నుండి, 20వ శతాబ్దం నాటి విభిన్న మానవ సమూహాల సమాజం దాకా విభిన్న చారిత్రక దశల్ని దాటుకుంటూ ఎలా ముందడుగు వేసిందీ ఆయన ఈ నవలలో వివరించి చెప్పాలనుకున్నాడు. కుటుంబం, స్వంత ఆస్తి, బానిసత్వం, భూస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం, వీటితో పాటు సోషలిజం సమాజంలో ఎలా ఏర్పడ్డాయో తెలిపాడు. ఆయా చారిత్రక దశల్ని కథన రూపంలో వివరించేందుకు కొన్ని దశాబ్దాల కాలాన్ని తీసుకుని ఫెదీవ్ వివరించాడు. 'ది రేట్' నవలలో వలె అంతర్యుద్ధ సమయాన్ని విస్తృతంగా తీసుకుని రచయిత కథను నడిపించాడు. (రాహుల్ సాంకృత్యాయన్ తన ప్రసిద్ధ చారిత్రక నవల 'ఓల్గా సేగంగా'ను బహుశా ఈ ప్రేరణతోనే మొదలెట్టి ఉంటాడు)

ఇక 1944లో ఫెదీవ్ "బ్లాకేడ్ రోజుల్లో లెనిన్‌గ్రాడ్" అనే బృహద్గ్రంథాన్ని ప్రచురించాడు. 1944-45 సంవత్సరాల మధ్య జరిగిన దేశభక్త మహాయుద్ధం (సామ్రాజ్యవాద రెండో ప్రపంచ యుద్ధం) నకు సంబంధించి ఫెదీవ్ పలు స్కెచ్‌లూ, వ్యాసాలూ, ప్రజలు చేసిన వీరోచిత ప్రతిఘటనల గురించిన కథనాలూ వెలువరించాడు. వాటన్నింటినీ కలిపి 1944లో ఈ గ్రంథంగా అతడు ప్రచురించాడు. ఈ యుద్ధ సమయంలో నాజీల చేత చుట్టుముట్టబడిన లెనిన్‌గ్రాడ్ పట్టణంలోని ప్రజల జీవనస్థితిపై ధైర్యంగా వారు చేసిన ప్రతిఘటనపై ఈ గ్రంథం ఒక సమగ్ర చిత్రణ అని చెప్పవచ్చు. ఆ యుద్ధ సమయంలో లెనిన్‌గ్రాడ్ మొత్తం 900 రోజులు దిగ్బంధంలో ఉంది, పట్టణ జనాభా 30 లక్షల్లో మూడోవంతు, అనగా సుమారు 10 లక్షల మంది ఆకలితో, బాంబుదాడుల్లో మరణించారు. అయినప్పటికీ ప్రజలు తలవంచక నిలబడటం చరిత్రలో ఒక మహోన్నత సంఘటన! లెనిన్‌గ్రాడ్ ముట్టడి చరిత్రలోనే అతిదీర్ఘకాలం కొనసాగిన ముట్టడిగా పేరొందటం తెలిసిందే!

1945లో ఫెదీవ్ కీర్తి కిరీటంలో కలికితురాయిగా భాసించిన "మొలొదయా గ్వార్దీయా" (Motodaia Gvardiia) అనే నవలా రచన. ఈ నవల 'The Young Guard' పేరుతో ఆంగ్లంలోకి అనువదింపబడి ప్రసిద్ధి చెందింది. దేశభక్త యుత మహాయుద్ధంలో యుద్ధం సాగే క్రమంలో నాజీ దురాక్రమణదారులపై ప్రజల ప్రతిఘటన వీరోచిత, సాహసోపేత ధోరణులు నానాటికీ ఉధృతం అవడాన్ని ఫదీవ్ తన రచనల్లో అద్భుతంగా అక్షర బద్ధం చేశాడు. ఈ విషయాల్ని ఫదీవ్ ఈ నవలలో ఉన్నతంగా చూపించాడు. అందువల్ల ఈ నవలకుగాను దేశ అత్యున్నత సాహితీ పురస్కారం 'స్టాలిన్ బహుమతి' లభించింది. ఇదే పేరుతో ఈ నవలను సినిమాగా కూడా తీశారు. దానికీ గొప్ప ప్రేక్షకాదరణ లభించింది.

క్రాస్నోదాన్ ప్రాంతంలో రహస్యంగా పనిచేస్తున్న 'కొమ్సొమోల్ ఆర్గనైజేషన్' (యువ కమ్యూనిస్టు లీగు)కు సంబంధించిన యంగ్‌గార్డు దళాలు సాగించిన సాహసకృత్యాల ప్రేరణతో ఫెదీవ్ ఈ నవల రాశాడు. జర్మన్ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా సోవియట్ ప్రజలు సాగించిన పోరాటాల్ని కీర్తిస్తూ రాయబడిన ఈ నవలలో - ఒలెగ్ కొషెవోయ్, సెర్జీ తూలెనిన్, ల్యుబోవ్ షెవ్‌త్సోవా, ఉలియానా గ్రొమోవా, ఇవాన్ జెమ్నుఖోవ్ మొదలైన పాత్రలూ, ఇంకా యంగ్‌గార్డు సభ్యులు యొక్క సోషలిజానికి సంబంధించిన ఉన్నతమైన ఊహలకు ఈ నవల రూపాన్నిచ్చింది. ఫెదీవ్ తన కథానాయకుల్ని - సాహసాల వెలుగులో వారు సామూహిక క్రమశిక్షణ పాటించడంలో కనబరిచిన లయనూ, వారి వారి మానసిక వృత్తుల్నీ, పై అధికారుల్ని పక్కదారి పట్టించడంలో ఉపయోగించిన తెలివినీ మనోహరంగా వర్ణించాడు. అయితే ఈ నవలకు లభించిన ప్రజాదరణకు తోడు, కొన్ని విమర్శలూ రావడం వల్ల, వాటికి సమాధానమా అన్నట్లు అతడు రెండో ముద్రణ (1951)లో కొన్ని సంఘటనల్ని జత చేశాడు. అజ్ఞాత జీవితంలో కొమ్సొమోల్ సభ్యులు (యువ కమ్యూనిస్టు లీగు సభ్యులు) కమ్యూనిస్టు నాయకులతో నెరపిన సంబంధాలకు చెందినవే ఈ సంఘటనలు

రష్యన్ సాహిత్యంలో ఉన్నత సంప్రదాయాల్ని నెలకొల్పడంలో ఉదాహరణ ప్రాయంగా నిలిచిన తోల్‌స్తోయ్, గోర్కీలలాగే ఫెదీవ్ సోషలిస్టు వాస్తవికతకు సంబంధించిన ఉన్నత నమూనాల్ని సృజించాడు. అతడి చివరి రచన 'ఇనుముతత్వం' (Charntia Metallurgiia) అనే నవల ఆంగ్లంలో 'Ferrus Metallurgy' పేరుతో అనువదించబడింది. ఇందులో కూడా ఫెదీవ్ తన కాలపు వాస్తవ జీవిత సంఘర్షణను వర్ణించాడు. అయితే ఇది కూడా అసంపూర్తిగానే మిగిలిపోయింది.

సాహిత్య విమర్శకు సంబంధించి ఫెదీవ్ వ్యాసాలన్నీ ఒక సంపుటిగా "ముప్పై సంవత్సరాలకు పైగా" (Over Thirty Years) పేరుతో అతడి మరణానంతరం వెలువరించారు. సాహిత్యంపై అతడి దృక్పథం, సోషలిస్టు సౌందర్య శాస్త్రాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో అతడి ఆలోచనలూ ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. అలాగే అతడి ఉత్తరాలు ఒక సంపుటిగా 1959లో వెలువడ్డాయి.

## సాహిత్య సంఘాలలో ఫెదీవ్ పాత్ర

ఫెదయేవ్ తన కౌమార (ప్రారంభ) దశలోనే సోవియట్ విప్లవ ప్రభుత్వాన్ని కాపాడేందుకు గెరిల్లా పోరాట యోధునిగా పనిచెయ్యడమేగాక, విప్లవకర బోల్షివిక్ పార్టీ కార్యకర్తగా కూడా చురుకైన

పాత్రను పోషించినట్లు ముందే చూశాం. ఆ రాజకీయాల్లోనే అతడు మరింత చురుగ్గా పనిచేస్తూ, 1939 నుండి 1956 దాకా పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా, 1956లో సెంట్రల్ కమిటీ కాండిడేట్ సభ్యునిగా ఎన్నికయ్యాడు. సుప్రీం సోవియట్‌కు ఒకసారి రెండో డిప్యూటీగా, ఒకసారి మూడో డిప్యూటీగా పని చేశాడు. అలాగే ప్రపంచ శాంతి సంఘం ఉపాధ్యక్షునిగా కూడా పనిచేశాడు. ఇలా ఒక పక్కన తన రాజకీయ కృషి కొనసాగిస్తూ, ప్రజా జీవితంలో ఒక ప్రముఖ స్థానం పొందుతూనే, ఫెదీవ్ సాహిత్య రంగంలో ఉన్నతమైన కృషి చేశాడు. ముందే చెప్పుకున్నట్లు, ఫెదీవ్ సాహిత్య రంగంలో చేసిన కృషి ద్విముఖంగా సాగింది. ఒక పక్క ప్రజల ఆలోచనలపై ప్రభావాన్ని చూపించే ప్రసిద్ధ నవలలు రాస్తూనే, మరోపక్క ప్రజల పక్షాన నిలబడే పటిష్టమైన సాహిత్య సంఘాల నిర్మాణంలో జాతీయ స్థాయిలో నిర్ణయాత్మక పాత్ర వహించాడు. పలు సాహిత్య సంఘాలలో ఉన్నతమైన బాధ్యతలు నిర్వర్తించాడు. ఆ రోజుల్లో ఎన్నో రకాల సాహిత్య సంఘాలు దేశంలో ఉండేవి. వాటన్నింటినీ ఒక్క తాటి మీదికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించి, అందులో చాలా వరకు విజయం సాధించాడు. మొదట రష్యన్ కార్మిక వర్గ రచయితల సంఘంలో ఉన్నత స్థానంలో ఉన్నాడు. అటు తర్వాత ఏర్పడ్డ సోవియట్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా 1939 నుంచి 1944 దాకా, ఆపై 1946 నుంచి 54 దాకా ప్రధాన కార్యదర్శి మరియు ఛైర్మన్‌గా పనిచేశాడు. తన ఉన్నత స్థాయి సాహిత్య కృషికిగాను రెండుసార్లు లెనిన్ బహుమతుల్నీ, ఒకసారి స్టాలిన్ బహుమతినీ, ఇంకెన్నో అవార్డుల్నీ గెలుచుకున్నాడు. స్టాలిన్ ఫెదయేవ్ పట్ల గొప్ప ఉన్నతాభిప్రాయంతో ఉండేవాడు. 'ఈ శతాబ్దిలో ప్రపంచం ఇంత వరకూ గమనించిన గొప్ప మానవతావాది' అంటూ స్టాలిన్ ఫెదయేవ్‌ని ప్రశంసలతో ముంచెత్తాడు.

స్టాలిన్ కాలంలో ఒక వెలుగు వెలిగిన ఫెదయేవ్, స్టాలిన్ అనంతర కాలంలో ఎన్నో అవమానాలకు గురి కావలసి వచ్చింది. విప్లవ ప్రభుత్వ వ్యతిరేక వర్గానికి చెందిన బూర్జువా, రాజీవాద, సామ్రాజ్యవాద వర్గాల, వారి తాబేదార్లయిన సృజనశీల మేధావుల విషపూరిత అపహాస్యాలకు, విద్వేషాలకు ఫెదీవ్ గురి కావలసి వచ్చింది. స్టాలిన్ కాలంలో జరిగిన ప్రక్షాళన సమయంలో కొందరు రచయితలు తమ విద్వేషపూరిత రాతలూ, చర్యలకుగాను అరెస్టవ్వగా, ఎంతో సహృదయంతో వారికి ఫెదయేవ్ సానుభూతి చూపిస్తే, వారి వారి నుంచి అతడు కృతజ్ఞతలు అందుకోవడం అటుంచి, దూషణలూ, అపహాస్యాలు అందుకోవలసి వచ్చింది. ఇక ప్రభుత్వం నుంచి అయితే, అతడి విప్లవ నిబద్ధతకు గాను తీవ్ర అనుమానాలకు గురి కావలసి వచ్చింది. అతడి రాజకీయ పదవిని తగ్గించారు. అంతకు ముందు దీర్ఘకాలం పార్టీ సెంట్రల్ కమిటీలో సభ్యునిగా పని చేశాడు. కానీ చివరకి అతణ్ణి సభ్యత్వానికి నిరాకరించలేదు గానీ, కాండిడేట్ సభ్యునిగా తీసుకున్నారు. మరోపక్క సాహిత్యరంగంలో అతణ్ణి తీవ్రమైన అవమానాలు పాలు జేసి, అతడికిచ్చిన స్టాలిన్, లెనిన్ బహుమతుల్ని వెనక్కి తీసుకున్నారు. విప్లవ వ్యతిరేకమైన ప్రభుత్వ చర్యల్ని విమర్శించినందుకుగాను, అతడి రాతల్లో లోపాల్ని ఎప్పటికప్పుడు ఎంచుతూ అతడి ఆత్మాభిమానాన్ని దెబ్బ కొట్టారు. అంతటితో ఆపక అతడు రాయడానికి వీల్లేదని నిషేధం విధించినప్పుడు, ఇక తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నప్పుడు, సాటి రచయితలు ఏం చెయ్యాలి? చనిపోయినవాడు ఎంతటి ప్రత్యర్థయినా, సహృదయుడైన వాడు సంతాపాన్నయినా వెలిబుచ్చుతాడు, లేదా కనీసం ఏ వ్యాఖ్యానమూ చెయ్యక మౌనంగానయినా ఉంటాడు. కానీ అతని ప్రత్యర్థులు అంత మాత్రమయినా సహృదయతను కనబర్చారు కారు.

ఫెదయేవ్‌కు పొరుగునే ఉండే 'ప్రసిద్ధ' కవీ, రచయితా అయిన పాస్టర్ నాక్ చేసిన పని ఏమిటో తెలుసా? పొరుగునే ఉన్నందుకు సహజంగా సానుభూతి సూచకంగా విషాదగీతమో, ఓ స్మృతి వ్యాసమో రాస్తాడని సాధారణంగా ఎవరైనా అనుకుంటారు. కానీ పాస్టర్ నాక్ రాసిందేమంటే ఓ వ్యంగ్యగీతిక! అతడి ఆత్మహత్యను అవహేళన చేసే హేళన గీతక! ఫెదీవ్ విషయంలో అతడికెందుకట అంత కడుపుమంట అంటే, స్టాలిన్ హయాంలో పాస్టర్ నాక్ ఓ కావ్యం రాశాడట! ఆ కావ్యాన్ని అచ్చు కాకుండా ఫెదీవ్ అడ్డుకున్నాడట! రచయితల సంఘం అధ్యక్షునిగా అప్పుడు ఫెదీవ్ ఉన్నందున, తన పలుకుబడినుపయోగించి, ఆ కావ్యం ప్రచురించ బడకుండా అడ్డుకున్నందుకట పాస్టర్ నాక్‌కు ఫెదీవ్ మీద అంత ద్వేషం. ఇంతకీ ఆ కావ్యం ఎంతంటి మహత్తరమైందోనని పాఠకులు భావించేరు! కేవలం అదొక పచ్చి బూతు కావ్యం! విప్లవ ప్రభుత్వ కాలంలో ఇలాంటి బూతు కావ్యాలకు చోటుండకూడదని రచయితల సంఘం అధ్యక్షునిగా ఫెదీవ్ దానికి వ్యతిరేక ప్రచారం చేశాడు. అదీ పాస్టర్ నాక్ కడుపు మంటకు కారణం. ఆ కావ్య ప్రచురణ ఆగిపోవడం వల్ల, తనకు వచ్చే డబ్బు రాకుండా పోయిందనీ, ఆ విధంగా ఫెదీవ్ తన పొట్ట కొట్టాడనీ పాస్టర్ నాక్ మాత్రమే కాదు, అతడి మిత్ర బృందంలోని రచయితలంతా (వీరంతా స్టాలిన్ వ్యతిరేకులే) ఫెదీవ్‌ని నిందించారు. ఇంతకీ ఈ పాస్టర్ నాక్ ఎవరో పాఠకులకు ఎరుకేనా? 'డాక్టర్ ఝువాగో' నవల (1956) ద్వారా పాశ్చాత్య దేశాల్లో ప్రసిద్ధికెక్కిన, తద్వారా నోబుల్ బహుమతిని 1957లో సాహిత్య రంగంలో చేసిన కృషికి గాను అందుకున్న వాడితడే. అంత గొప్ప బహుమతినందుకున్నందుకు ఆ నవల ఓ అద్భుత కళాఖండం అని పాఠకులు తిరిగి భ్రమపడేరు! ఆ నవలలో ఉన్నదంతా స్టాలిన్ పాలనను విమర్శించడం, స్టాలిన్ ప్రవేశపెట్టిన పథకాలు లోపభూయిష్టాలని చూపడం, విప్లవద్రోహులకు విధించిన శిక్షల్ని పరమ ఘోరంగా వర్ణించడం! పాశ్చాత్య దేశాలకు కావలసింది అదేగా! అయితే ఈ నవలని కృశ్చేవ్ పాలనాకాలంలోనే ప్రచురించడానికి ధైర్యం చాలలేదు. అందువల్ల దీన్ని నిషేధించగా, పాస్టర్ నాక్ పాశ్చాత్య దేశాలకు 'రహస్యంగా' పంపించి అక్కడే 1956లో అచ్చు వేశాడు (స్టాలిన్‌కు వ్యతిరేక ప్రచారం చేసే నవలలకు నోబుల్ సాహిత్య బహుమతుల్ని ప్రకటించడం పాస్టర్ నాక్ ఒక్కడికే పరిమితం కాదు. అలెక్సాండ్రా సోల్జినిత్సిన్ కూడా ఇలాంటి నవలనే రాసి, నోబుల్ బహుమతిని అందుకున్నాడు. షోలహోవ్‌కు కూడా నోబుల్ బహుమతినిచ్చారు గానీ, అతడు స్టాలిన్‌ను విమర్శించిన నవలలు రాసినట్లు లేదు. స్టాలిన్ పాలనను వ్యతిరేకించడమైతే చేశాడు కృశ్చేవ్ కాలంలో. అలాగే కృశ్చేవ్‌ను అంటిపెట్టుకుని పాశ్చాత్య దేశాల్లోనూ పర్యటించాడు. అంత మాత్రం చేత అతడు ఒక మామూలు రచయిత కాదు. ప్రపంచ సాహిత్యానికి ఎన్నో చేర్పులు చేర్చాడు. అన్ని విధాలా అతడు నోబుల్ బహుమానానికి అర్హుడే. ఏమైనా పాస్టర్ నాక్‌కు నోబుల్ బహుమతి రావడం పట్ల విప్లవ వ్యతిరేక రచయితలు కూడా బయటికి హర్షాన్ని ప్రకటించే సాహసం చేయలేకపోయారు, ఒక్క కొర్నీచుకొవ్‌స్కీ తప్ప! దీన్ని బట్టే తెలుసుకోవచ్చు ప్రజల్లో విప్లవం ఎడల, స్టాలిన్ ఎడల

ఎలాంటి అభిమానం మున్నదీ.)

పాస్టర్ నాక్ ఒక్కడే కాదు, పలువురు ఇతర రచయితలూ ఇదే మాదిరి కడుపు మంటను వెలిగక్కారు. 'నదెజ్డామందేల్‌స్తమ్' తన జ్ఞాపకాల్లో తన భర్త అయిన 'ఒసిప్‌మందేల్‌స్తమ్' (1891-1938) యొక్క చివరి అరెస్ట్ (1938)కి ముందు, ఫెదయేవ్ ఎంతో దయతో వీడ్కోలు ఇచ్చాడని చెబుతూనే, ఇంకా ఇలా చెప్పింది : 'తనలో గల భావోద్వేగానికి అక్షర రూపం ఇవ్వడంలోనూ, దుఃఖాన్ని అవసరమైనప్పుడు కప్పి పుచ్చడంలోనూ ఫెదయేవ్ సమర్ధుడైనప్పటికీ, అతడే మాత్రం దయలేని కఠినుడని ల్యూబా (ఎహ్రెన్‌బర్గ్) నాకు చెప్పాడు. 'యిద్దిష్' భాషా రచయితల (కొన్ని యూరప్ ప్రాంతాల్లో యూదులు ఉపయోగించే హిబ్రూ భాషకు గల ప్రాంతీయ యాస 'యిద్దిష్' భాష) హత్యోదంతంలో ఇది స్పష్టమైనట్లు ల్యూబా అన్నాడు. మందేల్‌స్తమ్ విషయంలో వలెగాక, ఫెదయేవ్‌కు ఆ యిద్దిష్ భాషా రచయితలు మిత్రులు. వారి అరెస్టులకు ముందు కూడా ఫెదయేవ్ ఇచ్చిన ఆ కన్నీటి వీడ్కోలు సంఘటన, వారి అనంతర హత్యలకు ఫెదయేవ్ అంగీకరించడానికి చిహ్నమేనని ల్యూబా చెప్పాడు...'

ఇక మరో రచయిత 'కోర్నీ ఇవాన్‌చుక్,' ఫెదయేవ్ యొక్క ఆత్మహత్య తర్వాత, తన రోజువారీ దినచర్య పుస్తకంలో ఈ కింది విధంగా రాసుకున్నాడట:

"నేను చాలా విచారిస్తున్నాను ప్రియమైన అలెక్సాండ్ర్ అలెక్సాండ్రోవిచ్! ఒక వ్యక్తి యొక్క రష్యన్ రకమైన సహజసిద్ధమైన మేధస్సుపైన గల గట్టి పొరలు... ఓరి దేవుడో! ఆ పొరలు ఎలాంటివి? స్టాలిన్ యుగంలో విగతులైన సకల మానవులూ, మూర్ఖమైన సకల అణచివేతలూ, దానియొక్క బ్రహ్మాండమైన ఉద్యోగస్వామ్యం, ఇంకా దాని యొక్క యావత్తు అవినీతి, మరియు రెడ్ టేపిజం - ఈ అసంగతాలకూ, వాటికి సంబంధించిన ఇతరాలకూ - వీటన్నిటికీ ఫెదయేవ్ యొక్క ఆమోదం ఉంది.

ప్రాథమికంగా గౌరవనీయుడైన ఒక మానవుడు, సాహిత్య ప్రేమికుడైన వాడు, తన సాహిత్య నావను - మిక్కిలి ప్రమాదాలతో కూడిన, అత్యంత సిగ్గుచేటైన జలాలలోనికి తీసుకెళ్లడమేగాకుండా, ఉన్నతమైన మానవతా భావనకు గూఢచర్య మనస్తత్వాన్ని రంగరించ బోయి, తన జీవితాన్ని ముగించుకున్నాడు. అదే అతడి నడవడికలోని గజిబిజికీ, అతని జీవితంలోని చివరి సంవత్సరాల్లో హింసించ బడినట్లున్న అతని నైతిక స్థితికీ కారణం!

అతడు కోల్పోయిన వ్యక్తిగా పుట్టలేదు. ఉపయోగకరమైన నాయకుడు. రచయితల అదృష్టాలను సరిచూసే వ్యక్తి. సాహిత్య పరిరక్షక పదవి అతణ్ణి తీవ్రంగా బాధించినందున, అతడా స్థానం నుండి తప్పుకుని ఉండాల్సింది. అతడి మిత్రులెవరూ అతను చేస్తున్న దానిని విశ్లేషించి, అది సరికాదని చెప్పడానికి సిద్దంగా లేరు. అతడి చివరి కొద్ది సంవత్సరాలుగా రాస్తున్న వ్యాసాల్లో ఓ కొత్త ఒరవడిని సృష్టించబోయాడు గానీ... ఆ వ్యాసాలు పాఠకుల దృష్టిలో అతడి స్థాయిని దిగజార్చేవిగా ఉన్నాయి తప్ప, యంగ్‌గార్డు శిక్షుల్ని మేల్కొల్పి, వాటిని తిరిగి పని చేయించేవిగా లేవు. కఠోర శ్రమ, నైపుణ్యం, సున్నిత మనస్తత్వం గల అతడు, ప్రమాదాల ఊబిలో దిగబడి, ఆ బురద దుర్వాసనను తట్టుకోలేక, మద్యం మత్తులో, నిర్ణయాత్మక స్పృహను కోల్పోయాడు..."

పై రాతల్లో నదేజ్డామందేల్‌స్తమే రాసిందాన్ని పరిగణనలోనికి తీసుకుంటే, ఫెదయేవ్‌లో ఆమె ఆరోపించిన నేరం గురించి చూద్దాం. ఆమె రాసిందాన్ని బట్టి, ఆమె భర్త అయిన కవీ, రచయిత 'ఒసిప్ మందేల్‌స్తమ్'ని చివరిసారిగా అరెస్ట్ చేసేముందు (ఈ అరెస్ట్ తర్వాత కొద్ది కాలానికి జబ్బు చేసి ఒసిప్ మరణించాడు - రచ.), అతడికి ఫెదయేవ్ ఎంతో బరువెక్కిన హృదయంతో, కన్నీటి వీడ్కోలు యిచ్చాడట! ఆమె కూడా ఫెదయేవ్‌లో ఆ సహృదయతనూ, సానుభూతినీ గుర్తించింది. అయితే ఆ తర్వాత ల్యూబా (ఎహ్రెన్‌బర్గ్) ఫెదయేవ్ దయలేని కఠినుడని చెప్పాడట! ఎందుకని ల్యూబా అలా భావించాడంటే, యిద్దిష్ భాషా రచయితల హత్యకు ముందు కూడా, ఫెదయేవ్ వారికి కన్నీటి వీడ్కోలు ఇచ్చినందుకట! అంతేగాక, ఆ రచయితలు ఫెదయేవ్‌కు మిత్రులు అయినందువల్లనట! ఆ రచయితలు ఫెదయేవ్‌కు మిత్రులయినంత మాత్రాన, అతడు కఠినుడెందుకయ్యాడంటే, ఎహ్రెన్‌బర్గ్ పొంతనలేని వివరణ నిస్తాడు. ఫెదయేవ్ వారికి కన్నీటి వీడ్కోలు ఇవ్వడం ద్వారా ఆ హత్యలకు అతడు అంగీకారం తెలిపాడని ఎహ్రెన్‌బర్గ్ వివరణ! ఈ ల్యూబా (ఎహ్రెన్‌బర్గ్) తర్కం, దాన్ని నదెజ్డామందేల్‌స్తమ్ యధాతథంగా ఉటంకించడం చూస్తే, ఆమె కూడా ఆ తర్కాన్ని నమ్మిందని మనకు అర్థమవుతుంది. అంతేగాక, ఈ తర్కం మామూలు తర్కం కాదని, ఇదేదో కూటతర్కంలా ఉన్నదని కూడా అర్థమవుతుంది. అరెస్టయి, శిక్షలకు గురికాబోతున్న సాటి రచయితలకు కన్నీటి వీడ్కోలు ఇవ్వడమే ఫెదయేవ్ చేసిన నేరంగా మనకు కనిపిస్తుంది! దీన్ని బట్టి ల్యూబా (ఎహ్రెన్ బర్గ్) ఉద్దేశంలో, శిక్షకు గురైన రచయితలు హత్యలకు గురవుతారని ఫెదయేవ్‌కు ముందే తెలుసున్నట్లు, ఫెదయేవ్‌కు వారి హత్యల పట్ల నిజమైన సానుభూతి కలిగినవాడై ఉంటే, ఆ హత్యలను ఆపడానికి ప్రయత్నించేవాడనీ మనకు అనిపిస్తుంది. ఆ హత్యలను ఫెదయేవ్ ఎలా ఆపగలడంటే, సోవియట్ రచయితల సంఘం అధ్యక్షుడిగా, పార్టీ వ్యక్తిగా ఫెదయేవ్‌కు పలుకుబడి ఉన్నదనీ, కానీ ఫెదయేవ్ ఆ పలుకుబడి ఉపయోగించలేదు కాబట్టి, ఫెదయేవ్ యొక్క కన్నీటి వీడ్కోలు ఓ కంటి తుడుపు చర్యే తప్ప, మనసులో నుండి వచ్చింది కాదనీ!

పై రెండు ఉదంతాల్లో ఒసిప్ మందేల్‌స్తమ్ గురించి మొదట తెలుసుకుందాం. పోలెండ్ నుంచి వచ్చిన ఒక ఉన్నత వ్యాపార (తోళ్ల వ్యాపారం) కుటుంబంలో జన్మించిన ఇతడు 'అక్మేయిజం' అనే కవితా సిద్ధాంతానికి చెందిన కవీ, రచయితా. ఆక్మేయిజం కవితా సిద్ధాంతం ప్రకారం, అందంగా తీర్చిదిద్దబడి ఆకర్షణీయంగా మలిచిన పదాల పొందికతో, స్పష్టంగా భావాన్ని వెలిబుచ్చాలి. పాశ్చాత్య ప్రభావంతో రష్యాలో పుట్టిన ఈ కవి సంఘం మేనిఫెస్టోను ఇతడే రాశాడు. మరో కవయిత్రి అన్నా అఖ్మతోవాతో బహుకాలం 'సన్నిహితం'గా మెలిగిన ఇతడు, పలువురు మహిళామణులతో పీకల్లోతు ప్రేమాయణాల్లో మునిగితేలాడు. నదెజ్డాను వివాహమాడిన తర్వాత కూడా ఇతడు తన ప్రేమాయణాలను మానుకోలేదు. ఎందరితోనో సాగించాడు. మొదటగా ఎక్కువగా కవిత్వాన్ని రాసిన ఇతడు, ఆ తర్వాత వచనంలోకి మారాడు. విప్లవ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఇతడు, ఏకపార్టీ స్వామ్యాన్ని, క్రెమ్లిన్‌లో అధికారం కేంద్రీకరించబడటాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. అంతేగాక స్టాలిన్‌ను వ్యక్తిగతంగా హేళన చేస్తూ 'స్టాలిన్ ఎపిగ్రామ్' అనే కవితను రాసి ఓ హీరోలాగా ఏమాత్రం జంకు లేకుండా నలుగురు చేరిన చోటల్లా

చదివేవాడు. ఇంకా ఇతడికి ఏయే విప్లవ ప్రభుత్వ వ్యతిరేక చర్యల్లో ప్రమేయం ఉందీ తెలియదు గానీ (ఇతడి విషయంలో వామపక్ష కమ్యూనిస్టు ముఠా నాయకుడుకు బుహారిన్ జోక్యాన్ని బట్టి మనకు ఇలా అనుమానించే ఆస్కారం కలుగుతోంది), 1930లో భార్య నదెజ్దాతో సహా ఇతణ్ణి అరెస్టు చేసి ప్రవాసం పంపించారు. అయితే వామపక్ష కమ్యూనిస్టు ముఠా నాయకుడైన బుహారిన్ జోక్యం చేసుకోవడం వల్లనో, లేక మరేదో కారణం వల్ల కొద్ది నెలల్లోనే అతణ్ణి విడిచిపెట్టారు. దాంతో భార్యతో సహా 'ఒరొనెజ్'లో మకాం పెట్టాడు. అప్పుడే అతడు 'ఒరొనెజ్ నోటుబుక్' అనే పద్యాన్ని రాశాడు. ఈ సమయంలోనే స్టాలిన్ని 'మంచి' చేసుకోవడం కోసం, ఒకప్పుడు తీవ్రంగా విమర్శించిన తన కలంతోనే ఇప్పుడు 'ఓడ్ టు స్టాలిన్' అనే పేరుతో కొన్ని పద్యాలు రాశాడు. అయినా ప్రభుత్వానికి ఏం అనుమానం వచ్చిందో ఏమో, మొదట మాస్కోకు దూరంగా వెళ్లవద్దని ఉత్తర్వులిచ్చి, ఆపై కొద్ది కాలానికి, 1938, మే 5న అరెస్టు చేశారు. ఈ రెండోసారి అరెస్ట్ చేసినప్పుడే ఫెదయేవ్ అతడికి కన్నీటి వీడ్కోలు ఇచ్చాడు. ఓసిప్ అరెస్ట్ తర్వాత, అతడి నేరాన్ని విచారించి ప్రవర్తన సరిదిద్దేందుకు 5 సంవత్సరముల కరెక్షన్ కాంప్ శిక్ష విధించారు. కాంప్‌కు తరలించే క్రమంలో, మధ్య స్టేషన్ అయిన 'వ్లదివోస్తోక్'లో జబ్బు చేసి మరణించాడు. ఇది ప్రభుత్వం చేసిన హత్యేనని ఎహ్రెన్‌బర్గ్ ఆరోపణ. (ఈ ఎహ్రెన్‌బర్గ్ ఓసిప్ మందేల్‌స్తమే పుస్తకాల్ని అచ్చువెయ్యడంలో శ్రద్ధ వహించాడు. ఇక నదెజ్దా మందేల్‌స్తమే అయితే, భర్త తన ప్రేమాయణాల ద్వారా తనకు చేసిన ద్రోహాన్ని ఏమాత్రం లెక్క చేయక, అతడి మరణానంతరం, అంతకుముందు భర్త రచనలు చెల్లాచెదురు కాగా, ఆ తర్వాత వాటిని ఎంతో ఓపిగ్గా సేకరించి, వాటన్నింటినీ ప్రచురించింది. ఇక స్టాలిన్ మరణానంతరం, కృశ్చేవ్ ప్రభుత్వం, ఓసిప్ మందేల్‌స్తమ్‌పైన 1938లో మోపబడ్డ ఆరోపణలన్నింటినీ రద్దు చేయగా, గోర్బచేవ్ హయాంలో, 1987లో, ఓసిప్ 1930లో మోపబడ్డ ఆరోపణలు రద్దు చెయ్యబడ్డాయి. 1977లో అంతరిక్షంలో ఓ చిన్న గ్రహానికి ఓసిప్ పేరుపెట్టడం కూడా జరిగింది. వీటిని బట్టి ప్రతీఘాత ప్రభుత్వాలకు ఓసిప్‌పై ఎంత శ్రద్ధ ఉన్నదీ అర్థమవుతుంది కదా!)

ఇక ఇప్పుడు ఎహ్రెన్‌బర్గ్ పేర్కొన్న యిద్దిష్ భాషా రచయితల 'హత్యో'దంతాన్ని పరిశీలిద్దాం.

రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పట్నుంచీ జర్మనీ చేసిన భయంకర దాడుల్ని సోవియట్ రష్యా వీరోచితంగా ఎదుర్కొని, నిలదొక్కుకుని, ప్రతిదాడుల్ని చెయ్యడమేగాక, ఫాసిస్ట్ జర్మన్ మూకల్ని పారదోలి, జర్మనీకంటా వారిని తరిమికొట్టడమేగాక, ఫాసిస్టుల సొంత గడ్డమీదే ఆ సేవల్ని ఓడించి, ప్రపంచాన్ని ఫాసిస్టుల నుంచి రక్షించిన సంగతి విదితమే. యుద్ధం మొదలు కాకముందే, హిట్లర్ మూకలు యూదుల్ని ఎంతగా వెంటాడి వేటాడిందీ కూడా విదితమే. అందువల్ల రష్యాలోని కొంతమంది యూదు రచయితలు రెండో ప్రపంచ యుద్ధ ప్రారంభంలో ఫాసిస్ట్ వ్యతిరేక కూటమి (జూయిష్ యాంటీ ఫాసిస్టు కమిటీ) గా ఏర్పడి, ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న యూదుల మద్దతు, జర్మనీకి వ్యతిరేకంగా సోవియట్ రష్యాకు అందించేందుకు సిద్ధపడ్డారు. పలువురు రచయితలూ, కవులూ, జర్నలిస్టులూ ఈ కమిటీలో ఉన్నారు. తమ తమ రచనల ద్వారా, రేడియోలో ప్రచారం ద్వారా ప్రపంచ యూదుల మద్దతు కూడగట్టాలని వీరంతా భావించారు. ఆ విధంగా ఈ కమిటీ కొంత కృషి చేసి, యుద్ధం తర్వాత ఆకస్మికంగా తన లక్ష్యాన్ని మార్చుకుంది. ఎందుకంటే, యుద్ధం తర్వాత యూదుల కోసం ప్రత్యేక దేశం ఇజ్రాయేల్ ఏర్పడినందున, ఆ దేశానికి మద్దతునివ్వాలని వీరు రహస్యంగా అనుకున్నందు వల్ల కావచ్చు, బయటకు, దేశంలోని (రష్యాలోని) వివిధ యూదు సంఘాలనూ, తమ ప్రత్యేక సంస్కృతినీ, గుర్తింపునూ పటిష్టపరుచుకోవాలని ప్రకటించుకున్నారు. అయితే సంఘంలోని సభ్యులు కొంత మంది దీన్ని వ్యతిరేకించారు. అయినప్పటికీ కమిటీ తన నిర్ణయం మార్చుకోలేదు. దీని అధ్యక్ష, ఉపాధ్యక్షులు నిధుల సేకరణ పేరుతో అమెరికా, ఇంగ్లాండులు పర్యటించారు. అటుపై ఈ సంఘంలోని కొందరు ముఖ్యులు సోవియట్ వ్యతిరేక వార్తల్ని ప్రచారం చేస్తున్నారనీ, విప్లవ వ్యతిరేక నేరాలకు పాల్పడుతున్నారనీ, శత్రు దేశాలకు అనుకూలంగా గూఢచర్యం జరుపుతున్నారనీ ఆరోపిస్తూ, మొదట 1948 సెప్టెంబరులో కొందర్నీ, అటు తర్వాత 1948 జూన్ ఇంకొందర్నీ, మొత్తం 15 మందిని అరెస్టు చేశారు. వీరి నేరాలను సైనిక న్యాయస్థానం విచారించింది. ఖైదీల్లో కొంత మంది ఆ ఆరోపణల్ని అంగీకరించగా, మరి కొంతమంది తిరస్కరించారు. విచారణ ముగిసేలోగా ఓ ఖైదీ మరణించాడు. 13 మందికి మరణ శిక్ష విధించి, దాన్ని 1952 ఆగస్టు 12న అమలు చేశారు. ఓ ఖైదీని 3 1/2 సంవత్సరాల కరెక్షన్ కాంప్‌కు పంపారు. (అయితే స్టాలిన్ మరణానంతరం, కృశ్చేవ్ ప్రభుత్వం యథావిధిగా ఈ రచయితలపై ప్రభుత్వం చేసిన ఆరోపణలకు రుజువులు లేవని చెప్పి, ఉపసంహరించి, ఓ మహిళా ఖైదీకి విధించిన కరెక్షన్ కాంప్ శిక్షను రద్దు చేశారు. ఈ విధంగా కృశ్చేవ్ ప్రభుత్వంగానీ, అనంతర కాలంలో పాలించిన ప్రభుత్వాలుగానీ స్టాలిన్ కాలం నాటి పలు కేసుల విషయంలో నేరారోపణల్ని ఉపసంహరించడం చూస్తుంటే, స్టాలిన్ కాలంలో సాగిన విచారణలన్నీ అక్రమాలని నిరూపించడమే ఆ ప్రభుత్వాల ఆశయంగా మనకు అనిపించకమానదు)

ఈ యిద్దిష్ రచయితల అరెస్ట్ సమయంలోనే ఫెదయేవ్ వారికి కన్నీటి వీడ్కోలు ఇచ్చాడనీ, వీరంతా అతడికి మిత్రులనీ పై రాతల వల్లే తెలుస్తోంది. ఈ కన్నీటి వీడ్కోలు కూడా, వారి అనంతర హత్యలకు ఫెదయేవ్ అంగీకరించడానికి చిహ్నమేనని ఎహ్రెన్‌బర్గ్ ఆరోపించడం తెలిసిందే. ఒకవేళ ఫెదయేవ్ ఈ హత్యలను అంగీకరించకపోయి ఉంటే గనుక, ఏం చేసి ఉండేవాడన్నది ఎహ్రెన్‌బర్గ్ రాయలేదనుకోండి. అయినప్పటికీ, ముందే మనం ఊహించినట్లు, అలా అయి ఉంటే (ఈ హత్యలను ఫెదయేవ్ అంగీకరించకపోయి ఉంటే) అతడు (ఫెదయేవ్) తన పలుకుబడిని ఉపయోగించి, వాటిని (ఆ హత్యలను) ఆపు చేసివుండే వాడన్నది ఎహ్రెన్‌బర్గ్ ఉద్దేశం కావచ్చును. అప్పుడతడి కన్నీటి వీడ్కోలు అతడి మృదు హృదయానికి చిహ్నంగా ఉండేదని ఎహ్రెన్‌బర్గ్ చెప్పి ఉండేవాడు. ఇదేమీ జరగలేదు గనుక, ఫెదయేవ్ ఏమాత్రం దయలేని కఠినుడని ఎహ్రెన్‌బర్గ్ చెప్పాడు.

నిజానికి పైన పేర్కొన్న రచయితలకు సంబంధించిన రెండు ఉదంతాలూ (ఇవి ఆ రచయితలకు అనుకూలంగా 'లోవల' (ఇంటర్‌నెట్)లో ఇవ్వబడ్డ కథనాలే! లోవలలో వీరిపై ఇంకా చాలా కథనాలున్నప్పటికీ, అవన్నీ కూడా వారికి అనుకూలంగా ఉన్నవే అయి ఉంటాయనీ, అప్పటి విప్లవ ప్రభుత్వ అనుకూల కథనాలు ఉండవనీ వేరే చెప్పనక్కరలేదనుకోండి! ఎందుకంటే, లోవలలోని సైట్లన్నీ

ప్రతీఘాతానికీ, అలాగే సామ్రాజ్యవాదానికీ అనుకూలమైనవేననీ, మార్క్సిజానికి సంబంధించి ప్రత్యేకంగా ప్రారంభించిన ఒకటి రెండు తప్ప - మనందరికీ తెలిసిన సంగతే కదా! అంతెందుకు, ఫెదయేవ్ జీవితానికి సంబంధించిన పైన పేర్కొన్న అంశాలు కూడా, అతడికి వ్యతిరేకంగా ఉన్న కథనాలలోంచి గ్రహించినవేనని ఈ సందర్భంలో చెప్పడం అవసరం. ఎందుకంటే, అతడి జీవిత చరిత్రను, ఎలాంటి పక్షపాతాలూ లేకుండా, జరిగింది జరిగినట్లు చెప్పే పూర్తి కథనాలు లభ్యం కావడం లేదు. అందువల్ల అతణ్ణి విమర్శించే కథనాల నుంచే, వాటిని విశ్లేషించి, వాస్తవాలను రాబట్టాల్సి ఉంది) పరిశీలిస్తే మనకేం అనిపిస్తుంది? ఆ రచయితలు పరమ అమాయకులని ఎవరైనా (ప్రతీఘాతకులకూ, రివిజనిస్టులకూ, వారి తాబేదార్లకు తప్ప) భావించగలరా? ఓసిప్ విషయంలో అతడిది సహజ మరణమో లేక ఎహ్రెన్‌బర్గ్ వగైరాలు భావించినట్లు ప్రభుత్వ హత్యో మనకు తెలీదు. ఒకవేళ ప్రభుత్వం చేసి ఉంటే, అది రహస్యంగా చేసింది కాబట్టి, ఫెదయేవ్ దాన్ని హత్యగా భావించే అవకాశం లేదు. అయితే ప్రభుత్వమే అతణ్ణి చంపాలని అనుకుని ఉంటే, దాన్ని ఆపేదెవరు? బహిరంగంగానే మరణశిక్ష విధించి ఉండవచ్చు.

ఇక యిద్దిష్ రచయితల విషయానికి వస్తే, నేరాన్ని కొందరు స్వయంగానే ఒప్పుకున్నందున, నేరం అసలంటూ జరిగినట్లే కదా! మరి ఈ విషయంలో, ఓసిప్‌కుగానీ, యిద్దిష్ రచయితలకు గానీ ఫెదయేవ్ ఏం సహాయం చెయ్యగలడు? అయినా వారంతా సాటి రచయితలు గనుక, ఫెదయేవ్ కన్నీటి వీడ్కోలు ఇచ్చాడు. అంతే తప్ప, అతడిది రాతి గుండె అయినందువల్లనో, లేదా ఆ హత్యలకు అతడి ఆమోదం ఉన్నందువల్లనో కాదని చెప్పవచ్చు.

ఇక్కడ ఎహ్రెన్‌బర్గ్ చరిత్ర కూడా కొంత చెప్పవలసిన అవసరం ఉన్నది. నవలా రచయితగానూ, జర్నలిస్టుగానూ, యుద్ధ విలేఖరి (మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలకూ, స్పానిష్ అంతర్యుద్ధానికీ)గా పని చేసిన ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీకి వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం చేసి స్టాలిన్ మెప్పు పొందాడు. యూదు రచయితల సంఘంలో (జెఎసి) ప్రముఖ సభ్యుడిగా ఉండి, ఇజ్రాయేల్‌ను తీవ్రంగా విమర్శించాడు. స్టాలిన్ కాలంలో ఎంతో పలుకుబడి కలిగిన ఇతడు 100కి పైగా పుస్తకాలు రాశాడు. బోల్షివిక్కుగా తన జీవితాన్ని ప్రారంభించిన ఇతడు, 'పారిస్ పతనం' నవల ద్వారా తెలుగు వారికీ పరిచితుడే. శత్రువుల్ని చీల్చి చెండాడే వాడి వేడి పదజాలం ద్వారా విప్లవ కాక పుట్టించే ఇతడు పరమ వివాదాస్పదుడు. స్టాలిన్ మరణానంతరం, కృశ్చేవ్ సాగించిన విప్లవ వ్యతిరేక లిబరిజాన్ని అందిపుచ్చుకున్న ఇతడు, తన 'దిథా' నవల (స్నేహ విస్మృతి) ద్వారా తన తిరోగమన విశ్వరూపాన్ని చూపించి పరమ అసహ్యకరమైన రాతలు రాసి; విప్లవాభిమానులకు కోపాన్ని రగిలించాడు. అంతేగాక విప్లవ వ్యతిరేకి అయిన ఓసిప్‌మందేల్‌స్తమ్ రచనలను అచ్చువెయ్యడం ద్వారా, అలాగే విప్లవ వ్యతిరేక రాతలు రాసిన పాస్టర్ నాక్‌ను వెనకేసుకురావడం ద్వారా తన వాస్తవిక అంతరంగాన్ని ఆవిష్కరించాడు. ఇంతకీ ఈ నవలలో కథా నాయకుడెవరో తెలుసా? విప్లవానికి ప్రసిద్ధవెన్నుపోటుదారుడూ, రివిజనిస్టూ అయిన కృశ్చేవ్! లిబరలైజేషన్ పేరుతో అతడు సాగించిన విప్లవ విచ్ఛిన్నం, స్టాలిన్‌పై అబద్ధాల్ని కల్పించి, తీవ్రంగా ప్రచారం చెయ్యడం, స్టాలిన్ వ్యక్తిత్వ హననం - వీటన్నింటినీ ఎంతో ఆకర్షణీయంగా ఎహ్రెన్‌బర్గ్ చూపించాడు. ఇతడు చేసిన నిందా ప్రచారం ఎంతటి విషపూరితం అంటే, 'గులాగ్' లేబర్ కాంప్‌లో మిలియన్ల కొద్దీ 'విప్లవకారులు' ఉన్నారని ఇతడు చేసిన వర్ణన. ఇక కృశ్చేవ్ బెల్గ్రేడ్‌లో టిటోను కలుసుకోవడం, అటుపై లండన్‌లో బ్రిటిష్ ప్రధానినీ, అమెరికాలో అక్కడి అధ్యక్షుడినీ కలిసి స్నేహ హస్తం అందించి, ఒప్పందాలు కుదుర్చుకుని, పాశ్చాత్య దేశాల నుండీ టన్నుల కొద్దీ విష సంస్కృతిని దిగుమతి చేసుకోవడం - వీటన్నింటినీ ఎంతో గొప్పగా వర్ణించి చూపించాడు. అప్పటికే మొదలై ఉన్న ఈ అంటు జాడ్యం వల్ల విప్లవ సంస్కృతికి ఎలాంటి నష్టం కలుగుతోందీ 1946లో స్టాలిన్ సృజనాత్మక మేధావులతో జరిపిన చర్చలో హెచ్చరించడాన్ని గమనిస్తే (1946లో స్టాలిన్ సృజనశీల మేధావులతో జరిపిన సంభాషణ చరిత్ర ప్రసిద్ధికెక్కింది. ఆ మేధావులకు రచయితల సంఘం ఛైర్మన్ అయిన ఫెదయేవ్ నాయకత్వం వహించి, తమ తమ సృజనశీల కళారూపాల్లో వ్యక్తమవుతున్న విషయాల్ని గురించీ, తమ ముందున్న సమస్యల గురించీ చెప్పినప్పుడు, స్టాలిన్ ఈ హెచ్చరిక చేశాడు. అలాగే భవిష్యత్తులో శత్రు దేశాల గూఢచారులు సాంస్కృతిక రంగంలో ఎలా చొరబడి, విప్లవానికి ఎలాంటి నష్టం కలగజేయబోయేదీ ముందే ఊహించి హెచ్చరించాడు), ఆ ముప్పులను నిస్సిగ్గుగా కృశ్చేవ్ ఎలా చేతులు బార్లా చాపి ఆహ్వానించిందీ, దాన్ని ఎహ్రెన్‌బర్గ్ ఎలా ఉన్నతీకరించి, రంగులద్ది ఆకర్షణీయంగా చూపించిందీ ఈ నవలలో కనబడుతుంది. అయితే అబద్ధం అత్యంత డిమాండ్ ఉన్న వ్యాపార సరుకున్న విషయాన్ని ఈ నవల అమ్మకం నిరూపించింది. విడుదలైన రోజే 45,000 కాపీలు అమ్ముడుపోయి చరిత్ర సృష్టించింది. ఇలాంటి వ్యాపారమర్మాలు తెలిసిన ఎహ్రెన్ బర్గ్, ఫెదయేవ్‌ని విమర్శించాడంటే ఆశ్చర్యం ఏముంది!

ఇక మరో రచయిత కోర్నీ చుకోవ్‌స్కీ (పిల్లల రచయితగా ప్రసిద్ధికెక్కిన ఇతడు 1882 నుంచి 1969 దాకా జీవించాడు. అయితే ఇతడు చేసిన పిల్లల రచనలు పిల్లల్ని తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని పెద్ద విమర్శల దుమారమే రేగింది. ఆ దుమారంలో ముఖ్యపాత్ర లెనిన్ భార్య అయిన నదెజ్దా కాన్‌స్టన్‌తీనోవ్నా కూప్ స్కయాది, మరికొందరు పిల్లలు రచయితలదీ, సోవియట్ అధికారానికి ఇతడు బద్ధవ్యతిరేకి. అంతేగాక సోవియట్ సెన్సార్ విధానాలకు వ్యతిరేకమైన రాతలు రాసి. ఇబ్బందులు పడ్డ పలువురు రచయితలకు ఇతడు అండగా నిలబడ్డ విప్లవ వ్యతిరేకి. అంతెందుకు, స్టాలిన్ హయాంలో జరిగాయని చెప్పబడుతున్న ఘోరాల్ని భూతద్దంలో చూపించి, తద్వారా పాశ్చాత్య దేశాలమెప్పు పొందుతూ, నోబుల్ ప్రైజ్ కొట్టేసిన 'డాక్టర్ ఝివాగో' నవలా రచయిత అయిన పాస్టర్ నాక్‌ను, బహిరంగంగా అభినందించినవాడు ఈ కోర్నీచుకోవ్‌స్కీ ఒక్కడే కావడం గమనార్హం. స్టాలిన్ వ్యక్తిత్వంపై దుర్మార్గంగా దాడి చేసిన కృశ్చేవ్ హయామే అయినప్పటికీ, మరే రచయితా పాస్టర్ నాక్‌ని బహిరంగంగా అభినందించే ధైర్యం చెయ్యలేకపోయారంటే, ప్రజాభిప్రాయం ఎలా ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. కోర్నీచుకోవ్‌స్కీ ఒక్కడే కాదు, అతడి కుమార్తె, రచయిత్రి అయిన 'లిదియా' కూడా సోవియట్ వ్యతిరేక ఉద్యమానికి నాయకురాలే), ఫెదయేవ్‌పై చేసిన ఆరోపణల సంగతి చూద్దాం. స్టాలిన్ యుగపు సకల అవలక్షణాలకు ఫెదయేవ్ యొక్క ఆమోదం ఉన్నదని ఇతడంటాడు. ఇతడు పేర్కొన్న అవలక్షణాల్లో అధికారుల అవినీతి, రెడ్ టేపిజంలను మినహాయిస్తే (ఎందుకంటే,

అవే గనుక ఉండి ఉంటే, సామ్రాజ్యవాద దేశాలకే ఆశ్చర్యం గొలిపేంత వేగంగా దేశం బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించి, ప్రపంచ శక్తిగా ఎదిగి ఉండేది కాదు. బహుశా విప్లవ వ్యతిరేకుల పట్ల సెన్సార్ అధికారుల కఠిన వైఖరికి కొర్నీచుకోవ్స్కీ అవినీతి, రెడ్ టేపిజం అనే పేర్లు పెట్టి, ఆ పేర్లను మొత్తం అధికార వ్యవస్థకు ఆపాదించి ఉండవచ్చు), ప్రజల హత్యల గురించి చూద్దాం. ఎహ్రెనబర్గ్ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాడు కదా!

సోవియట్ రష్యాలో 1936-38 మధ్య పెద్ద ఎత్తున ప్రక్షాళన కార్యక్రమం అమలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే దానికి కారణం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు అధికారాన్ని కైవశం చేసుకోవడానికి ఘోరమైన కుట్రకు పాల్పడ్డమే. వివిధ స్థాయిల్లో వేలాదిగా ఉన్న తమ అనుచరణాలతో పాటు, తగిన మద్దతు కోసం వీరు విప్లవ వ్యతిరేకులైన వివిధ శక్తుల్నీ, వ్యక్తుల్నీ, వర్గాల్నీ కలుపుకుని తమ కుట్రకు పదును పెట్టారు. నాజీ గూఢచారి శాఖ 'గెస్టపో' మద్దతు కూడా వీరికుంది. దేశంలో అల్లకల్లోలం సృష్టించేందుకు ఫ్యాక్టరీల్లో యంత్రాలు పాడు చెయ్యడం, గనుల్లో పేలుల్లో సృష్టించడం వేలాదిగా అమలు చేసి ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగించారు. పార్టీలో స్టాలిన్‌కు కుడిభుజంలాంటి కీరోవ్ (స్టాలిన్‌కు వారసునిగా బహుశా ప్రకటించబడేవాడు. లెనిన్‌గ్రాడ్‌లో పార్టీ కార్యదర్శి)ని. అతడి ఆఫీసులోనే చంపేసి, స్టాలిన్ హత్య చేయించాడని పుకార్లు లేవదీశారు. దీంతో ఈ హత్యను తీవ్రంగా తీసుకున్న ప్రభుత్వం దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించే సరికి, పెద్ద నాయకుల గుట్టు, వారి కుట్ర కోణం బయటపడింది. ఆ కుట్రకు దేశ వ్యాపితమూలాలున్నట్లు తెలియడంతో, ఆ స్థాయిలోనే విచారణలు జరిగాయి. అందునా యుద్ధం ముంగిట ఉన్నందున (రెండో ప్రపంచ యుద్ధం నేడో రేపో బద్దలు కానున్నదన్న వార్తలు ప్రపంచమంతటా వ్యాపించాయి), ప్రభుత్వం సమూల ప్రక్షాళనకు దిగక తప్పలేదు. ఉన్నత స్థాయి నాయకుల విచారణలు బహిరంగంగానే జరగగా, వారు నేరాన్ని ఒప్పుకోవడం జరిగింది కూడా. (వారు ఎందుకు అలా అంగీకరించారన్న దానికి అనేక కారణాలు చెబుతున్నారు. మిగిలిన, ఇంకా బయటపడని కుట్రదారుల్ని కాపాడడానికని కొందరు కారణం చెబుతున్నారు). అయితే ఈ నేరాంగీకార ప్రకటనల్ని కొందరు ప్రభుత్వ వ్యతిరేకులు స్టాలిన్ మార్కు విచారణలని, అవహేళన చేశారు గానీ, విచారణలకు విదేశీ రాయబారుల్నీ, పత్రికా విలేఖరుల్నీ వగైరాలను ఆహ్వానించి మరీ జరిపారు. అమెరికన్ రాయబారి కూడా వాటికి హాజరవడమేగాక, అవి నిజమైన విచారణలేనని తెలియ జెప్పాడు కూడా. ఇలాంటి ఘోరనేరాలకు పాల్పడిన వారికి ఉరిశిక్షలకు తక్కువైన శిక్షల్ని ఎవరు విధిస్తారు? వారికి ఆ శిక్షనే విధించడం జరిగింది. ఇంతలో 8 మంది సేనానులు హిట్లర్ కార్యదర్శితో సరాసరి సంబంధం పెట్టుకుని, లంచాలు మేసి, ఉక్రెయిన్ జర్మనీకి అప్పగించేందుకు జరిపిన కుట్ర బట్టబయలై సంచలనం సృష్టించింది. ఆ దేశద్రోహులకూ సరైన శిక్షనే విధించారు. ఈ విధంగా దేశవ్యాప్తంగా నేరాలు, ఘోరాలకు తెగబడ్డ పలువురికి ఉరిశిక్షలూ, మరికొందరికి లేబర్‌కాంపుల్లో ప్రవాస శిక్షలూ విధించారు. విచిత్రమేమంటే మనం సినిమాల్లో చూస్తున్నట్లు పోలీసు శాఖలోకి గెస్టపో ఏజెంట్లు జొరబడి, అమాయకుల్ని, నిజాయితీపరులైన సుశిక్షితులైన పార్టీ వాదుల్నీ కూడా బహుళ సంఖ్యలో శిక్షించి, గందరగోళాన్ని పెంచేందుకు ప్రయత్నించారనీ కూడా బయటపడింది. ఏమైనా సకాలంలోనే ఇటువంటి వాటి అరికట్టగలిగారు. మొత్తానికి తీవ్రస్థాయిలో జరిగిన ఈ కుట్రను అంతే స్థాయిలో విచారించి, శిక్షలు వేశారు. వేలాదిగా జరిగిన విచారణల్లో ఏ దేశంలోనయినా కొన్ని పొరపాట్లు జరగడం సహజం. అందునా యుద్ధం పొంచి ఉన్నందున, ఏ దేశమైనా ఇలాంటి కుట్రల్ని సమూలంగా తుంచివేయడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. అందులో సామ్రాజ్యవాద దేశాలు చుట్టూ పొంచి వుండి, తమ దేశాన్ని కబళించేందుకు ఏ చిన్న అవకాశాన్నీ విడిచిపెట్టని స్థితిలో ఓ సోషలిస్టు దేశం, మరింత తీవ్రంగా ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. సోవియట్ రష్యా అదే చేసింది. అయితే విచారణ సాగించే పోలీసు శాఖాధిపతే విద్రోహి అని తేలడంతో, స్టాలిన్ స్వయంగా కల్పించుకుని, విచారణలు తప్పు దారి పట్టకుండా ఉండేందుకు పార్టీ మార్గదర్శకత్వంలో నియంత్రణా చర్యలు చేపట్టాడు. అయినా కొన్ని తప్పులు జరిగాయనీ, అమాయకులు శిక్షించబడ్డారనీ స్టాలినే స్వయంగా అంగీకరించాడు.

జరిగింది ఇదికాగా, దీన్ని కొండంత చేసి, భూతద్దంలో చూసి స్టాలిన్ కాలంలో అన్నీ అణచివేతలేనని, లక్షలాది హత్యలూ, కోట్లాది లేబర్ కాంపుల శిక్షలూ పడ్డాయని సామ్రాజ్యవాదులు గగ్గోలుపెట్టారు. వారికన్నా ఎక్కువ రివిజనిస్టు ద్రోహి కృశ్చేవ్ పెట్టాడు. స్టాలిన్ మరణానంతరం వంచనతో అధికారాన్ని చేపట్టడమేగాక, వంచనతోనే దాన్ని నిలబెట్టుకున్న ఇతడు (స్టాలిన్‌ది సహజ మరణం కాదనీ, ఆయన్ని ఓ పథకం ప్రకారం హత్య చేశారని, హంతక ముఠాలో కృశ్చేవ్ కూడా ఒకడనీ ఇటీవల జరిగిన పరిశోధనలో బయటపడిందని చెబుతున్నారు), తన రివిజనిస్టు విశ్వరూపాన్ని స్టాలిన్‌పై అబద్ధాలతోనే మొదలుపెట్టాడు. దాంతో విప్లవ వ్యతిరేకులు చెలరేగిపోయారు. అలాంటి వారిలో పైన పేర్కొన్న రచయితలు కూడా ఉన్నారు. అందుకనే ఇంకా విప్లవ రాజకీయాల్నే అంటిపెట్టుకుని ఉన్న ఫెదయేవ్‌ని లక్ష్యంగా చేసుకుని వీరంతా అతణ్ణి దుయ్యబట్టడంలో ముందు వరసలో ఉన్నారు.

ఫెదయేవ్ స్టాలిన్ పాలనను వ్యతిరేకించని మాట నిజమే. అంతేగాక అతడు స్టాలిన్ ఆధ్వర్యంలోని పార్టీలో సెంట్రల్ కమిటీ సభ్యునిగా కూడా ఉన్నాడు. విప్లవ ప్రభుత్వం సోషలిజాన్ని రక్షించేందుకు అనుసరించిన పాలనా విధానాల్నీ సమర్థించాడు. అలాగే తను పని చేస్తున్న రచయితల సంఘాన్ని ఉన్నత నైతిక విలువలతో నిలబెట్టేందుకు ఎంతో కృషి చేశాడు. అంతేగాక నాడు ప్రభుత్వ ప్రతిపాదిత సాంస్కృతిక విధానాన్ని ఆమోదించి, తమ రచయితల సంఘం చేత ఆమోదింపజెయ్యడమే గాక, ఆ విధానాన్ని తీవ్రంగా ప్రచారం చేశాడు కూడా. ఈ సాంస్కృతిక విధానాన్ని రూపొందించిన వాడు 'ఝుదనోవ్'. అతడప్పుడు పార్టీ కార్యదర్శిగా పని చేస్తూ, ప్రభుత్వ సాంస్కృతిక రంగానికి అనధికార సలహాదారుగా ఉన్నాడు. ప్రభుత్వ సాంస్కృతిక విధానాన్ని వ్యతిరేకించిన సృజనశీల మేధావులు, దానికి 'ఝుదనోవిజమ్' (దీని రష్యన్ పేరు 'ఝుదనోవ్‌శ్చినా') పేరుతో హేళన చేశారు. కృశ్చేవ్ కాలంలో 1958లో ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసింది.

స్టాలిన్ కాలంలో సోవియట్ ప్రభుత్వం సోషలిస్టు దేశంగా రష్యాను తీర్చిదిద్దేందుకు పలు చర్యలు తీసుకుని, వాటిని గట్టి పట్టుదలతో అమలు చేసి విజయం సాధించింది. ఆ విధంగా ప్రభుత్వం బలపడటం

గిట్టని ప్రత్యర్థులు, పలు మార్గాల ద్వారా ప్రభుత్వాన్ని బలహీన పరిచేందుకు ప్రయత్నించారు. కళలూ, సాహిత్య రంగాలకు చెందిన పలువురు మేధావులు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు తమ తమ రంగాల్లో కృషి చేశారు.

సాధారణంగా కళలూ, సాహిత్య రంగాలకు చెందిన కొందరు సృజనశీల మేధావులు, తామొక అతీత మానవులమని భావిస్తూ, తమ ఇష్టం వచ్చిన రీతిగా తమ తమ రంగాల్లో పని చేస్తుంటారు. తామూ సంఘంలో ఒక భాగమనీ, అందువల్ల బాధ్యతగా పని చెయ్యాలనీ అనుకోరు. విప్లవం పట్ల కంటగింపు కలిగిన ఈ రంగాలకు చెందిన పలువురు, విప్లవోద్యమాన్నీ, కమ్యూనిజాన్నీ, ప్రభుత్వాన్నీ, కమ్యూనిస్టు మేధావుల్నీ విమర్శిస్తూ, అవహేళన చేస్తూ, బూర్జువా సిద్ధాంతాల్ని పరోక్షంగా బలపరిచేందుకు ప్రయత్నించారు. ఇది మితిమీరిపోవడంతో, ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వమూ, పార్టీ కొంతవరకూ ప్రయత్నించింది. అందులో భాగంగానే ఝదనోవిజమ్ ఆవిర్భావంగా చెప్పాల్సి ఉంటుంది.

ఆంద్రెయ్ ఝదనోవ్ బోల్షివిక్ పార్టీ కార్యదర్శిగా 1946లో పని చేశాడు. ఇతని సిద్ధాంతం ప్రకారం ప్రపంచం రెండు శిబిరాలుగా చీలిపోయింది. అవి : (1) సామ్రాజ్యవాద శిబిరం. దానికి అమెరికా నేతృత్వం వహిస్తోంది. (2) ప్రజాస్వామ్య శిబిరం. దీనికి సోవియట్ యూనియన్ నేతృత్వం వహిస్తోంది. ఈ సిద్ధాంతంలోని ప్రధాన సూత్రాన్ని కొద్ది మాటల్లో చెప్పాలంటే, సోవియట్ సంస్కృతిలో ఉన్న ఒకే ఒక్క వైరుధ్యం ఏమంటే, మంచికీ, మరింత మంచికీ గల తేడాయే.

1946లో పార్టీ సెంట్రల్ కమిటీ తన తీర్మానం ద్వారా రెండు పత్రికల్ని వ్యతిరేకించింది. ఆ పత్రికలు రాజకీయాలతో సంబంధం లేనట్లు నటిస్తూ, పార్టీ వైఖరిని కించపరిచేలా ఉండే వ్యాసాల్ని ప్రచురించాయి. అలాగే మిఖైల్ జుశ్చెంకో, అన్నా అఖ్మతోవా వంటి రచయితలు కూడా తమ తమ గ్రంథాల్లో అలాంటి రాతలే రాయడం వల్ల, వారిని కూడా పార్టీ వ్యతిరేకించింది. అలాగే సంప్రదాయ వ్యతిరేకోద్యమాన్ని ప్రారంభించడానికి చిహ్నంగా ప్రభుత్వం 1948లో సంగీతంపై ఉత్తర్వును వెలువరించింది. స్వరకారుల సంఘం ఈ ఉత్తర్వులను ఆమోదించింది. ఈ ఉత్తర్వు వెలువరించడానికి కారణం కొందరు సంగీతకారులు ప్రజావ్యతిరేకతను చూపించే, అవహేళన పూర్వకమైన ఒపేరాల్ని సృజించడమే.)

అయితే ఫెదయేవ్ తాను ప్రభుత్వ పక్షాన ఉన్నప్పటికీ, స్టాలిన్ పార్టీ కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో ఒప్పుకున్నట్లు, కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమే గనుక, వాటికి ఫెదయేవ్ యొక్క ఆమోదం ఉన్నదని చెప్పడం సరికాదు. అయితే ఫెదయేవ్ ఏ తప్పుల్ని వ్యతిరేకించాడో పూర్తి వివరాలు మనకు తెలీనప్పటికీ, కనీసం అమాయకులకు మరణశిక్షలు విధించడం వరకైనా అతడిలో అసంతృప్తి ఉన్నదని చెప్పవచ్చును. ఫెదయేవ్‌లో లోపాలున్నట్లు ఆరోపించిన రచయితలు ఎహ్రెన్‌బర్గ్, నదెజ్డామందేల్‌స్తమ్, ఒసిప్ మందేల్‌స్తమ్, చుకోవ్‌స్కీల మాటలను బట్టి, అతడు (ఫెదయేవ్‌కు) శిక్షలు విధించబడిన కవులకూ, రచయితలకూ కన్నీటి వీడ్కోలు ఇవ్వడాన్ని బట్టి మనం ఈ విషయాన్ని చెప్పవచ్చును. ఫెదయేవ్‌లో ఇలాంటి అసంతృప్తి ఉందనడానికి, అతడి ఆత్మహత్య లేఖే నిదర్శనం. ("... పూర్వపు పాలకుడైన స్టాలిన్ నుంచి కన్నా, వీరివల్ల తక్కువ నష్టాన్ని ఆశించాం. కానీ ఆయన కనీసం విద్యావంతుడు. వీరో పరమమూర్ఖులు...") ఈ ఉదహరించిన వాక్యాన్ని బట్టి ఫెదయేవ్ స్టాలిన్ కాలంలో రచయితకు జరిగిన నష్టాన్ని చూసి తీవ్రంగానే బాధ పడినట్లు అర్థమవుతోంది కదా! కనుక ఎహ్రెన్‌బర్గ్ చెప్పినట్లుగా అతడి కన్నీటి వీడ్కోలులో ఎలాంటి కపటం లేదు. అతడు నటిని పెళ్లాడాడు గానీ (రెండో ప్రపంచ యుద్ధంలో ఆమె లెనిన్‌గ్రాడ్‌ని విడిచి సురక్షిత స్థలానికి వెళ్లిపోవడంతో వారి బంధం విడిపోయింది. అనంతరం అతడు ఓ కవయిత్రిని వివాహమాడాడు), తను నటుడు కాడు, సున్నిత మనస్కుడు. కనుక ల్యూబా చెప్పిన మాటలు అసంగతమైనవే గాక, పరమ అన్యాయమైనవి కూడా.

ఫెదయేవ్ ఆత్మహత్య : స్టాలిన్ మరణం (1953) తర్వాతి సంవత్సరం దాకా (1954 దాకా) ఫెదయేవ్ సోవియట్ రచయితల సంఘం అధ్యక్షునిగానే ఉన్నాడు. అటు తర్వాత 1954లో పదవి కోల్పోయాడు. కృశ్చేవ్ కాలంలో విప్లవాభిమానులైన రచయితల, ~వుల హత్యల పరంపర కొనసాగిందని ఫెదయేవ్ ఆత్మహత్య లేఖ వల్ల తెలుస్తోంది. ఆ లేఖ నేడు లభ్యం. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత ప్రభుత్వ రహస్య పత్రాలు వెల్లడయినందున, కె.జి.బి. వారి గ్రంథాలయంలో ఇది యథాతథంగా దొరికింది. (ఆ లేఖ అనువాదం చివర్లో చూడొచ్చు.) గూఢచారి శాఖవారి గ్రంథాలయంలో కాబట్టి, భద్రంగా వారి ఫైళ్లలో ఉన్నది. దాని కింది ఫెదయేవ్ ఆత్మహత్యను పరిశోధించిన పోలీసు అధికారి రాసిన నోట్ కూడా ఉన్నది. చరిత్ర పరిశోధకులు స్టాలిన్ కాలంలో జరిగిన మానవ హననాల గురించి, శిక్షల గురించీ మసాలాలు జోడించి, కృశ్చేవ్ చెప్పిన అబద్ధాలకు మరిన్ని రెట్లు అబద్ధాలు సృష్టించి చిలవలు పలవలుగా వర్ణించారు. ఇక ఆ కాలంలో కొందరు రచయితలు చనిపోవడం పట్ల ప్రపంచ వ్యాపితంగా ఉన్న యూదుసంఘాలు (యూదు రచయితల మృతిపట్ల) ఇప్పటికీ స్మృతి సభలు, ఖండన సభలూ జరుపుతూండగా, ప్రపంచ వ్యాప్త సాంస్కృతిక యోధులు గంభీర ప్రకటన గుప్పిస్తున్నారు. కానీ కృశ్చేవ్ హయాలో అంతకన్నా ఎక్కువగా జరిగిన రచయితల హత్యల గురించి ఏ ఒక్క ఎహ్రెన్‌బర్గ్‌గానీ, చుకోవ్‌స్కీ గానీ, నదెజ్డా మందేల్‌స్తమ్‌గానీ, ప్రపంచవ్యాప్త సాంస్కృతిక యోధుల్లో ఏ ఒక్కరు గానీ ఖండించినట్లుగానీ, సంతాపం వ్యక్తం చేసినట్లుగానీ లేదు. మరి ఫెదయేవ్ ఆత్మహత్య లేఖ ఒక చారిత్రక పత్రం. ఆ రీత్యా ఇది అత్యంత విలువైంది. దీన్ని ఆధారం చేసుకునైనా భవిష్యత్తులో పరిశోధనలు సాగుతాయని ఆశిద్దాం.

పై ఆత్మహత్యా లేఖవల్ల ఫెదయేవ్ జీవితానికి సంబంధించిన మరిన్ని వివరాలు మనకు తెలుస్తున్నాయి. అంతకు ముందు చుకోవ్‌స్కీ రాసినదాన్ని బట్టి, కృశ్చేవ్‌కాలంలో ప్రభుత్వం సాగిస్తున్న రివిజనిస్టు చర్యలు, స్టాలిన్ ప్రభుత్వ విధానాల్ని తిరగదోడుతున్న రీతుల్నీ చూసి, సహజంగా విప్లవకారుడైన ఫెదయేవ్ మౌనంగా ఉండలేకపోయాడనీ, ఇది 1954 నుంచే మొదలవడంతో, అతడు తన రచయితల సంఘం అధ్యక్ష పదవిని కోల్పోవలసి వచ్చిందనీ ఊహించవచ్చు. అయినప్పటికీ ఫెదయేవ్ జంకక, ప్రభుత్వ వైఖరిలో మార్పు కోసం తన రచనల ద్వారా ప్రయత్నించాడనీ, వాటిని చూసి చూకోవ్‌స్కీ వంటివారు ఓర్వలేక, నీరసపు రాతలుగా కొట్టేశారనీ భావించవచ్చు. మళ్లీ అతడి ఆత్మహత్య లేఖ దగ్గరకే వస్తే, ఫెదయేవ్ తన విమర్శ వ్యాసాల ద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టడం వల్ల, అతడిపై రాయకుండా ప్రభుత్వం, పార్టీ (ఈ రెంటికీ ఆ రోజుల్లో తేడా లేదు. అతడు పార్టీలో సెంట్రల్

కమిటీలో కాండిడేట్ మెంబర్ అయినందువల్ల పార్టీ నిషేధించిందని అతడు తన లేఖలో చెప్పాడు. కళను తన నుండి దూరం చేయడమంటే ఇదే) అయితే అతడు పార్టీ ప్రముఖుడయినందువల్ల, అలాగే అప్పటి దాకా రచయితల సంఘం అధ్యక్షుడూ అయినందువల్ల కావచ్చు, ఫెదయేవే తన లేఖలో ఆరోపించినట్లు, అతణ్ణి చంపకుండా, నిషేధం మాత్రం విధించింది.

ఇంకా అతడు తన లేఖలో ఆరోపించినట్లు, అంతకు ముందు, అతడికి లభించిన బహుమతుల్ని (సాహిత్య రంగంలో ఫెదయేవ్‌కు స్టాలిన్ బహుమతి లభించింది). వెనక్కి తీసుకోవడంతో మాత్రమే సరిపుచ్చక, అతడి రాతల పట్ల అసమ్మతి తెలపడం, అలాగే అతడిచ్చే ఉపన్యాసాల్లోనూ, అతడి ఆలోచనల్లోనూ గల లోపాల్ని ఎంచుతూండటం వగైరా వగైరా చర్యల వల్ల ఎన్నోసార్లు అవమానానికి గురి చేసింది పార్టీ ప్రభుత్వం. అయినప్పటికీ, ఫెదియేవ్ ఎంతో సహనంతో అవమానాలన్నింటినీ సహించి, పార్టీ కేంద్రకమిటీకి పదే పదే తనకు జరిగిన అన్యాయాల్ని వివరించాడు. తనపై విధించిన అన్యాయపు నిషేధాన్ని ఎత్తివేయమని విజ్ఞప్తి చేశాడు. అయినా సి.సి. ఆ పని చేసింది కాదు. అప్పటికే అతడిలో సహనం నశించిపోయింది. ప్రజా జీవితంలో పేరు ప్రఖ్యాతులు గల ఒక మేధావి, అతడి ఆ పేరు ప్రఖ్యాతలకు కారణమైన రచనాశక్తిపై నిషేధం విధిస్తే, అతడి ప్రతిభను గుర్తించి ఇచ్చిన అవార్డులను ఉపసంహరించి, అతడిని అనుక్షణం తప్పులెంచుతూ అవమానిస్తే, ఇక అతడికి అంతకన్నా మరణం వేరే ఏం ఉంటుంది? తీవ్ర మానసిక వేదనకు గురైన ఫెదీవ్ అంత్యకాలంలో మద్యం విపరీతంగా సేవిస్తూ, చివరికి 1956, మే 13న పిస్టల్‌తో కాల్చుకుని మరణించాడు. అతడు మరణించినప్పుడు ప్రతిఘాతక రచయితలు పండుగ చేసుకున్నారు. పాస్టర్ నాక్ అయితే, ముందే చెప్పినట్లు, హేళనగీతిక (విషాద గీతిక కాదు) రాసి, తన కడుపుబ్బును వెల్లడించుకున్నాడు. మరి ఫెదీవ్ శిక్షింపబడ్డ రచయితలకు కన్నీటి వీడ్కోలు ఇచ్చాడు! ఒక విప్లవకారుడికీ, ఒక ప్రతీఘాతకుడికీ గల తేడాను ఫెదీవ్ మరణం చరిత్రలో ఒక గొప్ప సాక్ష్యంగా నిలిచిపోతుంది! రచయిత కావడానికి అర్హత సున్నిత మనస్సుండాలంటారు. అంటే స్పందించే మనసన్న మాట! మరి ఎవరికి సున్నితమనస్సుందో, కఠినత్ముడెవరో కూడా పై సంఘటనే తెలియజేస్తోంది కదా!

1939 నుంచి 1956 దాకా పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యునిగానూ, 1956లో కాండిడేట్ సభ్యునిగా పనిచేసిన ఫెదయేవ్‌ని కృశ్చేవ్ పట్టించుకోలేదు గానీ, (కృశ్చేవ్ 1964లో పదవీచ్యుతుడయిన తర్వాత అతణ్ణి పట్టించుకున్నవారు లేరు), కృశ్చేవ్ అనంతరం ప్రభుత్వాలు మాత్రం ఉదాశీనంగా ఉండలేకపోయాయి. 1972 నుంచి మిలటరీ సాహిత్యానికిగాను ఫెదయేవ్ మెడల్ ఇవ్వడం మొదలెట్టారు. మొదట దాన్ని మిలటరీ చరిత్ర, జీవితాలపై గల రచనలకు గాను ఇచ్చారుగానీ, 2002లో దాన్ని కొంత మార్చి, మిలటరీలో సాహిత్య రచనలకుగాను ఇవ్వసాగారు. 1971లో రష్యన్ ప్రభుత్వం ఫెదీవ్ స్టాంపును విడుదల చేసింది.

* * *

ఇప్పుడు ఫెదయేవ్ నవల 'వెనుకంజ' (తెలుగులో 'దళం')లో గల ముఖ్య కథాంశాలు, ఫెదయేవ్ దాన్ని తీర్చిదిద్దిన విధం తెలుసుకుందాం.

**'వెనుకంజ' (దళం)లోని కథాంశాలు :**

ఈ నవల మూడు భాగాలుగా, ఒక్కో భాగం వివిధ ప్రకరణాలుగా విభజించబడింది. ప్రతి ప్రకరణానికీ ఓ పేరుంది. ఇప్పుడు ఆయా ప్రకరణాలలో గల కథను వరుసగా గమనిద్దాం.

మొదటి భాగం మొదటి ప్రకరణానికి దళంలో ఓ సభ్యుడైన మొరోజ్కో పేరున్న, దళం కమాండెంటు లెవిన్‌సన్ వర్ణనతోనే నవల ప్రారంభమైంది.

దూరప్రాచ్యంలో గల జపాను ఆక్రమిత ప్రాంతాలలో ఓ ప్రాంతానికి కాస్త ఎడంగా ఉన్న ఒక గ్రామంలో లెవిన్‌సన్ దళం విడిది చేసింది. ఈ దళం గుర్రపు దళం. ఆ ప్రాంతంలో ఇంకా ఇలాంటి గెరిల్లా దళాలు ఇంకా ఉన్నాయి. వాటి అన్నింటికీ కేంద్ర షాల్డిబాలో ఉంది. ఆ కేంద్రానికి కొన్ని ఉత్తరాల్ని అందజేసి రమ్మని లెవిన్‌సన్ తన ఆర్డర్లీ అయిన మొరోజ్కాను పురమాయించాడు. ఇలా ఉత్తరాల్ని అటూ ఇటూ మొయ్యడంతో మొరోజ్కా విసుగెత్తిపోయి ఉన్నాడు. గెరిల్లా దళాల్లో సైనిక దళాల్లో ఉన్నట్లు అంత క్రమశిక్షణ ఉండదు. మొరోజ్కా తనని ఇలా తిప్పుతున్నందుకు కమాండెంటును తిట్టుకుంటూ ఉండిపోయాడు తప్ప, సమాధానం చెప్పకపోయేసరికి కమాండెంటు మందలించాడు. దాంతో "ఎక్కడికెళ్లాలన్నా ఈ మొరోజ్కాయేనా? దళంలో ఇంకెవ్వరూ లేరా?" గొణిగాడు మొరోజ్కా.

"సరే, నువ్వెళ్లకుంటే, దళం నుంచి దయ చెయ్యి" మొహమాటం లేకుండా లెవిన్‌సన్ అనే సరికి, గత్యంతరం లేక, 'సరే ఉత్తరం ఇయ్యి' గునుసుకుంటూ ఉత్తరం అందుకున్న మొరోజ్కా "నేనా, దళాన్ని ఒదిలేసి, తుపాకీని ఒదిలిపెట్టి వెళ్లిపోవడమా, కలలోని మాట..." అనుకుంటూ బయలు దేరాడు.

'శుంఠా' కమాండర్ చనువుగా మందలించగానే, తనూ అంతే చనువుగా, "చూడు తమ్ముడూ... కాస్త అలా ఆస్పత్రికెళ్లి, 'వార్యా' (తన భార్య ఆమె. ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది) ను చూసొద్దామనుకుంటూండగానే, నీ కాగితాలూ నువ్వూ తయారు. దీన్ని బట్టి శుంఠ ఎవరైందీ తెలీడం లేదూ?" అంటూ వెడుతూ, దారిలో తనను పలకరించిన శాపర్ (మందు గనులు నాటేవాడు) అయిన 'గొంచ రెంకో'పై మెరటు హాస్యం కురిపించాడు. శాపర్ దానికి తగినట్లుగానే జవాబిచ్చాడు. ఆపై మొరోజ్కా గుర్రం మిష్కా గోధుమ, యవ చేల మధ్య వేగంగా పరిగెత్తింది.

మొరోజ్కా గని కార్మికుడు. తాత చేసే పొలం పనులు నచ్చక తండ్రి బొగ్గు గనిలో చేరాడు. నలుగురు కొడుకుల్ని కన్నాడు. ఓ చీకటి కొంపలో అందులో ఒకడు మొరోజ్కా. బొగ్గు బళ్లు లాగడం, బూతులు కుయ్యడం, సారా తాగడం - ఇలా సైబీరియన్ అడవిలో గల ఆగని పక్కనున్న చిన్ని గ్రామంలో ఉంటూ జీవితాన్ని సాఫీగా సాగిస్తుండుగా, ఏప్రిల్ సమ్మె (1914?)లో అతణ్ణి జైల్లో కుక్కారు. అతడేదో గొప్ప నాయకుడని కాదు జైల్లో పెట్టింది. తప్పతాగే అతణ్ణి కాస్త చితక్కొడితే, సమ్మె నాయకుల పేర్లు బయటపెడతాడని. కానీ అతడా పని చెయ్యకపోయేసరికి, చేసేదేం లేక ఒదిలేశారు. ఆనక అతడు సైన్యంలో అశ్విక దళంలో చేరాడు. పిరికివాళ్లను అసహ్యించుకోవడం అక్కడే నేర్చుకున్నాడు. యుద్ధంలో గాయపడి, విప్లవానికి ముందే సైన్యం నుండి తిరిగొచ్చాడు. అప్పుడే వార్యాను వెళ్లాడాడు. ఆమె పది మందితో తిరిగే గొడ్రాలు. అతడే పని చేసినా ఇంతే. ఏం ఆలోచించడు. బొగ్గుగని అధికార్లకు అతడు నచ్చలేదు. 1918లో ఓ రోజు వార్యాను వెంటబెట్టుకుని మరీ సోవియట్ల రక్షణార్థం

గెరిల్లా దళంలో చేరిపోయాడు.

స్వియాజిన్స్క్ ప్రాంతానికి చేరింది మిష్కా. ఎదురుగా గల కొండ వెనుకే 'క్రిలోవ్కా' నది. అక్కడే 'షాల్దిబా' దళం విడిచింది. ఇంతలో కొండ వెనుక ఏదో పెద్దగా పగిలిన శబ్దం, ఆపై తుపాకీ కాల్పులు, మధ్య పెద్ద పెద్ద గర్జనలు వినపడుతూండే సరికి, ఆగమన్నాడు మొరాజ్కా. వెంటనే మిష్కా స్తంభించినట్లు ఆగిపోయింది. ఆపై అతడు గుర్రం దిగి, కొండపైకి పాకి చూస్తే క్రిలోవ్కా నది ఆవల జపాను మరుగుజ్జు సైన్యం బారులు తీరి వస్తోంది. ఈవలి వైపున బార్లీ పొలాల కడ్డం పడి కొందరు చిందర వందరగా పారిపోతున్నారు. వారినేమాత్రం నిరోధించక ఓ నల్ల గుర్రం మీదున్న వ్యక్తిని 'షాల్దిబా'గా గుర్తించాడు మొరోజ్కా. ఓ పారిపోతున్న గుంపులో ఓ వ్యక్తి చూస్తుండగానే కింద పడ్డాడు. అతణ్ణి వదిలేసి మిగిలిన వారు వెళ్లిపోతూండడాన్ని చూసిన మొరాజ్కా, వారిని తిట్టుకుంటూ, మిష్కాని పిల్చి, దానిపై రివ్వున ఆ పడిపోయిన వ్యక్తి దగ్గరకు, తలపైన తుపాకీ గుళ్లు దూసుకువెడుతూండగానే వెళ్లాడు. ఆపై ఆ వ్యక్తి తన గుర్రం పైకి చేర్చి, తన దళం వద్దకు చేర్చాడు. అయితే ఆ వ్యక్తిపై అకారణంగానే అతడికి ద్వేషం కలిగింది. అతడు పట్నవాసం వ్యక్తిగా చూస్తుండగానే అనిపించింది. నీటుగా ఉండేవారంటే అతడికి సహజంగానే అసహ్యం. (అతడి జేబులో ఉన్న కాగితాల కట్టవల్ల అతడి పేరు 'మెచిక్' అని తెలిసింది.) అతడి అనుభవంలో వాళ్లు అపనమ్మకస్తులు. కాస్తంత రవ్వతగలగానే జావ కారిపోయాడు, పక్షి!" అని బయటకే అనే సరికి, "నోర్ముయ్" అని కేకలేశాడు కమాండెంటు. ఆ రాత్రే అతడిని ఆస్పత్రికి చేర్చమని అతడు ఉప కమాండెంటు అయిన 'బాక్లనోవ్'ని ఆజ్ఞాపించాడు.

ఓ అడవిలోని కొయ్య కుటీరంలో ఉంది ఆస్పత్రి. "మూడు రంధ్రాలు నిక్కచివి. తలకు చిన్న రాపిడి దెబ్బ. నెల దాటకుండానే నయం అవుతాయి" అన్నాడు ఆస్పత్రి డాక్టర్ 'స్టాషిన్స్కీ' మెచిక్‌ని పరీక్షించి. గాయాల రంధ్రాల్లోకి గాజుగుడ్డను బలవంతాన కూరుతుంటే, అలవికాని బాధ కలుగుతున్నా, కరుణామయమైన ఆస్పత్రి నర్సు వార్యా మృదుస్పర్శను అనుభవిస్తూ, అంతగా పెడబొబ్బలు పెట్టకుండానే కట్లు కట్టించుకున్నాడు మెచిక్.

సరిగ్గా మూడు వారాల కిందట మేజోళ్లలో ప్రయాణ పత్రాలు, జేబులో రివాల్వర్‌తో పట్నం నుంచి హుషారుగా, జపాను వారితో ఎప్పుడు ఎప్పుడు పోరాటంలో పాల్గొంటానే అనే ఉద్రేకంతో వచ్చాడు మెచిక్. అతడి ఊహల్లో వీరుల దివ్యమూర్తులు కదలాడారు. క్రిలోవ్కా నదిని సమీపిస్తూండే సరికి, తుపాకులు భారుపెట్టిన గుంపొకటి ప్రశ్నల వర్షంతో అతడి మీద పడింది. బూట్లలోంచి ప్రయాణ పత్రాల్ని కష్టం మీద తీసిచ్చాడతడు. "తీర ప్రాంత జిల్లా కమిటీ, సోషలిస్టు రివల్యూషనరీ గ్రూపు..." అందులోని మాటల్ని ఓ నావికుడు కష్టం మీద ఉచ్చరించి, "అయితే ఇప్పుడేమంటావ్?" అని గట్టిగా అరిచి, బూతులు కూశాడు. "సరిగా చదువ్ కామ్రేడ్... ఇది మాక్సిమ్ లిస్టులిచ్చింది..." (ఒకానొక దశలో బోల్షివిక్కులతో కలిసిన ఒక సోషలిస్టు రివల్యూషనరీ గ్రూపు) అని మెచిక్ చెబుతున్నా వినిపించుకోకుండా, అతణ్ణంతా చితక్కొట్టి, ఒక కొసకు ఆఫీసర్ ఎదుట హాజరు పెట్టారు. ఆ ఆఫీసరు ఎలాగో చదివి, పర్మిట్ సరిగానే ఉందని సంతృప్తి పడి, నావికుణ్ణి మందలించాడు. ఉత్త పుణ్యానికే అతడి వీపు మరమ్మత్తు చేశానని నావికుడు సిగ్గుపడ్డాడు. ఆ విధంగా మెచిక్ ఆ దళంలో సర్వహక్కులూ గల సభ్యుడయ్యాడు.

అయితే దళంలోని వ్యక్తుల ప్రవర్తనే అతడికి విచిత్రంగా కనిపించింది. తాను వీరాధివీరులుగా ఊహించినట్లు వారు లేరు. అంతా మోటుగా, అపరిశుభ్రంగా, నీచంగా బూతులు తిట్టుకుంటూ, కొట్లాడుకుంటూ, తనని వింతగా చూస్తూ, చిన్న విషయానికే వేళాకోళం చేస్తూ, వెక్కిరిస్తూ ఎగతాళి పట్టించడం, వ్యాకరణ దోషాలు లేకుండా మాట్లాడినా నవ్వే, పట్నవాసపు తన బట్టలు చూసినా నవ్వే, రైఫిల్ సరిగ్గా తుడవకపోయినా నవ్వే, రొట్టె తక్కువ తిన్నా నవ్వే... అయితే వీరంతా కథల్లోని కల్పిత మానవుల్లా గాక, సజీవ చైతన్యం గల మనుషులు! ఇదంతా నెమరేసుకుంటూ, దళంలో చేరాలన్న తన కోర్కె పట్ల విచారించసాగాడు మెచిక్.

ఆస్పత్రిలో రెండు కేసులే పెద్దవి. కడుపుకు గాయం తగిలిన 'ఫ్రోలోవ్' అనే పార్టిజాన్ ఒకడు, రెండోవాడు మెచిక్. ఓ కొయ్య కుటీరం వీరి నివాసం. ప్రతి ఉదయం వీరిద్దర్నీ మోసుకొచ్చేవారు. పొద్దున్నే బవిరిగడ్డం గల "పీకో" తాత మెచిక్ వద్దకు వచ్చి, రెడ్‌గార్డుగా పని చేస్తున్న తన కొడుకు గురించి ఓ కథలా చెప్పేవాడు. బర్చి చెట్లతో నిండిన స్వంత నిమ్మ తోటలో తేనెటీగలు పెంచుకుంటూ, ఇంటి పట్టున హాయిగా ఉన్న తన వద్దకు ఒక రోజు కొడుకు వచ్చాడనీ, అలా కొద్దిసేపు ఒకర్ని ఒకరు చూసుకుంటూ ఉండిపోయామనీ, తాను 'ఛీలూ' అనే చోటుకి వెడుతున్నానని కొడుకు చెప్పాడనీ, అక్కడికెందుకంటే, జెకోస్లోవాకులు వచ్చారన్నాడనీ, తన దగ్గరే ఉండిపొమ్మన్నా కొడుకు వెళ్లాడనీ, ఆ తర్వాత కొద్ది రోజులకే కోల్చక్ దండు వచ్చి తన పట్టుల్ని నాశనం చేశారనీ... అంటూ తాత వాపోయాడు. ఆ విధంగా పీకా తాత, అలాగే ఆస్పత్రి నర్సు అతడికెంతో ఇష్టులయ్యారు.

ఆస్పత్రికంతా వార్యా ఒక్కతే స్త్రీ రోగులకు సేవ చేసే ఆమె, సకల మానవాళి పట్ల అనంతమైన అనురాగం చూపిస్తుంది. అలాగే మెచిక్ పట్ల. గాయం నయమయేకొద్దీ ఆమె పట్ల మెచిక్ నూతన దృక్పథంతో చూడసాగాడు. "దాని మొగుడు యుద్ధంలో పని చేస్తుంటే, అదిక్కడ కనిపించిన ప్రతి మొగాణ్ణీ రానుకు వూనుకు తిరుగుతూంటుంది" అన్నాడు పీకా. "ఆమె ఎవర్నీ తిరస్కరించదు. అదే ఆమెతో వచ్చిన చిక్కు" అన్నాడతడు. ఒకరోజు ఆమె తన గాయాలకు కట్టు కట్టాక, తన పక్కన కూర్చోమన్నాడు మెచిక్. ఆమె కూర్చుని అతని వంక దీర్ఘంగా చూసింది. అతడు తన తలగడ కిందనున్న ఫొటో తీశాడు. పూర్వం తనకెంతో అందంగా కనిపించిన ఆ ఫొటోలని యువతి ఇప్పుడు వికారంగా అనిపించింది. అప్రయత్నంగా ఆ ఫొటోని ఆమెకిచ్చాడు మెచిక్. ఇంచలో బయట ఎవరినో చూసి ఆమె గబుక్కున లేచే సరికి ఆ ఫొటో కిందపడింది.

ఆ వచ్చిన వ్యక్తిని ఎక్కడో చూసినట్లనిపించింది మెచిక్‌కి. అతడు మొరోజ్కా. వార్యా మొగుణ్ణి మెచిక్‌కి పరిచయం చేసింది. ఆమె వార్యా, ఆమె భర్త ఇద్దరూ అడవిలో పోయి, కొద్ది సేపటికి అలసిన శరీరాలతో వచ్చారు. ఆపై మొరోజ్కా ఈలవేసి, చెట్ల చాటునున్న మిష్కానికేసి, దాన్ని ఒక్క ఊపు మీద ఎక్కి, లోయలోకి పోతూ, మెచిక్ పట్ల తన భార్య ఆకర్షితురాలవడం గురించి ఆలోచించసాగాడు.

ఈ ఆలోచనల్లోనే లోయలోకి చేరుకున్న మొరోజ్కా గ్రామ ప్రెసిడెంటయిన రియాబెట్స్ యొక్క దోస చేను రావడం గమనించాడు. చేలో ఉన్న గుడిసెలో ఎవరూ లేకపోవడంతో, కిందకు దిగి సంచి

# సంకెళ్ల సవ్వడి వినండి

*సజ్జా వెంకటేశ్వర్లు*

ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం ఉందా లేదా అని తెలుసుకోవాలంటే ఆ దేశపు జైళ్లను చూడాలి అని ఎవరన్నారోగాని, అది అక్షరాలా నిజం. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని పాలకులు నిస్సిగ్గుగా చాటుకొనే భారతదేశంలో అసలేం జరుగుతుందో తెలుసుకోవాలంటే జైళ్ళలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. జైళ్లను బయటినుండి సందర్శించే వారికి తెలిసే విషయాలు పెద్దగా ఏమీ ఉండవు. లోపల ఏం జరుగుతుందో బయట ప్రపంచానికి ఏ మాత్రం అర్థం కాదు. అరుణ్ పుస్తకం మనకా ప్రపంచాన్ని చూపిస్తుందంటారు ముందు మాటలో బి. అనూరాధ. ఈ పుస్తకానికి తను ముందు మాటను రాయటానికి తానూ జైలుకి 'ఇన్‌సైడర్' కావటమే అర్హతగా కూడా చెప్పుకున్నారు. అంతే కాకుండా ఆదివారం ఆంధ్రజ్యోతి పత్రికలో కొన్ని వారాల పాటు జైలు కథలు కూడా ఈమె రాశారు. తన చుట్టూ ఉన్న తోటి ఖైదీలను కలుసుకొని వారి బాధల గాథలను కథలుగా చెప్పారు. ముఖ్యంగా ఆదివాసీ మహిళల జీవితాలను ఎత్తి పట్టారు. రచయిత్రిగా అనూరాధకు ఈ పుస్తకానికి ముందు మాట రాసే నిజమైన అర్హతను తెచ్చి పెట్టింది. అది అనివార్యం. అది-ఈ తెలుగు అనువాదానికి మాత్రమే పరిమితం.

సంకెళ్ల సవ్వడి
అరుణ్ ఫెరెరా
ప్రచురణ : మలుపు
వెల : రు.150/-

అరుణ్‌ఫెరేరా ఆంగ్లంలో రాసిన "కలర్స్ ఆఫ్ ది కేజ్"కు నరేష్ ఫెర్నాండెజ్ రాసిన ముందుమాట అనువాదమూ ఉంది. నరేష్ ఫెర్నాండెజ్ అరుణ్ ఫెరేరాకు మంచి మిత్రుడు. విద్యార్థి దశ నుండి అరుణ్ ఫెరేరాను అంచనా కట్టగల పరిశీలనా దృక్పథం ఉంది. అలాగే ఒకే సామాజిక నేపథ్యంలో పుట్టి పెరిగిన విడదీయలేని సంబంధం వారిది. ఇవాళ సామాజిక సమస్యల పట్ల స్పందించటం వాటి పరిష్కారాల కోసం పని చేసే వారిని రాజ్యం ఎలా వేటాడి ఇబ్బందులు పెట్టి వేధిస్తుందో తెలియజేసేరు. అరుణ్ ఫెరేరా లాంటి సామాజిక కార్యకర్తలను అరెస్టు చేయటం - మావోయిస్టుగా చూపటం రాజ్యానికి కొత్త కాదు. కానీ, అలా నోరు నొక్కేయటానికి కారణం ఉంది. తాను పని చేస్తున్న విదర్భ ప్రాంత వాసుల కోసం రాజ్యాన్ని ప్రశ్నించటం అసలు కారణంగా కనిపిస్తుందనీ, ఎందరో రైతులు అక్కడ ఆత్మహత్యలకు గురికావడం వెనుక ఉన్న కారణాలన్నింటినీ అరుణ్ ఫెరేరా లాంటి వాళ్లు పని

---

తీసుకుని దోసకాయలూ, పుచ్చకాయలూ తెంపుతూ, కొన్ని తను తింటూ, సంచీ నింపాడు. ఇంతలో రియాబెట్జ్‌ని దూరంగా చూసి మిష్కా సకిలించే సరికి, రియాబెట్జ్ "ఎవరక్కడ?" అని అరిచాడు. దాంతో అప్పటిగ్గానీ తను చేసింది దొంగపని అని గుర్తించని మొరోజ్కా, చప్పున సంచీ అక్కడ పడేసి క్షణాల్లో గుర్రంపై అదృశ్యమయ్యాడు. అయితే రియాబెట్జ్ జరిగిన దొంగతనాన్ని గుర్తించి, దీనికి వెంటనే ప్రతీకారాన్ని చెయ్యాలన్న పట్టుదలతో దళం ఉండే చోటుకి బయలుదేరాడు.

ఆ సమయంలో లెవిన్‌సన్ ఒక తోటలో కూర్చుని, అప్పుడే జపాను శ్రేణుల వద్ద నుంచి వచ్చిన వేగు ద్వారా వార్తల్ని సేకరిస్తున్నాడు. వేగు చెప్పిందాన్ని బట్టి, షాల్డిబా దళం కొరియన్ క్షేత్రాలకు తిరోగమించిందని తెలుసుకున్నప్పటికీ, వేగు కొరియన్ క్షేత్రాల్ని మేప్‌లో గుర్తించలేక పొరుగు జిల్లాని గుర్తించడం చేత, అంతకు ముందు ఇతర విధాల సేకరించిన వార్తలతో ఈ వేగు తెచ్చిన వార్త సరిపోలేకపోవడం చేత అందులో ఏదో లోపం ఉందని గ్రహించాడు. దాంతో ఇక వేగును దయ చెయ్యమన్నాడు లెవిన్‌సన్. అతని బుర్రలో దళం త్వరలోనే విచ్ఛిన్నమై పోతుందనే ఆలోచన మెరుపులా వచ్చింది. ఇంతలో అతడికి దళం ఉప కమాండెంటు బాక్లనోవ్, రియాబెట్జ్‌తో వస్తూ కనిపించారు.

"రియాబెట్జ్ తోటలో మొరోజ్కా దోసకాయలు దొంగిలించాడు" ఫిర్యాదు చేశాడు బాక్లనోవ్. రియాబెట్జ్ కూడా, మొరోజ్కా తన తోటలో సగం కాయలు తగలేశాడనీ, తాను చేపల వల బాగు చేసుకుంటుంటే, అతడీ పని చేశాడనీ ఆరోపించాడు.

ఫిర్యాదును శాంతంగా విన్న లెవిన్‌సన్, మొరోజ్కాను పిలిపించి, "దోసకాయలున్న సంచీ నీదేనా?" అని ప్రశ్నించాడు. సమాధానం సరిగ్గా రాకపోయేసరికి, అతడి రివాల్వర్ ఊడ దీసుకొమ్మని బాక్లనోవ్‌ని పురమాయించే సరికి, "నువ్వే కదా దీన్ని నాకిచ్చింది" అంటూ మొరోజ్కా తన రివాల్వర్ బయటకు తీశాడు. 'పెద్ద... ఎన్ని దోసకాయలు కోశాను... ఈ మాత్రానికేనా?" అని అతడు రియాబెట్జ్‌ని అడిగాడు గానీ, రియాబెట్జ్ సమాధానం ఇవ్వలేదు. మొరోజ్కా ప్రవర్తనని విచారించడానికి దళాన్ని, గ్రామ సమితినీ కూడా సమావేశపరచమని లెవిన్‌సన్ ఆజ్ఞాపించేసరికి, "దళాన్ని రమ్మనవచ్చు, కానీ, రైతులు దేనికి?" మొరోజ్కా గొణిగాడు.

అతడి మాటలు వినిపించుకోకుండా, లెవిన్‌సన్, రియాబెట్జ్‌ని పక్కకు తీసుకెళ్లి, రెండు రోజుల్లో గ్రామ ప్రజల వద్ద గోధుమలు సేకరించి, రెండు పూడ్ల బిస్కెట్లు తయారు చేయించమనీ, అవి ఎవరికి, ఎందుకనేది మాత్రం తెలియకూడదని పురమాయించాడు. అలాగే గుర్రాలకు దాణా హెచ్చించమని, దళానికి కూడా పూర్తి రేషన్ అందించమని బాక్లనోవ్‌కు పురమాయించాడు...

(మిగతా వచ్చే సంచికలో..)

చేయటం ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఇదీ రాజ్యానికి కంటగింపుగా ఉంది. కనుక ఒక పథకం ప్రకారం అమలు చేస్తున్న నిర్బంధాన్ని ప్రయోగించారు.

అలాగే, చిన్న పుస్తకంగా అరుణ్ ఫరేరా తను వేద్దామని నరేష్ ఫెర్నాండెజ్‌ను కలిసి కొన్ని జైలులో గీసిన రేఖా చిత్రాలు - కొన్ని స్కెచ్‌లు చూపినప్పుడు. ఇచ్చిన సలహా వల్లనే మనం ఇవ్వాల ఈ పుస్తకంగా చూడగలుగుతున్నాం. బహుశ జైలు జీవితంలోని అన్ని కోణాలను తరచి తిరిగి పరిశీలించాల్సిన అవసరం అది అక్షరబద్ధం చేయ్యాల్సిన పద్ధతిని మిత్రుడిగా నరేష్ ఫెర్నాండెజ్ రూపకల్పనగా ఈ ముందుమాటలో కనిపిస్తుంది. అరుణ్ ఫరేరా రచయితగా ఇలా కనిపించటంలో కూడా నరేష్ ఫెర్నాండెజ్ కనిపిస్తారు. ఇది ఇలా వెలుగు చూడటానికి రెండేళ్ళ కాలం పట్టిందంటే. నిర్దిష్టంగా ఒక రూపం కోసం చేసిన గట్టి ప్రయత్నం దాగి ఉందని తెలుస్తుంది. కనుకనే భారతదేశంలో అమలులో ఉన్న న్యాయవ్యవస్థను, జైళ్ళ తీరుతెన్నులను అద్దంలో చూపిందీ రచన.

ఇవాళ ఎంతో మందిని ఎన్నో రకాలుగా నిర్బంధించటం చూస్తున్నాం. కానీ, వాళ్ళలో ఎవరూ ఇలా తమ అనుభవాలను ముందు పెట్టుకొని అటు రాజ్యాన్ని, ఇటు జైళ్ళ పనితీరును, మధ్య వర్తిత్వం చేసే న్యాయవ్యవస్థను వాటి గుణ దోషాలను ఎత్తి చూపగల ప్రయత్నం చేయలేదు. పోలీసులు అరెస్టు చేస్తే ఏం చెయ్యాలో చదివాం. అలాగే స్నేహలతారెడ్డి జైలు జీవితం చదివాం. శివసాగర్ జైలు డైరీ చదివాం. విదేశీ మహిళ రాసిన "భారతదేశంలో నా జైలు జీవితం" ఎంత విషాదకంగా బాధాకరంగా నడిచిందో మేరీ టైలర్ చెప్పారు. అలాగే ఎల్.కె. అద్వాని రాసిన ఎమర్జెన్సీ చీకటి రోజులు ఆత్మకథ అంకాన్ని చదివాం. ఈ మొత్తంలో లేని ప్రత్యేకత అరుణ్ ఫరేరా సంకెళ్ల సవ్వడిలో దాగి ఉంది. అది జైళ్ళను నేల మట్టం చేసే మరింత న్యాయమైన సమాజం కోసం వాళ్ళు కంటున్న స్వప్నాలకు అంకితమైన నడుచుకోవటం.

ఈ కలర్స్ ఆఫ్ ది కేజ్ వెలువడినప్పుడు - వెలువడిన మేధావుల అభిప్రాయాలు అరుణ్ ఫరేరా గురి చూసిన లక్ష్యాల వైపు చూశాయి కానీ, దాటి ముందుకు వెళ్ళలేదు. అరుంధతీ రాయ్ ఇలాంటి పుస్తకాలు మరిన్ని వెలువడాలని కోరుకున్నారు. ప్రశాంతత చెదరని కథకుడిగా అరుణ్ ఫరేరాను హిందూస్థాన్ టైమ్స్ అభివర్ణించింది. ఇలా పత్రికలు మేధావులు వారి వారి అభిప్రాయాలు రాశారు. ఈ గ్రంథాన్ని పాఠ్యాంశంగా విశ్వవిద్యాలయాలు చేర్చాలని ఉచిత సలహాలూ కనిపించాయి. ఇలా నేల విడిచి సాము చేయటంలో వారి వారి రూపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవి సమస్యలకు సంఘీభావం తెలియజేయటానికీ, దానిలో ఉండి భాగస్వామ్యం కావటానికి ఉన్నంత తేడా ఉంది. రచయితగా సామాజిక కార్యకర్త రూపుదిద్దుకోవడం ఒక అవసరం. అలాంటి అవసరాన్ని అది నడిపే మార్గాన్ని విస్తృతపరిచే మరింత శక్తిగా ఫరేరా ఇక్కడ కనిపిస్తున్నారు.

ఇంతకీ పుస్తకంలో తన నిర్బంధ జీవితం నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలలు ఎలా చూసారు. ఏడు అధ్యాయాలుగా విభజించారు. హాలాదీనం. 3479, అండాసెల్, ఫాసీయార్డ్, గునాఖానా, ఆశ, లాల్‌గేట్, లాల్‌గేట్ అవతల ఇవి ఆ ఏడు. వీటికి తానే వేసిన, జైలు జీవితంలో ఖైదీల పోలీసుల తీరు తెన్నులకు బొమ్మలు అద్దంలా ఉన్నాయి. సామాజిక ఉద్యమాలలో పని చేసే వాళ్ళలో కార్టూనిస్టులు - కవులు - రచయితలు ఉంటే ఫలితాలు ఇలా వైవిధ్యంతో కూడిన రూపాల్లో వస్తాయి. అవి వారి నుండి వెలువడే దాకా, వాళ్లల్లో మానసిక ఒత్తిడి వదిలి వెళ్ళటం సాధ్యం కాదు. అరుణ్ ఫరేరా నుండి ఇలా బొమ్మలుగా రావటం సందర్భోచితం. ఇలాంటి సృజనశీలురు ప్రతీది ఎంతగా పరిశీలిస్తారో ఈ రచన మొత్తంగా మనతో అక్రమ నిర్బంధంలో ఉన్న వారి తరపున న్యాయపోరాటాల వైపు నిలబడి మాట్లాడుతుంది. అయితే పోలీసులు ఎక్కడా తనను సామాజిక కార్యకర్తగా చూసిన దఖాలాలు లేవు. అలాంటి చూపు కోల్పోయిన పోలీసు వ్యవస్థ సహజంగానే ప్రశ్నించే వాళ్ళను మావోయిస్టులు అనడం దేశవ్యాపితంగానే కనిపిస్తుంది. ఇదొక విస్తరించిన రాజ్య స్వభావం.

అయినా, అరుణ్ ఫరేరాను ఒక సామాజిక ఉద్యమ కార్యకర్తగా అర్థం చేసుకునే క్రమంలోనే ఈ రచన సాగుతుంది. ప్రజలతో ప్రజా సమస్యలతో కలిసి బహిరంగ జీవితంలోనే కనబడుతుంది. కనుక ఇది అరుణ్ ఫరేరా ఒకడి నిర్బంధం ఎంత మాత్రమూ కాదు. 8 మే 2007 మధ్యాహ్నం రైల్వే స్టేషన్‌లో ప్రయాణానికి సిద్ధంగా ఉన్న తాను, మఫ్టీలో వచ్చిన పోలీసులు చుట్టు ముట్టి, మూటకట్టి కారులో తీసుకుపోయి, కొట్టి చిత్రహింసలకు గురిచేసి, వాళ్ళ ప్రశ్నల్ని సంధించి కొన్ని గంటల తరువాత అరెస్టు చేసినట్టు చూపటంలో చట్టాలు చెప్పే వాటి సూత్రాల ఉల్లంఘన కనిపిస్తుంది. న్యాయస్థానంలో జరిగే తంతు ముగించుకొని పోలీసు కస్టడీ అనే చట్టపర కార్యంతోబి అరుణ్ ఫరేరా ఎలా మళ్లీ చిత్రహింసలకు గురి చేయబడ్డాడు చదువుతుంటే ఇది ఎక్కడో దూరంగా నాగపూర్‌లో జరిగినట్టు అనిపించదు. మన మధ్యనే ఇలా ఇక్కడే చట్ట ఉల్లంఘన అణిచివేత దిశగా కొనసాగిస్తున్నట్టు కనిపిస్తుంది.

ఒక సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న తాను ఎదురు చూడని ఈ అనుభవాలు మనల్ని కలచివేస్తాయి. కదిలిస్తాయి. తన జైలు జీవితం మొత్తం "అండాసెల్"లో గడిపి మొక్కవోని విశ్వాసాలలో తిరిగి రావటం, జీర్ణం కాని ప్రత్యేక గుణం ఒకటి కాపాడుకుంటూ ఉందని అదే తిరిగి అదే ఉద్యమాలతో మరింత శక్తి నింపుతుందోని ఆచరణ ద్వారా అనుభవం పొందింది.

ఇక్కడ చాలా మాట్లాడాడు. ఇంకా అనేక ప్రత్యేక సందర్భాలలో మరీ ముఖ్యంగా ఒంటరిగా నిర్బంధంలో ఎలా సామాజిక ఉద్యమాలలో పని చేసేవాళ్ళ మసలుకోవాలో చెప్పారు. అనుక్షణం అంకిత భావాల్ని ఎలా ప్రోది చేసుకుంటూ చుట్టూ వాతావరణాన్ని ప్రభావితం చెయ్యాలో తాను నేర్చుకుంటూ నడుస్తున్న కదలికలున్నాయి. కానీ, కొన్ని అపస్వరాలు కనిపించాయి. అవి "అదృష్టం - దురదుష్టం" అనే పదాల ప్రయోగాలు. ఈ పదాల వెనుక దాగి ఉండే భావజాలాన్ని మరిచిపోయినట్టున్నారు. అలాగే, అనువాదంలోనూ అడ్డం తిరిగిన మాటలు వాడారు "కొట్టుడు" లాంటివి. వాటిని సులభశైలిలోకి తెచ్చి ఉంటే బాగుండేది.

జైలు జీవితంలోని ఎన్నో వెలుగు చూడని న్యాయపరమైన, వ్యవస్థీకృతమైన రాజ్య స్వభావాల్ని అక్షరబద్ధం చేసి అందించటం ఇవాల్టి ఉద్యమాలకు కార్యకర్తలకు తన అనుభవ పాఠం చెప్పటమే అవుతుంది. ఇది అవసరం.

# మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం

ఫ్రాన్సిస్ వీన్
అనువాదం: ముక్తవరం పార్థసారథి

(5)

గత సంచిక తరువాయి...

చివరికి 1857లో వచ్చిన అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, మళ్లీ మార్క్స్‌ను ఆర్థిక శాస్త్ర అధ్యయానికి ప్రోత్సహించింది. న్యూయార్క్‌లో ఒక బ్యాంకు దివాళా తియ్యటంతో ప్రారంభమైన ఈ ప్రళయం ఆస్ట్రియా, జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లాండులకు వ్యాపించింది. అనారోగ్యం నుండి కోలుకుంటున్న ఎంగెల్స్ ఈ విలయ ప్రహసనాన్ని ఆనందించటానికి మాంచెస్టర్ ఆఫీసుకు తిరిగి వచ్చాడు. అంతటా ధరలు దారుణంగా పడిపోతున్నాయి. మార్కెట్లు పతనమవుతున్నాయి.' కంపెనీలన్నీ దివాళా తీస్తున్నాయి. సర్వే సర్వత్రా వ్యాపించిన భయ వాతావరణంతో దిక్కు తోచని స్థితిలో అల్లాడిపోయారు వ్యాపారస్తులు. "కాటన్ ఎక్స్ఛేంజిని చూస్తుంటే బలే సరదాగా ఉంది. నా ఉత్సాహం, ఆనందం చూసి అందరూ ఉడుక్కు చస్తున్నారు" అని రాశాడు ఎంగెల్స్. ఈ నాటకీయ పరిణామాలతో మార్క్స్‌లో కూడా ఉత్సాహం పెల్లుబికింది. 1857-58 చలికాలమంతా తెల్లారి నాల్గింటి దాకా మేల్కొని ఆర్థిక గణాంకాలు సేకరిస్తూ, విశ్లేషిస్తూ గడిపాడు. "కనీసం స్థూలంగానైనా ఈ ఆర్థిక జల ప్రళయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాను" అన్నాడు. కాని నిజానికి ప్రళయం రాలేదు. అయినా మార్క్స్ పడవను సిద్ధం చేసుకునే తన ప్రయత్నం ఆపలేదు. ఇప్పుడు కాకపోతే మరికొన్ని నాళ్లకు రాకతప్పదని ఆయని విశ్వాసం. తన ప్రాథమిక గణిత పరిజ్ఞానం - ఆర్థిక విశ్లేషణకు సరిపోవటం లేదనుకున్నప్పుడు అర్జెంటుగా ఆల్జీబ్రా నేర్చుకున్నాడు. "ప్రజా శ్రేయస్సు దృష్ట్యా, ఈ విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యక తప్పదు" అన్నాడు.

రాత్రుళ్లు మేల్కొని ఆయన రాసిన 800 పేజీల గురించి, (మాస్కోలోని మార్క్స్ - ఎంగెల్స్ ఇన్‌స్టిట్యూట్ 1939లో విడుదల చేసిన దాకా) పండితులకు కూడా తెలియదు. 1953లో Grundrisse (Outlines of a Critique of Political Economy) పేరుతో జర్మన్ భాషలో ప్రచురించబడింది. ఇది పుస్తకం కాదు. పుస్తకం రాయటానికి రాసుకొన్న నోట్స్ మాత్రమే. మార్క్స్ స్వయంగా దీన్ని 'కలగూర గంప' అన్నాడు. కాని 1844 నాటి Paris / Manuscripts కూ, పెట్టుబడి మొదటి భాగానికీ (1867) మధ్యన వంతెన ఇది. మారుతున్న పరిణితి చెందుతున్న మార్క్స్ ఆలోచనల పరిణామక్రమాన్ని సూచిస్తుంది. పరాయీకరణ గురించీ, గతితార్కికత గురించీ, "డబ్బు అంటే ఏమిటి?" అనే విషయం గురించీ సుదీర్ఘంగా చర్చిస్తాడు కొన్ని సార్లిది 1844 Manuscripts ను గుర్తిస్తాయి. అయితే, వాటికీ Grundrisse కూ ఉన్న ప్రధానమైన తేడా - అప్పుడు ఈ విషయాల గురించి దేనికదిగా చర్చిస్తే, ఇప్పుడు వాటికి తాత్విక, ఆర్థిక విషయాలను కూడా జోడించాడు. ఒక జర్మన్ సోషలిస్టు ఫెర్డినాండ్ లసాల్ చెప్పినట్టుగా, ఇప్పుడు మార్క్స్ - హెగెల్ ఆర్థిక శాస్త్రవేత్తగా, రికార్డో సోషలిస్టుగా మారినట్టుగా - రాశాడు. మరో చోట శ్రమశక్తి, అదనపు విలువ గురించి రాసిన చోట Das Kapital లాగే ఉంటుంది.

ఈ దశలో తన చేసిన పనిని మార్క్స్ "ఆర్థిక చెత్త" (The Economic Shit) అని చెప్పుకున్నాడు. అలా అభివర్ణించటంలో తనేదో తప్పు చేస్తున్నానన్న భావన కూడా ఆయనలో ఉండి ఉంటుంది. అనేక సంవత్సరాల క్రితం, 1845లోనే 'పొలిటికల్ ఎకానమీ గురించిన పుస్తకం' ఇంచుమించు పూర్తయిందన్నాడు. ఆ తర్వాత పదమూడు సంవత్సరాలూ ఈ అబద్ధాన్ని ఎన్నిసార్లు, ఎంత మందికి చెప్పాడంటే, ఆయన మిత్రులు ఒక అనన్య సామాన్యమైన అసాధ్యమైన మహాద్భుతమేదో జరగబోతోందని ఆశించారు. ఒక పుస్తకానికి మార్క్స్ ఇంత సమయం తీసుకున్నాడంటే ఏదో ప్రభంజనం సృష్టించ బోతున్నాడు. మిన్ను విరిగి మీద పడబోతోంది. అచ్చయిందంటే ఒక భూకంపమే. పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులే కూలిపోతాయి. మాంచెస్టర్‌లో ఉన్న ఎంగెల్స్‌కు, మార్క్స్ రాసిన లేఖలు కూడా ఈ సస్పెన్స్‌ను మరింత పెంచాయి. "ఇన్నాళ్లూ ప్రచారంలో ఉన్న లాభ సిద్ధాంతాన్ని (Theory of Profit) "నాశనం చేశాను" అంటూ 1858 జనవరిలో ప్రకటించాడు. అయితే, ఇన్ని సంవత్సరాలు బ్రిటిష్ మ్యూజియంలో కదలకుండా కూర్చుని గడిపీ, దీర్ఘరాత్రులు తన టేబుల్ వద్ద కూర్చుని రాసీ, ఆయన ముగించినవి కొన్ని (అముద్రిత) నోట్స్ మాత్రమే.

1858 ప్రారంభంలో, ఒక బెర్లిన్ ప్రచురణకర్త (డంకర్)తో ఒప్పందం కుదురుస్తానని మార్క్స్‌కు ప్రతిపాదించాడు ఫెర్డినాండ్ లసాల్. బూర్జువా ఆర్థిక వ్యవస్థ గుట్టును బహిర్గతం చేసిన తన పుస్తకం ఆరు భాగాల్లో ఉంటుంది. అందువల్ల వీటిని ఆరు సంపుటాలుగా ప్రచురించాలి. 1) పెట్టుబడి గురించి - విషయాన్ని పాఠకులకు పరిచయం చేయటం కోసం కొన్ని ప్రాథమిక అధ్యాయాలు, 2) స్థిరాస్తి గురించి (on Landed Property), 3) వేతన శ్రమ (On Wage Labour, 4) రాజ్యం గురించి (On the State), 5) అంతర్జాతీయ వ్యాపారం, 6) ప్రపంచ విపణి. "మొదటి సంపుటం మే నాటికి ముద్రణకు సిద్ధంగా ఉంటుంది. ఆ తర్వాత కొద్ది నెలల్లో, రెండవది అలాగే మిగిలినవీ. అయితే గడువు (Deadline) విధించుకున్న ప్రతిసారిలాగే ఈసారి కూడా మార్క్స్ శరీరం సహాయ నిరాకరణ చేసి తన నిరసన తెలిపింది. "కడుపులో వికారంగా ఉండి ఎంత ఇబ్బంది పడ్డానంటే ఈ వారం రోజులూ ఆలోచించలేదు. కనీసం చదవలేదు. రాయలేదు. అసలే పనీ చేయలేకపోయాను" అని ఎంగెల్స్‌తో చెప్పుకున్నాడు (ఏప్రిల్ 1858లో). కాలేయ సమస్యలు పెరిగాయి. "కూర్చుని రెండు గంటలు రాస్తే తరువాత రెండు రోజులు పడుకోవాల్సిందే."

జీవితమంతా ఇలాంటి ఫిర్యాదులే చేశాడు. "పని చేయక పోవటానికి

మార్క్స్ చెప్పే ఇలాంటి సాకులకు అందరం అలవాటు పడ్డాం" అని రాశాడు ఎంగెల్స్. చాలా సంవత్సరాల తర్వాత "అనారోగ్య మొదట మనసులో ప్రారంభమవుతుంది" అని స్వయంగా అంగీకరించాడు మార్క్స్. అయితే, ఇతర అవాంతరాలకూ తక్కువేమీ లేదు. కూతురు ఎలినార్ కోరింత దగ్గుతో బాధపడింది. విచారంతో, దిగులుతో నరాల బలహీనత పెరిగింది. భార్య మంచం పట్టింది. అరువిచ్చే షావుకారు, తాకట్టు కొట్టువాడూ "ఇస్తావా, చస్తావా?" అంటూ ఇంటి మీదికొచ్చి పరువు తీశారు చాలాసార్లు. "జేబులో చిల్లిగవ్వ లేనప్పుడు 'డబ్బు' గురించి రాసినవాడు మరెవడూ ఉండలేడేమో!" అంటూ ఒకసారి జోక్ చేశాడు మార్క్స్. ఆ వేసవి కాలమంతా ఒక్క ముక్క రాయకపోయినా, 1858 సెప్టెంబర్ వరకు ప్రచురణకర్తకు పోస్ట్ చెయ్యగలనని వాగ్దానం చేశాడు. కాని తర్వాత "మరి కొన్ని వారాలు పడుతుంది" అని మాట మార్చాడు. నిజానికీ, ఆ దశలో ప్రపంచమే ఆయనకు వ్యతిరేకంగా కుట్ర చేసింది. ఆర్థిక వ్యవస్థ మొత్తం ధ్వంసమైపోతుందని తను ఊహించాడు. కాని ఆ ప్రపంచ ఆర్థిక సంక్షోభం త్వరలోనే సమసిపోయింది. మార్కెట్లు కోలుకున్నాయి. అనుకున్నది జరగకపోవటంతో మార్క్స్‌కు కోపం వచ్చింది. అంటే ఆయనకు "భరించలేని పంటినొప్పి" వచ్చింది.

నవంబర్ మధ్యలో, తొలి గడువు ముగిసిన ఆరు నెలలకు, బెర్లిన్ ప్రచురణ కర్త తరఫున, లసాల్, పుస్తకం గురించి మర్యాదగా వాకబు చేశాడు. "మీరిచ్చే డబ్బులకు అత్యుత్తమ రచన తిరిగి మీకివ్వాలనే నా ప్రయత్నం ఆ కారణంగానే ఆలస్యం జరుగుతోంది" అని జవాబిచ్చాడు మార్క్స్ అని.

"నే రాసిన ప్రతి వాక్యంలో నా లివర్ బాధ కనిపిస్తుంది. కేవలం ఆరోగ్య కారణాల వల్ల నా కృషిని ఆషామాషీగా ముగించదలచు కోలేదు."

"ఇవి నా పదిహేనేళ్ల పరిశోధన ఫలితం - Best Years of my life."

"సామాజిక సంబంధాల గురించిన ఒక ముఖ్యమైన దృష్టి కోణాన్ని మొదటిసారి, శాస్త్రీయంగా ప్రతిపాదించాను. అందువల్ల, నా శైలి, కాలేయ సమస్యలతో పాడు కాకుండా చూడటం పార్టీ పట్ల నేను నిర్వర్తించాల్సిన బాధ్యత."

ఇప్పుడే రాయటం ప్రారంభిస్తాను. నాలుగు వారాల్లో ముగిస్తాను.

ఈ చివరి వాక్యం చదివి లసాల్ తప్పక ఆశ్చర్య పడి ఉంటాడు. ఫిబ్రవరిలోనే ఈ పుస్తకం ముగింపు దశలో ఉంది అన్నాడు మార్క్స్. ఎంగెల్స్ కూడా షాక్‌కు గురయ్యాడు. చివరికి 1858 జనవరిలో వ్రాతప్రతిని బెర్లిన్‌కు పంపించి "ఇది అచ్చులో పన్నెండు షీట్లు (192 పేజీలు) వస్తుంది. ఇది చూసి నిరాశ చెందవద్దు. దీనికి Capital in General అని పేరు పెట్టినా ఇందులో Capital గురించి ఏమీ లేదు" అని వివరణ ఇచ్చారు. అంటే ఇన్ని కబుర్లు చెప్పిన పెద్ద మనిషి చివరికి ఒక చిన్న పుస్తకం మాత్రమే రాసిచ్చాడు. ఇందులో కూడా సగం - ఇతర ఆర్థిక శాస్త్రవేత్తల సిద్ధాంతాల క్రోడీకరణ మాత్రమే. ఆసక్తికరమైనది ఆత్మకథాత్మకమైన ముందుమాట. తన హెగెల్ అధ్యయనం. రైనిష్ జైటుంగ్ పత్రికలో తన అనుభవం "పౌర సమాజం యొక్క మూలాలు పొలిటికల్ ఎకానమీలో ఉన్నాయని" తెలిపిందని అందులో పేర్కొన్నాడు.

ఇప్పుడా పుస్తకం పేరు A Contribution to the Critique of Political Economy. ప్రచురణ తేదీ సమీపించిన కొద్దీ దాని గురించి ఉత్ప్రేక్షల్లో చెప్పుకున్నాడు మార్క్స్. తక్షణమే ఇది అన్ని భాషల్లోకీ అనువాదమై నాగరిక ప్రపంచంలో అందరి ప్రశంసలూ పొందుతుంది.

కానీ అతని మిత్రులకిది పెద్ద ఆశాభంగం. నిజానికి అందరికీ నిరాశే మిగిల్చింది. "నన్ను ఇంతగా డిసప్పాయింట్ చేసిన పుస్తకం మరొకటి లేదు" అన్నాడు జర్మన్ సోషలిస్ట్ విల్హెల్మ్ లీబ్‌క్నెష్ట్. కొన్ని పత్రికలు మాత్రమే సమీక్షించాయి. 'కార్ల్ పుస్తకం మీద మేం పెట్టుకున్న ఆశలన్నీ జర్మన్‌ల మూగనోము (సమీక్షించకపోవటం) కుట్రతో భగ్న మయ్యాయి" అంటూ రగిలిపోయింది జెన్నీ. రెండవ భాగం మొద్దు నిద్రపోతున్న ఆ గాడిదల్ని తన్ని లేపుతుంది.

కొన్ని నెలల తర్వాత రెండవ భాగం రావాలి. గడువు తేదీని డిసెంబర్ 1859కు మార్చుకున్నాక మార్క్స్. ఇక ఇంత కన్నా పెంచేది లేదు. పెట్టుబడి గురించిన తన థీసిస్‌కు ఇదే ఆఖరు వాయిదా.

Critiqueలో దీన్ని చర్చించకుండా వదిలేశాడు. ఆ పని ఇప్పుడు పూర్తవుతుంది. కాని మరో సంవత్సరం దాకా తను రాసుకున్న నోట్‌బుక్స్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. బెర్న్ యూనివర్సిటీలో ఉన్న కార్ల్ వోగ్ట్‌తో వార్తాపత్రికల్లో వ్యాసాల ద్వారా తన తగువు కొనసాగించాడు. మరోవైపు పరువు నష్టం దావా కూడా వేశాడు. ఈ గొడవ ముగిసిందనుకుంటున్నప్పుడు కొత్తగా గద్దెనెక్కిన ప్రష్యన్ రాజు రాజకీయ కారణాల వల్ల దేశం వదిలిపోయిన వాళ్లందరికీ క్షమాభిక్ష ప్రకటించాడు. ఈ పరిణామంతో, నూ రైనిష్ జైటుంగ్ లాంటి పత్రికను తను స్వదేశంలో తిరిగి ప్రారంభించి వచ్చుననే ఆశ చిగురించింది. అందుకు, మరి నిధులు సమకూర్చుకోవాలి. 1861లో జర్మనీకి వెళ్లి ఈ కార్యక్రమం ప్రారంభించాడు మార్క్స్. (ప్రయాణానికి ఫెర్డినాండ్ లసాల్ ఆర్థిక సహాయం చేశాడు." 1862లో రెండవ బృహత్ పారిశ్రామిక ప్రదర్శన చూడటానికి లండన్ వచ్చిన లసాల్‌కు తిరుగు ఆతిథ్యమిచ్చాను అంటూ గొణుక్కున్నాడు. "పైగా, నేనెట్లాగూ సైద్ధాంతిక గ్రంథం మీద పనిచెయ్యటం లేదు గనక తనతో కలిసి షికారుకు రమ్మంటాడు!"

తన సైద్ధాంతిక కృషి గురించి లసాల్ చేసిన వ్యాఖ్య మార్క్స్‌కు ములుగర్రలా పనిచేసింది. ఇక ఎలాగైనా పుస్తకం ముగించాలి. చాలా ఆలస్యమైపోయింది. వోగ్ట్‌తో వివాదం తన సమయమంతా తినేసింది. పత్రికలకు రాసే ఒప్పందాలు కూడా ఏమీ లేవు. తిరిగి బ్రిటిష్ మ్యూజియంకు అంకితమయ్యాడు. 1862-63 మధ్య ఆయన తీసుకున్న నోట్స్ 1500 పేజీలకు పెరిగాయి. "జర్మన్ స్కౌండ్రెల్స్ పుస్తకం సైజును బట్టి విలువ నిర్ణయిస్తారు. దీన్ని బాగా పెంచుతున్నాను" అన్నాడు. ఇన్నాళ్ళూ అర్థం కాని సైద్ధాంతిక విషయాలు ఇప్పుడు తేటతెల్లమయినట్టనిపించింది. (జిన్ను గ్లాసులాగ స్పష్టంగా, పారదర్శకంగా ఉన్నాయి!) ఉదాహరణకు వ్యవసాయ కౌలు (Agricultural Rent) గురించిన రికార్డో సిద్ధాంతం సరైనది కాదేమోనని చాలా కాలంగా సందేహిస్తూనే ఉన్నాను. జరిగిన మోసం ఇప్పుడర్థమైంది. Valueకూ, Cost Priceకూ మధ్య గందరగోళం సృష్టించాడాయన. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వాటి అసలు విలువకన్నా ఎక్కువగా ఉంటాయి. (అందులో ఉన్న శ్రమ సమయం - Labour time ప్రకారం) ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను, అధిక కౌలు రూపంలో కాజేస్తున్నాడు భూస్వామి. కాని సోషలిస్టు వ్యవస్థలో, ఈ అదనపు విలువ, కార్మికుల మధ్య తిరిగి పంచబడుతుంది. మార్కెట్ ధర మారనప్పటికీ ఉత్పత్తుల విలువ వాటి Socail Character పూర్తిగా మారిపోతుంది.

అయితే, మార్క్స్ తన కృషి గురించి సంతోషపడి అనవసరంగా ఆశలు పెంచుకున్నాడు. 1862 చివరలో, హానోవర్ (జర్మనీ) నుండి డాక్టర్ లుడ్విష్ కూగెల్‌మాన్ అనబడే అభిమాని A Contribution the

Critique of Political Economy తరువాతి సంపుటం ఎప్పుడొస్తుందని వాకబు చేశాడు. "ఎట్టకేలకు రెండవ భాగం పూర్తయింది. ఇక సాపు ప్రతి రాయటమే తరువాయి. ఆ తర్వాత ముద్రణకు పంపించే ముందు కొద్దిగా మెరుగులు దిద్దాలి. అంతే" అని జవాబిచ్చాడు మార్క్స్. అంతేకాదు మొదటి భాగం లాగ, ఇప్పుడు దానికి పేరు "A Contribution to the Critique of Political Economy. రెండవ భాగం" అని కాక, సింపుల్‌గా Das Kapital అని ఉంటుంది. పెద్ద పుస్తకాలకు చిన్న పేర్లుంటేనే ముద్దు.

నిజానికి ఆ 'రెండవ భాగం' మీద చాలా పని జరగాల్సి ఉంది. మెరుగులు దిద్దటానికింకా టైముంది. ఈలోగా ఆయన దృష్టి ఇతర విషయాల మీదికి మళ్లింది. 1850లో కమ్యూనిస్ట్ లీగ్ కథ ముగిసిన నాటి నుండీ, రాజకీయాలలో పాల్గొనటానికి నిరాకరించాడు మార్క్స్. "కార్మిక వర్గానికి నా సైద్ధాంతిక అధ్యయనం యొక్క అవసరం ఎక్కువగా ఉంది. కాలం చెల్లిన ఈ గ్రూపులతో కాలయాపన చేయటం వృథా" అనుకున్నాడు. కాని 1864లో, International Working Men's Association (IWMA) ప్రారంభ సమావేశానికి ఆహ్వానం రావటంతో కాదనలేకపోయాడు. (ఈ IWMA - ఇంగ్లిష్, ఫ్రెంచి కార్మిక సంఘాల, సోషలిస్టుల సమాఖ్య). సమావేశంలో మాట్లాడక పోయినా, ఆ సాయంత్రం వరకు ఆయన్ను జనరల్ కౌన్సిల్‌కు Co-opt చేసుకున్నారు. 1865 నాటికి, ఏ హోదా లేకపోయినా, IWMA కు తిరుగులేని నాయకుడయ్యాడు మార్క్స్.

IWMA కార్యక్రమాలు ఆయన సమయాన్ని పూర్తిగా హరించి వేశాయి. 1865 మార్చిలో, ఎంగెల్స్‌కు రాసిన లేఖలో ఒక వారం ఎలా గడిచిందో వివరించాడు : "మంగళవారం సాయంత్రం ప్రారంభమైన జనరల్ కౌన్సిల్ సమావేశం కీచులాటలతో అర్ధరాత్రి దాకా సాగింది. తెల్లారి, పోలిష్ తిరుగుబాటు వార్షికోత్సవం కొవెంట్ గార్డెన్‌లో బహిరంగ సభ రూపంలో జరిగింది. శనివారం, సోమవారం ఫ్రెంచి సమస్య గురించి కమిటీ సమావేశాలు జరిగాయి. (రెండు సమావేశాలూ అర్ధరాత్రి దాటిందాకా కొనసాగాయి) జనరల్ కౌన్సిల్‌లోని ఫ్రెంచి, ఇంగ్లిష్ సభ్యుల మధ్య పరస్పర దూషణలతో సోమవారం గడిచింది. ఇవన్నీ చాలవన్నట్టు, ఏమాత్రం సమయం చిక్కినా, వారాంతంలో, ఓటింగ్ హక్కుల గురించి జరిగే సమావేశం వివరాలు చర్చించటానికి నా వద్దకు వస్తూనే ఉన్నారు ఎవరో ఒకరు. "అబ్బబ్బ : సమయమంతా వృధా అయిపోతోంది" అని వాపోయాడు.

"తన మిత్రుడు, సభ్యత్వా నమోదు పత్రాల మీద సంతకాలు చేస్తూ గంటలు గంటలు ఎందుకు గడుపుతున్నాడు? కలహించే కమిటీ సభ్యులతో తనూ వాదోపవాదాల కెందుకు దిగుతున్నాడు? టేబుల్ దగ్గర కూర్చుని Das Kapital ఎందుకు పూర్తి చెయ్యటం లేదు? "IWMA లో ఈ సౌభ్రాతృత్వ భావన ఎంతో కాలం కొనసాగదని నాకు తెలుసు. ఇంకా చాలా పోట్లాటలు జరుగుతాయి. వీటిలో తల దూర్చటమంటే కాలం వృధా చేసుకోవటమే" అని మార్క్స్‌ను హెచ్చరించాడు ఎంగెల్స్.

1865 వేసవిలో మార్క్స్ రోజూ వాంతులు చేసుకుంటూనే ఉన్నాడు. (వేడి పెరగటం వల్లా, జీర్ణాశయ సమస్యలవల్లా). చర్మం కింద కురుపులు లేచాయి. ఇంటికి అనుకోని అతిథులు వచ్చి పడ్డారు. జర్మనీ నుండి జెన్నీ సోదరుడు; దక్షిణాఫ్రికా నుండి మార్క్స్ బావమరిది; మాస్ట్రిక్ట్ నుండి ఒక మేన కోడలు. ఇంటి ముందుకు అప్పుల వాళ్లు వచ్చి పరువు తీస్తూనే ఉన్నారు. రోజురోజుకూ పరిస్థితి భరించలేకుండా తయారైంది. ఇంత గందరగోళంలో, అవమానాలు, తిట్లు, శాపనార్థాల మధ్య 1200 పేజీల మాస్టర్ పీస్ ముగింపు దశకు చేసుకుంది. ప్రతి పేజీలో కొట్టివేతలు. ఎవరికీ అర్థంకాని దస్తూరి అది.

1866 కొత్త సంవత్సరం ప్రారంభ దినాన ఫెయిర్ కాపీ చెయ్యటానికుపక్రమించాడు మార్క్స్. పుట్టిన పాపాయిని శుభ్రంగా తుడిచి స్నానం చేయాలి. ఈ కార్యక్రమం ఏడాది పాటు కొనసాగింది. ఈసారి, కాలేయ సమస్యలు, కురుపులు వచ్చినా పని ఆపలేదు. ఒంటినిండా కురుపులు, బొబ్బలతో (కూర్చునే చోట) చివరి పేజీలు నిల్చునే రాశాడు. ఒళ్లంతా నొప్పులు, తీపులు. (అనెస్తెటిక్‌గా పనిచేసే ఆర్సెనిక్ (పాషాణం) ఎక్కువ మోతాదులో తీసుకుంటే మెదడు కూడా మొద్దుబారిపోతుంది. అందువల్ల దాన్ని జాగ్రత్తగా వాడాలి!) ఎంగెల్స్‌కు వ్రాతప్రతిలో కురుపుల బాధ కనిపించింది, తన మిత్రుని అభిప్రాయంతో అంగీకరించాడు మార్క్స్. అవును. కోపం పెరిగింది. భాష పరుషంగా ఉంది! "బూర్జువాలు తమ చివరి రోజు దాకా నా కురుపుల బాధను గుర్తుంచుకుంటారు. వాళ్ల మనుషులు కారు. పందులు" అన్నాడు.

ఫెయిర్ చెయ్యటం ముగియగానే, కురుపులు; బొబ్బలు మాయమయ్యాయి. నేననుకుంటూనే ఉన్నాను. ఆ పాడు పుస్తకం - నీలో ఇన్నాళ్లు దాచుకున్నావు చూడు - అదే నీ అన్ని సమస్యలకూ కారణం. అది ముగించిందాకా ఆ కష్టాలు, అనారోగ్యం నిన్ను వదలవు" అని రాశాడు ఎంగెల్స్. "500 బలిసిన పందులంత బలంతో" ఏప్రిల్ 1867లో, వ్రాతప్రతిని తీసుకుని, ముద్రణా వ్యవహారాలు చూడటానికి హాంబర్గ్ బయల్దేరాడు మార్క్స్. మిగతా రెండు సంపుటాలూ ఏడాది ముగిసేలాగా ఇవ్వాలన్న ప్రచురణకర్త కోరిక కూడా అతడి ఉత్సాహాన్ని ఏమాత్రం తగ్గించలేదు. ఏడాదిలోగా తన జీవితం మారిపోతుందని నమ్మకముంది. అప్పటికే, వ్రాతప్రతిని అక్కడక్కడా చదివిన వాళ్ల అభిప్రాయాలు విని తన పేరు యూరోప్ అంతటా మార్మోగి పోరాటం ఖాయమనుకున్నాడు. కీర్తి కిరీటం తనకోసం నిరీక్షిస్తున్నది. కమ్యూనిస్ట్ లీగ్, IWMAల సభ్యుడు, పాతమిత్రుడు యోహాన్ జార్జి ఎక్కారియస్ ప్రకారం, "తన జ్ఞానాన్ని ప్రపంచానికి ప్రసాదించబోతున్నాడు ప్రవక్త!

## కొటేషన్

చరిత్ర అంటే పంచేంద్రియ జ్ఞానమే! ప్రాథమిక అవసరాలకు మాత్రమే ఉపయోగపడే ఇంద్రియ జ్ఞానం కూడా ప్రాథమిక దశలోనే ఉంటుంది. ఆకలితో నకనక లాడుతున్న వ్యక్తికి తనకు కావలసిన ప్రత్యేకమైన ఆహారమంటూ ఏదీ ఉండదు. అయినప్పటికీ, అతడు తినే ఆహారానికీ, జంతువు తినే ఆహారానికీ తేడా ఉంటుంది. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నవాడు కళలను ఆనందించలేడు. లోహాల వ్యాపారికి వాటికి మార్కెట్ విలువ మాత్రమే తెలుస్తుంది గాని వాటి వలన రూపుదిద్దుకునే కళా ఖండాల గురించిన అవగాహన ఉండదు. అతడికి ఖనిజ శాస్త్రం గురించి కూడా తెలియదు. వ్యక్తి అస్తిత్వాన్ని నిర్ణయించేది, సౌందర్య భావన గురించి అతని పంచేంద్రియ జ్ఞానంలో వచ్చిన మార్పులే జీవితాన్ని అర్థవంతం చేసుకోవటమంటే అదే.

- కార్ల్ మార్క్స్

Economic and Philosophic Manuscripts

(ఇంకా ఉంది)

# -: స్వీకారం :-

కాశీం కవిత్వం
1994-2014

ప్రచురణ :
స్నేహ ప్రచురణలు

వెల : రు. 140/-

పేజీలు : 266




తెలంగాణ సాహిత్యం
కాశీం

ప్రచురణ :
స్నేహ ప్రచురణలు

వెల : రు. 140/-

పేజీలు : 248




దండకారణ్యంలో
మావోయిస్టు ఆచరణ
జనతన రాజ్యం

పాణి

ప్రచురణ :
విరసం

వెల : రు. 300/-

పేజీలు : 565




సాహసయోధురాలు
గజ్జల సరోజ రచనలు

ప్రచురణ :
విరసం

వెల : రు. 40/-

పేజీలు : 80




దండకారణ్య కథలు
(2013-2015)

ప్రచురణ :
విరసం

వెల : రు. 70/-

పేజీలు : 136




లొంగిన ప్రతిసారీ

పచ్చల కిరణ్ కుమార్

ప్రచురణ :
విరసం

వెల : రు. 50/-

పేజీలు : 94




చిగురించే పాదం
కవిత్వం

మేడక యుగంధరరావు

ప్రచురణ :
విరసం

వెల : రు. 40/-

పేజీలు : 70




రైజింగ్ సన్
కామ్రేడ్ సూర్యం
స్మృతిలో..

ప్రచురణ :
సూర్యమిత్రుల
ప్రచురణలు

వెల : రు. 20/-

పేజీలు : 46




మంది పాట
ఉరవడిలో..

సిటీ యూనిట్ కవిత్వం

ప్రచురణ :
విరసం

వెల : రు. 40/-

పేజీలు : 96




దండకారణ్యంలో
చలసాని ప్రసాద్

చేతనా నాట్యమంచ్

ప్రచురణ :
విరసం

వెల : రు. 10/-

పేజీలు : 14




ఫాలింగ్
రాజధాని శోభ - బడుగుల క్షోభ
కథ

నల్లూరి రుక్మిణి

ప్రచురణ :
విరసం

వెల : రు. 10/-

పేజీలు : 24




మార్క్సిస్టు
మహోపాధ్యాయుల
జీవన రేఖలు

ప్రచురణ :
విరసం

వెల : రు. 20/-

పేజీలు : 40

సాహస గెరిల్లా
యోధుడు
కా. మాసా (సంజయ్)కు
విప్లవ జోహార్లు!

ప్రచురణ :
దిక్సూచి ప్రచురణలు

వెల : రు. 10/-

పేజీలు : 14




సీమ గొంతుక
వినండి

అరుణ్

ప్రచురణ :
విరసం కర్నూల్ యూనిట్

వెల : రు. 50/-

పేజీలు : 104




కవిత్వంతో
ములాఖాత్

ఎన్. వేణుగోపాల్

ప్రచురణ :
స్వేచ్ఛాసాహితి

వెల : రు. 120/-

పేజీలు : 206

KLVA101M 184

**ARUNATARA** RNI Regn.No.21152/72 Published on 30/1/2016 February, 2016
Vol. : 44 Issue : 1 Hyderabad





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR. DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | KLVA101M184 |
| పుస్తకం పేరు | అరుణతార |
| తారీఖు | 08 February 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 77 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | no |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | narma |
| పేజీలు విడదీసినది | Bhanu |
| స్కాన్ చేసినది | Naveenda |
| పరీక్ష చేసినది | sireesha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |